
# కథా కౌముది

2021 - part -2





శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 253



# కౌముది మాసపత్రికలో

## 2021 ఆగస్ట్ నుంచి డిసెంబర్ 2021 వరకూ వచ్చిన కథలు


| క్రమసంఖ్య | కథపేరు | రచయిత(త్రి)పేరు | పేజి |
|---|---|---|---|
| 1 | బంధం | డా.వేదుల రజనీకాంతా రావు | 3 |
| 2 | చూపు | శ్యామ్ అవ్వారి | 12 |
| 3 | తనలో నన్ను | పాణిని జన్నాభట్ల | 17 |
| 4 | అత్తారింటికి దారేది? | సి హెచ్. వి.ఎస్.ఎస్.పుల్లం రాజు | 25 |
| 5 | కాలింగ్ బెల్ | ఓట్ర ప్రకాష్ రావు | 31 |
| 6 | భక్త వరుణుడు | దమ్మవళం శ్రీనివాస్ | 35 |
| 7 | ఏది ముఖ్యం | పప్పు శాంతా దేవి | 43 |
| 8 | మలుపుల్లో మెరుపులు | మేడా మస్తాన్ రెడ్డి | 47 |
| 9 | స్థితప్రజ్ఞత | సీతాశర్మ మంథా | 52 |
| 10 | రక్షకుడు | కృపాకర్ పోతుల | 56 |
| 11 | పాపం..అమ్మా, నాన్న | ఏ.బి.ఎస్.రామారావు | 61 |
| 12 | మరదలి కష్టం – బావ సాయం | ఆర్.సి.కృష్ణ స్వామి రాజు | 71 |
| 13 | బాల్చీ తన్నేసింది | విప్పగుంట రామ మనోహర | 76 |
| 14 | దేవకీ సుతుడు | 'నిర్మలాదిత్య' (భాస్కర్ పులికల్) | 83 |
| 15 | బుడి బుడి అడుగులు | ఎం .ఆర్.వి. సత్యనారాయణ మూర్తి | 88 |
| 16 | మనిషి | దమ్మవళం శ్రీనివాస్ | 93 |
| 17 | మల్లన్న పాగా | రాచపూటి రమేష్ | 101 |

# బంధం డా.వేదుల రజనీకాంతా రావు

"ఎంతిచ్చేవు?" అని అడిగేరు శాస్త్రి గారు.

"ఎంతో కొంత. ఎక్కువేం కాదు లే. ఐనా ఈ సమయంలో అవన్నీ ఎందుకు మావయ్యా?" అన్నాడు నాని.

"కాదురా, ఈ రోజుల్లో, మోసం మరీ ఎక్కువ అయిందిరా నానీ"

"ఊరుకో మావయ్యా"

"చెప్పవేం, బట్టలకి ఎంతయిందో ?"

"అంతా కలిపి మూడువందలు !"

" నే చెప్తూనే ఉన్నా చేనేత షాపులో కొనమని. అంత ఖరీదెందుకు ? పసుపూ, కుంకం కూడా కొనీసేవా ? నానీ, ఇంట్లో సరిగా వెదికితే కేజీలు కేజీలు పసుపూ, కుంకం ఉంటాయి. బజారు నుండి తేవాలట్రా ?"

నానికి సహనం సన్నగిల్లుతోంది. మామయ్య సంగతి బాగా గమనిస్తూనే ఉన్నాడు చాలా సంవత్సరాల నుండి. బడికెళ్తూ మిఠాయికి పైసలిమ్మం టే, తన దగ్గర లేవని బాహాటంగా బొంకే వాడు. ఏడుస్తూ నేలమీద దొరికినంత పనిచేస్తేనే కాని, ఆ చిల్లి కాణీ, పంచెముడి నుంచి ఊడేది కాదు.

కొంచెంసేపయ్యాక శాస్త్రి గారు నాని భుజం మీద ప్రేమతో చెయ్యి వేసి అన్నారు "నానీ, మన దక్షిణ వసారా వెనకాల గడ్డిమేటు చాటున సరువుడు కర్రలు ఉన్నాయి. పాలెం సంతలో ఆ మధ్య ఓ కుండా చవగ్గా కొన్నాను."

"మావయ్యా, నేను చేయవలసిన పనులు ఏవో చేస్తున్నా కదా "కొంచెంసేపు గదిలోకెళ్ళి ధ్యానం చేసుకో కూడదూ ?"

శాస్త్రి గారి కొడుకు గోపాలం, కోడలు రాణీ ఝార్కండ్ లో ఉద్యోగ రీత్యా ఉంటున్నారు.

తెల్లవారుజాము ఐదు గంటలకు ఫోన్లో తల్లి చనిపోయిన విషాద వార్త చెప్పారు శాస్త్రి గారు కొడుక్కి గద్గద స్వరం తో. పొరలి వచ్చే దుఃఖంలో ఆయన ఏమి మాట్లాడారో ఆయనకే తెలియలేదు. చివరి క్షణాల్లో తల్లిని చూసే అదృష్టానికి గోపాలం నోచుకోలేదు. ఉదయం పది గంటలు అవుతోంది. అసలే వేసవి ఎండలు తీవ్రంగా ఉన్నాయి. దగ్గర

వాళ్లంతా ఎక్కడికక్కడే నిస్సహాయంగా ఇళ్లల్లో బందీలై పోయేరు మహమ్మారి కరోనా వలన. ప్రేమతో రావాలనుకున్న వాళ్ళ కాళ్లకు సంకెళ్లు తగిలించింది కరోనా. ఆఖరి చూపులకి ఎవరూ వచ్చే ఆశ లేదు. మానవ జాతికి, తదితర జీవరాశులకు అంతిమ యాత్ర సమయం లో వీడ్కోలు విషయంలో ప్రకృతి నిష్పక్షపాతి అయింది.

తన సుఖ దుఃఖాల్లో భాగస్వామిగా, కార్యకలాపాల్లో, క్లిష్టమైన స్థితిలో అండగా అరవై ఏళ్లు నిలిచిన అర్ధాంగి శాంతమ్మ గారి తుది యాత్ర విలువ కట్టి , ఆమె ఆఖరి ప్రయాణ సమయంలో కూడా శాస్త్రి గారు, నేను, నాది అనే స్వార్ధం, ధన మోహము అనే మాయలో పరిభ్రమిస్తూన్నారు. కవితలు, కావ్యాలు, పురాణాలు, ప్రబంధాలు బోధించేవారు. పండిత గోష్ఠిలో సత్కారాలు పొందిన వారు. ఆయన అందె కట్టి సీతాపహరణం హరికథ చెప్తూ ఉంటే చుట్టుపక్కల నుండి వచ్చిన గ్రామ ప్రజలు మైమరచి తెల్లవారుజాము వరకు కదలకుండా పరవశమయేవారు. సహధర్మచారిణి కి అవసాన సమయంలో సగౌరవంగా వీడ్కోలీయలేని స్థితిలో, శాస్త్రిగారు ఎంత పాండిత్యం ఉన్నా, ఎన్ని పేరుప్రతిష్ఠలు న్నా, ఆత్మశోధన లేక జీవిత పరమార్థాన్ని గ్రహించలేకపోతున్నారు.

ప్రకృతి వింత వైరుధ్యం చూపిస్తుంది. శాంతమ్మ గారు పేరుకి తగినట్లు ఎప్పుడూ చిరునవ్వుతో కనిపించేవారు. ఎన్నడూ ఆమెలో కోపం, చిరాకు కనబడలేదు. ఇరుగు పొరుగు వాళ్ళు ఏదో ఒక విధంగా ఆమె ఓర్పు, ఔదార్యం, సానుభూతుల ఆసరాగా ఆమె సహకారం, సహాయం పొందినవాళ్ళే. సంవత్సరాల తరబడి అదేపనిగా అలవాటైన శాస్త్రిగారి పూజా విధానానికి ఏర్పాటు చేయడం, ఆ తర్వాత ఆయనకు కావలసినట్టుగా పద్ధతి ప్రకారం పచ్చడి, కూర, పప్పు , అన్నం, ఏదో ఒక రకం పులుసు వండడం ఆమెకు ఒక సునాయాసమైన దైనందిక ప్రక్రియ.

చేతికి గోరింటాకు పెట్టమనో, గొబ్బి పువ్వుల దండ గుచ్చిపెట్టమనో, మధ్య పాపిడి రెండు జడలు వెయ్యమని, చక్కిలాలు చుట్టడం నేర్పమని, ముగ్గులు నేర్పమని, మంగళ హారతి పాట నేర్పమని ఇరుగు పొరుగు చిన్నా, పెద్దా, శాంతమ్మ గారితో సంతోషాన్ని పంచుకునేవారు. పొరుగింటి గిరిజ కాపరానికెళ్లిన నెల తిరక్కుండానే, పుట్టింటికి తిరిగొస్తే, సముదాయించి నేర్పుతో గిరిజని అత్తవారింటికి తిరిగి పంపి ఒక కాపురం నిలబెట్టిన తృప్తి, ఆనందం ఎప్పటికీ ఆమె కళ్ళల్లో కనిపించేవి. పసిపిల్లలు ఆమె వంటింటిని దండయాత్ర చేయడం మామూలు విషయం. ఏ ఇత్తడి డబ్బాలో సున్నుండలు ఉంటాయో, ఏ డబ్బాలో చేగోడీలుంటాయో ఆ పిల్లలకి బలే గుర్తు. చూపించి మరీ దండుకునేవారు. శాస్త్రి గారు చూడకుండా శాంతమ్మ గారు పిల్లలను చేరదీసి లాలించి పాలించే వారు. పాల రామి మనుమడికి పలక మీద అక్షరాలు దిద్దించి ఊళ్ళో ప్రాథమిక పాఠశాల్లో ఒకటో తరగతిలో సీటు రావడానికి అర్హతను ఇప్పించారు శాంతమ్మ గారు. సంధ్య వేళ పిల్లలకు శాంతమ్మ గారు “ఎవరి బోధన అభోగి రాగం వర్ణం” నేర్పుతుంటే, ఆ సూర్యుడు పాట పూర్తయ్యే వరకు అస్తమించటానికి నిరీక్షిస్తున్నాడా అనిపించేది.

నిదురలోనే ఎటువంటి వేదనా లేకుండా ఆ శాంతమూర్తిని భగవంతుడు తన సన్నిధికి తీసుకెళ్ళాడు. శాంతమ్మ గారికి పరమపదము ఈ జన్మాంతం లో దొరికింది కర్మయోగం వలన.

“నానీ ఎక్కడున్నావురా?”

శాస్త్రిగారి కేక విని నాని, “ ఆ.., వంటింట్లో మంచినీళ్లు తాగుతున్నాను”

“ఏమైనా కబురు వచ్చిందా గోపాలం నుంచి?”

“ఫోన్లు తగలటం లేదు మావయ్యా”

“ఇక చేసేది ఏముంది? పోనీ, అగ్రహారం వీధిలో ఎవరైనా బ్రాహ్మడు కనిపించేడా? వరాలు తాత మనవడు అవతారం పౌరోహిత్యాలు చేస్తాడని విన్నాను. ఓ సారి భోగట్టా చెయ్యి”.

“మావయ్యా, రెండు నెల్లకిందట మన ఊళ్ళో జంబో సర్కస్ వచ్చింది కదా?”

“ఏమిట్రా .? అవతారం అంటే సర్కస్ అంటావ్!”

“ఔను మావయ్యా. సర్కస్ మేనేజర్ పెళ్ళాం రీటాని అవతారం ఎక్కడికో మరో ఊరికి తీసుకుని వెళ్ళి పోయేడని అందరికీ తెలిసినదే కదా! ఇంకెక్కడి అవతారం?”

“సర్లే! ఏదో ప్రయత్నం చెయ్యి.”

పెరట్లో ఆవు,దూడ ‘అంబా,అంబా’ అంటూ శాంతమ్మగారిని పిలుస్తున్నట్లే అరుస్తున్నాయి.పశువుల పాక, ఇల్లు అంతా సవరక్షణ లేక అస్తవ్యస్తంగా ఉంది.

ప్రతిరోజూ ఉదయం నుండి సాయంత్రం వరకూ ఏదో అవసరానికో, కాలక్షేపానికో పిల్లా, పెద్దా శాంతమ్మ గారి కోసం వస్తూ పోతూ,సందడిగా కళకళలాడుతూఉండే ఇల్లు కరోనా మహత్యం వలన నిశ్శబ్దంగా మారిపోయింది.

శాంతమ్మ మరణవార్త చుట్టుప్రక్కల వారికి నాని తెలియజేయగానే, ‘అయ్యో! అలాగా! నిన్న ఉదయం డాబా మీద చూసేనే, బాగా మాట్లాడేరు కూడాను!అంత సడన్ గా ఏమయింది?’ ‘జ్వరమేమైనా వచ్చిందా?’ ‘ డాక్టరుకి చూపించేరా?’ ‘కరోనా కాదు కదా!’ ‘ అదేమిటీ!డాక్టరుకి చూపించనే లేదా? ‘అంటూ మాస్క్ ల వెనకాల నుంచి అందరూ తలొక రకంగా ప్రశ్నలు వేశారే కాని, ఒక్కరు కూడా గడప దాటి బయటకి రాలేదు. ‘ఆ ప్రశ్నలకు జవాబులు వాళ్లకీ తెలుసు. మృత్యువు తాను వస్తున్నానని ఎవరికైనా చెప్పి వస్తుందా?ఏదో మాట్లాడాలని అలా అంటూంటారు’అనుకొన్నాడు, నాని.. సమయానికి తల్లి కూడా దగ్గర లేకపోవడం నానికి దిక్కుతోచని పరిస్థితిఏర్పడింది.పదిహేను రోజుల క్రితం దూరపు బంధువుల ఇంట్లో పెళ్లికి వంట సాయం కోసం పట్టణానికి వెళ్లిన తల్లి, అటు పట్నంలోనూ, ఇటు పల్లెలోనూ కరోనా చుట్టుముట్టడంతో అక్కడ చిక్కుకుపోయింది. చుట్టుప్రక్కలవారి ప్రశ్నలకి

జవాబులు చెప్పలేక, వారిని సహాయం అడగటానికి ఇష్టపడక, ఇటు శాస్త్రి గారి ఆందోళన తగ్గించ లేక , తల్లిని తల్చుకొంటూ ,ధైర్యాన్ని తెచ్చుకొని ఇంట్లోకి, బయటకీ తిరుగుతూ తాను చేయవలసిన పన్లను చేస్తున్నాడు ,నాని.బయట దుకాణాల వాళ్లతో తమ పరిస్థితి వివరించి, వాళ్లచేత దుకాణాలు తెరిపించి సామాన్లు కొనవలసి వచ్చింది, నానికి. కరోనా మహమ్మారి మహిమ వలన ఎవర్నీ తప్పు పట్టలేని పరిస్థితి వచ్చింది మరి!

మావయ్యా అని సంబోధించే చనువు ఎన్నినాళ్ళ బంధమో! ఎన్ని బంధాల ఋణమో! బాగాచిన్నతనంలోనే నాని తండ్రి గతించాడు. వంటలూ వార్పులూ ఇంటింటా చేసుకుంటూ ఏ రోజుకారోజు నెట్టుకొస్తోంది గత పది సంవత్సరాలుగా తల్లి బుచ్చమ్మ. ఆస్తి, భూమి వంటివి ఏవీ లేనలేవు. తన మంచితనం వల్ల శెట్టిగారి మట్టింటి గూడులో కొడుకు మీద కొండంత ఆశలు పెట్టుకొని బ్రతుకు తెరువు సాగిస్తోంది.

జ్ఞానం వచ్చినప్పటి నుండి సుబ్బారాయుడు గారింట్లో సోమవారం, నారాయణ గారింట్లో మంగళవారం, బుధవారం నాడు ఈశ్వరుడి గారింట్లో, అలా వారాలబ్బాయిగా నాని రోజులు గడుపుతూ సెకండరీ స్కూల్ చదువు సాగిస్తున్నాడు.

శాంతమ్మ గారు ఒక రోజు శాస్త్రి గారితో భోజనం సమయంలో, పెరుగు అన్నంలో ఆవకాయ వేస్తూ, "ఏమండీ. నాని, పాపం చిన్నతనంలోనే తండ్రి లేని వాడయేడు . చూస్తూనే ఉన్నారుగా, తల్లి చాలా శ్రమ పడి వాడిని పెంచుతోంది. ఇంటింటికీ తిరిగి వాడు భోజనం కోసం శ్రమ పడేది బదులు, ఆ పాటి రెండు పూటల భోజనమూ మనమే పెట్టొచ్చు కదండీ".

శాంతమ్మ ప్రతిపాదన లోని పుణ్యఫలం తను కూడా పంచుకొన వచ్చన్న భావం శాస్త్రి గారి హృదయంలో మ్రోగింది .

"నిజమే శాంతా. చక్కటి మాట చెప్పేవు. నానికి చెప్పు. "నాని సంబరపడుతూ ఆమాట అమ్మకు చెప్పాడు. మరునాడు నాని తల్లి బుచ్చమ్మ పరుగు పరుగున శాంతమ్మగారింటికి వచ్చి, శాస్త్రిగారి దంపతులిద్దరికీ పాదాభివందనం చేసి ఆనందబాష్పాలతో ఉబ్బితబ్బిబైపోయింది. ఆ రోజు నుండి నాని శాస్త్రి గారింట్లో కాలక్షేపం చేస్తూ వారాలబ్బాయిలా కాకుండా వారింటివాడయ్యేడు. ఉన్నట్టుండి ఒక రోజు శాస్త్రిగారు, "ఒరే నానీ! ఇక మీద నన్ను మావయ్యా అని పిలవరా" అన్నారు.

కొందరు శాస్త్రిగారు నాని ని దత్తత చేసుకున్నారేమో అని, మరికొందరు ‘నిజంగా మేనల్లుడు కామోసు’ ‘అనీ అనుకునేవారు.

కనికరం లేని సూర్యదేవుడు జీవరాసులనన్నిటినీ ఎవరి గూటిలో వాళ్ళని బందీ చేసేడు. బయట జనసంచారం బందయింది. శాంతమ్మ గారి భౌతికకాయం నిశ్చలంగా విశ్రాంతి తీసుకుంటోంది నాలుగిళ్ళ వసారాలో. ఈ లోకంలో అందరి ఋణం తీర్చుకుని ఆ పుణ్యాత్మ పరమాత్ముని సన్నిధిలో ఆనందానుభూతి పొందుతోంది.

నాని వచ్చేడు "మావయ్యా .. నాగపూర్ ముందు గూడ్స్ ట్రైన్ పట్టాలు తప్పిందిట, మరి గోపాలం వాళ్లు ఎప్పటికి వస్తారో ఏమిటో? "

"ఏం చేద్దాం మావయ్యా? గవర్నమెంట్ వాళ్లెవరో ఓ అరడజను మంది పట్నం నుంచి వచ్చారు. బజార్లో ఉన్నారు. టీకాలు వేసే వాళ్ళై ఉంటారు. ఓ ఇద్దరు ఆఫీసర్లున్నారు వాళ్లలో. ఇళ్ల అడ్రస్లు తీసుకుంటున్నారు. మనింటికి కూడా వస్తారో ఏంటో! వాళ్ళకేంచెప్పాలో మరి?"... నాని మాట పూర్తవకుండానే ఒక వ్యక్తి ఇంటికి రానే వచ్చాడు.

"జగన్నాధ శాస్త్రి గారిల్లిదేనా? ఆయన ఇంట్లోనే ఉన్నారా?మా ఆఫీసర్ గారు కనుక్కొని రమ్మన్నారు".

"అవును బాబూ. ఇంతకీ ఏం పని" అన్నారు శాస్త్రి గారు.

"తెలియదండి. తమ దర్శనం కోసం కాబోలు. వారే వస్తారు లెండి."

ఇరవై నిమిషాల తరువాత ఇంటి ముందు కారాగింది. ఇద్దరు యువకులు ముఖంమీద మాస్క్ లు తగిలించుకొని,కారులోంచి దిగి ఇంటి వైపు వస్తూ ఆగిపోయారు. వారిలో వారు ఏదో మాట్లాడుకుంటూ మరి నాలుగు అడుగులు వేసేరు. కొంచెంసేపు ఆగి, ఇంటి చుట్టూ దిక్కులు చూస్తూ నిలబడి పోయేరు. ప్రాకారంలో ఉన్న మామిడి చెట్టు, సపోటా చెట్టు వెనుకనుంచి , మందార మొక్క, మల్లి తీగల పక్కనుండి బావి దగ్గరికి వెళ్ళారు. బావిలోకి తొంగి చూసేరు. ఇదంతా చూస్తున్న శాస్త్రి గారికి, నాని కి అంతా వింతగా అనిపించి ఏమీ అర్థం కావడం లేదు. ఒక ప్రక్క నిర్వికారంగా శాంతమ్మ నిర్జీవంగా పడి ఉంది. ఈ సమయంలో ఈ ఆగంతకులు ఇంటి పరిసరాలను పరీక్ష చేస్తున్నారు. ఏదో తర్జనభర్జన వాళ్ళ మధ్య జరుగుతుంది చాలామట్టుకు ఇంగ్లీషులో. ఇంటి పన్ను విధిగా ప్రతి సంవత్సరం శాస్త్రి గారు చెల్లిస్తూనే ఉన్నారు. ఇంటి చుట్టూ గాని, పరిసరాల్లో గాని మురికి, చెత్త వంటివి లేనే లేవు. తానేమీ దరఖాస్తు పెట్టలేదు గవర్నమెంట్ కి. తనకేమీ నోటీసులు రాలేదు. వాళ్ళ వైఖరి ఏమీ అర్థం కావడం లేదు సరి కదా వాళ్ళ ప్రవర్తన అనుమానాస్పదంగా తోచింది. ఏదైనా సరే ఇదా సమయం? ఒక ప్రక్క దుఃఖ సాగరంలో మునిగి మరో ప్రక్క కర్తవ్య నిర్వహణ భారం కుందించుతుంటే ఈ వ్యక్తుల రాక, వారి పోకడలు విపరీతంగా దుర్భరంగా ఉన్నాయి శాస్త్రి గారికి . ఈ పరిస్థితి ఆయన సహనాన్ని ఉద్రేకాన్ని పరీక్షిస్తోంది.

శాస్త్రిగారి ఆందోళనకు ఊరడింపుగా ఇరువురు యువకులూ జోడించిన హస్తాలతో నమస్కారం చేస్తూ ముందడుగు వేసి తమ పరిచయం చేసుకోబోయేరు. ఇంతలోనే శాస్త్రిగారు ఎంతో ఆవేదనతో కంట తడి పెట్టుకుని

వణుకుతున్న కంఠంతో “ఎవరు బాబూ ? మంచి సమయం చూసుకుని నా తలరాతని హేళన చేయడానికి, పుండు మీద కారం చల్లడానికి వచ్చారు. ఇక్కడ ఏదో మహోత్సవం జరుగుతున్నాదనా, విందులు వడ్డిస్తున్నారనా పట్నవాసం నుండి విచ్చేసారు? వచ్చేరుగా. రండి.. . రండి . లోపల మీవంటి అతిధులను ఆహ్వానిస్తున్నారు ఈ ఇంటి గృహిణి. భోజన సమయంలో ఈ ఇంటికి వచ్చిన వారెవ్వరూ భోజనం చేయకుండా వెళ్ళ లేదు ఈ రోజు వరకు. తప్పక మీరు ఆమెను కలిసేకనే మనం మిగతా విషయాలు మాట్లాడుకుందాం. ఐనా, మీరెవరో, ఎక్కడ నుంచి , ఎందుకు వచ్చారో మాకు తెలుసుకోవాలని ఉత్సాహం గాని ఓపిక గాని లేవు" అని అన్నారు.

విపరీతమైన భావోద్రేకం తో శరీరం కంపించిపోతూ శాస్త్రిగారి వదనంలో దుఃఖం పెల్లుబికి పోతుంటే, దిగ్భ్రమతో అచేతనంగా నిలబడిపోయాడు నాని.

“ఒరే నానీ ‐‐‐ వీళ్ళని లోనికి తీసుకెళ్లి శాంతకి పరిచయం చేయి.”

అపరిచితవ్యక్తులిద్దరూ అయోమయంగా ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటూ నాని వెనకాల ఇంట్లోకి ప్రవేశించారు. వరండాలోకి వెళ్ళగానే కనబడిన దృశ్యం చూసి స్థాణువులైపోయేరు. తల దగ్గర ఉంచిన అగరవత్తుల పరిమళం ఆఘ్రాణిస్తూ నిదురలో ఉన్నారా అన్నట్లుగా శాంతమ్మ గారి మృతదేహం కనిపించింది. సుపరిచితమైన చిరునవ్వు, జీవం లేని వదనం మీద నిశ్చలంగా ఉంది.” ఎవరికీ తెలియకుండా అమ్మగార్ని చూసి అందరికీ ఆశ్చర్యం, ఆనందం కలిగిద్దాం, తమ గుర్తింపు కూడా చెప్పకుండా” అనుకొని ఇంత దూరం వచ్చిన అన్నదమ్ముల ఆశలు పటాపంచలయ్యాయి. శాంతమ్మ గారి ముఖంలో గత ఇరవై సంవత్సరాల్లోనూ ఏ మార్పు కనబడలేదు వారిద్దరికీ. వారికి చిన్ననాటి శాంతమ్మ గారిని చూస్తున్నట్లే అనిపించింది. అమాంతం వస్తున్న కన్నీళ్ల ధారతో ఆమె పాదాలు ప్రక్షాళనము చేద్దామనే కోరిక బలీయంగా ఆపుకున్నారు అన్నదమ్ములిద్దరూ. సమయం కూడా సంకెళ్లు వేస్తుంది సందర్భానుసారంగా. ఉచితానుచితాలు కాలగతిలో మారినా మానవ దృక్పధం మారదు. మౌనమే పరిష్కరిస్తుంది ఈ పరిస్థితి అని గ్రహించారు అన్నదమ్ములు రామారావు, లక్ష్మణరావు.

నానిని వివరాలడిగేరు. నిద్రలో ఆమె పరమపదించడం, బహు దూరం గా ఉంటున్న ఒక్కగానొక్క కొడుకు గోపాలం ఈ రోజుకి చేరుకోలేని నిస్సహాయత, గ్రామంలో కుటుంబాలు ఆచార ప్రకారం దేహాన్ని కదిల్చేవరకు భుజించరని వివరిస్తూ ఇక దుఃఖం తట్టుకోలేకపోయాడు. అసలు విషయం చెబుదామని ప్రయత్నం చేసేడు.

రామారావు “నానీ .. చాలా ప్రొద్దెక్కింది. మరి తరువాత కార్యక్రమం ఏం చెయ్యాలి ?”

“ఏం చేయాలో తెలియడం లేదు. ఇప్పుడు కావలసిన వాళ్ళిద్దరూ లేరు. ఎంత వెదకినా దొరకలేదు. మామయ్య దుఃఖంలో మునిగి ఏమీ మాట్లాడటం లేదు” అన్నాడు నాని.

"ఎవరు వాళ్ళు ?"

"ఇంకెవరు? కర్మకాండ చేసే పురోహితుడికి ఒంట్లో బాగా లేదట, , రాలేనన్నాడు. అత్తయ్యని సాగనంప డానికి పల్లకి వాహకులుకూడా ఎవరూ కరోనా వల్ల ముందుకు రావడంలేదు. పూజారి శర్మగారిని ప్రాధేయపడితే అతనేమో," ఇటువంటి అపరకర్మలు చేయిస్తున్నానని ప్రజలకు తెలిస్తే, ఇక ఏ శుభకార్యాలకీ పిలవరు సరికదా, వెలివేసినంత శిక్ష వేస్తారు, పైగా, గుడిలో పూజారి గా మరి ఎవరూ అంగీకరించరు "అని నీళ్లు నమిలాడు. మరి అత్తయ్య ఆఖరి ప్రయాణం ఎలా జరిపించాలో, దారీతెన్నూ తెలియడం లేదు".

అన్నదమ్ములిద్దరూ చాలా గూఢంగా చర్చించుకున్నారు. నానికి ఏమీ అర్థం కాలేదు. ఇక శాస్త్రి గారితో ఏం చెప్పినా వినే వైఖరిలో లేరు కాబట్టి నాని మధ్యవర్తిత్వం లో తాము చేయబోయేది నిర్ణయించుకుని నానికి బాగా అర్థమయ్యేలాగ ఏం చెయ్యాలో చెప్పారు. వేరే ఉపాయం లేదని నాని గ్రహించాడు.

ఎన్నడూ ఉపవాసమంటే ఎరుగని శాస్త్రిగారు పొద్దుటి నుండి పచ్చి మంచి నీళ్ళు కూడా ముట్టలేదు. బాగా నీరసంగా ఉన్నారు.

"మావయ్యా .... వాళ్లిద్దరూ నిన్ను దిగులు పడవద్దు అంటున్నారు. అత్తయ్యని వాళ్లే సాగనంపుతా మంటున్నారు. వాళ్లతో వచ్చిన రెవెన్యూ సిబ్బందిలో నలుగురు మనుష్యుల సాయంతో అత్తయ్యను సగౌరవంగా తీసుకొని వెళ్తారుట. మన చేతుల్లో ఇక చేయగలిగిందేమీ లేదు కదా! ఇక ఆలస్యం చేయ వద్దంటున్నారు. సరేనని ఒప్పుకో మావయ్యా". శాస్త్రిగారు మూగబోయిన స్థితిలో, చేతి సంజ్ఞ తో అంగీకారం తెలియ చేశారు.

వెనువెంటనే లక్ష్మణరావు కార్లో వెనుతిరిగి వెళ్లి, ఒక నలభై నిముషాల్లో నలుగురు వ్యక్తులతో సహా తిరిగి వచ్చాడు. కావలసిన సామాగ్రి కూడా వచ్చింది. శాస్త్రిగారి గంభీరత్వం పోయి, తలకు కొరివి పెట్టవలసిన కొడుకు గోపాలం కోసం ఆయన హృదయం విషాదంతో పరితపించిపోతోంది .

ఆఖరి క్షణం వచ్చింది. శాంతమ్మ గారి భౌతిక కాయాన్ని సున్నితంగా అతి గౌరవంతో ఎత్తి పరుండబెట్టేరు తయారు చేసిన వెదురు కర్రల నిచ్చెన పైన. శాస్త్రిగారు నివ్వెర పోతుండగా అపరిచిత వ్యక్తులిద్దరూ ముందు, వారి సహచరులు కామోసు, మరో ఇద్దరు తమ భుజస్కంధాల పైకి లేవ తీసుకుని జాగ్రత్తగా నడక సాగించారు. గౌరవార్థం కరంగా, శాస్త్రోక్తంగా శాస్త్రి గారిని ముందు దారి చూపమన్నారు. తరువాతి కార్యక్రమాన్ని, అంతకు ముందు లక్ష్మణరావు ఒప్పించి , రప్పించిన పూజారి శర్మ గారి ఆధ్వర్యంలో అతి సూక్ష్మంగా పూర్తి చేసి, అక్కడ శర్మ గారిని దక్షిణతో సంతుష్ట పరచి, దహన క్రియ కు వచ్చిన వారందరూ ఇంటి ముఖం పట్టారు. ఎవరికీ ఏం మాట్లాడాలో, ఏం చెప్పాలో, తెలియలేదు.

ఇక సంధ్య వేళ కావస్తోంది. అంతటి మహోపకారం చేసిన అపరిచిత వ్యక్తులకి తాగడానికి మంచినీళ్లు తప్ప ఇంకేమీ సమర్పించుకోలేనని శాస్త్రిగారు కంటతడి పెట్టుకున్నారు. వారికి ఏ విధంగా కృతజ్ఞతలు చెప్పుకోవాలో, కూడా మాటలు రావడం లేదు.

"అయ్యా .... మాకు సెలవు ఇప్పించండి " అన్నారు రామారావు, లక్ష్మణరావు. వారితో వచ్చిన రెవెన్యూ సిబ్బంది చేతులు కట్టుకుని నిల్చున్నారు.

శాస్త్రిగారు, "వయసులో బాగా చిన్నవారు మీరిద్దరూ. సమయానికి వచ్చి, మీరు చేసిన మహత్తరమైన కార్యానికి నేను మీకు ఎంతో ఋణపడి ఉన్నాను. ప్రత్యేకంగా ఈ దహన సంస్కారం చేసేందుకే ఆ భగవంతుడు మిమ్మల్ని ఈపూట ఇక్కడకి పంపినట్లున్నాడు. మీ పేర్లు, మీ పరిచయం ఇప్పటిదాకా జరగనే లేదు. కానీ మీరు తిరిగి వెళ్లే తొందర్లో ఉన్నారు. ఇంతకీ ఇదంతా శాంతమ్మ పుణ్యఫలం. మీ చేతుల మీదుగా సగౌరవంగా ఆమెకు వీడ్కోలిచ్చేరు, గోపాలాన్ని మరపింపచేస్తూ. ఈ పూటకి ఇక్కడ మిమ్మల్ని ఉండమని, నా ఆతిథ్యం స్వీకరించమని అడగడానికి నాకు శక్తి లేదు. భగవంతుడు మీకు ఆయురారోగ్యాలు పదికాలాలపాటు ప్రసాదించమని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను."

అప్పుడు రామారావు, "బాబుగారూ! తమర్ని పేరుపెట్టి సంబోధించే అర్హత మాకు లేదు. జ్ఞానంలో, నిష్ఠలో, మీ కుటుంబ సాంప్రదాయాలతో పోల్చుకునే తాహతు మాకు అసలు లేదు. ఈ రోజు మనం ఈ విధంగా కలుసుకోవడం విధివిలాసం. మాకు వచ్చిన ఈ అవకాశం భగవత్ప్రసాదం. రెవెన్యూ ఆఫీస్ లో మా అన్నదమ్ములిద్దరికీ ఉద్యోగరీత్యా ఈ రోజు డ్యూటీ మీద ఈ ఊరు రావలసి వచ్చింది మా సిబ్బందితో పాటు. సుమారు ముప్పై సంవత్సరాల కిందట గ్రామ పంచాయతీ నిర్వహణలో ఏ పాపమెరుగని మా నాన్న వెంకన్నని ఊరు నుండి తమరు బహిష్కరించారు. దానికి దొంగ సాక్షులదే గాని మిమ్ము తప్పుబట్టలేము.

అప్పటి తల్లిలేని లాము, కిత్తులు మేమే, మీకు జ్ఞాపకం ఉండవచ్చు. ఎప్పుడూ లాగు తప్ప ఒంటి మీద వేరే బట్ట మాకు లేదు ఆ రోజుల్లో. అమ్మగారు రోజూ మమ్మల్ని చేరదీసేవారు మీరు చూడకుండా. మీ గోపాలం అప్పటికి ఇంకా జన్మించలేదు. ఆ నూతి చపటా మీద కూర్చుని అమ్మగారు ఆప్యాయంగా ఎంతో అభిమానంతో ఇచ్చే చేగోడీలో, సున్ని ఉండలో, చక్కిలాలో మీకు తెలియకూడదని చప్పుడు చేయకుండా తినేవాళ్ళం. ఆ లొత్తపోయిన తినుబండారాల ఇత్తడి డబ్బా ఏ అరలో ఉంటుందో కూడా అమ్మగారు మమ్మల్ని వంటింట్లోకి తీసుకెళ్లి చూపించేరు. ఎప్పుడూ చూడని గాజు గ్లాసులో పాలు ఇచ్చేవారు. మీ పద్ధతిని, ఆచార వ్యవహారాలను అమ్మగారు గౌరవిస్తూ, మమ్మల్ని ఎప్పుడూ చాటుగా సంతోషపెట్టే వారు. మేం నవ్వుతూ ఉంటే ఆమె కళ్ళల్లో జ్యోతులు వెలిగేవి. ఈ అనుబంధానికి పది నెలల భారంమోసి ప్రసవవేదన పడనవసరం లేదు. ఆ కొబ్బరి చెట్టూ, మామిడి చెట్టూ, నూతి చపటాని ముందు ఇక్కడకి రాగానే తనివి తీరా చూసుకున్నాం. అమ్మగారికి వెనుకనుండి వెళ్లి, ఆమెకు ప్రదక్షిణ చేసి, చీర ఇచ్చి పాదాలకు

నమస్కారం చేయాలని ఊహించుకున్నాం. మా పరిచయం మీకు హఠాత్తుగా చెప్పి ఆశ్చర్య పరుద్దాం అనుకున్నాం. కానీ లోనికి వెళ్ళగానే కనిపించిన దృశ్యం మమ్మల్ని మూగవారిని చేసింది. మేమమ్మగారికి తెచ్చిన చీర తోనే అమ్మగార్ని దేవలోకానికి వీడ్కోలు చెప్పవలసి వచ్చింది. "

"దహనక్రియకు వచ్చిన విషమ పరిస్థితి నాని ద్వారా అర్థమైంది. అప్పుడు చేయవలసిన కర్తవ్యం మాకు దేవుడిచ్చిన వరంగా భావించేం. ఐతే, ఆ సమయంలో మా పరిచయం బయట పెడితే కార్యం జరగదేమో అని గుట్టుగా విధులు నిర్వర్తించేం. శ్రోత్రియ కుటుంబంలోని అమ్మగారికి చివరికి శూద్రుని చేతుల మీదుగా అంత్యక్రియలు జరిపినందుకు మేము మీ క్షమార్హులం కాకపోయినా , మమ్మల్ని ఆ దేవుడు క్షమించాలని ప్రార్థిస్తాం". అంటూ దు:ఖంతో పొంగి వస్తున్న కన్నీళ్లను తుడుచుకునే ప్రయత్నమైనా చేయకుండా చేతులు జోడించిన వారిద్దరి దగ్గరకూ ఎంతో ఆశ్చర్యంతోనూ, ఉద్వేగంతో తడబడే అడుగులతో వచ్చి, రెండు చేతులూ జోడించి పైకి ఎత్తి, "ఆ భగవంతుడి లీలలు ఎంత చిత్రమైనవి! ముప్ఫై ఏళ్ల కిందటి బంధం ఈ రోజుకి ఈ విధంగా మనల్ని కలిపింది. అంతా దైవేచ్ఛ!!" అంటూ వారిద్దరి శిరస్సుల మీదా చేతులు వేసి దీవిస్తున్నట్లుగా, " నాకిప్పుడు ముగ్గురు కుమారులు. గోపాలం రాని వెల్తి పూర్తి చేయడమే కాకుండా, పెద్ద కొడుకులుగా మీరు బాధ్యత నిర్వహించేరు. నాకిప్పుడు ఎంతో తృప్తిగా, ఆనందంగా ఉంది. భగవంతుడికి నేను మనసారా కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను . మీ అమ్మ పై నుండి ఆశీర్వదిస్తోంది చూడండి. కులం, మతం, ఆచారాలు, కుటుంబ సంప్రదాయాలు – వీటన్నింటి మీదా మానవత్వానిదే పైచేయి !!!" అని " అంటూ, ఆర్ద్రత నిండిన భావావేశంతో వారిరువురినీ దగ్గరకి తీసుకొన్నారు.

ఊహించని ఆప్యాయతకి అన్నదమ్ములిద్దరూ ఆనందంతో నోటమాట రాక కొంచెం సేపు వరకూ అలాగే ఉండి తరవాత మెల్లగా, "మరి మేము సెలవు తీసుకుంటాం బాబుగారూ" అని రామారావనగానే,

శాస్త్రిగారు వారిని ఒక నిమిషం ఆగమని, ఇంట్లోకి వెళ్ళారు. పరుగు పరుగున తిరిగి వచ్చి లొత్తపోయిన ఇత్తడి డబ్బాని ఆ ఇద్దరి చేతుల్లో పెట్టి, కండువాతో కన్నీళ్లు తుడుచుకున్నారు. ఆ డబ్బాని ఆనందంతో, ఆశ్చర్యం తో ఆప్యాయంగా పొదివి పట్టుకొని, శాస్త్రి గారికి పాదాభివందనం చేసి, నానిని ఓదార్పుగా భుజం తట్టి రామారావు లక్ష్మణరావు బయల్దేరక తప్పదన్నట్లుగా, కొంత అయిష్టంగా మిగతా వారితో కలిసి కారెక్కారు. ఒక చెయ్యి ఎత్తి వారిని దీవిస్తూ , మరో చేతిని నాని భుజం మీద ఆసరాగా వేసి, కారు కనుమరుగయే వరకు శాస్త్రిగారు ఆగని కన్నీళ్లతో అటువైపే చూస్తూండిపోయేరు.

# చూపు శ్యామ్ అవ్వారి

'టప్'మని చేతిమీద నీటి చుక్క పడింది. అతడు తలెత్తి ఆకాశం వైపు చూసాడు. వర్షం వచ్చేలా ఉంది.

"తను త్వరగా వస్తే బావుణ్ణు" అనుకున్నాడు అతడు.

తలతిప్పి చూసాడు పక్కనే ఉన్న శ్మశానం వైపు. అంతా నిశ్శబ్దం! పడుకున్నవాళ్ళ సద్దు లేదు. అతని చూపు అప్పుడే కట్టిన ఒక్క కొత్త సమాధి పైన నిలిచింది. అంతటా నిశ్శబ్దం, అంతరంగంలో తప్ప!

"తను త్వరగా వస్తే బావుణ్ణు" మళ్ళీ అనుకున్నాడు అతడు. అతని ఆలోచన పూర్తి కాక మునుపే దూరంగా ఒక కారు దుమ్ములేపుకుంటూ వచ్చి ఆగింది. నిశ్శబ్దాన్ని భగ్నం చేస్తూ కారు ఇంజిన్ ఇంకొకసారి రొదపెట్టి ఆగింది!

అతడు అప్రత్నయంగా ఒక అడుగు ముందుకేసి ఆగాడు. కారు ముందు డోర్ తెరుచుకుని ఒక యువకుడు దిగాడు. ఆ యువకుడు తలతిప్పి వెతుకుతున్నట్టు అటూ ఇటూ చూసాడు. దూరంగా ఉన్న అతణ్ణి చూసి 'హలో' అన్నట్టుగా చేయి లేపాడు.

అతడు కూడా చేయి ఊపాడు.

ఆ యువకుడు కారు వెనుక డోర్ తెరిచాడు.

దూరంలో ఉన్న అతడికి ఏమి కనిపించడం లేదు! అతడి గుండె వేగం పెరిగింది. కారులో నుండి దిగిన వ్యక్తి సరిగ్గా కనిపించడం లేదు. ఆ యువకుడు పక్కకు జరిగాడు. ఆమె కనిపించింది. అతడి శ్వాస బరువెక్కింది. దూరంనుండి క్లియర్ గా లేకపోయినా తనను గుర్తుపట్టగలడు! 30 సంవత్సరాలు కాదు, ఇంకా 30 సంవత్సరాలు వచ్చినా ఆమెను గుర్తుపట్టగలడు.

ఆమె కూడా దూరం నుండి అతడిని చూసింది. ఒక్క క్షణం ఆమె అడుగు తడబడింది. ఆ యువకుడు ఆమె చేయి పట్టుకున్నాడు. ఆమె అతని సాయంతో అతడి వైపు నడవసాగింది. 30 సంవత్సరాల దూరం ౩౦౦ వందల గజాల దూరంగా మిగిలింది.

ఆమె ఆగింది. ఆ యువకుడితో ఏమో మాట్లాడుతుంది. ఆ యువకుడు ఆమె చేయి వదిలేసాడు. ఆమె ఆ యువకుడి చెంప చిన్నగా తట్టి మళ్లా నడవసాగింది అతని వైపు. ఆ యువకుడు ఒక్క నిమిషం పాటు ఆమెనే చూస్తూ ఉండిపోయాడు. ఆ తరువాత వెనుదిరిగి కారు వైపు వెళ్ళిపోయాడు.

ఆమె దగ్గరగా వస్తున్నాకొద్దీ అతడి గుండె వేగం పెరగసాగింది. ఆమె నడకలో ఏ మాత్రం తేడాలేదు సరికదా ఇంకాస్త వేగం పెరిగింది. ఆమె పూర్తిగా దగ్గరకు వచ్చింది.

అతడు చిరునవ్వు నవ్వబోయాడు, నవ్వు పూర్తిగా విరియలేదు. ఏదో మాట్లాడదాము అనుకున్నాడు. కానీ మాట పెదవి దాటకముందే ఆమె అతడిని గట్టిగా కౌగిలించుకుంది. అతడు నిలువెల్లా కదిలిపోయాడు.

"30 సంవత్సరాలు" అన్నది ఆమె!

"30 సంవత్సరాలు" ఒప్పుకున్నాడు అతడు!

"30 సంవత్సరాలు ఎక్కడికి పోయాయి కామేశు?" అన్నది ఆమె!

అతడు మౌనంగా ఆమెని పట్టుకుని ఉండిపోయాడు.

కొద్దిసేపటికి ఆమె అతడి నుండి విడివడింది.

"నిన్ను చూడనీ పూర్తిగా" అంది!

అప్పుడు గమనించాడు అతడు.

"నీ కళ్ళద్దాలు?" సగంలో ఆపాడు.

చిన్నగా నవ్వింది ఆమె.

"ఇప్పుడే వస్తుంటే కిందపడి పగిలిపోయాయి. మావాడు కొత్తవి కొందామంటే సమయం లేదని వచ్చేసాను. అయినా నిన్ను చూడడానికి నాకు అద్దాలేందుకు చెప్పు? నా కళ్ళముందు ఆనాటి నువ్వే కనిపిస్తున్నావు!"

అతను ఏమీ మాట్లాడలేదు. ఆమె మళ్లా అతడిని గట్టిగా కౌగిలించుకుంది.

ఒక్క క్షణం తరువాత అతడు ఆమెని తననుండి విడదీసాడు.

"ఇక్కడ కూర్చుని మాట్లాడుకుందాం", పక్కనే ఉన్న బెంచి వద్దకు తీసుకెళ్ళాడు.

ఇద్దరూ అలా కొద్దిసేపు మౌనంగా కూర్చున్నారు. అతడు ఏమో చెప్పబోయాడు. ఆమె తన చేతులతో అతడి నోటిని మూసింది.

"నువ్వు ఎప్పుడూ మాట్లదేవాడివి. ఇప్పుడు నేను మాట్లాడుతాను నువ్వు వినాలి అంతే!"

అతడు మౌనంగా తల ఊపాడు.

ఆమె మాట్లాడడం మొదలుపెట్టింది.

---

ఆ యువకుడు టైమ్ చూసుకున్నాడు. వచ్చి రెండు గంటలవుతుంది. చేతిలో ఉన్న రాయిని దూరంగా విసిరేసి, ఒకసారి తలతిప్పి చూసాడు. అమ్మ మాట్లాడుతూ కనిపించింది. కారు తలుపు తెరిచి సీట్ బాగా వెనక్కు వాల్చి కూర్చుని కళ్ళు మూసుకున్నాడు.

---

"అలా రోజులు సంవత్సరాలు గడచిపోయాయి. ఆయన అనుమానాలు అవమానాలు తట్టుకుంటూ, నిన్ను వదులుకున్నందుకు తిట్టుకుంటూ జీవించాను. నా అదృష్టం కొద్దీ నా కొడుకు, తండ్రిలా కాక, ఒక మనిషిలా మారాడు. ఆయన పోయాక వాడికి నిన్ను చూడాలనే నా కోరికని చెప్పాను. వాడే నిన్ను వెతికి పట్టుకొని ఇక్కడికి తీసుకొచ్చాడు."

అతడు తలతిప్పి కారు వైపు చూసాడు. ఆ యువకుడు కనిపించలేదు.

ఎక్కడో పెద్ద ఉరుము ఉరిమింది. అప్పుడు అర్థమయ్యింది ఎంత మసకగా మారిందో ఆ వాతావరణం.

"ఇక బయలుదేరుదామా? చాలసేపైంది మనమిక్కడ కూర్చుని. అక్కడ మీ అబ్బాయి కూడా wait చేస్తుంటాడు!"

"నిన్ను వదిలి వెళ్లాలని లేదు, కాని వెళ్లక తప్పదు!'

అతడు చిన్న నవ్వు నవ్వాడు.

"పోనీ ఉండిపోనా? నాకు నీతో మిగిలిన జీవితం గడపాలని ఉంది!"

అతడు ఆమె తల నిమిరాడు. "బయలుదేరుదామా?"

ఆమె ఒక నిట్టూర్పు విడిచింది. "అర్థమైంది!"

ఇద్దరూ లేచారు.

"వెళ్లేముందు, నువ్వెంత కాలమో అడిగింది, నేను ఇంతకాలంగా ఇవ్వాలని వేచి చూసింది ఇచ్చి వెళ్తాను!" ఆమె తల ఎత్తి తన పెదాలను అతని పెదాల వద్ద తెచ్చింది.

---

ఆ యువకుడు తల తిప్పి చూసాడు. వారిరువురు దగ్గరగా ఉండడం కనిపించింది. చప్పున తల తిప్పేసుకున్నాడు.

+++++++++++++++++++++++++++++++++++++++++++++++++++++++

కొద్దిసేపటికి ఆమె దూరంగా జరిగింది. అతడు ఇంకా అలా నిశ్చేస్టుడై ఉండిపోయాడు.

"వెళదామా?" ఆమె అడిగింది.

ఇద్దరూ కారు వైపు నడిచారు.

అడుగుల శబ్దం విని ఆ యువకుడు లేచి నించున్నాడు.

వారిద్దరూ కారు వద్ద ఆగారు.

ఆమె అతని చేయి మీద చేయి వేసింది. "మళ్లా ఎప్పుడు?"

అతను ఆమె చేతి మీద చేయి వేసాడు. "ఎప్పుడు వీలవుతే అప్పుడు"

ఆ యువకుడు కారు తలుపు తెరిచి పట్టుకున్నాడు. ఆమె లోపలికి జరిగి కూర్చుంది. ఆ యువకుడు తన వైపు తలుపు తెరిచాడు.

"ఒక్క క్షణం!". అతడు ఆ యువకుడిని ఆపాడు. తన జేబులు తడుముకొని ఒక చిన్న పేపర్ తీసి కారు టాప్ మీద పెట్టి పెన్ను ఏదో రాసాడు.

"Please! give it to her once you reach home!" ఆ పేపర్ని మడిచి ఆ యువకుడి చేతికి ఇచ్చాడు. ఆ యువకుడు ఒక క్షణం ఇతని వైపు చూసి, పేపర్ జేబులో పెట్టుకున్నాడు.

లోపలినుండి ఆమె చేయి ఊపుతుండగా, కారు వెళ్ళిపోయింది. అతడు అక్కడే మిగిలిపోయాడు.

(ఒక నెల తరువాత)

"మాధవ్ గారికి నమస్కారం! కొంత ఆలస్యంగా ఈ ఉత్తరం రాస్తున్నందుకు క్షమించాలి!

అమ్మ చనిపోయింది!"

అతడు ఉత్తరం చదవటం ఆపాడు. తలెత్తి ఆకాశం వైపు చూసాడు. మసకగా కనిపించింది. కళ్ళజోడు తీసి కళ్ళు తుడుచుకున్నాడు.

గాలి వేగం పుంజుకుంది. గాలికి చేతిలోని ఉత్తరం రెపరెపలాడుతుంది. మళ్లా చదవడం ప్రారంభించాడు.

"మిమ్మల్ని కలిసాక తిరిగి వస్తుంటే అమ్మ ఎంత సేపు మాట్లాడిందో మీకు చెప్పలేను. అమ్మ మాటల్లో పట్టలేనంత ఆనందం. తన చిన్ననాటి కబుర్లు, మీ జ్ఞాపకాలు, అలా చెపుతూనే ఉంది. నన్ను ఒక్క క్షణం కూడా మాట్లాడనివ్వలేదు. అంత సంతోషంగా ఉండింది అమ్మ! నాకు ఊహ తెలిసినప్పటినుండి అమ్మని ఇంత సంతోషంగా నేను ఎన్నడు చూడలేదు. నాన్న తిట్లకి దెబ్బలకి అల్లల్లాడుతూ మూగదైపోయిన అమ్మ మాత్రమే నాకు గుర్తుకుంది. అలాంటి అమ్మ ఇంతలా మాట్లాడుతూ ఉంటే నా సంతోషానికి పగ్గాల్లేవు. అలా మాట్లాడుతూ మాట్లాడుతూ అమ్మ

నెమ్మదిగా నిద్రలోకి జారుకుంది. ఇంటికి చేరాక తెలిసింది, అది నిద్ర కాదని, శాశ్వత నిద్ర అని. అమ్మ ముఖంలో ప్రశాంతత నాకింకా గుర్తుకుంది. జీవితం మొత్తం ఏడిపించిన ఆ దేవుడు చివరి నిముషంలో మాత్రం అమ్మని చిరునవ్వుతో తీసుకెళ్ళిపోయాడు. అమ్మ మొఖంలో మిమ్మల్ని కలిసిన ఆనందం అలానే ఉండిపోయింది. నాకు అప్పుడు దేవుడి మీద చాలా కోపం వచ్చింది. ఆవిడని మీతో ఇంకొద్దిసార్లు కలవనిచ్చి సంతోషంగా ఉంచితే ఏం పోయేది?"

అతడు చదవడం ఆపాడు. అతని పెదాల మీద ఆ నాటి ముద్ర ఇంకా నిలబడిపోయింది.

"అమ్మని లోపల తెచ్చి పడుకోబెట్టాము. ఇల్లంతా గోల గోల. నాకదేమి వినిపించలేదు. అమ్మని అలానే చూస్తూ ఉండిపోయాను. నాకేమి ఏడుపు రాలేదు. ఎందుకు రావాలి? అమ్మ సంతోషంగా వెళ్ళిపోయింది. అలా చూస్తూండగా, మీరు రాసిన నోట్ గుర్తుకొచ్చింది. అమ్మకి చదివి వినిపించాలని జేబులోనుండి తీసి చదివాను. ఒక్క క్షణం నాకాళ్ళ కింద భూమి కదిలిపోయింది అనిపించింది. అప్పుడు ఏడ్చాను సర్! అప్పుడు వెక్కి వెక్కి ఏడ్చాను! అమ్మ కోసం ఏడ్చాను. అమ్మను తలుచుకొని ఏడ్చాను. అమ్మ ఒక్క చిన్న కోరిక కామేశ్వర్ గారిని కలవాలని. అది తీర్చనందుకు ఏడ్చాను. అమ్మను దేవుడు మోసం చేసాడు. మీరూ మోసం చేసారు. కానీ నాకు మీమీద కాని, ఆ దేవుడి మీదకాని కోపం రాలేదు. ఎందుకో తెలుసా? అమ్మ కామేశ్వర్ గారినే కలిసానన్న తృప్తితో వెళ్ళిపోయింది. ఆమెకి ఆయన ఈమధ్యనే చనిపోయాడన్న నిజం తెలిస్తే ఆ బాధ తట్టుకోలేక జీవితాంతం మిగిలిపోయేది. అలాంటి బ్రతుకు కంటే ఇలా సంతోషంగా వెళ్ళిపోవడం మంచిదైంది. అందుకేనేమో దేవుడు ఆమెను నిజం తెలియక ముందే అంత వేగంగా తీసుకెళ్ళిపోయాడు.

ఆ నోట్ ని అమ్మ చితి మీద వేద్దామనుకున్నాను కాని భయం వేసింది. అమ్మకి నిజం అక్కడ తెలిసినా తట్టుకోలేదు. అందుకే చింపేసాను. చిన్న చిన్న ముక్కల కింద చింపేసాను. ఈ విషయం తెలిసింది ఇక మన ఇద్దరికే.

మీరు ఉన్న చిన్న ఊళ్ళో ఇంటర్నెట్ లేదని తెలుసు కాబట్టి ఈ ఉత్తరం రాస్తున్నాను. మీరు అమెరికా తిరిగివెళ్ళి పోయే లోపు ఈ ఉత్తరం మీకు అందుతుందని ఆశిస్తున్నాను.

అన్నట్లు, మిమ్మల్ని అమ్మ అంత్యక్రియలకు కావాలనే పిలవలేదు. మీరు అమ్మ దరిదాపుల రావడం కూడా నాకు ఇష్టం లేదు. ఆమె కామేశ్వర్ నే చూసింది. అది అలానే ఉండిపోవాలి.

మీకు శాశ్వతంగా సెలవు!"

ఆ ఉత్తరం మీద ఒక నీటి చుక్క పడింది. అతడు ఆ ఉత్తరాన్ని అలానే నెల మీదకు వదిలేసాడు. ఒక గట్టి గాలి ఆ ఉత్తరాన్ని అలా ఎగరేసుకు పోయింది.

అతడు వెనుకకు తిరిగి నడవడం మొదలుపెట్టాడు.

"నన్ను క్షమించరా కాముడు! నువ్వు లేవన్న నిజాన్ని చెప్పడానికే నేను అక్కడ వేచి చేసాను. కానీ ఆరోజు తను వినే స్థితిలో లేదు. చిన్నపటినుండి మనమిద్దరం ఒకే తల్లికి పుట్టిన బిడ్డల్లా ఉన్నామనడం ఇక్కడ ఈ విధంగా పనికొచ్చింది. నేను నిజం చెప్పలేక పోయాను, కాని అబద్ధం కూడా ఆడలేదు. అందుకు మీరిద్దరూ నన్ను క్షమించాలి"

గాలి వేగం పుంజుకుంది!

# తనలో నన్ను

పాణిని జన్నాభట్ల

నాలో ఆత్రుత మొదలైంది. "ఆరున్నర దాటినా ఇంకా ఇంటికి రాలేదేంటి వీళ్ళు?" అప్పుడప్పుడూ ఇంతకు ముందిలా జరిగినా తను సర్దుకుంది కానీ ఈ మధ్య వల్ల కావటం లేదు. ఎక్కువ సమయం కూడా దొరకదు సాయంత్రాలు ఇక్కడే చూస్తూ కూర్చోటానికి.

"ఎక్కడి కెళ్ళుంటారో? ఎప్పుడొస్తారో?"

నేనూ నా ఆలోచనలూ. నేను ఒకరు కాదు ఇద్దరనిపిస్తుంది ఒక్కోసారి. నాకు తెలీనిదేదో నాలో ఉందనిపిస్తుంది. అది నాతో కొట్లాడుతుంది, నిలదీస్తుంది, అవమానిస్తుంది. ఎక్కడికెళ్తున్నానో తెలియని లోతులకి తీసికెళ్ళి పడేస్తుంది. వెనక్కి రాలేక ఉక్కిరిబిక్కిరౌతున్న నా అసహాయతను చూసి నవ్వుకుంటుంది. నా భర్త అరుపు లాంటి బలమైన శక్తిని చూస్తే దానికి భయం. తెలియని చోటెక్కడికో పారిపోయి దాక్కుంటుంది. పిరికి పంద.

చటుక్కున తలెత్తి చూసేటప్పటికి హాల్లో లైటు వెలిగింది. ఇద్దరూ లోపలికొస్తూ సోఫాలో కూలబడ్డారు. "అలిసిపోయారు పాపం, ఎందుకింత కష్టపెట్టే ఉద్యోగాలు చెయ్యడం?" నా పిచ్చి జాలితనం. రెండు నిమిషాల్లో పైకి లేచింది ఆ అమ్మాయి. హాలు తలుపు తీసుకొని బాల్కనీలోకి వచ్చింది. తెల్ల స్లీవ్ లెస్ షర్ట్, ఎరుపు ప్యాంట్. సన్నని శిల్పంలా ఉంది. బాల్కనీ గ్రిల్ మీదకు వంగి ఎదురుగా చూస్తోంది. "నన్నేనా?" నా అనుమానం.

లేదు. మా మధ్య దూరం నన్ను కనబడనివ్వదు!

సంవత్సరం క్రితమే కట్టారు ఆ లగ్జరీ కమ్యూనిటీని. దానికీ, మా అపార్ట్మెంట్ కీ మధ్య పెద్ద ఖాళీ స్థలం, ఒకరోడ్డూ, ప్రహరీ గోడలూ. సరిగ్గా ఆర్నెల్ల ముందు ఆ అపార్ట్మెంట్ లో దిగిందా జంట. ఇల్లు ఎక్కువ గ్లాస్ తో మోడరన్ గా కట్టించారు. పొద్దున పూట ఎండ రిఫ్లెక్షన్ వల్ల ఏమీ కనపడదు కానీ రాత్రి లైట్ లో మాత్రం మా కిచెన్ నుంచి వాళ్ళ హాల్ స్పష్టంగా కనబడుతుంది. మొదట్లో పెద్దగా పట్టించుకునేదాన్ని కాదు కానీ తర్వాత్తర్వాత కుతూహలం పెరిగి రోజూ గమనించడం మొదలుపెట్టాను. ముఖ్యంగా ఆ అమ్మాయిని.

తను నాజూగ్గా, మోడ్రన్ గా ఉంటుంది. జీన్స్ లు, ఫ్యాషన్ వేర్ ఎక్కువ వేస్తుంది. దూరంగా ఉండటంతో తన మేకప్, జువెలరీ సరిగ్గా కనపడవు. తన కోలముఖం, నడక, డ్రెస్సింగ్ సెన్స్ అన్నీ నాకు బాగా నచ్చాయి. జీవితంలో నేనెలా ఉండలేకపోయానో తను అలా ఉంది.

"నేనెందుకలా లేను?" అన్న ఈర్ష్య నుంచి "తనని చూడకుండా ఉండలేను" అనేవరకూ వచ్చింది నా వ్యవహారం ఈ నాలుగు నెలల్లో.

"తనకీ నాకూ సంబంధం ఏంటి?", "తనమీద ఇష్టమంటే, ఎలాంటిదది?", "తనని చూస్తూ తప్పు చేస్తున్నానా?" – నా మెదడుకు నేనే సంధించుకున్న ప్రశ్నలివి. "నువ్వు టీవీనో, మూవీనో చూస్తున్నావనుకో, దాంట్లోని క్యారెక్టర్ కీ నీకూ సంబంధం ఏంటి? నువ్వెందుకు దాన్ని ప్రేమిస్తావ్? దానికి బాధ కలిగితే నువ్వెందుకేడుస్తావ్? ఇదీ అంతే. అది తప్పు కానప్పుడు ఇదీ కాదు" తెగేసి చెప్పింది నా మెదడు. నివ్వెరపరిచే సమాధానం.

"సంధ్యా! సంధ్యా! డిన్నర్ కి ఇంకా లేటుందా?"

సమాధానం అవసరం లేని ప్రశ్న. తన ఉద్దేశ్యాల్ని కప్పిపుచ్చే ఇలాంటి ప్రశ్నలెన్నో వేస్తాడు నా భర్త.

"వస్తున్నానండీ, ఐదు నిమిషాల్లో వడ్డిస్తాను" నా నిజం ఆకలితో ఉంది, వెళ్ళక తప్పదు.

డైనింగ్ టేబుల్ దగ్గర "ఈ మధ్య బాగా పరధ్యానంగా ఉంటున్నావ్, కూరల్లో ఉప్పులూ, కారాలూ సరిగా ఉండట్లేదు, ఒంట్లో బానే ఉందా?" అన్నాడు కంచంలోకి చూస్తూ.

భార్య మానసిక స్థితిని కళ్ళలోకి చూడకుండా, మనసుతో వెతకకుండా ఉప్పు తక్కువైన వంటతో తెలుసుకునే భర్తనేమనాలి? పెళ్ళై ఇరవై ఏళ్ళయ్యాక కూడా మా ఇద్దరి మధ్య ఇంకా ఆ స్పార్క్ కావాలనుకునే నాదే పిచ్చిదనం. అసలు స్పార్క్ అంటేనే క్షణకాలం ఉండేది కదా.

"మమ్మీ ఎప్పుడూ కిచెన్లోంచి ఆపోసిట్ ఫ్లాట్ వైపు చూస్తోంది డాడీ" నా కొడుకు కంప్లైంట్. ఎప్పుడూ వాడి చదువూ, ఫ్రెండ్స్ తప్ప నా బాధలూ, కోరికలూ వాడికి పట్టవు. అసలు నన్ను మనిషిగా గుర్తించాడా అని నా అనుమానం. అమ్మలకి పిల్లలమీద కాపీరైట్ హక్కులుంటే బావుణ్ణు. వీడిలాంటి వాళ్ళ నోరు మూయచ్చు.

నేనేమీ తిరిగి అనలేదు. ఇదంతా ఒన్ వే బతుకు. ఇక్కడ నాకొచ్చేదేమీ కనపడదు. ఆ అమ్మాయి, ఆ ప్రపంచం అలా కాదు. నన్నేమీ కావాలని వేధించరు. నేనక్కడికి పారిపోవటంలో తప్పులేదు. మెదడులో 'డోపామైన్' అనే పదార్థం మనకు నచ్చిందే పదే పదే చేయిస్తుందట. వీడియోగేమ్స్ ఆడటం ఆపమని అన్నప్పుడు నా కొడుకు చెప్పిన సైన్స్ లెక్చరది.

నాకూ అలాంటి మెదడే, డోపామైనే!

మర్నాడు సాయంత్రం అంతా హడావిడిగా ఉంది వాళ్ళింట్లో. చాలా మంది జనాలు. హాలంతా నిండిపోయింది. అందరూ మెరిసిపోతున్నారు కాస్ట్లీ బట్టల్లో. "ఏంటివాళ? ఎందుకీ పార్టీ?" బైట బాల్కనీలో కొచ్చి చూస్తున్నాను. లోపల్నించి ఆ అమ్మాయి వచ్చింది హాల్లోకి. పింక్ కలర్ కాక్ టైల్ డ్రెస్, లేయర్డ్ హైర్ తో ఓ మోడల్ లా ఉంది. తన వెంటే అతనూ వచ్చాడు పసుపు షేర్వాణీలో. నలిగిన నైటీ, జిడ్డు పట్టిన చేతులు, అస్తవ్యస్తంగా పెట్టిన జుట్టుముడితో నా వాలకాన్ని ఒకసారి ఊహించుకున్నాను. గబుక్కున బెడ్రూమ్ లోకి పరిగెత్తి ఐదు నిమిషాల్లో మంచి పంజాబీ డ్రెస్ వేసుకొని, ముఖం కడుక్కుని మళ్లీ వంటింట్లోకొచ్చాను. పార్టీకి తగ్గట్టు ఉండాలి కదా!

వచ్చి చూసేటప్పటికి ఇద్దరూ టేబుల్ మీదకి వంగి కేక్ కట్ చేస్తున్నారు. అందరూ చప్పట్లు కొడుతున్నట్లు తెలుస్తోంది. "పెళ్ళిరోజు!" మెల్లగా వెలిగిన నా ట్యూబ్ లైటు, సంతోషంతో నిండిన నా ముఖం. తర్వాత గంటసేపూ తూనిగలా అటూ, ఇటూ తిరిగింది ఆ అమ్మాయి పార్టీలో. చాలామందితో మాట్లాడింది, కొందరిని కౌగిలించుకుంది. నా కళ్ళు పెద్దవయ్యాయి. గుండెల్లో అలారం. "ఇవన్నీ మామూలే పెద్ద సర్కిల్స్ లో. తప్పేముంది?" రెడీగా ఉంటుందది సమాధానాలతో.

మెల్లగా జనాలు పల్చబడ్డారు. చివరికి వీళ్ళిద్దరే మిగిలారు. తను సోఫా మీద, అతను గోడకానుకుని మాట్లాడుకుంటున్నారు. అతను ఉన్నట్టుండి చేతిలో ఉన్న గ్లాస్ నేలమీద విసిరికొట్టాడు. ఆ అమ్మాయి ఒక్కసారి సోఫా మీంచి లేచింది. ఇద్దరూ చేతులాడిస్తున్నారు విసురుగా. దూరం దూరంగానే ఉన్నారింకా. నా గుండె వేగం పెరిగింది. "ఎందుకీ వాదన?" "తనేమన్నా తప్పు చేసిందా?" "ఎవరితోనైనా మాట్లాడటం నచ్చలేదా తన భర్తకి?"

మొట్టమొదటి సారి వాళ్ళ మాటలని వినిపించలేని దూరం మీద, ఊహించలేని నా మనసుమీద కోపమొచ్చింది.

అలా వాదిస్తూనే అతను హాల్ చివరికి చేరుకుని కర్టెన్ ని పూర్తిగా క్లోజ్ చేసాడు. ఎర్రటి అడ్డం నాకూ వాళ్ళకీ మధ్య. "నాకు తెలియకూడని రహస్యమేంటి?"

తనూ గొడవపడింది భర్తతో చాలా సార్లు కానీ ఆ గొడవల్లో అంత కసి కనబడదు. అసలు ధైర్యంగా నించొని అంతసేపు మాట్లాడిందీ లేదు.

"ఏందుకంత కోపం తనకి, సర్దుకు పోవచ్చు కదా?"

"తనని తనలాగే ఉండనీ, నీ లాగా మార్చకు".

నన్నీ స్థితిలో చూసి నిద్ర కూడా దగ్గరికి రావడం మానుకుంది. మనసు తెరిచే ఉన్నప్పుడు కళ్ళు మూసి ప్రయోజనం లేదు.

పొద్దున్నే వంట హడావిడి ఇంట్లో. సరుకులేవో లేవు. ఫోన్ చేస్తే కాలనీ షాపతను లిఫ్ట్ చెయ్యలేదు. నేనే వెళ్ళాను. షాప్ క్లోజ్ చేసుంది. నీరసంగా దూరంగా ఉన్న సూపర్ మార్కెట్ లోకి నడిచాను. అక్కడ అందంగా పెట్టిన వస్తువుల్ని అలా చూస్తూ వెళ్తున్నాను వచ్చిన విషయం మర్చిపోయి.

అకస్మాత్తుగా నేనున్న వరసలో కనబడింది ఆ అమ్మాయి. చెంపకీ భుజానికీ మధ్య ఫోన్ పెట్టుకొని మాట్లాడుతోంది. "తనేనా?" ఒకక్ క్షణం జాగ్రత్తగా చూసాను. అదే స్టైలిష్ డ్రెస్సింగ్, జుట్టూ. "తనే".అంత దగ్గరగా చూడటం మొదటి సారి. పెదద్ కళ్ళు, సన్నటి ముక్కు, చూడాలనిపించే ముఖం. నా అభిమానం ఇంకా పెరిగింది. అలా చూస్తూ నిలబడి పోయాను.

"కదులు, తనతో ఎదన్నా మాట్లాడు" ఎవరో ముందుకి తోసినట్టు వెల్తున్నాను. దగ్గరిగా వస్తూ చూసాను, తన చెంప కింది భాగం ఎర్రగా కమిలిపోయి ఉంది. కళ్ళు కూడా ఉబ్బినట్లు కనబడుతున్నాయి.

"నిద్ర పోలేదనుకుంటా?"

"అతనేమైనా కొట్టాడా?"

"ఛ ఛ అంత పని చేసుండడు"

"మరెందుకలా ఉంది తను?"

మౌనం.

తన ఫోన్ మాటలు వినబడుతున్నాయి.

"నాకు లేట్ అవుతుంది. నువ్వు వెళ్ళిపో"

...

"ఇట్స్ ఒకే, అయామ్ ఫైన్ నౌ"

...

"నేను క్యాబ్ లో వస్తాను"

...

"డోంట్ సే సారీ. యూ డోంట్ మీన్ ఇట్"

"బై".ఫోన్ పెట్టేసింది తల విదిలిస్తూ. ఎదుటి వాళ్ళు చెప్పేది నమ్మనప్పుడో, నచ్చనప్పుడో చేసే ప్రక్రియ. మన శరీరం భావాల్ని దాచలేదు. ఏదోలా బయటకి తోస్తుంది.

"అతను కొట్టాడు కచ్చితంగా, అందుకే అంత బతిమిలాట"

"హు"

"ఏం మాట్లాడావే?"

"ఏం చెప్పమంటావ్? అవును అదే జరిగింది. ఎవరో ఒకరు తగ్గాలి. ఎందుకిలా చక్కటి కాపురం నాశనం చేస్కుంటారు?"

"నీకెలా తెలుసు చక్కటిదని?"

"ఇంతకు ముందెప్పుడూ ఇలా గొడవలు చూడలేదు"

"గొడవల్లేకపోతే అంతా బానే ఉన్నట్టా? మరి నీ కాపురం సంగతేంటి, హ్యాపీనా నువ్వు?"

"ఇప్పుడు మనం ఆలోచించాల్సింది నా గురించి కాదు"

"హుమ్, వెళ్ళు తనతో మాట్లాడు"

నా ఆలోచనల్ని తొక్కిపెట్టి అటూ ఇటూ చూసాను. తను షాప్ బైటకి నడుస్తోంది. తనవైపు పరిగెత్త బోయి ఆగిపోయాను. ధైర్యం చాల్లేదు. నేనెవరిని?

బిల్లింగ్ కౌంటర్ అతన్ని అడిగాను బైటకి చూపిస్తూ

"తన పేరు?"

"శైలూ మేడం, మీరు?.."

"థాంక్స్" చెప్పి మెల్లగా మా ఇంటివైపు నడిచాను.

శైలజ.

తర్వాత వారం రోజులూ వాళ్ళ హాల్ కర్టెన్ వేసే ఉంది. శైలజని ఆ రోజు అలా చూసినప్పటినుండి నా మనసు మనసులో లేదు. ఇది మెదడు చెప్పిన టీవీ సీరియల్ కాదు. అసలు మెదడుని నమ్మక పోవటమే మంచిది.

"నెనేమన్నా చెయ్యగలనా?"

"నీ పక్కింట్లోనూ, ఎదురింట్లోనూ ఉన్నాయి సమస్యలు. ఎప్పుడన్నా పట్టించుకున్నావా?"

"ఉండచ్చు గాక, ఇది వేరు"

"ఏమౌతుంది తను నీకు?"

"నీకర్థం కాదు"

ఒకరోజు పొద్దున ఆరింటికి పనిమనిషి వెనక పనిచేస్తోంది. నేను పాల పాకెట్ తీసుకొని వంటింట్లోకి వచ్చాను. వస్తూనే ఎదురుగా చూసి మొద్దుబారిపోయాను. శైలజ, వాళ్ళ బాల్కనీ గ్రిల్ మీంచి వంగి కిందకి చూస్తోంది. తన కాళ్ళు ఫ్లోర్ మీద లేవు.

"పడిపోతావే" బిగ్గరగా అరిచాను.పాల పాకెట్ జారిపడింది. లోపలెక్కడో అరిచాననుకున్నా కానీ మాట నోరు దాటింది. "బుద్ధి లేదు నాకు". అనుకున్నదంతా అయ్యింది.

పనిమనిషి రాజమ్మ ఒక్క పరుగున లోపలికొస్తూ అంది "ఏమైందమ్మా?"

అప్పుడే లేస్తున్న నా భర్త "ఎవరి మీదే అరుస్తున్నావ్ పొద్దున్నే, రాజమ్మనా?"

ఏదో ఒకటి చెప్పాలి.

"అదీ..ఏంలేదు, పాలపాకెట్ జారుతుంటే హడావిడిలో..."

ఇద్దరూ నమ్మలేదు. రాజమ్మకి ప్రశ్నించే అవసరంలేదు. అనుమానంగా చూస్తూ వెళ్ళి పనిచేసుకుంటోంది.

మళ్ళీ శైలు వంక చూసాను. బద్ధకం తీర్చుకుంటున్న పిల్లిలా, అలా గ్రిల్ మీద సాగి చూస్తూ గిరుక్కున తిరిగి లోపలికెళ్ళింది.

"ఎవరినే చూస్తున్నావ్?" వెనకనుండి హఠాత్తుగా నా భర్త. అక్కడెవరూ లేరు "హమ్మయ్య".

"ఏం లేదని చెప్పానుకదండీ, పాల గురించే. పెద్దగా అరిచే స్వాతంత్ర్యం కూడా లేదా నాకు?" భర్తలని భయపెట్టే ప్రశ్న.

"అదికాదే, నీకెమన్నా అయ్యిందేమోనని" తగ్గి అన్నాడు.

నేను పొయ్యి వైపు తిరిగి పనిచేసుకుంటున్నాను.

"నువ్వసలు అర్థం కావే" అనుకుంటూ వెళ్ళిపోయాడు.

"ఒకర్నొకరం బాగా అర్థంచేస్కున్నాం" అని అందర్నీ ఒప్పించి పెళ్ళిచేస్కుంది తనే. ఇప్పుడేమో అర్థంకావట్లేదంటున్నాడు. వీటిలో ఏదో ఒకటి అబద్ధం. కాకపోవచ్చు. అభిప్రాయాలలో సత్యాసత్యాలుండవ్.

తనకి తనే అర్థమవ్వని మనిషి ఎదుటివాడికెలా అర్థమవుతాడో అర్థం కాదు.

శైలూ చేసే పిచ్చి పనులకి నాకు రోజురోజుకీ కోపం, జాలి పెరిగిపోతున్నాయి. ఒక రోజు సాయంత్రం ఇంకో అమ్మాయితో మాట్లాడుతూ కనపడింది తను. "ఫ్రెండనుకుంటా". కొంచెం సేపటికి తను శైలజ భుజంమీద రాస్తోంది. దగ్గరిగా తీసుకుంది.

"ఏడుస్తోందా?" కన్నీళ్ళు కనపడట్లేదు. తెలుస్తున్నాయి. "పరిస్థితి బాగుపడేలా లేదు"

ఇంకో రోజు భార్యాభర్తలిద్దరూ కనబడ్డారు. కర్టెన్ గురించెవరూ పట్టించుకున్నట్టు లేదు. శైలూ చేతిలో ఏదో ఉంది. లైట్ దాని మీదపడి మెరుస్తోంది. "కత్తి!" "ఏం చేస్తున్నావే?" నాలో అలజడి. ఊపిరి బిగపట్టి చూస్తున్నాను. అతడు "వద్దు" అన్నట్టు చేతులు చూపిస్తున్నాడు. తను కత్తి తనవైపు తిప్పింది. గుచ్చుకుంటానన్నట్టు ఊపుతోంది. తను దణ్ణం పెడుతున్నాడు. కత్తి దూరంగా విసిరేసి సోఫా మీదకొచ్చి కూర్చుంది. అతనొచ్చి కింద కూర్చున్నాడు. ఆమె చేతులు పట్టుకుని ఒడిలో తలపెట్టాడు.

వాళ్ళ ప్రవర్తనకి నాకు గాభరా పెరిగిపోయింది. ఇద్దరు జీవితాలు కలిసుండాలంటే ఇంత వేదన. జీవితాంతం మనిషి ఒకేలా ఉంటాడనుకోవటం భ్రమ. దాన్ని పట్టుకొని పెళ్ళిళ్ళు చేస్కోవటం గడ్డి పోచల్ని నమ్ముకుని పర్వతం పైకెక్కడం లాంటిది. ఎప్పుడైనా అంతులేని అగాధంలో పడచ్చు.

"లేదు, వీళ్ళనిలా వదిలెయ్యకూడదు. రేపు శైలుతో మాట్లాడతాను. తనడిగితే నిజం చెప్తాను. సంసారం పాడు చేస్కోవద్దని చెప్తాను. పిచ్చి పనులు చెయ్యద్దని హెచ్చరిస్తాను".

నా లోపల్నించేమీ ప్రతిస్పందన లేదు. ఇద్దరం ఏకీభవించిన క్షణమది!

రాత్రంతా అటూ ఇటూ దొర్లాను. మనక్కావల్సినప్పుడు గడియారం కదలదు. సంతోషంలో వేగంగా, బాధలో మెల్లగా నడిచే టైమ్ ని ఎలా నమ్మడం?

పొద్దున్నే లేచి వంట జోలికి వెళ్ళలేదు. ఒకరోజు వండకపోతే ప్రళయం రాదు. సరాసరి నైట్ డ్రెస్స్ మార్చుకోని, చెప్పులేసుకుని బయల్దేరాను. లేటైతే తాను మళ్ళీ ఆఫీసుకెళ్ళిపోతుంది. ముందే కలవాలి. నేనేం చెప్పాలో ఆలోచిస్తూ నడుస్తున్నాను. పరుగులాంటి నడక.

తన కమ్యూనిటీలో అడుగుపెట్టాను. సెక్యూరిటీ ఎవరూ కనపడలేదు. ఆశ్చర్యం. ఇంత పెద్ద కమ్యూనిటీలో సెక్యురిటీ ఎవరూ లేకపోవటం. అపార్ట్మెంట్ ఓనర్ పేర్లు రాసున్నాయి ఒక గోడమీద. "రవి & శైలజ – 502".

లిఫ్ట్ దగ్గర వెయిట్ చేస్తున్నాను. అదెంతకీ రాకపోవడంతో మెట్లెక్కడం మొదలుపెట్టాను.

"తనని బైటకి పిలుస్తాను. కింద వాకింగ్ చేస్తూ మాట్లాడతాను"

"అసలేమంటుందో.."

"అనేదేముంది, దాని మొహం"

"నన్ ఆఫ్ యువర్ బిజినెస్ అంటే?"

"ఇట్ ఈస్ మై బిజినెస్ అంటాను"

ఆయాసపడుతూ ఐదో అంతస్తులోకి వస్తూ అటూ ఇటూ చూసాను. ఒక కార్నర్ ఫ్లాట్ బైట కొంతమంది సెక్యూరిటీ గార్డ్స్, ట్రాక్ ప్యాంట్స్ వేసుకున్న మగవాళ్ళూ నించొని లోపలికి తొంగి చూస్తున్నారు. అటువైపు భయంభయంగా నడుస్తున్నాను. మనసంతా కీడు శంకిస్తోంది. లిఫ్ట్ దగ్గర ఇద్దరు పనిమనుషులు గుసగుసలాడుకుంటున్నారు. అందులో ఒకామె నోటి మీద చెయ్యి పెట్టుకుని రహస్యంగా చెప్తోంది "మాత్రలు మింగిందంట".

ఉన్నట్టుండి అగాధంలో పడిపోతున్నట్టనిపించింది. భయం కళ్ళల్లోకి చేరింది. అడుగు కదలట్లేదు. గుండె వేగాన్నేలా తట్టుకోవాలో తెలియట్లేదు. అక్కడే గోడకి వాలిపోయాను. వచ్చిన దారిలోనే పరిగెత్తి పారిపోదామనిపించింది. కొంతసేపటికి తేరుకున్నాను.

"శైలూకేం కాదు" ధైర్యం చెప్పుకుంటూ ముందుకడుగేస్తున్నాను. వాళ్ళ తలుపు దగ్గరికొచ్చాను. అందరూ నన్ను చూస్తున్నారు. పట్టించుకోలేదు. తొంగి చూసాను.

నేల మీద ఉంది శైలూ. దుప్పటి కప్పి ఉంది తన మీద. ముఖం మాత్రమే కనబడుతోంది. నా నోటినుంచి చిన్న అరుపు. గాలంతా బైటికి తీస్తున్నట్టు. అప్పటివరకూ నియంత్రించిన కన్నీళ్ళు ఆనకట్ట దాటాయి. ధారలుగా కురుస్తున్నాయి. ఒక మూలగా కూర్చిని సన్నగా ఏడుస్తున్న తన భర్త తలెత్తి నావైపు చూసాడు. "నీ వల్లే ఇదంతా" అంటున్న నా చూపుని చూసి తలదించుకున్నాడు.

శైలూనలా చూడలేకపోయాను. అచేతనంగా, మూగగా. తనొక అందమైన రహస్యం. ఎడారిలో దొరికిన జలపాతం. వెనక్కి తిరిగాను. పరిగెదుతున్నాను, నా అడుగులు ఒకేసారి రెండు, మూడు మెట్లని దాటుతున్నాయి. గేటు బైటికొచ్చాను.

"ఎవరికి చెప్పాలి?, ఎవరితో పంచుకోవాలీ వ్యధ?"

"సంధ్యా?" దగ్గరగా ఓ పిలుపు.నా భర్త. బైక్ మీద ఉన్నాడు.

"ఇక్కడున్నావేంటి?"

"ఏమండీ..ఆ అమ్మాయి, ఆ అమ్మాయి.." అంటూ వెనక్కి చూపిస్తూ ఆగాను.

"ఎవరే?, అక్కడెవరూ లేరు. పనిమనిషి కోసం వచ్చావా? రాజమ్మ రాలేదా ఇవాళ?"

తలాడించాను.

"ఏంటి కళ్ళు ఎర్రగా ఉన్నాయి? నిద్ర పట్టలేదా? పద ఇంట్లో డ్రాప్ చేసి వెళ్తాను"

బైక్ ఎక్కాను.

దూరంగా కనుమరుగౌతున్న ఆ కమ్యూనిటీ వైపు చూశాను.

నా రహస్యాన్ని పాతిపెట్టిన శ్మశానంలా ఉందది.

## అత్తారింటికి దారేది? సి హెచ్. వి.ఎస్.ఎస్.పుల్లం రాజు

“కట్టె విరిచి పొయ్యిలో పెట్టి నట్లుగా మోటుగా, కటువుగా వుంటుంది ఆవిడ మాట. నోటికి ఎంతవస్తే అంతే, ఆ సమయంలో ఆవిడకి ఆలోచన శూన్యం. అదే నా పాలిట శాపం. అందుకే ఇలా కూలింది నా కాపురం", నెలల పసి గుడ్డుని ఒడిలో పెట్టుకుని, సముద్రమంత విషాదాన్ని భరిస్తూ, ఏడుస్తూ చెప్పింది శశి.

"చూడు, మీ అమ్మ సంగతి నాకు తెలియందా? ముందు ఆ కన్నీళ్లు తుడుచుకో. అసలు ఏమి జరిగిందో వివరంగా చెప్పు...“ సముదాయిస్తూ అడిగాడు బావ.

బావకి శశి మేనమామ కూతురు. ఆమె పుట్టిల్లు అమలాపురానికి దగ్గరలో ఉన్న ఒక పల్లెటూరు. ఆస్తిపాస్తులు బాగానే ఉన్నాయి. శశి పేరుకు తగ్గట్టుగానే చక్కని చుక్క. శాంతంగా, సౌమ్యంగా, అణకువగా ఉంటుంది శశి. శశికి డిగ్రీ

పూర్తి అవుతుంటేనే కుటుంబం మంచిదని, కుర్రాడు కాలేజీ లో అధ్యాపకుడని,అంద గాడని, భావించి విజయవాడలో వుండే విజయ్ తో వివాహం చేశారు. శశి తండ్రి శాంతమూర్తి, చాలా గంభీరంగా ఉంటాడు. కానీ శశి తల్లి అందుకు పూర్తిగా వ్యతిరేకం. కోపం రావడానికి కారణం అక్కర్లేదు ఆవిడకు.

"విజయవాడ నించి పురిటికి తీసుకు వచ్చాడు నాన్న నన్ను ఏడో నెలలో. వచ్చి నెల రోజులు దాటుతుండగా ఒక రోజు విజయ్ వచ్చాడు నన్ను చూడటానికి. ఆయన వస్తారని మాకు తెలీదు. అదే రోజు నాన్న ఏదో ముఖ్యమైన పనుందని బయటికి వెళ్ళాడు. పరిస్థితులన్నీ ఆరోజు నామీద పగ పట్టాయి కాబోలు..." శశి చెప్తోంది, మండువా దగ్గర సోఫాలో కూర్చున్న బావతో. గదిలో పాపాయి నిద్ర పోతోంది.

"వచ్చినప్పటి నుండి ఆయనది ఒకటే గోల. పసుపు కుంకుమగా ఇస్తామన్న రెండెకరాల భూమి ఆయన పేర రాయలేదని, రోజూ వాళ్ళ నాన్న రాద్ధాంతాలు చేస్తున్నాడట. మర్యాద గల కుటుంబ మనుకున్నాము, మనం మోస పోయా మని వాపోతున్నాడట. పోనీ మా మావగారు వాళ్ళు ఏమీ లేనివాళ్ళా అంటే, కాదు పొలాలు, ఇళ్లు, వాకిళ్ళు అన్నీ ఉన్నాయి. కానీ డబ్బంటే పిచ్చి. నన్ను మా నాన్నని మోసం చేసి పెళ్లి చేసారంటూ గోల గోల చేసాడు విజయ్. నచ్చ చెప్పడానికి నేను ఎంతో ప్రయత్నం చేస్తూనే వున్నాను. బామ్మ వచ్చి, 'మేము మోసం చేస్తామా నాయనా! కాస్త నేను చెప్పేది విను బాబు' అంటూ సర్ది చెప్పడానికి ప్రయత్నం చేసింది. 'ముసలమ్మ గారూ! ఇది మీ వ్యవహారం కాదు మీకు సంబంధం లేదు బయటికి పొండి' అంటూ గద్దించాడు విజయ్.

ఇంతలో జరగరానిదే జరిగింది. నా భయమే నిజమయ్యింది. పెరట్లో ఉన్న మా అమ్మకు ఆ మాటలు ఎలా వినపడ్డాయో తెలీదు. విడిచి పెట్ట బడిన బాణంలా రివ్వున దూసుకు వచ్చింది. పూనకం వచ్చినదానిలా వూగి పోయింది. చూడబ్బాయి! నువ్వు చాలా ఎక్కువ మాట్లాడుతున్నావు. ఇక తగ్గు. మీ గౌరవ మర్యాదలు మాకూ తెలుసు. మీ నాన్న కి డబ్బు జబ్బు. అది నీకూ వచ్చిందా? అయినా కడుపుతో ఉన్న పిల్లని కన్నీళ్లు పెట్టించడానికి పని కట్టుకుని వచ్చావా? వెధవ సంస్కారం... వెధవ పెంపకం... అసలు నిన్ను ఇప్పుడు రమ్మని మన్నది ఎవరంట?' మా అమ్మ వీరంగం చూసి నాకు నోట మాట రాలేదు... ఏడుస్తూ అలాగే కూలబడిపోయా. దెబ్బ తిన్న పులిలా వున్నా డాయన. తెచ్చుకున్న సంచీని భుజానికి వేసుకున్నారు. ఒక్క అంగ లో రోడ్డు మీదకి వచ్చారు.మళ్ళీ ఈ గడప తొక్కితే ఒట్టు... అంటూ విసవిసా నడుస్తూ రోడ్డు మలుపు తిరిగారు". శశి చెప్పడం ఆపి కన్నీళ్లు తుడుచుకుంటూ పాపాయి ఏడుపు విని గదిలోకి పరుగెత్తింది.

ఆడపిల్ల పుట్టిందని తల్లి బిడ్డ క్షేమంగా వున్నారని వియ్యంకుడికి ఉత్తరం రాసాడు శశి తండ్రి. కానీ ఏమీ జవాబు రాలేదు. ఆ రోజు జరిగిన సంఘటనకి తను చాలా చింతిస్తున్నానని కూడా తెలియజేస్తూ ఉత్తరాలు రాస్తునే వున్నాడు శశి తండ్రి.

నెలలు గడుస్తున్న కొద్దీ ఆ కుటుంబాల మధ్య అగాధం కూడా పెరుగుతూనే ఉంది.

బావకి మేనమామ అన్నా,ఆ పల్లెటూరు అన్నా ఎంతో ఇష్టం. చిన్నతనంలో కొంత కాలం ఆ ఊర్లో చదువుకున్నాడు. అమ్మమ్మ (మేనమామ తల్లి) అతనికి ఎన్నో కథలు చెప్పేది. ఆంధ్ర పత్రికను అమ్మమ్మ గణగణా చదువుతుంటే, రోడ్డు మీద వెళ్లే వాళ్ళు కూడా నిలబడి వినే వారు. మంత్రాలు వేసేది. ముహుర్తాలు పెట్టేది. సలహాలు చెప్పేది.

పొలం పనులు పూర్తి చేసుకుని మధ్యాహ్నానికి తిరిగి వచ్చిన మేనమామను పలకరించాడు బావ. ఇద్దరు కలిసి భోజనాలు చేశారు. వసారాలో చేరి మేనమామ, మేనల్లుడు కబుర్లు ప్రారంభిస్తే వాటికి అంతే ఉండేది కాదు. గ్రామ, దేశ రాజకీయాలు,క్రీడలు, సినిమాలు ఇలా ఎన్నెన్నో వాటిపై చర్చలు. కానీ ఈసారి మేనమామ ఎంతో గంభీరంగా వున్నాడు. పొడి పొడిగా అడిగిన వాటికే సమాధానాలు చెప్తున్న మేనమామ మనసుని గ్రహించాడు బావ.

సాయంత్రమవుతుంటే స్నేహితులను కలవటానికి వూర్లోకి బయలుదేరి దీపాలు పెట్టేవేళకి ఇంటికి చేరాడు బావ. భోజనాలు ముగించి పెరట్లో వేసిన మడత మంచాల మీదకి చేరారు అందరూ. శుక్ల పక్షం రోజులవి. పెరట్లో బాదం చెట్టు, ఉసిరి చెట్టు,జామ చెట్టు, నిమ్మ చెట్టు కొంచెం దూరంలో సన్నజాజి పందిరి మరి కొంచెం దూరంలో బావి. వెన్నెల్లో అన్నీ అందంగా కనిపిస్తున్నాయి. కొబ్బరాకుల మధ్యలోంచి వెన్నెల కురుస్తోంది. బావకి బాల్యం గుర్తుకువచ్చింది. ఇంతలో హడావిడిగా వస్తోంది శశి అక్కడికి. ఏదో చెప్పాలనుకుంటోంది. "రా శశి! చెప్పు ఏమిటి సంగతులు" కూర్చోమని సైగ చేస్తూ అన్నాడు బావ.

కుక్కని తరుముదామని వెళితే పాము కరిచిందని సామెత. ఆ రోజు సాయంత్రం శశి స్నేహితురాలు సంధ్య ఇంటికి వచ్చింది. పిచ్చా పాటి తో మొదలైన వాళ్ళ కబుర్లు కొత్త మలుపులు తిరిగాయి. సంధ్య, శశి కంటే వయసులో పెద్దది. అందం,ఆస్తి తెలివితేటలు వుండే సంధ్యకు కాస్తంత పొగరు, అహంకారం ఉండేవి. కాలేజీలో చదువుకున్న రోజుల్లో.

శశి కంటే ముందుగానే సంధ్యకు వివాహమయ్యింది. కళ్యాణం కమనీయంగానే జరిగింది కానీ, పట్టుమని పది రోజులు కూడా కాపురం చెయ్యలేదు సంధ్య. పదహారు రోజులు పండుగ కూడా పూర్తి కాకుండానే పుట్టింటికి చేరింది. అయితే ఆమెది కట్నకానుకల సమస్యా, అత్తమమల తోటి సమస్యా కాదు. తన భర్త చూడటానికి చిరంజీవి లా వున్నా పడక గదిలో మాత్రం అంత సీన్ లేదని సంధ్య ఆరోపణ. మగతనం లేని వాడితో మనువు, కాపురం ఏమిటని ఆమె ప్రశ్న. నాలుగు గోడల మధ్యా, రెండు తనువుల మధ్యా ఒక మంచం మీద జరిగే రహస్యాలను, రచ్చ బండ కీడిస్తే రగడే మిగులుతుంది.

"జరిగింది పీడ కల అని మర్చిపో, బ్రహ్మాండమైన ఇంకో సంబంధం తెస్తాము. నీకు తగిన వాటితోనే పెళ్లి చేస్తా" మంటూ బాబయ్యలు,మావయ్యలు శపధాలు చేశారు. మీసాలు తిప్పిన ఆ మగ ధీరులను చూసి తన అదృష్టానికి మురిసి పోయింది.

కాలం నడుస్తుంటే ఆవేశాలు చల్లారి శపధాల సంగతే అందరూ మరచి పోయారు. అత్తారింటికి వెళ్లని సంధ్యకి పుట్టింటికే వచ్చాయి... విడాకుల పత్రాలు.

సంధ్య ఒక సారి ఏదో పని మీద రాజమండ్రి వెళ్ళింది. అక్కడ షాపింగ్ మాల్ లో అనుకోని సంఘటన జరిగింది. ఆమెకు అక్కడే కనిపించాడు తను విడాకులిచ్చిన మాజీ భర్త. అనుకోకుండా ఇద్దరి చూపులు కలిశాయి. ఒకర్నొకరు గుర్తు పట్టారు. అతనిలో పెద్దగా మార్పు ఏమీ లేదు. కానీ అతని చిటికిన వ్రేలు పట్టుకుని నెమ్మదిగా నడకలు నేర్చుకుంటున్న అతని వంశాంకురాన్ని చూసి అవాక్కయ్యింది సంధ్య. "ఏవండీ! పిల్లాడి చెయ్యి గట్టిగా పట్టుకోండి. వద లకండి సుమా" అంటున్న ఒక తీయని స్త్రీ కంఠం కూడా వినపడింది సంధ్యకు. అంతలోనే ఆమె దగ్గరగా వచ్చి పిల్లవాడిని ఎత్తుకుంది. ఆమె భుజాన ఉన్న బ్యాగ్ ను తీసుకుని ముందుకు నడిచాడు. చేజారిన అదృష్టం లా చూస్తూ వుండగానే ఆ ముగ్గురు సంధ్య కనుల ముందు నుండి సాగిపోయారు.

అటు పగటికీ ఇటు రాత్రికీ చెందని సంధ్యలా ఆమె అక్కడే నిలబడిపోయింది.

బరువెక్కిన మనసు తో, నోట మాట రాక శశి శిల లా వుండిపోయింది. ఆమె కు సంధ్య సంగతి తెలిసి మనసు అల్లకల్లోలమయ్యింది. "శశి, ఇక వెళ్లి పడుక్కో,భయపడకు, అన్నీ సర్దుకుంటాయి" అని ఓదార్చాడు బావ. కానీ, ఆలోచనలు ఈగల్లా ముసురుతున్నాయి బావ బుర్రలో. నల్ల మబ్బులు చంద్రుడు మీద దాడి చేస్తున్నాయి ఆకాశంలో. దూరంగా వున్న చెట్ల మీద జుట్టు విర బోసుకొని నవ్వుతున్నాయి దెయ్యాలు. నిద్ర పట్టక మంచంమీద దొర్లుతున్నాడు బావ.

విజయవాడ వచ్చాడు కానీ, బావ కళ్ళ ముందు శశి,మేనమామ కదులుతూనే వున్నారు. ఆఫీసులో పని చేస్తున్నా ఆలోచనలు మాత్రం శశి చుట్టూనే తిరుగుతూనే వున్నాయి.

రెండురోజులు పోయిన తరువాత విజయ్ పని చేస్తున్న కాలేజీ కి వెళ్ళాడు బావ. స్టాఫ్ రూమ్ కి వెళ్లి విజయ్ కోసం వాకబు చేస్తే,క్లాస్ కి వెళ్లి నట్లు తెలిసింది. అక్కడున్న వరండాలో నిలబడి అటూ ఇటూ చూస్తూ జేబు రుమాలుతో ఒకసారి మొహం తుడుచుకున్నాడు. ఇంతలో గంట మోగింది. క్లాసులు వదిలి అందరూ బయటికి వస్తున్నారు. దూరంగా మెట్ల మీద నుండి కిందకు దిగుతున్నాడు విజయ్

" నమస్కారం సార్... బావున్నారా" నవ్వుతూ పలకరిస్తూ విజయ్ దగ్గరికి వెళ్లాడు బావ.

ఒక్క నిముషం గుర్తు పట్టనట్లు నటించి అంతలోనే " ఓ! మీరా!... బావ కదా !" ప్రశ్నర్ధకంగా చూశాడు విజయ్.

తలూపుతూ "థాంక్యూ సార్ భలే గుర్తు పట్టారు" అన్నాడు బావ హుషారుగా.

" తండ్రి అయ్యారు మీరు... శుభాకాంక్షలు... ఎలా ఉంది మీ ఇంటి మహా లక్ష్మీ?" వూహించని ప్రశ్నకు కొంచెం కంగారు పడ్డాడు విజయ్.

" నాకేమీ తెలియదండీ ..ఎవరు ఎలా దాపురిస్తే నాకేం ? చికాకుగా ముఖం పెట్టుకున్నాడు విజయ్... ఉక్రోషం ముఖంలో పొంగింది.

ఇద్దరి మధ్య మాటలు లేవు. రెండు అడుగులు నడిచారు ఇద్దరు.

"రెండు రోజుల క్రితం మా మావయ్య ఇంటికి వెళ్ళాను." విజయ్ పక్కనే నడుస్తూ చెప్తున్నాడు బావ. "నిజం చెప్పద్దూ... ఆ బంగారు తల్లి అంతా మీ పోలికే. మీ బంగారు ఛాయ... కోటేసిన ముక్కు.. ఇంకా కళ్ళ ముందే కదులుతోంది. అవును,తండ్రి పోలికలు ఆడ పిల్లకు వస్తే అదృష్టం అంటారు కదా" బావ మాటల్లో ఆనందం పొంగింది.

ఒకసారి బావ కేసి తేరి పార చూసాడు విజయ్. ఇతను చెప్పే మాటలన్నీ నిజమా అన్నట్లు. ఇంకేమి చెబుతాడో అన్నట్లు చెవులు రిక్కించాడు విజయ్. ఏమి అడుగుతాడో అన్నట్లు విజయ్ ప్రశ్నల కోసం ఎదురు చూస్తున్నాడు బావ.

"నేరం ఒకరిది శిక్ష మరొకరికి... భూమి మీద పడ్డ ఆ బంగారు బిడ్డ చేసిన నేర మేమిటో నాకు తెలియదు. అర్ధం లేని పంతాలతో,పట్టింపులతో ఏమి సాధిస్తారు ? బంగారం లాంటి జీవితాలని పాడు చేసుకోవడం తప్ప " కొంచెం గట్టిగానే అన్నాడు బావ, విజయ్ స్పందన ఎలా ఉంటుందో అనుకుంటూ.

కస్సున లేచాడు విజయ్" పిల్లలు తప్పులు చేస్తారు.వాళ్లని క్షమించాలి... కానీ మర్యాద మన్ననలు లేని పెద్దవాళ్లే బుద్ధి గడ్డి తిని హద్దులు మీరి ప్రవర్తిస్తే...? " విజయ్ గొంతు కోపంతో వణికింది.

మౌనమే బావ సమాధానం. స్వరం పెంచి మళ్ళీ విజయ్ అన్నాడు..." చూడండి! నాకేమి తక్కువ? అందం,ఆస్తి, ఉద్యోగం ఏమి లేదో చెప్పండి ..నోరుందని రెచ్చిపోతే గుణపాఠం నేనూ చెప్పగలను...".

ఎక్కడ తగ్గాలో బావకి తెలుసు. ప్రశాంతంగా చెప్పాడు "చూడండి విజయ్ గారు! మీ మనసు నాకు అర్థమయింది. విషయం నాకు తెలుసు. మీరు చేస్తున్నది తప్పని అనలేను. కానీ..." చివరి మాటని వత్తుతోఅన్నాడు బావ.

"ఏం ఆగి పోయారే, చెప్పండి" ఉద్రేకంతో రెట్టించాడు విజయ్.

"పదండి, కొంచం ముందుకెళ్లి క్యాంటీన్ లో కూర్చుని మాట్లాడుకొందాం" ఎంతో సౌమ్యంగా అభ్యర్ధించాడు బావ. అతని మాటని కాదనలేక పోయాడు విజయ్.ఎదురెదురుగా కూర్చొన్న ఇద్దరి చేతుల్లోనూ కూల్డ్రింక్స్ వున్నాయి.

"విజయ్ నువ్వు చెప్పు. శశి ని ఓదార్చగల వాళ్లు ఈ ప్రపంచంలో ఎవరైనా ఉన్నారా?నీవు తప్ప. తల్లిదండ్రులు, స్నేహితులు చుట్టూ ఎంతమంది వున్నా ఒంటరిగా బ్రతుకుతూ పిచ్చిదానిలావుంది శశి". ఈసారి బావ గొంతు బాధ తో జీరబోయింది.

ఇద్దరి మధ్యా మరలా మౌనం పరుచు కొంది. దూరంగా వున్న క్రీడా మైదానంలో గాలిపటాలు ఎగురవేస్తున్నారు పిల్లలు. దారం తెగిన గాలిపటం ఒకటి గిరికీలు కొడుతూ చెట్టు కొమ్మల్లో చిక్కుకుపోయింది. ఖాళీ కూల్ డ్రింక్ సీసా ను టేబుల్ మీద పెడుతూ విజయ్ అన్నాడు

"మేము సంస్కారం లేని మనుషులం, మావన్నీ వెధవ పెంపకాలు... డబ్బు మనుష్యులం... మాదారిన మమ్మల్ని వదిలెయ్యండి."

పదునైన చురకత్తిని విసిరి నట్లు అనిపించింది బావ కి. పదును లేని కత్తికి ప్రయోజనం పూజ్యం. కత్తి ఎంత పదునుగా వున్నా పిడికిలి పట్టుకొనే ప్రయోజనం సాధించాలి. చెప్పడానికి ఏముంది మీ దగ్గర అన్నట్లు చూస్తున్నాడు విజయ్.

"విజయ్ గారు! నోరు పనిచేసినట్టు గా మెదడు పని చేయదు కొందరి కి. సున్నితమైన మనస్సున్న మీరు ఇది అర్థం చేసుకోవాలి. బుర్ర తక్కువ వాళ్ల గురించి ,వాళ్ల మాటలు గురించి మీలాంటి వారు పట్టించుకోకూడదు.మరొక విషయం చెప్పాలి మీకు. ఆనాడు జరిగిన సంఘటన కు మీరు మీ తల్లిదండ్రులు మాత్రమే కాదు బాధ పడుతున్న ది...". మిగిలిన కూల్డ్రింక్ ని గుటక వేస్తూ విజయ్ కేసి చూసాడు బావ. సగంలో ఆపేసిన మాటల తో కొంచెం అయోమయంలో పడ్డాడు విజయ్. "మీరూ, మీ తల్లిదండ్రులు ఆ సంఘటన కు ఎంతో బాధ పడుతుంటే, మిమ్మల్ని చూడాలన్నా మీతో మాట్లాడాలన్నా నోరు రాక, సిగ్గు తో కృంగిపోతూ ,జీవచ్ఛవంలా బతుకుతున్నాడు మా మేనమామ. ఇవన్నీ పక్కన పెట్టండి, ఆ ముక్కుపచ్చలారని చిట్టితల్లి చేసిన తప్పు ఏమిటి? తండ్రికీ తాతకి,నానమ్మ కి దూరంగా గడపవలసిన ఖర్మ ఏమిటి? వయస్సులో వున్న మీ మొగుడు పెళ్లారిద్దరు, శాపగ్రస్తులులా,ఎడారిలో మోడుల్లా దూరం దూరంగా బతకటం దారుణం కాదూ?". బావ మాటల్లో వేదన వుంది, తప్పు నువ్వు కూడా చేస్తున్నావన్న హెచ్చరికా వుంది.

క్యాంటీన్ లో నుండి బయటకు వచ్చారిద్దరు. విజయ్ ముఖం లో రంగులు మారుతున్నాయి. కొమ్మల్లో చిక్కుకున్న గాలిపటాన్నితెచ్చిన కుర్రాడు, దారం తో ముడివేసి, ఆకాశం లోకి ఎగురవేస్తున్నాడు.

"చెప్పండి విజయ్... ఏమిచేద్దామంటారు?" బావ గొంతు లో అభ్యర్థన స్పష్టంగా వినిపిస్తోంది విజయకి.

"సరే, మీరే చెప్పండి... ఏం చేయాలో..." బావ మాటలమీద నమ్మకం తో విజయ్ అన్నాడు.

"ఇదీ బంగారం లాంటి మాటంటే" నవ్వుతూ అన్నాడు బావ. "వచ్చే శనివారం సాయంత్రానికి మీ ఆవిడ, కూతురు మీ ఇంట్లో వుంటారు... సరేనా?" బావ మాటలకి నిజంగానా అన్నట్లు చూసాడు విజయ్. నూతనోత్సాహం మొహం లో

తొణికిసలాడింది అతని లో. అది గమనించి "కానీ..." అన్నాడు బావ విజయ్ కేసి చూస్తూ. "చెప్పండి బావ గారు, నేనేమి చెయ్యాలో..." నవ్వుతూ అడిగాడు విజయ్.

"స్వాగతతోరణాలు కట్టండి ఇంటి కి." కదిలాడు బావ.

బామ్మ నిర్ణయించిన ముహూర్తానికి, అందరికీ వీడ్కోలు పలుకు తూ బావ కారులో విజయవాడ కి బయలు దేరింది శశి. దూరంగా నిలబడి సంధ్య చేయి వూపుతోంది.

కారు హారన్ విని పరుగులు తీస్తూ వచ్చాడు విజయ్. మనుమరాలి కి గుమ్మంలో హారతి ఇచ్చి, కోడలిని ఆప్యాయంగా ఇంట్లో కి తీసుకుని వెళ్లింది శశి అత్త గారు.

ఆ రోజు రాత్రి... కోడలు తెచ్చిన దస్తావేజులు తృప్తిగా చూసుకొని ,చదువు కొని బీరువాలో భద్రపరిచాడు విజయ్ తండ్రి. తాతా బామ్మల మధ్య రాజకుమారి లా ఠీవిగా నిద్ర పోతోంది మనవరాలు. కాపురంలో రగిలిన సమస్యల్ని దాటించి, అత్తారింటికి దారి చూపించిన బావ కి మనసులోనే కృతజ్ఞతలు తెలుపుకొంది శశి. కలహాలు తొలగి తేలిక పడ్డ మనసులతో ఎంతో సంతోషంగా ఉన్నారు శశి విజయ్ లు. ఎన్నో నెలలు తర్వాత తిరిగి కలుసుకున్న ఆనందంలో ,ఆ శుభతరుణం లో ఆ దంపతులు బెడ్రూమ్ లో ఏమిచేస్తున్నారని అడగకండి దయచేసి.

## కాలింగ్ బెల్

ఓట్ర ప్రకాష్ రావు

సోమయాజులు ఉలిక్కి పడి లేచాడు. పైన ఫ్యాన్ వేగంగా తిరుగుతున్నా ముఖాన చెమట పట్టడం గమనించాడు. సమయం ఒంటిగంట అయింది. 'ఇక తలకిందులుగా తపస్సు చేసినా నిదుర రాదు' అని మనసులో బాధగా అనుకొన్నాడు .

ఏమిటో ఈ మధ్య ప్రతిరోజూ పీడ కలలు రావడం... రాత్రి వేళ ఒకటి లేక రెండు గంటల సమయంలో ఉలిక్కి పడి లేవడం ఆతరువాత నిదుర రాక అసహనంగా పిచ్చి పిచ్చి ఆలోచనలతో అటూ ఇటూ మంచంపై పొర్లుతూ క్షణం ఒక యుగంలా ...... ఈ సమస్య ఎవరితో చెప్పుకోవాలో అర్థం కావడం లేదు.

ఒక రోజు భార్య సావిత్రి అన్న మాటలు గుర్తుకు తెచ్చుకొన్నాడు .

"మనిద్దరిలో ఎవరు ముందుగా మరణిస్తారో వారే అదృష్టవంతులు "అంది సావిత్రి

"అదేమిటి సావిత్రీ మనమిద్దరమూ ఎవరూ లేని ఆనాధలు అయినట్లు మాట్లాడుతున్నావు. మనల్ని ప్రేమించే ఇద్దరు కొడుకులు , ఒక కూతురుఉన్నారన్న సంగతి మరిచావా?. వాళ్ళు మనకు కాస్తా దూరంగా అంటే, కొడుకులిద్దరూ విదేశంలో ఉంటె, కూతురు పెళ్లైయ్యాక అల్లుడు ఉద్యోగరీత్యా ముంబైలో స్థిరపడ్డారు. ఇప్పటికీ మనతో ప్రతిరోజూ ఫోన్లో మాట్లాడుతున్నారుగా" అన్నాడు

" ఏమి మాట్లాడుతున్నారో ....మనమై వాట్స్ అప్ ద్వారా ఫోన్ చేయడం వల్ల మాట్లాడుతున్నారు. మనం ఫోన్ చెయ్యకుండా ఉంటే వారానికి ఒకసారి మాట్లాడుతారు. ఈ కాలం పిల్లలలంతా మారిపోయారు. విదేశాల్లో వున్నా ఒకటే, పక్క ఊరిలో వున్నా ఒకటే...ప్చ్ " అంది సావిత్రి .

సావిత్రి మరణించి ఆరునెలలు అయింది. సావిత్రి మరణించాక ఈ మధ్య సోమయాజులతో రెండువారాలకొకరోజు ఫోన్ చేసినా ఒకటి రెండు నిమిషాల పైన మాట్లాడకపోవడం సోమయాజులు గుర్తించి మౌనంగా బాధపడ్డాడు.

కొంత సేపు సావిత్రీ ఆలోచనలలో మునిగిపోయాడు .మరికొంత సేపు ఈ ఒంటరితనం ఎలా భరించాలన్న ఆలోచనలో పడ్డాడు . మనసులో ఏదో తెలియని శూన్యం....... నిదురరాక .... 'ప్చ్.... ఒంటరితనం జీవితం ఎంతటి నరకమో ' అనుకొన్నాడు సోమయాజులు

ఆరుగంటలకు పాలవాడి కేక. పాలగిన్నె తీసుకొని తలుపులు తెరిచాడు

"సార్ మీరొక్కరే నేను ఒక కేక వేయగానే తలుపులు తెరచి పాలు తీసుకొంటున్నారు ప్రతి ఇంటిలోనూ పాలు తీసుకొనడానికి చాలా ఆలస్యం చేస్తున్నారు. పాల సైకిల్ స్టాండ్ వేసి కాలింగ్ బెల్ కొట్టి పిలుస్తున్నాను " అంటూ పాల గిన్నెలోపాలు పోసాడు .

సోమయాజులు వాడి వైపుచూస్తూ జీవం లేని నవ్వు నవ్వాడు 'వాళ్లంతా అదృష్టవంతులు హాయిగా నిదురపోతున్నారు,నేను దురదృష్టవంతుడ్ని 'అని మనసులో అనుకొంటూ లోనికి వెళ్ళాడు.

★★★ ★★★ ★★★

హోటల్ ముందు తగిలించి ఉన్న పెద్ద బ్యానర్ కనపడింది . 'సర్వ సమస్యలకు , మానసికాందోళనలకు పరిష్కారమార్గమైన ధ్యానం నేర్పించబడును.రిసిప్షన్ హోలులో జరిగే పరిచయ కార్యక్రమమునకు అందరూ ఆహ్వానితులే' అంటూ పెద్ద అక్షరాలతో ప్రింట్ చేసి వుంది.

ఆ పరిచయ కార్యక్రమమునకు సోమయాజులు వెళ్ళాడు. అరవై వయసుకు అటూ ఇటూ ఉన్న ఆడవారు మగవారు మొత్తం కలిపి ఇరవై మంది ఉన్నారు. పట్టణమంతా ప్రకటనలు ఇచ్చినా చాలా తక్కువగా ఇరవైమంది మాత్రమే వచ్చారంటే సోమయాజులుకు ఆశ్చర్యం కలిగించింది

ధ్యాన గురువు మాట్లాడుతూ మనసు గురించి ఎన్నోవిధాల చెప్పారు ' ఎటువంటి చెడు ఆలోచనలు కలగకుండా ప్రశాంతంగా నిదురించాలంటే ఈ ధ్యానం అభ్యసిస్తే చాలు "అన్న మాటలు సోమయాజులు మనసులో నిలచిపోయింది ఆ క్షణమే ఆ తరగతిలో చేరాలని నిర్ణయించుకొన్నాడు

అతని ప్రసంగం ముగించడానికి ముందు "మొత్తం ఐదు రోజులు ఈ తరగతులు జరగుతుంది. ఈ తరగతులలో చేరడానికి మనిషికి పదిహేను వేల రూపాయలు ఫీజు నిర్ణయించాము. తరగతులలో చేరవలసిన వారు డబ్బు చెల్లించి తమ పేరు నమోదు చేసుకోండి " అన్నారు .

ఐదురోజుల ధ్యానం తరగతులు ముగిసింది.

' ఈ ధ్యానం వల్ల తనకు ఎటువంటి ప్రయోజనం లేదు. వీళ్ళు నిజమైన ఆధ్యాత్మిక గురువులు కాదు వ్యాపార గురువులు. పదిహేనువేలరూపాయలు వృధా అయింది ' సోమయాజులు అనుకొన్నాడు.

★★★ ★★★ ★★★

హనుమంతుని గుడి దగ్గర ఒక చిన్న ప్రకటన సోమయాజులు చూసి చదివాడు ."ఉచిత యోగా విద్య హనుమంతుని గుడిలో ఈ రోజు నుండి ప్రారంభం కానుంది .ఆసక్తి కలవారు యోగ విద్యను అభ్యసించి వాటి ఫలితాలను పొందగలరని ఆశిస్తున్నాము "

సావిత్రీ మరణించడానికి ముందు ప్రతి వారం హనుమంతుని గుడికి భార్యతో కలసి సోమయాజులు వెళ్ళేవాడు. ఆ తరువాత మనసు ఏకాగ్రత లేక పోవడంతో గుడికి వెళ్లడం మానుకున్నాడు. ఈరోజు మరలా గుడిలోకి సోమయాజులు ప్రవేశించాడు. అప్పటికే యోగాసనం విద్యా తరగతులు ప్రారంభమైంది. సూర్య నమస్కారములు చేయిస్తున్నారు .

సుమారు యాభై సంవత్సరాల వయసుతో పొడుగాటి గడ్డం, నుదుట కుంకుమతో తెల్లటి దుస్తులు ధరించిన ఆ వ్యక్తిని చూడగానే అతనే యోగా గురువు ఉండవచ్చు అని అనుకొన్నాడు సోమయాజులు

" నమస్కారం అండీ ...నేను యోగా మాస్టర్ ను కలవడానికి వచ్చాను "

"నమస్కారం అన్నా ,యోగా గురించి నాకు తెలిసింది కొద్దిగా అయినా నన్ను యోగ మాస్టర్ అంటుంటారు. నా పేరు దాసు " అన్నారు

సోమయాజులు తన భార్య మరణం తరువాత తన మానసిక ఆందోళనగురించి క్లుప్తంగా చెప్పాడు. ధ్యానం తరగతులకు వెళ్లి ఎటువంటి ప్రయోజనం కలుగలేదన్నా సంగతి చెప్పిన తరువాత "అయ్యా , యోగాసనములు ద్వారా నా సమస్య కు పరిష్కారమార్గం దొరుకుతుందన్న ఆలోచనతో అక్కడున్న ప్రకటన చూడగానే వచ్చాను"అన్నాడు సోమయాజులు

"అన్నా,చూడటానికి మీ వయసు సుమారు డెబ్బై నుండి డెబ్బై ఐదు సంవత్సరాల వయసు ఉంటుందనుకొంటున్నాను " అన్నారు దాసు

" డెబ్బై ఐదు " సమాధానం ఇచ్చాడు సోమయాజులు

" క్షమించండి అన్నా యోగా తరగతులకు చిన్న పిల్లలకు మీలాంటి పెద్ద వారికి నేను నేర్పించను .నా దృష్టిలో చిన్న పిల్లలు, ముసలివారు జోడు గుర్రాలు లాంటి వారు . వారిద్దరూ సమానం. యోగా తరగతులు ఎలా జరుగుతుందో మీరు చూడండి .ఇక మీ మానసిక సమస్య ...." అంటూ ప్రారంభించబోతుంటే "అయ్యా క్షమించండి తరగతి మధ్యలో వచ్చి మిమ్మల్ని .....మీరు యోగా తరగతులను నిర్వహించండి ,అవసరమనిపిస్తే మరలా వస్తాను " అంటూ చేతులు జోడించాడు సోమయాజులు

దాసు తరగతులు జరపడం ప్రారంభించగానే సోమయాజులు వెనక్కు తిరిగి ఇంటిముఖం పట్టాడు. దారిలో చిన్న పిల్లలు ఆడుకొనే బాట్, బాల్ కొనుక్కొని వెళ్ళాడు తన ఇంటి ముందున్న కాళీ స్థలంలో నిలబడి రోడ్డు ప్రక్కన ఆడుకొంటున్న పిల్లలను పిలిచాడు .

"ట్రాఫిక్ ఎక్కువగానవున్న రోడ్డు ప్రక్కన ఆడుకోవడం కష్టం. లోనికి రండి మా యింటి ముందు ఆడుకొంటాము " అంటూ తన దగ్గరకు వచ్చిన పిల్లలతో చెప్పాడు. పిల్లలు సంతోషంతో అంగీకరించారు

అక్కడి పిల్లలు సోమయాజులతో అతితక్కువసమయంలో కలసి పోవడంతో వాళ్ళతో చిన్న పిల్లాడిలా ఆడుకొనసాగాడు. కాస్సేపు బాట్ బంతితో క్రికెట్ ఆడారు .

పరుగుపందెం ప్రారంభించారు .సోమయాజులుకు ఒక చిన్న అబ్బాయికి పరుగుపందెం ప్రారంభమైంది. ప్రక్కనున్న ఒక అమ్మాయి వన్ ...టూ ....త్రీ..." అనగానే ఇద్దరూ జోడుగుర్రాల్లా ఒకే వేగంతో పరుగెత్తసాగారు. వీధి దీపాలు వెలిగేంతవరకు ఆడుకొంటూనే ఉన్నారు .పిల్లల తల్లి తండ్రులు వచ్చి పిల్లలను పిలుచుకొని వెళ్ళడానికి వచ్చారు .

" ప్రతిరోజూ సాయంత్రం ఇదే సమయానికి రండి ఆడుకొందాము "అన్నాడు ఉత్సాహంతో

"తాతయ్యా రేపు ఆదివారం. "

“ ఆదివారం అన్న సంగతే మరచిపోయాను. ఆదివారం,సెలవురోజులలో ఉదయం నుంచి చీకటి పడేవరకు ఆడుకొందాము.” అన్నాడు.

ముసలివారు పిల్లలు జోడుగుఱ్ఱాలు అంటూ చెప్పి తన సమస్యకు పరిష్కారం కల్పించిన యోగా గురువు దాసుని మనసులో తలచుకొంటూ ధన్యవాదములు చెప్పుకొన్నాడు. తేలికైన మనసుతో ఇంటిలోనికి వెళ్ళాడు సోమయాజులు.

చాలాకాలం తరువాత ఆ రాత్రి సోమయాజులుకు గాఢ నిద్ర కలిగింది. పాల వాడి కేక వినిపించలేదు, కాలింగ్ బెల్ కొట్టాక మేలుకొన్నాడు

“ఏం సార్ ,ప్రతిరోజూ నేను ఒక చిన్న కేక వెయ్యగానే వచ్చే వారు. ఈ రోజు కాలింగ్ బెల్ మూడుసార్లు కొట్టాను. ఆరోగ్యం బాగోలేదా? " అన్నాడు పాలవాడు

పాలవాడి వైపు చిరునవ్వుతో చూస్తూ రోజూ " ఇక మీదట రోజూ కాలింగ్ బెల్ కొట్టవలసి వస్తుంది " అన్నాడు.

# భక్త వరుణుడు

దమ్మవళం శ్రీనివాస్

అది ఓ మధ్య తరగతి రైల్వే స్టేషన్. జనాలతో కిటకిటలాడుతోంది. అక్కడే ఓ పక్కగా, ఈ లోకంలో లేనట్టుగా మనసులో ఏదో తలచుకుంటూ నిలబడి ఉన్నాడు పాతికేళ్ళ వరుణ్. ఉత్కంఠగా ఉందతడికి. గుండె కొట్టుకునే వేగం పెరుగుతూ పోతుంది సమయం గడిచేకొద్దీ. అతడ్ని దాటుకొని వెళ్ళేవారంతా అతడి వైపు ఆసక్తిగా చూస్తూ వెళ్తున్నారు. చాలా అందంగా ఉన్నాడతడు. ఒత్తైన నల్లటి జుట్టు, ఎఱ్ఱటి మొహం, నిలువెత్తు రూపం. అయితే చాలా మందిని ఆకర్షిస్తుంది అతడి రూపం మాత్రమే కాదు. అవతారం కూడా.

తెల్లటి ధోవతి, కుర్తా, నుదుటున పెద్ద నిలువు నామం. తన వయసుకూ, ప్రస్తుత కాలానికీ బొత్తిగా సంబంధం లేనట్టుగా ఉందతడి అవతారం. ఒకళ్ళిద్దరు అతడేదో యువ సాధువనుకొని దండం పెట్టి మరీ వెళ్ళారు. తనని ఆసక్తిగా చూసే జనాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా భుజాన తగిలించుకున్న చిన్న సంచీ ఓసారి సర్దుకొని ఫోన్ వైపు చూసుకున్నాడు. అందులో కనిపించే సంస్కృత శ్లోకాలు కంఠస్థం చేస్తున్నాడు ఏదో పరీక్షలకు తయారవుతున్నట్టుగా.

ఈలోగా తిరుపతి నుంచి వచ్చే రైలు మరి కొద్దిసేపట్లో వస్తుందని అనౌన్స్ చేసారు. రైలు ఎక్కడానికీ, వచ్చేవారిని రిసీవ్ చేసుకోడానికీ జనాలు సిద్ధమవుతున్నారు. వరుణ్ ఎక్కాల్సిన రైలు కూడా అదే. తన ఎం.బి.ఏ చివరి

పరీక్షలకు, మొదటి జాబ్ ఇంటర్వ్యూ అటెండ్ అవుతున్నప్పుడు కూడా ఇంత ఒత్తిడికి గురవ్వలేదు. మరికొద్దిసేపట్లో తను రైల్లో కలవబోయేది సామాన్య వ్యక్తిని కాదు. ఎలాగైనా సరే ఆయన్ను ప్రసన్నం చేసుకొని తీరాలి. 'దేవుడా అర్జెంటుగా కాపాడు. నీ విషయంలో అబద్ధాలు చెప్పబోతున్నందుకు నన్ను నిజంగానే క్షమించు..' మనసులో దండం పెట్టుకున్నాడు.

రైలు స్టేషన్ చేరుకున్నట్టుగా గట్టిగా కూత వినిపించింది. ఫోన్ జేబులో పెట్టేసుకొని గట్టిగా శ్వాస తీసుకున్నాడు. ప్రశాంతంగా ఉండడానికి ప్రయత్నించసాగాడు. మనసును గిలిగింతలు పెడుతూ తళుక్కున ఊహల్లో మెదిలింది లహరి. ఎంత బావుంటుంది నిజంగా. సినీతారలు కూడా ఈర్ష్యపడే చర్మసౌందర్యం, ఒంపుసొంపులు. ముఖ్యంగా ఆ కళ్ళల్లోని మెరుపు తను ఎప్పుడూ ఏ అమ్మాయిలోనూ చూడలేదు.. కొంపదీసి లహరిని వొదులుకోవాల్సి వస్తుందా? మనసు బాధగా మూలిగింది. వెంటనే తేరుకున్నాడు. ఏదైతే అదైంది. అన్నింటికీ తెగించే ఇక్కడకు వచ్చాడు తను. ఇలా అనుకుంటూండగా రైలు వచ్చి ఆగింది ఎదురుగా. తను రిజర్వ్ చేసుకున్న బోగీ చూసుకొని, శుభం జరగాలని కుడికాలు ముందుపెట్టి రైల్లోకి అడుగుపెట్టాడు వరుణ్.

★★★

ఆ పూట అతడు అలా రైలు ఎక్కడానికి సరిగ్గా నాలుగు రోజుల క్రితం కలిసాడు లహరిని నాలుగేళ్ళ తరువాత. ఆఫీసు పనిమీద ఎవర్నో కలవటానికి లహరి పని చేసే కంపెనీకే వచ్చాడతడు అనుకోకుండా. చూడగానే గుర్తుపట్టి పలకరించాడు. ఆమె అక్కడే పనిచేస్తుందనీ, ఇంకా పెళ్ళవలేదని తెలియగానే పట్టరాని సంతోషంతో మైమరచిపోయాడు.

లహరి కూడా వరుణ్ ని చూసి ఆశ్చర్యపోయింది. కాలేజీ రోజుల్లో అతడి ప్రేమను తిరస్కరిస్తూ చివరిసారిగా తను అన్న మాటలు గుర్తుకు వచ్చినయ్.

*"వరుణ్, నా దృష్టిలో 'ప్రేమ' అనేది చాలా గొప్ప విషయం. ఇందులో రకాలు గానీ, భేధాలు కానీ ఉండవు. నా తల్లిదండ్రులకి నేనంటే ప్రేమ. వారి ప్రేమను ఓ పక్క వమ్ము చేస్తూ, చదువుకోవాల్సిన వయసులో ఇలాంటి ప్రేమ వ్యవహారంలోకి దిగడం నాకిష్టం లేదు. నా పెళ్ళి ఎవరితో, ఎప్పుడు జరగాలో వాళ్ళు మాత్రమే నిర్ణయిస్తారు. నేను కాదు.."*

క్లాసు మొత్తానికీ అందగాడు, చదువులో కూడా చురుగ్గా ఉండే వరుణ్ ప్రేమని తిరస్కరించడానికి కారణం లహరిని తండ్రి కృష్ణమూర్తి పెంచిన తీరు. కుటుంబ సాంప్రదాయాలతో పాటు ఓ మంచి వ్యక్తిత్వం ఉన్న మనిషిగా ఆమెని తీర్చిదిద్దడంలో ఆయన వందశాతం సఫలమయ్యాడు. ప్రభుత్వ కంపెనీలో పని చేసే ఆయన పనిమీద చూపే శ్రద్ధ, స్వార్థ చింతనలేని ఆలోచనలు, నలుగురికీ సహాయపడాలనే మనస్తత్వం, దైవభక్తి మొదలైన గుణాలు లహరిని ఎంతో ప్రభావితం చేసేవి. ఆయన అడుగుజాడల్లోనే నడవాలనీ, ఆయన గీసిన గీటు ఎప్పటికీ దాటకూడదని స్థిరనిశ్చయం చేసుకుంది.

తన ప్రేమను తిరస్కరించాక ఎప్పుడూ లహరి జోలికి వెళ్ళలేదు వరుణ్. తేరుకోడానికి కొంత సమయం పట్టినా, ఆమె చెప్పింది కూడా నిజమే కదా అనుకున్నాడు నిజాయితీగా. చదువు పూర్తిచేసుకొని ఒక యోగ్యుడిలా ఆమె తల్లిదండ్రులను కలిసి పెళ్ళి ప్రస్తావన తేవాలని గట్టిగా నిర్ణయించుకున్నాడు. అయితే అతడికి ఆ అవకాశమే రాలేదు. కాలేజీ చదువు పూర్తికాకుండానే లహరి తండ్రిని వేరే రాష్ట్రానికి బదిలీ చేయటంతో, తను ఎక్కడుందో కూడా తెలీకుండాపోయింది.

చదువు పూర్తిచేసుకొని మంచి ఉద్యోగం సంపాదించాడు వరుణ్. లహరి గుర్తొచ్చినప్పుడల్లా ఎంతో బాధకు లోనయ్యేవాడు. ఏ అమ్మాయి మీదా అతడికి మనసు రాలేదు. ఇంట్లోవాళ్ళు ఎన్ని సంబంధాలు తెచ్చినా కాదన్నాడు. ఎక్కడుందో వెతికి పట్టుకొని లహరిని మాత్రమే పెళ్ళి చేసుకోవాలని ఎన్నో విధాలుగా ప్రయత్నించి విఫలమయ్యాక అనుకోకుండా ఆమెను కలవటం జరిగింది.

ఏమాత్రం ఆలస్యం చేయకుండా పెళ్ళి ప్రస్తావన తీసుకువచ్చాడు వరుణ్.

"వరుణ్, నువ్వంటే నాకు మంచి అభిప్రాయమే ఉంది. అయితే మా నాన్నకు ఈ ప్రేమ వ్యవహారాలంటే గిట్టదు. నాకొచ్చిన సంబంధాల్లో ఒకటి నచ్చి అదే విషయం మాట్లాడటానికి ఆయన తిరుపతి వెళ్ళారు. ఇంకో నాలుగు రోజుల్లో తిరిగి వస్తారు అక్కడ బ్రహ్మోత్సవాలు కూడా చూసుకొని. ఆయన ఇప్పటికే నిర్ణయం తీసేసుకొని ఉంటే చేసేదేమీ లేదు.." సూటిగా చెప్పింది.

"నిర్ణయం తీసుకొని ఉండకపోతే?" ఆతృతగా అడిగాడు.

"అయినా కూడా, నువ్వు ఆయనకు నచ్చితేనే మన పెళ్ళి జరిగేది.. నా అంతట నేను వెళ్ళి నీ గురించి చెప్పటం అనేది జరగని పని. ఆయన తిరిగొచ్చాక, తిరుపతి సంబంధం కుదరకపోతే, మీ అమ్మానాన్నలతో వచ్చి ఆయన్ను కలిస్తే మంచిది"

"అప్పటిదాకా సమయం లేదు లహరి. నిన్ను దూరం చేసుకోలేను. అమ్మా నాన్నా కూడా ఊళ్ళో లేరు.. నాకో చిన్న సాయం చేస్తావా?"

"ఏంటది?"

"మీ నాన్నకు ఎలాంటి అల్లుడు కావాలి? ఆయన్ను మెప్పించాలంటే ఏం చేయాలి?" అడిగాడు అభ్యర్ధనగా.

చిన్నగా నవ్వి చెప్పింది లహరి "దైవ భక్తి ఉన్నవాడు కుటుంబాన్ని బాధ్యతగా చూసుకుంటాడనీ, ఏ తప్పూ చేయడని ఆయన నమ్మకం"

"చాలా థాంక్స్ లహరి. ఈ మాత్రం చాలు. మిగితాది నేను చూసుకుంటాను.." స్థిరనిశ్చయంతో చెప్పాడు. అప్పటికే అతడి మనసులో ఓ ఆలోచన రూపుదిద్దుకుంటుంది. లహరి తండ్రి కృష్ణమూర్తి కొలిచే దేవుడెవరు, తిరుపతి నుంచి తిరిగివచ్చే తేదీ, ప్రయాణ వివరాలు లాంటివి అడిగి తెలుసుకొని అక్కడ నుంచి వెళ్ళిపోయాడు.

అర్జెంటుగా తానో గొప్ప దైవభక్తుడిగా అవతారం ఎత్తి, కాబోయే మామగారితో తిరుపతి నుంచి వచ్చే రైల్లో కలిసి ప్రయాణం చేసి ఆయన్ను మెప్పించాలి. తను మాత్రమే లహరికి సరైన జోడీ అని ఆయనకు నమ్మకం కుదరాలి. ఇదీ అతడి ఆలోచన.

ఎప్పుడైనా గుళ్ళో దండం పెట్టుకోవటం తప్ప ఇంకేమీ తెలీని అతడు, ఆ తరువాత నాలుగు రోజులు సమయం దొరికినప్పుడల్లా కంప్యూటర్ ముందు కూర్చొని దైవభక్తికి సంబంధించిన ఎన్నో విషయాలు శ్రద్ధగా తెలుసుకున్నాడు. ఇవే కాక ఓ రెండు మూడు సంస్కృత శ్లోకాలు బాగా బట్టీ పట్టాడు. మాటల మధ్యలో ఆశువుగా వాటిని చెప్పి కృష్ణమూర్తిని మంత్రముగ్ధుడ్ని చేయాలన్నది అతడి ఆలోచన. మొదట తిరుపతిలోనే రైలు ఎక్కుదామనుకున్నా మరీ ఎక్కువసేపు ఆయనతో గడిపితే అసలు విషయం పట్టేస్తాడేమో అనిపించింది. అందుకే తిరుపతి నుంచి తమ ఊరికి వచ్చే మార్గంలో కేవలం నాలుగు గంటల దూరంలో ఉన్న ఓ రైల్వే స్టేషన్ను ఎన్నుకొని ఓ యువ భక్తుడిలా అక్కడకు వచ్చి కృష్ణమూర్తితో కలిసి ప్రయాణం చేయడానికి రైలు ఎక్కేసాడు.

★★★

రైల్లో అపర భక్తుడి వేషధారణలో ఎదురుగా వచ్చి కూర్చున్న కుర్రాడ్ని ఆసక్తిగా చూసాడు కృష్ణమూర్తి. "నమస్తే సర్.." గౌరవంగా చెప్పాడు వరుణ్ చిరునవ్వుతో. మనసులో ఉన్న జంకూ, భయం అన్నింటినీ గట్టిగా తొక్కిపెట్టాడు. కృష్ణమూర్తి మంచి ఎత్తూ, లావుతో చూడ్డానికి గంభీరంగా ఉన్నా ఆయన మొహంలో ఏదో తెలియని శాంతి గోచరిస్తుంది.

"నమస్తే బాబూ. నేను నీకు తెలుసా?" కొద్దిగా ఆశ్చర్యపోతూ అడిగాడాయన.

"అదేంటి సర్ అలా అంటారు? తిరుపతి నుంచి వస్తూ మీలాంటి దైవ భక్తులు కనిపిస్తే నమస్కారం చేయడానికి పరిచయం ఉండాలా ఏంటి" కొద్దిగా చనువు తీసుకుంటూ అన్నాడు వరుణ్.

చిన్నగా నవ్వి తలపంకించాడు కృష్ణమూర్తి. "ఏ ఊరు బాబూ మీది?" అడిగాడు. తన ఊరితో పాటు, పేరు, కుటుంబ విషయాలు, చదువు, పనిచేసే కంపెనీతో సహా అన్ని వివరాలూ చెప్పేసాడు వరుణ్ దొరికిందే అవకాశం అని. అన్నీ విన్నాక కృష్ణమూర్తి మొహం కొద్దిగా ప్రసన్నంగా మారటం గమనించాడు. ఉత్సాహంగా ఆ తరువాత కొద్దిసేపు తానో గొప్ప భక్తుడని తెలియచెప్పే విధంగా తన జ్ఞానాన్ని ప్రదర్శించబోయాడు. ఇక్కడే అతడు కృష్ణమూర్తిని తక్కువగా అంచనా వేసాడు.

"ఏంటో సర్. ఈ మానవ జీవితంలో దైవభక్తికి మించినది ఏదీ లేదనిపిస్తుంది. దైవం గురించి తెలుసుకోడానికి నాలుగు రోజులు కూడా నాలుగు క్షణాల్లా గడిచిపోయినట్టుగా ఉంటాయి.." అధ్యాత్మికంగా అన్నాడు వరుణ్ మనసులో దైవాన్ని తలచుకున్నట్టుగా.

"అవును బాబూ. అయితే, నీలాంటి చిన్నకుర్రాడు దైవం గురించి మాట్లాడటం చాలా గొప్ప విషయం. ఇంతకీ మీ ఆచార్యుడెవరు?" ఆసక్తిగా అడిగాడు కృష్ణమూర్తి.

"నేను చిన్న కుర్రాడ్నేంటి సర్. పాతికేళ్లు నిండిపోతే. ప్రహ్లాదుడు ఆరేళ్ళ వయసులోనే భక్తి మార్గం పట్టి ముక్తిని పొందాడు.. నేను భక్తుడిగా మారి ఇంకా పదేళ్ళు కూడా కాలేదు. మా గురువు గారి పేరు మల్లాది రాఘవాచారి గారు.." నోటికొచ్చిన పేరు ఆశువుగా చెప్పాడు.

"మన సాంప్రదాయం ప్రకారం 'ఆచార్యులు' అనాలి బాబూ. జ్ఞానాన్ని పంచేవాడు గురువైతే, దాన్ని సాంప్రదాయబద్ధంగా ఆచరించి కూడా చూపేవాడు ఆచార్యుడు.." వివరించాడు కృష్ణమూర్తి.

కొద్దిగా తడబడ్డాడు వరుణ్. వెంటనే సర్దుకొని "అవును సర్. నాకు దైవ మార్గాన్ని చూపిందే మా ఆచార్యులవారు.." ఆయన చెప్పిన విషయం తనకు ముందుగానే తెలిసినట్టుగా చెప్పాడు.

కొద్దిసేపు ఆగి మళ్ళీ తన భక్తిని నిరూపించుకునే కార్యక్రమం చేపట్టాడు. "తిరుమల సన్నిధికి మించిన వైష్ణవ దివ్యదేశం ఇంకోటి లేదు.. ఏడాదికి కనీసం రెండుసార్లైనా దర్శనానికి వెళ్తూంటాను నేను.." భక్తి ఉట్టిపడేలా చెప్పాడు వరుణ్. కృష్ణమూర్తి ముఖ్యంగా కొలిచేది తిరుమల దేవుడ్నే అని లహరి ముందుగానే చెప్పి ఉండటంతో, ఆయన్ను ప్రసన్నం చేసుకోటానికి ఈ మాటన్నాడు.

"వైష్ణవ సాంప్రదాయంలో తిరుమల కన్నా ప్రధానమైన దివ్యదేశం ఇంకోటి ఉంది. అదేంటో తెలుసా?" అడిగాడు కృష్ణమూర్తి.

వరుణ్ కి జవాబేమివ్వాలో తోచలేదు. అసలు దివ్యదేశం అంటే ఏంటో కూడా తనకు తెలీదు. ఎక్కడో ఏదో చదివింది వాడేసాడు. ఈయన అడిగిందానికి జవాబు తెలీదు అంటే తనకు ఏమీ తెలీదని అనుకోవచ్చు. ఏం చేయాలా అని ఆలోచిస్తూండగా ఫోన్ మోగింది. హమ్మయ్య అనుకొని వెంటనే ఫోన్ ఎత్తి మాట్లాడాడు. అతడి అక్కయ్య నుంచి ఫోన్. ఓ ఐదు నిమిషాలు మాట్లాడి పెట్టేసేలోపు వీళ్ళ సంభాషణ ఆసక్తిగా వింటున్న తోటి ప్రయాణీకుడు కృష్ణమూర్తినే అడిగేసాడు ఆయన అడిగిన ప్రశ్నకు జవాబు చెప్పమని.

"శ్రీరంగంలోని శ్రీరంగనాధస్వామి ఆలయం వైష్ణవ దివ్యదేశాల్లో అత్యంత ప్రధానమైనదిగా భావిస్తారు.." చెప్పాడు కృష్ణమూర్తి.

ఫోన్ పెట్టేస్తూ ఈ మాట విన్న వరుణ్ వెంటనే చెప్పాడు "అవును సర్. శ్రీరంగం నిజంగా చాలా గొప్ప ఆలయం. అన్ని దివ్యదేశాల్లోకెల్లా  చాలా ప్రధానమైంది". మళ్ళీ ఎక్కడో చదివింది గుర్తుకు తెచ్చుకుంటూ చెప్పాడు. ఇక్కడితో ఆగి ఉంటే బావుండేది. తన జ్ఞానాన్ని ప్రదర్శించాలన్న తాపత్రయంతో మళ్ళీ అన్నాడు "భారతదేశంలో ఉన్న నూటా ఎనిమిది దివ్యదేశాలు చూసిరావాలన్నది నా కోరిక సర్. ఏడాదికి కొన్ని చొప్పున అన్నీ చూసిరావాలంటే కనీసం ఐదేళ్ళు పడుతుంది.."

చిన్నగా నవ్వి చెప్పాడు కృష్ణమూర్తి "భారత దేశంలో ఉన్నవి నూటా అయిదే. మిగితా మూడు ఇక్కడ లేవు. ఒకటి నేపాల్లో ఉంది. ఇంకో రెండు.." అంటూ ఇంకా ఏదో చెబుతూండగా వరుణ్ మధ్యలో కల్పించుకొని "మిగితా రెండూ ఏ దేశంలో ఉన్నా, ఎంత ఖర్చైనా వెళ్తాను సర్.." అన్నాడు పట్టుదలగా.

ఈసారి పెద్దగా నవ్వి చెప్పాడు కృష్ణమూర్తి. "మిగితా రెండూ అసలు భూలోకంలోనే లేవు. ఈ మానవ శరీరంతో అక్కడకు వెళ్ళలేము. అందులో ఒకటి క్షీర సముద్రం, రెండోది వైకుంఠం.."

నోటమాటరానట్టుగా ఉండిపోయాడు వరుణ్ కొద్దిసేపు. మొదటిసారి తను చిత్తుగా ఓడిపోతాడేమో అని భయమేసింది. ఏదో ఒకటి అర్జెంటుగా చేయకపోతే కొంప మునుగుతుంది అనుకుంటూండగా ఫోన్ మోగింది. విసుగ్గా చూసుకున్నాడు. ఏదో తెలియని నెంబర్. కట్ చేసాక వెంటనే మళ్ళీ మోగింది. అవతలి వాళ్ళు అలా చేస్తూనే ఉన్నారు. ఎవరా అని ఫోన్ ఎత్తగానే క్రెడిట్ కార్డ్ తీసుకోమని ఏదో ఆఫర్ ఉందని చెప్పిందో అమ్మాయి. ఆసక్తి లేదని చెప్పి ఫోన్ పెట్టేసాడు.

ఈలోగా ఏదో స్టేషన్ రావటంతో, అంతా హడావిడిగా మారింది. బాగా ఆకలిగా ఉండటంతో వరుణ్ కూడా ఏదైనా తిందామని రైలు దిగాడు. ఎందుకైనా మంచిదని కృష్ణమూర్తి సీటు వైపు కాక రెండోవైపు దిగాడు. వేడి బజ్జీలు తిని టీ తాగాక హాయిగా అనిపించింది. ఆయన తనని బజ్జీలు తినటం చూస్తే బాగోదనిపించింది. తిరిగివస్తూ ఆయన ముందు తినడానికి జామకాయలు కొనుక్కొని వచ్చాడు.

ఆ తరువాత మళ్ళీ కొద్దిసేపు తన దైవభక్తి నిరూపించుకునే పనిలో పడ్డాడు వరుణ్. అయితే ఇంతకుముందులాగే అతడు చేసిన ప్రతీదీ బెడిసికొట్టింది. తను బట్టీపట్టిన చెప్పిన సంస్కృత శ్లోకాలు వాటి అర్థాలు కూడా అతడ్ని ఆదుకోలేకపోయాయి. వాటికి కృష్ణమూర్తి చెప్పిన అసలైన అర్థం అతడికి గూగుల్లో కూడా ఎక్కడా తగల్లేదు. ఆయనకున్న అపారమైన జ్ఞానం ముందు అతడు తేలిగ్గా తేలిపోయాడు.

మొత్తానికి నాలుగు గంటల ప్రయాణం ముగిసి వాళ్ళు దిగాల్సిన స్టేషన్ వచ్చింది. నీరసంగా కృష్ణమూర్తి దగ్గర సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు వరుణ్ ఎంతో నిరాశగా. ఆ తిరుపతి సంబంధం కుదిరిందో లేదో తెలీదు. ఇవాళ తన మాటలతో, ప్రవర్తనతో తానో దొంగ భక్తుడని ఆయనకు ఖచ్చితంగా అర్థమయ్యే ఉంటుంది. అంతటి గొప్ప

పండితుడ్ని తక్కువగా అంచనా వేసి తేలిగ్గా దొరికిపోయాడు. ఈసారి తల్లిదండ్రులతో వెళ్ళి కలిసినా తనను అల్లుడిగా ఒప్పుకునే అవకాశమే లేదు. దేవుడు కూడా ఆయన విషయంలో అబద్ధాలు చెప్పినందుకు తనకు బాగా శాస్తి చేసాడు. మనసంతా పాడైపోయి దిగులుగా ఇంటి దారిపట్టాడు వరుణ్.

★★★

"ఇవాళ రైల్లో వరుణ్ అని ఓ కుర్రాడ్ని కలిసాను తల్లీ. నాకు చాలా బాగా నచ్చాడు. ఇంట్లో సంబంధాలు చూస్తున్నారట. వివరాలు తీసుకున్నాను. ఆ తిరుపతి సంబంధం నాకెందుకో నచ్చలేదు. ఇక్కడిదాకా వచ్చిన సంబంధం అదీ తిరుపతిలో కుదరకపోవటంతో బాధగా అనిపించింది. అయితే ఆ భగవంతుడే పంపినట్టుగా ఈ కుర్రాడు వచ్చి కలిసాడు. అందం, చదువు, ఉద్యోగం అన్నింటిలోనూ నీతో సరితూగేవాడు. పైగా ఈ ఊరివాడు. నాకెందుకో ఈ సంబంధం కుదురుతుందనే అనిపిస్తుంది. అంతా ఆ భగవంతుడి దయ." ఇంటికి వచ్చాక స్నానం చేసి భోజనం చేస్తూ అన్నాడు కృష్ణమూర్తి లహరితో. పక్కనే కూర్చున్న లహరి తల్లికి కూడా వరుణ్ గురించిన అన్ని వివరాలూ చెప్పాడు.

"మీకో మాట చెప్పాలి నాన్నా" సందేహిస్తూ అన్నది లహరి అంతా విన్నాక.

"ఏంటమ్మా అది?"

"మిమ్మల్ని కలిసిన వరుణ్ నాలుగేళ్ళ క్రితం నాతో కలిసి చదువుకున్నాడు. నాలుగురోజుల క్రితమే నన్ను అనుకోకుండా కలిసాడు. నన్ను పెళ్ళి చేసుకోవాలని ఆశపడ్డాడు. మీకు ఎలాంటి అల్లుడు నచ్చుతాడని అడిగితే, దైవభక్తి ఉన్నవాడని చెప్పేసాను. నాకూ అతడి మీద మంచి అభిప్రాయమే ఉంది. ఒకవేళ మీకు అతడు నచ్చింది భక్తివల్లే అయితే, మీరు ఇంకోసారి అతడ్ని బాగా తెలుసుకోవటం మంచిది. భక్తి విషయంలో అతడిది నటనే కావొచ్చు.." సూటిగా చెప్పేసింది.

కొన్ని క్షణాలు నోటమాట రానట్టుగా ఉండిపోయాడు కృష్ణమూర్తి. లహరి తల్లి కూడా ఆందోళనగా చూసింది భర్త వైపు. చిన్నగా తలపంకించి చెప్పాడు కృష్ణమూర్తి "అతడో భక్తుడని నేననుకోవాలని చాలా ఉబలాటపడ్డాడు. ఈ విషయమే నాకూ అప్పుడు అంతుబట్టలేదు. ఇప్పుడర్థమైంది.."

"నన్ను క్షమించండి నాన్నా" సిగ్గుపడుతూ అన్నది లహరి.

"పర్లేదమ్మా. నువ్వనుకున్నట్టేమీ జరగలేదు. నిజానికి అతడికిదంతా కొత్త అని అతడ్ని చూసిన మరుక్షణం అర్థమైంది. ముఖాన పెట్టుకున్న నామం చూస్తే తెలిసిపోతుంది అలవాటుగా పెట్టుకునేదా లేక కొత్తా అని. అంతేకాక, అతడు నన్ను మెప్పించడానికి చేసిన ఏ ప్రయత్నం కూడా సఫలం కాలేదు.."

"మరి ఏ విషయంలో అతడు మీకు నచ్చాడు?" ఆశ్చర్యంగా అడిగింది లహరి.

"అతడికి సాంప్రదాయబద్ధంగా ఉండాల్సిన భక్తి విషయంలో అనుభవం లేకపోవచ్చు కానీ, దైవానికి సంబంధించిన అతి గొప్ప సూక్ష్మం చాలా చక్కగా తెలుసుకున్నాడు. నా దృష్టిలో ఇది చాలా గొప్ప విషయం."

"ఏంటి నాన్నా అది?" ఆసక్తిగా అడిగింది.

"ప్రతీ మనిషిలోనూ, ప్రతీ జీవిలోనూ పరమాత్మను చూడటం! అందుకు తగ్గట్టుగా ప్రవర్తించడం!

వచ్చే దారిలో ఏదో స్టేషన్లో రైలు దిగాడు వరుణ్. అతడు వెళ్ళాక నేనూ అలా నడుద్దామని కూర్చున్న చోటనుంచి లేచి తలుపుదాకా వెళ్ళాను. కొద్దిదూరంలో అతడు బజ్జీలు తింటూ నాకంటబడ్డాడు. అక్కడే ఆకలితో తచ్చాడుతున్న ఓ కుక్కపిల్లను అంతా కసురుకుంటూంటే, అతడు మాత్రం దాన్ని దగ్గరకు పిలిచి దానికీ తినడానికి పెట్టి ఆకలి తీర్చాడు. తిరిగివస్తూ జామకాయలు అమ్మే ముసలివాడితో చాలా మర్యాదగా, ఆప్యాయంగా మాట్లాడుతూ అడిగిందానికన్నా ఎక్కువ డబ్బిచ్చి కొన్నాడు. ఇదంతా నేను గమనిస్తున్నానని అతడికి తెలీదు. అంతే కాదు, వాళ్ళ అక్కయ్య నుంచి ఫోన్ వస్తే ఎంతో ప్రేమగా మాట్లాడిన తీరు, ఏ సాయం కావాలన్నా చేస్తానని చెప్పిన పద్ధతి నిజంగా నన్ను చాలా మెప్పించాయి.. అతడు భక్తి విషయంలో నన్ను మెప్పించే పనిలో తలమునకలై ఉండగా ఎవరో క్రెడిట్ కార్డ్ వాళ్ళు ఫోన్ చేసి విసిగిస్తూంటే, ఫోన్ ఎత్తి ఏ మాత్రం విసుగు చూపించకుండా ఆసక్తి లేదని ఎంతో మర్యాదగా చెప్పాడు.

ఇవేవీ మామూలు విషయాలు కాదు. చాలామంది మనుషులకు ఇవన్నీ ఊహకు కూడా అందవు. ఈ స్వార్థపూరిత లోకంలో సాటిజీవుల మీద దయ లేకుండా ప్రవర్తించడం, పేదవారితో కూడా చిల్లర బేరాలాడటం, తక్కువ స్థాయిలో ఉన్నవాళ్ళకు కనీస మర్యాద కూడా ఇవ్వకపోవటం, తోబుట్టువులను పట్టించుకోకపోవటం లాంటివి సర్వసాధరణంగా జరిగే విషయాలు. అతడు మాత్రం వీటన్నింటికీ అతీతంగా ఉన్నాడు. అందుకు కారణం తనలో ఉన్న పరమాత్మే అందరిలోనూ ఉన్నాడన్న స్పందన అంతర్లీనంగా కలిగి ఉండటం. ఇంతకు మించిన దైవభక్తి ఏదీ లేదు. రేపే మీ పెళ్ళి విషయం మాట్లాడదాం.. వాళ్ళ అమ్మానాన్నకు కబురు పెట్టమని అబ్బాయికి చెప్పు.."

## ఏది ముఖ్యం — పప్పు శాంతా దేవి

ఇంటి ముందు రిక్షా ఆగింది. గేటు ముందు తొక్కుడు బిల్లా ఆడుకుంటున్న నేనూ, మా చెల్లీ, రిక్షా దగ్గరకి పరుగెత్తాం. మా పెద్దక్క, దాని రెండేళ్ల కొడుకూ రిక్షా దిగారు. మేం హుషారుగా 'అక్కొచ్చిందీ' అని అరుస్తూ, చంటివాడిని ఎత్తుకుని ఆటల్లో పడిపోయాం. మా అరుపులు విని అమ్మ బయటికి వచ్చింది సంతోషంగా. తన చిన్న పెట్టె తీసుకుని అక్క ఇంట్లోకి వెళ్లింది.

తరువాత కొంత సేపటికి ఆటలు ఆపి లోపలికి వెళ్ళిన మాకు, అమ్మ, అక్క మాట్లాడుకుంటున్న మాటలు వినబడ్డాయి.

" పోనీ లే, మంచి పని చేశావు. ధైర్యం గా ఉండు. ఇక్కడే ఏదైనా ఉద్యోగం చూసుకుని ఉందువు గాని. ఉద్యోగం రాక పోయినా ఫరావా లేదు. మాకు నువ్వు బరువు కాదు. " అంటోంది అమ్మ.

"ఎలాగమ్మా, అవమానం సహించలేక వచ్చేశాను కానీ ఇల్లొదిలేస్తే పరువేం కాను? నా మాట వదిలేయ్యి. నా వెనకాల ఉన్న చెల్లెళ్ల మాట ఏమిటీ? వాళ్ళని అందరూ చిన్న చూపు చూడరూ? వాళ్ళకి పెళ్లిళ్లు ఆవుతాయా?" అక్క బాధ.

"ఇవన్నీ అర్థం లేని అనుమానాలు. ప్రపంచం అంతా చెడ్డది కాదు. అయినా ఈ పిల్లల పెళ్లిళ్లు ఇంకో పది, పదిహేను ఏళ్ల తరవాతి మాట. అప్పటికి బోలెడన్ని మార్పులు వస్తాయి. ఇవాళ నీ జీవితాన్ని గురించి ఆలోచించు. అర్థం లేని అనుమానాలు పెట్టుకోకు" అమ్మ సలహా.

మాకేమీ అర్థం కాలేదు. నాకు పన్నెండేళ్లు ,చెల్లికి పదేళ్ళు ఉంటాయి. ఇది డెబ్భైల నాటి మాట. మా పెద్దక్కకి, చిన్నక్కకి పెళ్లిళ్లు అయ్యాయి. మేమిద్దరం ఇంకా స్కూల్లో చదువుకుంటున్నాం. మాకూ, అక్కలకీ ఎడం ఎక్కువ. మా నాన్నగారు అనారోగ్యం కారణంగా ముందే రిటైర్ అయిపోయారు. ఆయనకి వచ్చే పెన్షన్ తో, ఇళ్ల అద్దెల తో మాకు ఇల్లు గడిచేది. ఆ రోజుల్లో చదువులకి ఇంతగా ఖర్చులు లేవుకదా, అందుకని అక్కలు బాగా చదువుకున్నారు; నాన్నగారు మమ్మల్ని కూడా బాగా చదువుకోమని ప్రోత్సహించే వారు.

ఇంతకీ సమస్య ఏమిటంటే మా బావగారు తాగి , అక్కని దుర్భాషలాడి , బయట పెట్టి తలుపేసేశారు. ఆయనకు తాగుడు ఎక్కువయిపోయింది. అక్క పిల్లాడిని తీసుకుని మా ఇంటికి వచ్చేసింది. అక్క పెళ్లప్పుడు అమ్మ, నాన్నలకు తెలుసో, తెలియదో మరి! ఏమయినా ఇప్పటి సమస్య అక్క ఇల్లు వదిలేసి రావడం.

రెండు రోజుల తరువాత మా బావగారు వచ్చారు. అక్కని తనతో రమ్మన్నారు. అక్క తయారవుతోంది ఆయనతో వెళ్లడానికి. అమ్మ చాలా నచ్చ చెప్పింది.

"వెళ్లొద్దమ్మా, ఇది ఏదో ఒక్కసారి జరిగింది అనుకుని వెళ్లకు. తాగుడు లాంటి వ్యసనం ఎక్కువ అవుతుంది, కానీ తగ్గదు. నువ్వు నాకు చెప్పట్లేదు కానీ ఇది మొదటిసారి అయ్యి ఉండదు. ఇంత జరిగింది కదా అని అతనేమీ ఆగడు. ఇది అతనికి అవమానం అని కూడా అనిపించదు. తప్పు అనీ అనుకోడు. అదేదో నువ్వు బెట్టు చేస్తే, నచ్చ చెప్పానని అనుకుంటాడు. నీ జీవితం దుర్భరమయి పోతుంది. పిల్లాడు చెడిపోతాడు. నువ్వు ఇక్కడే ఉండి నీ జీవిత మార్గం చూసుకో" అని అమ్మ హెచ్చరించింది.

"లేదమ్మా, ఈ ఒక్క వ్యసనం తప్ప మనిషి స్వతహాగా మంచివాడు. ఇంత జరిగాక మళ్ళీ తప్పు చెయ్యడు. వదిలేస్తే నాకు ఏమి గౌరవం ఉంటుంది? అయినా, అమ్మా, నాన్నగారికి అంతా తీవ్రమైన అనారోగ్యం చేసి , ఉద్యోగం వదిలేసి, ఇంట్లోనే ఉంటుంటే, నువ్వు ఆయనను వదిలేశావా? వదిలెయ్యడానికి పెళ్లి చేసుకుంటామా? " అక్క అమ్మని ఎదురు ప్రశ్నించింది.

అమ్మ తెల్లబోయింది.

"అమ్మాయి, ఇంత చదుకున్న దానివి, నీ ఆలోచనా శక్తి ఇంతేనుటే? శారీరక అనారోగ్యం మనిషి తనంతట తాను తెచ్చుకున్నది కాదు. ఆయన అనారోగ్యానికి ఆయన ప్రవర్తన కారణం కాదు. అది ఆయన తప్పు కాదు. అందువలన ఆయన భార్యగా, నేను ఆయనకి ఆలంబన కావాలి.

నీ విషయం అలా కాదు. తాగుడు ఒక వ్యసనం. అది అతని మానసిక దౌర్బల్యాన్ని సూచిస్తుంది. అతను చేస్తున్నది తప్పు. నువ్వు అతన్ని పట్టుకుని వేలాడితే నీకు ఇంకా అవమానాలు ఎదురవుతాయి. పిల్లాడి భవిష్యత్తు ఆలోచించు. శారీరకమైన అనారోగ్యానికి, మానసిక దౌర్బల్యానికీ మధ్య చాలా తేడా ఉంది. సరిగ్గా ఆలోచించు" అమ్మ చాలా చెప్పింది. అక్క వినలేదు. బావగారితో వెళ్ళి పోయింది.

ఆ తరువాత చాలా కథ జరిగింది. ఇంకో రెండేళ్ల తరువాత అక్కకి ఇంకో కూతురు పుట్టింది. బావగారి తాగుడు పెరిగింది. అక్క ఉద్యోగంలో చేరింది. ఉద్యోగం చేసుకుంటూ, ఆయనా వ్యసనాల వలన వచ్చిన కష్టాలు ఎదుర్కుంటూ పిల్లల్ని పెంచింది. ఆడ పిల్ల ఇంటి కష్టాలు అర్థం చేసుకుంటూ ఎదిగింది. బాగా చదువుకుంది. అమెరికా లో రీసెర్చికి అవకాశం వచ్చింది. వెళిపోయింది. అక్కడే ఉద్యోగం సంపాదించుకుంది. అక్క కొడుకు గురించి చెప్పడానికేమీ లేదు. వాడో తెలివైన పనికి రాని వాడు. తాగుడు ఎక్కువయి, అనారోగ్యం పాలై, ఎలాగో రిటైర్ అయ్యి, ఆ తరువాత ఈ లోకాన్ని వదిలేశారు బావగారు.

ఈ లోగా అమెరికా లో ఉన్న అక్క కూతురు, అక్కడే పని చేస్తున్న తన కొలీగ్ తో ప్రేమ లో పడింది. పెళ్లి చేసుకుంటానని అక్కకి చెప్పింది. వాళ్ళు మహారాష్ట్రా వాళ్ళు . ఆ అబ్బాయి తలిదండ్రులతో మాట్లాడడానికి బొంబాయి

వెళ్లాలని అనుకుంటోంది . అక్క కూతురి ప్రేమ వ్యవహారం అమెరికా లో ఎంతమందికి తెలుసో నాకు తెలియదు కానీ ఇండియాలో మాకు తెలిసిన వాళ్ళందరికీ తెలుసు. అక్క ఊళ్ళో అందరికీ తెలుసు. పరువు కోసం అక్క లబలబ లాడింది. అందుచేత వెంటనే పెళ్లి చేసెయ్యాలని తొందర పడింది.

ఇంతలో మళ్ళీ అమ్మాయి దగ్గర నుంచి వార్త వచ్చింది, తను ఆ అబ్బాయిని పెళ్లి చేసుకోననీ , అక్కని వాళ్ళింటికి వెళ్ళద్దనీ. అక్క సమస్య లో పడింది. స్కైపు లో పిల్లతో మాట్లాడింది.

“ ఎందుకమ్మా, పెళ్లి వద్దంటున్నావు? నువ్వు ప్రేమించిన వాడు కదా! ఊళ్ళో అందరికీ తెలిసి పోయింది. ఇప్పుడు నువ్వు పెళ్లి చేసుకోక పోతే మన పరువేం కాను? అందరూ హేళన చేస్తారు. అయినా కారణం ఏమిటి?” అని అడిగింది అక్క.

“అతన్ని రెండేళ్లుగా చూశానమ్మా. మంచి వాడనుకున్నాను. నన్ను ప్రేమించానని అన్నాడు. మంచివాడు కదా అని సరే నన్నాను. ఎన్ని సార్లో ఇద్దరం బయటికి వెళ్ళాం, కానీ ఎప్పుడూ తప్పుగా ప్రవర్తించలేదు. “

“మరి ఇప్పుడు సమస్య ఏమిటి?”

“ వారం రోజుల క్రితం, నా కొలీగ్ ఒకమ్మాయి పార్టీకి పిలిచింది. ఆ పార్టీ లలో అందరూ తాగుతారు. నేను అలాంటి పార్టీలకి వెళ్ళను. నేను రానని చెప్పాను. నీ బోయ్ ఫ్రెండ్ వస్తాడు కదా, నీకేం అభ్యంతరం, అంది. నిర్ఘాంత పోయాను. నీకు తెలియదా, అతను పార్టీలలో తాగడమే కాదు, రెగ్యులర్ డ్రింకర్ , అయిన దీన్లో అంతా అభ్యంతరం ఏమిటి, అంది. డ్రింకింగ్ ఇస్ కామన్ దీస్ డేస్ , అంది. అయినా నేను వెళ్లలేదు.

మర్నాడు, పార్టీ చాలా బాగా జరిగిందని, ఫోటోలు చూపెట్టింది. తాగి, ఊగుతూ, డాన్సు చేస్తూ, ఆమ్మాయిల మెడ మీద పడి తిరుగుతున్న అతని ఫోటోలు చూశాను. అందు చేత అతన్ని పెళ్లి చేసుకో కూడదని నిశ్చయం చేసుకున్నాను. “ అంది.

“అదేమిటి, మీ నాన్న గారూ తాగే వారు కదా, నేను ఆయన్ని వదిలేశానా?” అడిగింది అక్క.

“నీ నిర్ణయం తప్పమ్మా. ఆయన తాగుతారని తెలిసిన వెంటనే నువ్వు ఆయనని వదిలేయాల్సింది. నువ్వు చదువుకున్న దానివి అయినా, ఫాల్స్ ప్రేస్టేజి కోసం కష్ట పడ్డావు. అమ్మమ్మ , తాతగారు నిన్ను సపోర్ట్ చేస్తామన్నారని నువ్వే చెప్పావు. అయినా నువ్వు ధైర్యం చేయలేదు. ఫలితంగా మన కుతుళ్ళం అంతా కష్టపడ్డాం. నాన్న తాగి రోడ్డు మీద పడిపోతే, ఆయన్ని తీసుకు రావడానికి వెళ్ళినప్పుడల్లా ఎంత అవమాన పడ్డాం? జనం చూసిన హేళన చూపులు నేను మార్చి పోలేదమ్మా. ఆయన అప్పులు చేసేస్తే, తీర్చడానికి ఎంత కష్ట పడ్డాం? అన్నయ్య పనికి రాకుండా పోడానికి కారణం ఏమిటి?

వద్దమ్మా, వద్దు. ఈ కష్టాలన్నీ మళ్ళీ పడే ఓపిక నాకు లేదు. మనం ఎలా ఉన్నా, జనం ఏదో ఒకటి అంటూనే ఉంటారు. మన కష్టాలు వాళ్ళు తీర్చరు. ఇండియా నుంచి వచ్చిన అమ్మాయిలు సహన శీలురు, వాళ్ళ మీద పది తాగుబోతు జీవితం గడిపేద్దామని అనుకుంటారు కాబోలు ఇక్కడి మగవారు. నేను అలాంటి మోసాలు ఒప్పుకోను. నేను మనిషిలో ఉన్న తప్పులు క్షమించగలను, కానీ మోసాన్ని, మానసిక దౌర్బల్యాన్ని సహించలేను.

అమ్మా, నేను కావాలనుకున్నట్లు జీవిస్తాను. అంటే కానీ ఇతరుల మోసానికి చోటివ్వను. ఈ పెళ్లి గురించి మర్చిపో" తెగేసి చెప్పింది అక్క కూతురు.

"పెళ్లి కాక ముందు తెలిసింది కాబట్టి పెళ్లి చేసుకోనంటున్నావు. ఇదే పెళ్లి అయ్యాక తెలిస్తే వదిలేస్తావా? అతనికి మాట ఇచ్చావు, దానికి నిలబడక్కర లేదా? " అడిగింది అక్క.

"వదిలేస్తాను" ఖచ్చితంగా వచ్చింది సమాధానం. " నేను మనిషి వ్యక్తిత్వానికి విలువ ఇస్తాను. అమ్మా, అతని ప్రవర్తన సరిగ్గా లేదు. ఋజు ప్రవర్తన లేని వాళ్ళని సహించకూడదు. నేను అతనికి మాట ఇచ్చినప్పుడు అతనిలో ఉన్న ఈ చెడ్డ లక్షణాలు నాకు తెలియవు. మంచి వాడనుకుని మాట ఇచ్చాను. కొన్ని నమ్మకాల ఆధారంగా ఇచ్చిన మాట అది. ఆ నమ్మకాలు వమ్ము అయినప్పుడు ఆ మాటకి విలువ లేదు. మనిషికి ప్రవర్తన ముఖ్యం అమ్మా, మితావి ఏవీ కాదు. అందుకని నేను ఈ పెళ్లి చేసుకొను."

అక్క అవాక్కయి పోయింది. ఆ పిల్ల నిర్ణయం మారదని తెలుసు. తరువాత ఎప్పుడో నాతో అంది. " నన్ను తప్పు పట్టిందే నా కూతురు. తరాల అంతరం" .

"తరాల అంతారం కాదక్కా, దాని ఆత్మ విశ్వాసం, ఋజు ప్రవర్తన పట్ల ఉన్నా నిబద్ధత. నాకు దాని నిర్ణయం పట్ల చాలా గర్వంగా ఉంది. అయినా అమ్మ కూడా నీకు అదే చెప్పింది కదా! మరి అమ్మ, నీ కంటే ఇంకో తరం వెనుక వ్యక్తి కదా! తరాలు మారినా విలువలు మారవు. ఆలోచనా సరళి సరిగ్గా ఉండాలి. నేను పిల్లనే సమర్థిస్తాను. మనిషికి వ్యక్తిత్వం ముఖ్యం. " అన్నాను నేను.

పి.ఎస్ ఈ కథలో వ్యక్తులు, ఆలోచనలు ముఖ్యం తప్ప, కథ లోని పాత్రల పేర్లు కాదు. కథ జరిగిన చోటు కూడా ముఖ్యం కాదు. అందుకే పేర్లు పెట్ట లేదు.

.

# మలుపుల్లో మెరుపులు

మేడా మస్తాన్ రెడ్డి

ఆ వార్త  అల్లూరు మేజర్ పంచాయితీలో మెరపువేగంతో పాకిపోతోంది. పాతిక, ముప్ఫయ్ సంవత్సరా క్రితం ఊరు విడిచి వెళ్లిపోయిన జయచంద్రగారు తిరిగి ఆ పంచాయితీలో అడుగు పెట్టారట. ఆయన్ని టెలివిజన్ తెర మీద చూడడమే గానీ ప్రత్యక్షంగా చూసినవారు చాలా తక్కువే! పొడవైన కారులో జయచంద్రగారు వచ్చారట. ఆయన వెంట ముగ్గురు ఉత్తరాదివాళ్లూ ఉన్నారట.

అల్లూరు వదిలిపెట్టిన తర్వాత జయచంద్ర గురించి ఎన్నో వార్తలు వెలువడ్డాయి.  ఆయన కట్టించిన ఎన్నో నిర్మాణాలు చాలా రాష్ట్రాల్లో ఆయనకు పేరు సంపాదించి పెట్టాయి.

'ఉత్తర భారతదేశంలో ప్రధాన నగరాల్లో తన కార్యాలయాలు తెరచారు జయచంద్ర. ఎప్పటికప్పుడు మారే సాంకేతికతతో క్రొత్త నిర్మాణాలు చేపట్టడం ఆయన ప్రత్యేకత' అని పత్రికా ప్రపంచం ఆయనను పొగడ్తతో ముంచెత్తుతుంది.

గ్రామ పెద్దతో పాటు కొంత మంది పెద్దమనుషు జయచంద్రను కుసుకున్నారు. గ్రామ సర్పంచ్‌కి అక్కడే ఒక అతిథి గృహం ఉంది. ఆ గృహంలోనే దిగాడు జయచంద్ర. హాల్లో సమావేశం ఏర్పాటుచేశాడు ఊరి ప్రెసిడెంట్. నమస్కార ప్రతినమస్కారాలు,  పలకరింపులూ ముగిసాయి.

"ఒకప్పుడు వెయ్యి ఇళ్లు మాత్రమే ఉన్న పంచాయితీ ఇది. ఎంత ఎదిగిపోయింది?'' అన్నాడు జయచంద్ర.

"ఇప్పుడిది నగర పంచాయితీ. త్వరలో ఎన్నికలు కూడా రాబోతున్నాయి. మీరు ఊరు వదిలి వెళ్లిన తరువాత ప్రక్క నున్న చిన్న పంచాయితీలు కొన్ని  కలిసిపోయాయి" అన్నాడు గ్రామ పెద్ద.

తరువాతి సంభాషణ జయచంద్రతో పాటు చదువుకున్న, ఆడుకున్న స్నేహితుల మీదికి మళ్లింది.

"వాళ్లు ఎక్కడెక్కడ స్థిరపడ్డారో తెలీకుండాపోయింది. ఆరుగురం స్నేహితులం  ఒక బృందంగా ఉండేవాళ్లం. ముప్ఫయ్ యేళ్ల వయసులోనే మా బృందం నుండి ఒక ఆణిముత్యాన్ని శాశ్వతంగా కోల్పోయాము." జయచంద్ర గొంతు వణికింది.

"అతడెవరండీ?" అడిగాడు ఒక గ్రామస్తుడు.

"సత్యం. పూర్తి పేరు ఆళ్వారు సత్యనారాయణ రావు. శ్రీవైష్ణవులు. సత్యం బాబాయ్ అని పిలిచేవాళ్లం. గాలిపటానికి దారం కట్టే సూత్రం నాకు నేర్పినవాడు. తన దారం తెంపుకుని నా కంటే చాలా ముందే వెళ్లిపోయాడు."

"ఆయనేం పని చేసేవాడో?"

"ఎక్ట్రిసిటీ ఆఫీసులో పని చేస్తుండేవాడు. ఈ చుట్టుప్రక్కల గ్రామాల్లో అతడికి మంచి పలుకుబడి ఉండేది. పంపుసెట్ల విద్యుత్తును కూడా అతడే లెక్కకట్టేవాడు. అప్పటికి నేను నిరుద్యోగిని. రైస్ మిల్లులు వంటివి తనిఖీ చేసేటప్పుడు నన్నూ వెంటపెట్టుకు వెళ్లేవాడు. నన్ను వదిలిపెట్టేవాడు కాదు. అనుక్షణం నా క్షేమమే తన క్షేమంగా భావించేవాడు, ఆచరించేవాడు."

"అలాగా! మీకొక మంచి తోడు పోయింది. ఆయనెలా పోయాడు?"

"రోడ్డు ప్రమాదం. లారీ చక్రా క్రింద పచ్చడి పచ్చడిగా నలిగిపోయాడట. నేను వాడి అంత్యక్రియకు కూడా హాజరు కాలేకపోయాను."

"ఆ సమయంలో మీరు బాగా పని వత్తిడిలో ఉండి ఉంటారు."

"ఏమీ లేదు. నేను నా ప్రాణమిత్రుడిని అటువంటి స్థితిలో చూసి తట్టుకోలేనని భావించి చివరిసారిగా చూసే సాహసం చేయలేకపోయాను."

హాలులో వాతావరణం ఒక్కసారిగా బరువెక్కింది. లారీ చక్రాల క్రింద అతి హీనంగా పడి వున్న సత్యనారాయణ రావు మృతదేహం అందరి కళ్లముందు ప్రత్యక్షమయ్యింది. ముందుగా జయచంద్రే తేరుకున్నాడు.

"పేరంటాల తోపు వద్దకు నన్ను తీసుకువెళ్లరూ?" అడిగాడు జయచంద్ర.

★ ★ ★

'నెల్లూరు శ్రీరామ్ ఎ.సి లో " మట్టిలో మాణిక్యం" సినిమా ఆడుతోంది. మనం వెళ్లాలి' అన్నాడు జయచంద్ర.

మిగతా ఇద్దరూ నిరుత్సాహంగా చూశారు. 'ఆరు టికెట్లకు సరిపడా డబ్బు మన దగ్గర లేదు. దొంగతనంగా కొబ్బరికాయలు అమ్మిన సొమ్ము ఐదు రూపాయ యాభై పైసలు మాత్రమే ఉన్నాయి. ఒక అద్దె సైకిలు, మూడు టిక్కెట్లు మాత్రమే తీసుకోగలం' అన్నాడు ఇద్దరిలో ఒకడు.

'అయితే ఒక సైకిలు, మూడు టిక్కెట్లు' చిటికె వేశాడు రెండోవాడు.

'సత్యంగాడ్ని వదిలేయడం పాపంరా!' అన్నాడు జయచంద్ర.

అతడి గొంతులో పశ్చాత్తాపం వ్యక్తమవుతోంది. సినిమా టిక్కెట్ల కోసం డబ్బు సంపాదించాలనే కోరికతోనే కొబ్బరికాయ దొంగిలించాడు స్నేహితుడు. అంతకు ముందు కూడా అలాంటి దొంగతనం జరిగింది. ఆ ఇంటివారు అప్రమత్తంగా ఉన్నారు. దొంగను తరిమారు. పిట్టగోడ ప్రక్కన ఆ ఇంటివాళ్ళకు ఒక నోటుపుస్తకం దొరికింది. ఆ పుస్తకం జయచంద్రది.

జయచంద్రను తండ్రి దొరకపుచ్చుకున్నాడు. దండించబోయాడు. సత్యం రంగంలోనికి దిగాడు. కాపీ రాసుకోవడానికి ఆ పుస్తకాన్ని తానే తీసుకుపోయానని అబద్ధం చెప్పాడు. చేయని దొంగతనానికి అతడికి గట్టిగానే దెబ్బలు పడ్డాయి.

‘నేరం నీ మీద ఎందుకురా వేసుకున్నావు?’ అడిగాడు జయచంద్ర.

బాధను ఓర్చుకుంటూ నవ్వి వూరుకున్నాడు సత్యం.

ఏమైతేనేం, రెండో ఆట సినిమా చూసి బృందం రాత్రి ఒంటిగంట వేళ తిరుగు ప్రయాణమయ్యింది. ఒక సైకిలు, ముగ్గురు ప్రయాణికులు. పేరంటాల తోపు దాటితే బోడి సత్రం వస్తుంది. అక్కడికి అల్లూరు అర కిలోమీటరు. దారి పొడుగుతా కూడా ఇళ్ల సముదాయాలు ఉన్నాయి.

తోపు నుండి ఒక నల్లటి ఆకారం వారికి ఎదురు వచ్చింది. సైకిల్ నడిపేవాడు తడబడ్డాడు. వెనక కూర్చున్నవాడు దూకేశాడు. సైకిల్ బార్ పై కూర్చున్న వాడు  కంగారుగా అరచాడు.

‘ఒరేయ్ నేనురా, సత్యాన్ని!’ అంది ఆ ఆకారం.

పిల్లలు తేరుకున్నారు.

‘ఒరేయ్, చెరువు గట్టు దగ్గర పోలీసు కాపలా కాస్తున్నారు.  ఈ దారిలో గంజాయి ఊళ్లోకి ఎవరో తెస్తున్నారట. పనిలో పనిగా త్రిబుల్స్ రైడింగ్ అనీ, సైకిల్‌కు లైట్ లేదనీ మిమ్మల్ని కూడా అదుపులోనికి తీసుకుంటారు. ఈ సంగతి మీకు చెబుదామనే చాలాసేపటి నుండి మీ కోసం ఇక్కడ ఎదురుచూస్తూ ఉన్నాను’ అన్నాడు సత్యం.

అసలే సంకోచభావంతో ఉన్నారు పిల్లలు. ఇటువంటి ఉదారుడినా తాము మోసం చేసి వదిలిపెట్టి వెళ్లిపోయారు? వాళ్లు పొలాల చుట్టూ తరిగి ఊరు చేరుకునేసరికి తెల్లవారుతోంది.

★ ★ ★

పేరంటాల తోపు ప్రాంతం ఇప్పుడు అడవి మాదిరిగా లేదు. ఆ ప్రాంతంలో ఐదెకరాల ఖాళీ స్థలం కొని ఉంచాడు జయచంద్ర. అక్కడ ఏ ఆధారమూ లేనివారికి ఆశ్రమం నిర్మించడానికి ఆయన పూర్తిగా సంసిద్ధుడై సొంత ఊరు చేరుకున్నాడు.

గ్రామస్తులు తెల్లబోయారు. ఎక్కడెక్కడో నగరాల్లో స్థిరపడవసివున్న జయచంద్ర తన కుటుంబంతో పాటు ఇక్కడే స్థిరపడడానికి నిశ్చయించుకున్న సంగతి కూడా కారు ప్రయాణంలోనే వెల్లడించారాయన.

"మీరిక్కడ ఉంటారంటే ఆశ్చర్యంగా ఉంది" అన్నాడు పెద్ద కాపు.

"అవును. నా మిత్రుతో నేను కలసి తిరిగిన ఊరు ఇది. నా ప్రాణ మిత్రుడిని పోగొట్టుకున్న చోటు కూడా ఇదే! అందువన ఈ నేల మీద వాడి అడుగుజాడల వెతుక్కుంటూ, ఆ జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, నేను జన్మించిన ఈ నేల మీదే నా చివరి రోజు గడపాలని కోరుకుంటున్నాను" అన్నాడు జయచంద్ర.

గ్రామ పెద్దలు సంతోషించారు.

"నా మిత్రుల పేర్లు చెపుతాను. వాళ్లు ఎక్కడెక్కడున్నారో, ముఖ్యంగా సత్యం భార్యా బిడ్డలు ఎక్కడ స్థిరపడ్డారో ఆ వివరాలు నాకు కావాలి. ఎంత ఖర్చు అయినా పర్వాలేదు" అర్థించాడు జయచంద్ర.

పది రోజుల తర్వాత సత్యం భార్య పొన్నూరులో తన పెద్ద కొడుకు ఇంట దొరికింది. కూతుళ్లు తిరుపతిలో ఉంటున్నారు. వాళ్లను ఊరు రప్పించారు గ్రామ పెద్దలు.

జయచంద్ర భార్య కూడా వాళ్లను చూసి చాలా సంతోషించింది.

★ ★ ★

"వాళ్లను కూడా అనాథాశ్రమానికి బోర్డు డైరెక్టర్లుగా నియమించడం ఏమిటి?" కస్సుమన్నాడు జయచంద్ర పెద్ద కొడుకు.

జయచంద్ర కోపం తెచ్చుకోలేదు. "అలా అనకండి! నేనంటే సత్యానికి ప్రాణం. బాల్యంలో జరిగిన ఒక తగువులాటలో నేను వాడికి ఒక్కసారి రక్షణగా నిలిచాననే కృతజ్ఞత జీవితాంతం చూపుతూనే ఉన్నాడు. ఎప్పుడూ నా మీద ఈగ వాలనిచ్చేవాడు కాదు. అమ్మవారి జాతరలో నేను చేసిన అల్లరిని తనపై వేసుకుని చావుదెబ్బలు తిన్నాడు. పంట కాలువల్లో ఆడుకునేటప్పుడు నేను విసిరిన గులకరాయి పొరపాటున ఒకరి తలకు తగిలి పెద్ద గాయం అయ్యింది. ఆ కుర్రాడి తల్లిదండ్రుల ఎదుట ఆ రాయి విసిరింది తానేనని ఒప్పుకుని నన్ను వాళ్ల దగ్గరా, మా వాళ్ళ దగ్గరా రక్షించాడు. ఇలా వాడి ఎన్నో జ్ఞాపకాలు నా గుండెలో గూడు కట్టుకుని ఉన్నాయి." జయచంద్ర మాటలు ఆపి, ఒక్కసారి గట్టిగా గుండె నిండా గాలి పీల్చి వదిలాడు. భర్త చిన్ననాటి ముచ్చట్లను మురిపెంగా వింటూ వుంది అతడి భార్య.

జయచంద్ర కళ్లజోడు సవరించుకుని "మీరు ఆశ్చర్యపోయే మరో విషయం. వాడికి పెళ్లి సంబంధం వస్తే నాకు నిశ్చితార్థం అయితేనేగానీ తన పెళ్లికి అంగీకరించలేదు, తెలుసా? మీ అమ్మ కడుపులో మీరున్నప్పుడు తన భార్యనూ, కొడుకునూ మీ అమ్మ వద్ద ఉంచి డ్యూటీకి వెళ్తూ వుండేవాడు. మగబిడ్డ మీద ఉన్న భావనతో మీ అమ్మ కూడా

మగబిడ్డనే కంటుందని కోరుకునేవాడు. కాకతాళీయంగానే కావచ్చు. మీరిద్దరూ పుట్టారు. మన కుటుంబం మీద వాడికున్న ఆపేక్ష అటువంటిది. వాడికి ఎందుకో నా మీద అంతులేని ప్రేమ" అన్నాడు ఆయన.

"అందుకేనా ఆయన చనిపోయినప్పుడు చివరి చూపుకు కూడా మీరు వెళ్లలేదు." నిష్టూరంగా అడిగాడు చిన్న కొడుకు.

"వాడు ప్రయాణిస్తోన్న స్కూటరును లారీ వెనుక ఊగుతోన్న గొలుసు అందుకుని, వెనక చక్రాల క్రిందకు లాగేసిందట. రోడ్డు మీద చక్రాల క్రింద పడిన కప్ప మాదిరిగా వాడి శరీరం రోడ్డుకు అంటుకుపోయిందట. నా ప్రాణానికి ప్రాణం అయినవాడిని అలాంటి స్థితిలో చూడలేక..." ఆయన గొంతు వణుకుతోంది. కళ్లలో నీళ్లు నింపుకున్నాడు. ఆధారం కోసం అన్నట్టు కుర్చీచేతులను బలంగా పట్టుకున్నాడు.

"వాడి రూపం నిత్యం నా దృష్టిలో నవ్వుతూనే ఉండాలి. నన్ను ప్రేమగా చూస్తూనే ఉండాలి. నేనేమి సంపాదించినా దాంట్లో సగం వాటా వాడిదే" తిరిగి అన్నాడు జయచంద్ర.

"పోనీ, ఆ తరువాతయినా ఇక్కడకు వచ్చి ఉండవచ్చు కదా!"

"నిజమే! సంపాదనే సర్వస్వం అనుకున్నాను. అప్పట్లో నేను తెలిసి చేశానో, తెలియక చేశానో అదంతా జరిగిపోయింది" ఆయన మాట పూర్తి కాకముందే ఒక గ్రామస్తుడు కబురు తెచ్చాడు. నేమ్ బోర్డ్ వెలుపల వాకిట్లో ఉన్నదనీ, కూలీలు అప్పుడే లారీ నుండి దింపారనీ.

జయచంద్ర తన కొడుకుతో పాటు బయటికి కదిలాడు. వాకిట్లో నేమ్ బోర్డ్ నిలబెట్టి ఉంది.

'సత్యం నిత్య అన్నదాన పథకం' అని వుంది దాని మీద.

తండ్రిని సమీపించారు కొడుకులిద్దరూ. వాళ్ల కళ్లలో చెమ్మ.

"నాన్నగారూ! మీరు అందరినీ ప్రేమించారు. అందరికంటే ఎక్కువగా మీ స్నేహితుడినీ ప్రేమించారు. మేము పొరపాటు మాట్లాడాము" అన్నారు వాళ్లు.

వాళ్ల భుజాలు తడుతూ జయచంద్ర తల ఊపాడు, మాటలు పెగలక. 👉👈.

## స్థితప్రజ్ఞత

సీతాశర్మ మంథా

"ఒరేయ్, బుజ్జిగా! మాస్టారుగోరు వచ్చేసారు. ఇంజన్ ఎయ్యరా, ఆలీసం అయ్యిపోంది," కేకేసాడు వెంకట్రావు.

"మాస్టారు ఎప్పుడన్నా ఆలీసంగా ఒత్తారా! బామ్మర్దినని నేను నీకు లోకువ. అందుకే నా మీద అరుత్తావు," అనుకుంటూ బుజ్జి ఇంజన్ రూమ్ లోకి పరుగెత్తుకుని వెళ్ళి స్టీమర్ స్మార్ట్ చేసాడు. 'దుగ్ దుగ్ దుగ్ ' అనుకుంటూ గోదావరిలో మాస్టారి ప్రయాణం మొదలైంది.

ఆ స్టీమర్ రాజమండ్రి నించి భద్రాచలం వెళ్ళేవారిని దారిలో కూనవరం, పాపికొండలు చూపిస్తు వెడుతుంది. సుధీర్ మాస్టారు కూనవరం బయల్దేరారు. అక్కడికి బస్సులో కూడా వెళ్ళొచ్చు కాని అతనికి ఎన్నిసార్లు వెళ్ళినా ఎన్ని ఏళ్ళనించీ వెళ్ళినా స్టీమర్ లో వెళ్ళడమే ఇష్టం.

"అమ్మగారు, నాన్నగారు బాగుండారాండి?" వెంకట్రావు ప్రశ్నతో ప్రకృతిని, గాలిని ఆస్వాదిస్తున్న సుధీర్ ఆలోచనలకు గండి పడింది.

"ఆ... బావున్నారు", అంటూనె తనకంటె ముందే వచ్చి కూర్చున్నఅమ్మాయిల గాంగ్ ని ఒకసారి చూసాడు.

ఇవాళరేపు అందరు చీరలు మానేసి పంజాబి డ్రెస్సులు వేసుకోవడం వలన ఎవరు అమ్మాయిలో, ఎవరు అమ్మలో ఒక్కచూపులో తెలియడంలేదు. పైగా అతను ఒక్కడు కొంచెం దూరంగా ప్రపంచానికి సంబంధం లేనట్లు కూర్చున్నాడాయె! ఇంకోసారి చూడ్డానికి సంస్కారం అడ్డు వచ్చింది. కాని వాళ్ళ మాటలు అడపా తడపా అతని చెవిలో పడుతున్నాయి.

"చూడవే! ఎవరో దేవదాసులాగ ఉన్నాడు," అంది ఒక పాప.

"కాదు, తెల్ల లాల్చీ పైజామలో బంగారుబాబు లాగ ఉన్నాడు", అంది రెండో పాప.

"కాదే, మన సుధీర్ మాస్టారిలా ఉన్నారు," అంది ఒక తెలిసిన, విన్న కంఠం.

"ష్, మాట్లాడకండి," గద్దించింది ఇంకో కంఠం.

"అందరూ మనలాగ మంచివాళ్ళు, నెమ్మదివాళ్ళు ఉంటారా? తాటతీసి నిర్భయ కేసు పెట్టరూ?" అంది ఇంకొక ఆరింద.

వద్దనుకున్నా వినిపిస్తున్న మాటలతో సుధీర్ బాధగ నిట్టూర్చాడు. ఏ మనుషులకూ, వాతావరణానికి దూరంగా ఉంటున్నాడో వాళ్ళే మరల తన జీవితంలో తారసపడతారని అతను ఎప్పుడు అనుకోలేదు. కాని ఇప్పుడు అతను వాటన్నిటికీ అతీతుడు. తన పని, తన బాధ్యత ..అంతె. "వీళ్ళగురించి తలుచుకోవడం అనవసరం," అనుకున్నాడు. అయినా అతనికి గతం గుర్తు వచ్చింది.

★★★★★★★★★★★★★★★★★★★★

"హాయ్, గర్ల్స్, పరిగెత్తండి. ఏమి తిని రాలేదా ఏంటి? ఈ కొంచెం పరిగెత్తకపోతె తరువాత అసలు గేమ్ ఎలా ఆడతారు?" ఉత్సాహపరుస్తున్నాడు సుధీర్ సర్.

"ఎక్కువ ఎండలో ఆడితే నల్లగా అయిపోతానని, మా మమ్మీ ఆడొద్దంది సార్," బుంగమూతి పెట్టి గట్టుమీద కూర్చుని కాళ్ళు ఊపుతూ అంది సునంద.

"ఆడకపోతే డ్రమ్ములాగ అవుతావని చెప్పలేదా మీ మమ్మీ? డియర్ ," అన్నాడు సుధీర్.

" నిజమే సార్," సాగతీస్తూ పరిగెట్టింది సునంద.

వాళ్ళంతా పదవ తరగతి చదువుతున్న ముద్దుగుమ్మలు. అతను వాళ్ళ ఆటలు ఆడించే టీచర్. అందగాడు. వేరె ఊరులో మంచి ఉద్యోగం వచ్చినా అమ్మనాన్నలను వదలి వెళ్ళడం ఇష్టం లేక ఆ ప్రైవెట్ స్కూల్లో ఉద్యోగం చేసుకుంటున్నాడు. పైగా ఇంకొక కారణం సైన్సు టీచర్ సునీత. ఇద్దరు ఒకరినొకరు ఇష్టపడి త్వరలో పెళ్ళికూడ చేసుకుందామని అనుకున్నారు. కాని ఇంకా అందరికీ చెప్పలేదు ఆమె వద్దందని.

"త్వరగా, త్వరగా," సుధీర్ అనడంతో అతనిని చూస్తూ వేగంగా ముందుకు పరుగెత్తి కాలు మడతపడి కిందకి పడింది సునంద.

"అయ్యో, ఏమైంది," అంటూ సుధీర్ వచ్చి ఆమెను పట్టుకున్నాడు. అందరూ ఆమెవైపు చూడడంతో ఆ ఎటెన్షన్ సునందకి చాల నచ్చింది. ఇంకా సుధీర్ మీదకి కావాలని ఒరిగి పోయింది. కాని అతను అది ఏమి పట్టించుకోకుండ ఇంకొక అమ్మాయి సహాయంతో మెల్లగ 'స్టాఫ్ రూమ్' కి తీసుకెళ్లాడు. అక్కడ సునీత వాళ్ళని చూసి మొహం చిట్లించింది.

"పాపం, తనకు కాలు బెణికింది," అన్నాడు సుధీర్ కంగారుగ. "సరే, సరే", అని ఆమె అక్కడినించి వెళ్ళిపోయింది.

ఆరోజు సాయంత్రం సుధీర్, సునీత రోజు కలుసుకునే చోట కూర్చుని మాట్లాడుకుంటుంటె అతని సెల్ఫోన్ మోగింది. "హలో సార్, నేను సునంద," అని వినగానె సునీత హావభావాలు మారిపోయాయి. "బై, సుధీర్ . రేపు కలుద్దాం," అని చకాచకా వెళ్ళిపోయింది.

"ఈ సునందకి వార్నింగ్ ఇవ్వాలి", అనుకుంటు సుధీర్ కాల్ కట్ చేసాడు. మరలమరల రింగ్, తర్వాత మెసేజ్, "మీతో చాల మాట్లాడాలి సర్," అని. "సునీత చూస్తే, అమ్మో," అనుకుని, "రేపు మట్లాడుతా," అని జవాబు ఇచ్చి ఆ మెసేజ్ లు అన్నీ తీసేసాడు. "జవాబు ఇవ్వకపోతె ఇంకెన్ని పెడుతుందో ,“ అనుకుంటూ.

మర్నాడు స్కూల్లో "మీరు నాకు లెక్కలు చెప్పండి సార్. మీరైతే నెమ్మదిగా నాకు అర్థమయ్యేట్లు చెపుతారు. మా లెక్కల మాస్టారికి కోపం ఎక్కువ," అని అతనితో సునంద మాట్లాడుతోంది.

"నాకు కుదరదు.నువ్వు వేరె ఎవరైన టీచర్ తో మాట్లాడుకో" అని సుధీర్ చెప్తుండగా అక్కడికి సునీత వచ్చి వాళ్ళిద్దరినీ ఎగాదిగా చూసి వెళ్ళిపోయింది.

"అబ్బా,"తల పట్టుకున్నాడు సుధీర్. "అయ్యో, తలనెప్పా సర్, నా దగ్గర మాత్ర ఉంది. మమ్మీ ఎప్పుడూ ఉంచుకోమని ఇస్తుంది, బాగ్ లో ఉంది, ఇవ్వనా?" అని మీదమీదకి వచ్చేస్తోంది.

"నాకేం వద్దు. నువ్వు క్లాస్ కి వెళ్ళు." పంపించేసాడు సుధీర్ . కొంచెం బాధ పడుతూ వెళ్ళిపోయింది ఆ అమ్మాయి.

సాయంత్రం ఇంటికి ఫోన్, "ఎలా ఉంది సార్ మీకు?" అంటూ.

సుధీర్ చెప్పాడు,"నువ్వు నాకు కాల్స్ చెయ్యద్దు," అని. కాని ఆమె వినదు. చేస్తూనె ఉంటుంది.

"చిన్న పిల్ల, పరిక్షలు అయ్యాక ఎలాగు స్కూల్ వదిలి వెళ్ళిపోతుంది. అప్పుడు మానేస్తుందిలే ," అనుకున్నాడు అతను. ఇలా కొన్ని రోజులు గడిచాయి. ఆ ఊరుకోవడమే అతని కొంప ముంచింది.

ఒకరోజు 'స్టాఫ్ రూమ్' కి బంట్రోతు వచ్చి, "మిమ్మల్ని ప్రిన్సిపాల్ గారు తీసుకురమ్మన్నారు," అన్నాడు. సుధీర్ వెళ్ళేసరికి అక్కడ సునంద వాళ్ళ అమ్మ నాన్న ఇద్దరు ఉన్నారు.

"వీడె సార్, వీడి ఫొటో పుస్తకాల్లో పెట్టుకుని నా కూతురు చదువు మానేసింది. రోజు ఫోన్లు, మెసేజ్లు, అడిగితే,"వాడంటే నాకు ఇష్టం " అంటోంది. మీరేమైనా చర్య తీసుకుంటారా నన్ను చూసుకోమంటారా? వీడి పుస్తకాలు చూడండి, 'సునీ సునీ' అని ఎలా రాసుకున్నాడో? ఎంత ధైర్యంరా నీకు? నా కూతురుకే వల వేస్తావా? నువ్వెంత, నీ బతుకెంత?" ఇంకా ఏవో అవాకులు చవాకులు పేలుతు ఉంటే, సుధీర్ ప్రిన్సిపాల్ కి విషయం చెప్పబోయాడు.

ఆయన వాళ్ళకి సర్ది చెప్పి ఇంటికి పంపించేసి సుధీర్ తో అన్నాడు,"సార్, తప్పుఎవరిది అని నేను విచారించ తలుచుకోలేదు. అందుకే ఆడపిల్లలతో మాట్లాడుతున్నపుడు పది అడుగుల దూరం పెట్టమంటాను. ఇది ఒక ప్రైవేట్ స్కూల్. ఆయనకు చాల పలుకుబడి ఉంది, ఏమైనా చెయ్యగలడు. పోలీస్ రిపోర్ట్ ఇవ్వకుండా నేను ఆపగలను. ఇదే నేను మీకు చెయ్యకలిగేది. వీలైతె మీరు ఈ ఊరు వదిలి వెళ్ళిపోతె మంచిది, తర్వాత మీ ఇష్టం,"అన్నాడు.

ఆ ప్రిన్సిపాల్ ఎంతో అనుభవం ఉన్న వ్యక్తి. అతనికి తెలుసు. ఒక వ్యక్తి ఒక సంస్థతో పెట్టుకోకూడదని. అందునా ఆడపిల్లకి సంబంధించిన విషయం. యాజమాన్యం ఇతని మాట వినరు. స్కూల్ కి చెడ్డ పేరు వస్తుందని భయపడతారు. వాళ్ళకి ఏముంది? అవసరమైతే నాలుగు రూపాయలు ఎక్కువ ఇచ్చి ఇంకొక టీచర్ని తెచ్చుకుంటారు. ఒక మంచి టీచర్ని స్కూల్ కోల్పోయి నాలుగు రోజులపాటు విద్యార్థులు ఇబ్బంది పడతారు. తరువాత మామూలే.

అంతా అపరాధిలాగ చూసేసరికి, ఆఖరికి సునీత కూడ మొహం తప్పుకుని వెళ్ళిపోయె సరికి అతనికి తన ప్రపంచం ఆగిపోయింది అనుకున్నాడు. అతను ఆమెకు ఎంత చెబుదామన్నా ఆమె అస్సలు అవకాశం ఇవ్వలేదు. ఏమీ

తోచక తనకు ప్రశాంతత ఇచ్చే గోదావరి ప్రయాణం చేస్తుండగ స్టీమర్ కూనవరంలో ఆగింది. అతను అక్కడ దిగిపోయాడు.

తల్లితండ్రులు ఎంత బ్రతిమాలినా తిరిగి వెనక్కిరాలేదు. తనకు అక్కడే బావుందని, ఇష్టమైతే వాళ్ళని కూడ అక్కడికి వచ్చేయమని అనేవాడు. ఒక్కడే కొడుకు వలన వాళ్ళుకూడ ఎక్కడో అక్కడ అతను సంతోషంగా ఉంటే అదే చాలనుకునేవారు. కనీసం కళ్ళెదురుగ ఉన్నాడని అనుకుని అప్పడప్పుడు వచ్చి వెడుతూ ఉండేవారు.

అతను అక్కడి వాళ్ళల్లో ఒకడిగా కలిసిపోయాడు. అక్కడి పిల్లలకు పాఠాలు చెబుతూ ఎవరినీ తన దగ్గరికి రానీయక 'మందిలో ఉంటూ ఒంటరిగా', వాళ్ళకి ఉపయోగ పడుతూ నిజమైన 'మనీషి' అయ్యాడు. అక్కడ 'మాస్టారు' అంటే అతనిని చూపిస్తారు అంతా.

ఎప్పుడైనా పోలీసులు వచ్చి, "అన్నలు ఏమైనా ఇబ్బంది పెడితే మాకు చెప్పండి సార్", అంటారు. "పోలీసులు ఏమైనా 'రుబాబ్' చేస్తే మాకు జెప్పుండ్రి", అని అన్నలు అంటారు. అన్నింటికి చిరునవ్వే అతని సమాధానం. అలా పదిహేను సంవత్సరాలు గడిచాయి. అతను నలభైలలో పడ్డాడు.

ఇప్పుడింక తల్లితండ్రులు ప్రయాణం చేసె స్థితిలో లేరు. అందుకే అతను అప్పడప్పుడు రాజమండ్రి వెళ్ళి వాళ్ళని చూసి, అతనికి కావల్సిన సరుకులు తెచ్చుకుంటూ ఉంటాడు.

స్టీమర్ ఆగింది. దిగాక కొంచెం బడలిక అనిపించి సుధీర్ ఒక రాయి మీద కూర్చొన్నాడు తన కుటీరానికి వెళ్ళెముందు. దూరంగా ఇద్దరు ఆడవాళ్ళు తన దగ్గరకు వస్తూ కనిపించారు. సునంద, ఆమె స్నేహితురాలు– లావణ్య.

"మాస్టారు, నన్ను క్షమించండి. నాదే తప్పని అప్పుడు చెప్పలేక పోయాను." అంది సునంద.

"పోన్లేమ్మా, ఫరవాలేదు. నువ్వు బావున్నావు కదా! ఎంత మంది పిల్లలు? " నవ్వుతూ అడిగాడు సుధీర్.

"ఒక్క బాబు సార్. స్నేహితులు అంతా 'రీయూనియన్' అంటే, మరల అంతా సరదాగ కలవవచ్చు కదా అని వచ్చాను," అంది ఆమె.

"పదవే, పోదాం. మళ్ళీ వాళ్ళెవరైనా చూస్తారు," అంటూ లావణ్య తనని అక్కడ్నించి తీసికెళ్ళిపోయింది. నిజానికి సునందకి ఇంకా కొంచెం సేపు అతనితో మాట్లాడాలని ఉంది.

"అంటె ఇంకా నాదే తప్పని వాళ్ళంతా అనుకుంటున్నారన్న మాట. పోన్లె, అనవసరంగా ఆ అమ్మాయిని ఆకర్షించాను అనే అపరాధ భావన తొలిగింది," స్థిత ప్రజ్ఞతతో ఊరివైపు కదిలాడు సుధీర్.

"ఇప్పటికీ ఎంత బావున్నాడె మాస్టారు? అప్పటి పాంట్ టీషర్ట్ ల కంటే ఈ లాల్చీపైజామాలో ఇంకా అందంగా ఉన్నాడు," అంటూ తన మొదటి ప్రేమని గుర్తు చేసుకుంది సునంద. అందరి మనసులు తనకు తెలుసంటూ నర్మగర్భంగా గోదావరి సాగుతోంది, గోదావరిలో స్టీమర్ సాగుతోంది భద్రాచలంవైపు.

## రక్షకుడు

కృపాకర్ పోతుల

బ్రహ్మీజీగారికి ప్రచండమైన కోపం వచ్చింది. ఈ మధ్య ఆయనకి ఏం చదువుతున్నా ఇలాగే కోపం తన్నుకొచ్చేస్తోంది. నాలుగు లైన్లు చదవడం, కోపంతో చిందులేసెయ్యడం. చేతిలో పుస్తకాన్నో మూలకి విసిరికొట్టెయ్యడం. ఇదే తంతు. అది ఎంత ముదిరిపోయిందంటే, ఆయన చదవడానికి ఏదైనా పుస్తకాన్ని చేతిలోకి తీసుకుంటే చాలు...

"ఈయనతో చచ్చే చావైపోతోంది. పెద్ద చదవరిలా డబ్బులు తగలేసి పుస్తకాలు కొనడం దేనికో, కనీసం ఐదునిమిషాలైనా చదవకుండానే కోపంతో గంగవెర్రులెత్తిపోవడం దేనికో, వాటిని చింపి పోగులుపెట్టడం దేనికో, డబ్బులు తగలెయ్యడానికి కాకపోతే?" అంటూ ఆయన భార్య శారదాంబగారు నొక్కే సన్నాయినొక్కులు బ్రహ్మీజీగారి చెవిని పడుతూనే ఉంటాయిగాని, అవి ఆయన కోపాన్ని కాస్తైనా తగ్గించవు సరికదా, మరికాస్త ఎగదొయ్యడానికి మాత్రం మహచక్కగా దోహదపడతాయి.

"కోపం రాదూ మరి. అక్షరంముక్క తెలుగు రాయడం చేతకాని ప్రతీ అప్రాచ్యపువెధవా రచయితే ఈరోజుల్లో. వాడేదో ఒకటి గీకేసి "విద్యుత్కణసంబంధ టపా"లో (e-mail) ఏదో పత్రికమీదకి వదిలెయ్యడం, వాళ్ళు వెనకా ముందూ చూడకుండా దాన్ని 'అచ్చోసి' దేశం మీదకి వదిలెయ్యడం...వాటిని చదువుతుంటే రక్తపోటు ప్రకోపించి, రాసిన వాడినీ, ప్రచురించిన వాడినీ. ఇద్దరినీ నరికి పోగులెయ్యాలన్నంత కోపం వచ్చేస్తుంది" గాండ్రిస్తారు బ్రహ్మీజీగారు పిచ్చికోపంతో పెద్దపులిలా.

అసలు బ్రహ్మీజీగారికి చిన్నప్పటినుండీ మాతృభాషంటే వల్లమాలిన ప్రేమా అభిమానమూ౼నూ. ఉన్నతపాఠశాలలో చదువుకుంటున్న రోజులలో తెలుగులో మొదటిస్థానం ఎప్పుడూ బ్రహ్మీజీగారిదే. కాలేజీలో తెలుగు ముఖ్యవిషయంగా డిగ్రీ చేయాలన్న కోరికైతే మనసులో ఏమూలో ఉండేదిగాని, ఆరోజుల్లో చాలామంది

యువకులకుమల్లే, బ్రహ్మాజీగారికి కూడా బేంకు ఉద్యోగం మీద విపరీతమైన మోజు ఉండేది. ఆ కారణంగా ఆయన తెలుగు చదివే ఉద్దేశాన్ని మొగ్గలోనే తుంచిపారేసి దాని బదులు ఇంగ్లీషు మీడియంలో కామర్సు చదివారు. డిగ్రీ పూర్తైన తరవాత ముందుగా అనుకున్నట్టుగానే, బేంకు పరీక్షలురాసి, దేశంలోని బేంకులన్నింటిలోకీ అతిపెద్ద బేంకులో ఉద్యోగం సంపాదించడంలో కృతకృత్యులయారు. ఉద్యోగంలో చేరాక, బేంకుకంటే దానికి అనుబంధించబడ్డ ఉద్యోగులసంఘాని (trade union)కే ఎక్కువ సేవలందించి, అంచెలంచెలుగా దానికి అధినాయకునిగా ఎదిగేరు. ఉద్యోగం చేసినంతకాలం బేంకు యాజమాన్యానికి సింహస్వప్నంగా వ్యవహరించేరు.

--00--

ప్రపంచీకరణ దేశంలో వేళ్ళూనుకుంటున్న కాలం అది. దాని పుణ్యాన బహుళజాతిసంస్థలనేకం దేశంలో దుకాణాలు తెరవడంతో, యువత ఉద్యోగాలు 'కొనుక్కొని' బతకాల్సిన పరిస్థితి మారి, ఉద్యోగాలే యువతను వెతుక్కొని మరీ వరించే శుభపరిణామం చోటు చేసుకుంటోంది. అయితే ఆ ఉద్యోగాలన్నీ ఇంగ్లీషుమాధ్యమంలో చదివి, ఇంగ్లీషులో ధారాళంగా సంభాషించగలిగిన వారిని మాత్రమే వరించసాగాయి. తెలుగుమాధ్యమంలో చదివిన వారికి... అవి అందని ద్రాక్షలైతే అయ్యాయిగాని, పుల్లద్రాక్షలు మాత్రం కాలేదు. దానితో ప్రజలంతా తమ పిల్లల్ని తెలుగుమాధ్యమంలో కాక, ఇంగ్లీషుమాధ్యమంలో చదివించడానికే మొగ్గుచూపసాగారు.

బ్రహ్మాజీగారు కూడా, చాలా తార్కికంగా, యుక్తియుక్తంగా ఆలోచించగలిగే మేధావి వర్గానికి చెందిన వ్యక్తి గనుక, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తన ఒక్కగానొక్క కొడుకునూ ఖరీదైన ఇంగ్లీష్ మీడియం స్కూల్లో, అదికూడా పెద్ద ఇంటర్నేషనల్ స్కూల్లో చదివించేరు. అంతే కాకుండా, తెలుగైతే మార్కులు సరిగ్గా వేయరని, దాన్ని కనీసం రెండవభాషగానైనా చదివించడానికి సంసిద్ధత చూపలేదు.

"హిందీ వెధవలకీ, తమిళతంబీలకీ గల భాషాభిమానం మన 'తెలుగూ స్కౌండ్రల్స్' కి ఎక్కడ చచ్చిందండీ. మార్కులు వేసి చావరుకదా దుర్మార్గులు. అందుకే మావాడితో సెకండ్ లాంగ్వేజి 'ఫ్రెంచి" తియ్యించేను. అదైతే మంచి స్కోరింగ్ అని. మీరు కూడా మీ పిల్లలతో ఫ్రెంచే తియ్యిస్తే మంచిది. ఆలోచించండి" అని సలహాలు కూడా ఇస్తూ ఉండేవారాయన ఆయన ఆరోజుల్లో.

అలా చిన్నప్పట్నుంచీ అతిఖరీదైన బడిలో విద్యనభ్యసించిన ఆయన కుమారుడు, ఐఐటీ ముంబైలో ఇంజినీరింగ్ చదివి, ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడై, గొప్ప బహుళజాతి సంస్థలో ఉద్యోగం

సంపాదించుకోవడమేకాక, కంపెనీ ఖర్చుమీద అమెరికా వెళ్ళి, ఐదేళ్ళనుండీ అక్కడే ఉద్యోగం చేస్తున్నాడు. రెండుచేతులా సంపాదిస్తున్నాడుకూడా.

ఇంతలో కాలచక్రం గిర్రున ఒక భ్రమణం పూర్తిచేసింది. బ్రహ్మాజీగారికి అరవైఏళ్ళు నిండడం, ఆయన చేస్తున్న ఉద్యోగంనుండి రిటైరవ్వడం జరిగింది. ఆ తరవాత చెయ్యడానికి వ్యాపకం ఏమీలేక ఖాళీగా గోళ్ళు గిల్లుకుంటూ ఇంట్లోనే కూర్చోవలసి వచ్చింది. ఆ సమయంలో ఆయన హృదయాంతరాళంలో నిద్రాణమై పడిఉన్న పఠనాసక్తీ, మాతృభాషానురక్తీ తలలు విదుల్చుకొని నిద్రలేచేయి. తెలుగు కథలూ నవలలూ చదవాలన్న ప్రబలమైన కోరిక బుసలు కొడుతూ తలెత్తింది. దానితో, మార్కెట్లో కొనఊపిరితో మిగిలి ఉన్న ఒకటిరెండు అచ్చుపత్రికలకి మాత్రమేకాక, అనేక అంతర్జాలపత్రికలకి కూడా చందాదారునిగా చేరిపోయారు. తిరిగి చదవడం ప్రారంభించేరు.

అయితే, వాటిని చదవడం వలన ఆయనకు లభించినది మానసికోల్లాసం కాదు. చిత్తక్షోభ. ఎందుకంటే, ఏ రచనలో చూసినా సగానికి పైగా ఇంగ్లీషు పదాలే. వీడూ వాడూ అన్న తేడాలేదు. రాసినది ఆడా మగా అన్న బేధంలేదు. ఎవరు రాసినా అదే తీరు. సరైన తెలుగు పదం లేని ఏ 'కాంప్యూటర్' వంటి దానికో ఇంగ్లీషు పదం వాడితే అర్ధం ఉందిగాని, 'విమానం' అన్న చక్కని తెలుగుపదం ఉండగా 'ఎయిరోప్లేన్' ఎవరైనా రాస్తే మాత్రం బ్రహ్మాజీగారికి కోపం నషాళానికి అంటుకుపోతుంది. గంగవెర్రులెత్తిపోతారు.

'తెలుగుభాష ఇంతగా కునారిల్లిపోవడానికి గల కారణం ఏమయ్యుంటుంది చెప్మా' అని ఎంత ఆలోచించినా బ్రహ్మాజీగారికి సంతృప్తికరమైన సమాధానం లభించలేదు. దాన్ని కనుగొనే ఉద్దేశ్యంతో చిన్నపాటి పరిశోధన కావించేరాయన. అందులో వెలుగు చూసిన వాస్తవాలు ఆయనను దిగ్భ్రాంతికీ, ఆందోళనకూ గురిచేసేయి.

తెలుగుగడ్డ మీద ఉన్న బడులు, ఇంచుమించూ అన్నీ ఆంగ్లమాధ్యమంలో బోధించే బడులే అని కనిపెట్టేరాయన. తెలుగుమాధ్యమంలో బోధించే ప్రభుత్వపాఠశాలలు ఎక్కడో ఒకటీ అరా ఉన్నా, వాటిలో చదివే విద్యార్ధులుగాని, బోధించే ఉపాధ్యాయులుగాని దుర్భిణీ వేసి చూసినా ఎక్కడా కనబడలేదు బ్రహ్మాజీగారికి. దానికితోడు విద్యార్ధులందరూ ఒకరితో ఒకరు ఇంగ్లీషులోనే సంభాషించుకోవడం మాత్రమేకాకుండా, వయసుతో నిమిత్తం లేకుండా ''వాట్ ద హెల్ యార్', 'ఓ షిట్ మేన్'' ''హేయ్ డూడ్'' వంటి మామూలు మాటలేకాకుండా, పచ్చి ఇంగ్లీషుబూతులుకూడా, మంచినీళ్ళు తాగినంత సులువుగా మాట్లాడెయ్యడం చూసిన బ్రహ్మాజీగారు తీవ్రమైన ఆవేదనకూ అంతకు పదింతలు ఉద్రేకానికీ గురయ్యారు.

పరిస్థితి ఇలాగే కొనసాగనిస్తే తేనెలొలికే తియ్యని తెలుగు కనుమరుగైపోవడానికి ఇక ఎంతో కాలం పట్టదన్న ఆందోళన పట్టుకుంది బ్రహ్మాజీగారికి. అలా కనుమరుగు కాకుండా నివారించడానికి ఏం చేయాలా అని రెండురోజులు తీవ్రంగా ఆలోచించారాయన. ఎంతైనా పెద్ద ట్రేడ్ యూనియన్ నాయకుడు గనుక, 'ఈ దుష్పరిమాణాన్ని నివారించాలంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఉద్యమమే లేవదీయాల్సిన అవసరం కలదని' గ్రహించారు. అంతేకాకుండా ఆ ఉద్యమాన్ని తనే లేవదియ్యాలనీ, దానికి నాయకత్వం కూడా తనే వహించాలనీ నిర్ణయించుకున్నారు.

ఆ దిశలో మొదటి అడుగుగా తనవంటి 'మేధావులు' అధికంగా ఉండే సంఘాల్లోనూ, వాట్సాప్ సమూహాల్లోనూ సభ్యునిగా చేరిపోడమేకాక, ఆయనకున్న ట్రేడ్ యూనియన్ అనుభవంతో అనతికాలంలోనే వాటికి నాయకునిగా కూడా ఎదిగేరు. అనుకున్నట్టే తెలుగుభాషా పరిరక్షణకు పెద్ద ఉద్యమాన్నే లేవదీసేరు.

అందులో భాగంగా, తెలుగుభాషను బ్రతికించుకోవడాని, ఇంగ్లీషుభాష గొంతునులిమి చంపిపారెయ్యటం వినా వేరు మార్గము లేదని ఎలుగెత్తి చాటుతూ, ధినపత్రికలలో అసంఖ్యాకమైన వ్యాసాలు రాసేరు; వాటిని చదివిన పాఠకులు అనేకమంది బలంగా ప్రభావితమయ్యేరు. రాష్ట్వవ్యాప్తంగా పగలు రాస్తారోకోలూ, రాత్రుళ్ళు కొవ్వొత్తి ప్రదర్శనలూ నిర్వహించేరు. ఆ సందర్భాలలో గంభీరమైన ఉపన్యాసాలిచ్చేరు; వాటిని విన్న శ్రోతలు బహుగా ఉత్తేజితులయ్యేరు. అంతేకాకుండా తెలుగు టీవీచానళ్ళలో లెక్కబెట్టలేనన్ని ఇంటర్వ్యూలిచ్చేరు; చర్చలలో పాల్గొన్నారు. అవి తెలుగు ప్రజానీకాన్ని గంగవెర్రులెత్తించేయి.

తెలుగుగడ్డమీద, తెలుగుభాషకు తిరిగి జీవంపోయాలన్న సమున్నతమైన ఆశయంతో బ్రహ్మాజీగారు మెదలుపెట్టిన ఉద్యమం పతాకస్థాయికి చేరుకుంది.

అటువంటి సమయంలో, ఒకానొక శుభదినాన, రాష్ట్రంలో "ద మోస్ట్ పాప్యులర్ టీవీచానల్" ఒకటి బ్రహ్మాజీగారిని లైవ్ లో ఇంటర్వ్యూ చేసింది. ఆ ఇంటర్వ్యూలో క్లిష్టమైన ప్రశ్నలు లెక్కకు మిక్కిలిగా సంధించింది. బ్రహ్మాజీగారు వాటన్నింటికీ సముచితమైన సమాధానాలు ధీటుగా ఇచ్చేరు. అవి ప్రేక్షకుల్ని అలరింపజేయడమే కాకుండా బహుగా ఉత్తేజపరిచేయికూడా. పర్యవసానంగా ఆ ఇంటర్వ్యూ 'వాట్సాపూ', 'యూట్యూబూ', 'ట్విట్టరు'వంటి సామాజికమాధ్యమాలలో కారుచిచ్చులా 'వైరల్' అయింది. అమెరికాలో ఉన్న ఆయన కొడుకు అనుకోకుండా ఆ వీడియోను వీక్షించడం తటస్థంచింది.

మాతృభాషోద్ధరణకు కంకణం కట్టుకొని, దాని సాధనకు తన తండ్రి సాగిస్తున్న అలుపెరుగని పోరాటం గురించి తొలిసారిగా తెలుసుకున్న బ్రహ్మీజీగారి కుమారుడు అందు విషయమై చాలా గర్వించేడు. ఇంత ఉత్కృష్టమైన ఉద్యమాన్ని అంత తీవ్రమైన స్థాయిలో సాగిస్తూకూడా, ఆ విషయాన్ని తనకు మాటమాత్రమైనా తెలియజేయని తండ్రిమీద కొద్దిగా కినుక వహించేడు. తెలుగుగడ్డమీదే పుట్టినా తెలుగు చదవడం రాయడం రెండూ రాని తన దుస్థితినీ, అమెరికాలో పుట్టిన కారణాన, కనీసం తెలుగు మాట్లాడటమైనా సరిగ్గా రాని తన కూతురు దురదృష్టాన్ని తలచుకొని కుమిలిపోయేడు. ఈ ఘోరమైన తప్పిదాన్ని సరిదిద్దుకోవడానికి ఏంచేయాలా అని ఒకరోజంతా దీర్ఘంగా ఆలోచించేడు. ఆలోచించి....

తన ఒక్కగానొక్క కూతురుని తక్షణమే స్వదేశానికి, తండ్రివద్దకు పంపించేసి, తెలుగుమాధ్యమంలో చదివించి, తెలుగు ప్రజలకు ఆదర్శంగా నిలవాలని నిర్ణయించేడు. అంతేకాకుండా తనుకూడా సాధ్యమైనంత త్వరలో చేస్తున్న ఉద్యోగానికి రాజీనామాచేసి, మాతృదేశానికి తిరిగివెళ్ళి, తండ్రి సాగిస్తున్న పోరాటంలో ఆయనకు అండగా నిలవాలనికూడా గట్టిగా నిర్ణయించుకున్నాడు. ఆ విషయం తన భార్యకు చెప్పి, అతికష్టంపై ఆమెను అందుకు ఒప్పించడంలో సఫలీకృత్యుడయ్యేడు.

ఇంత మంచి విషయాన్ని తన నోటితో తనే స్వయంగా తండ్రికి తెలియజేయాలని ఉబలాటపడ్డాడు. తన నిర్ణయాన్ని విన్న తండ్రి ఎంతగా ఆనందిస్తాడో, తననెంతగా అభినందిస్తాడో ఊహించుకొని పులకించిపోయేడు. తండ్రికి ఫోన్ చేసి, తను తీసుకున్న నిర్ణయం గురించి తెలియజేసాడు గర్వంగా.

కొడుకు మాటలు విన్న బ్రహ్మీజీగారు కోపంతో వణికిపోయారు. కోపోద్రేకం వల్ల కొన్నిక్షణాలపాటూ ఆయన నోటమాట పెగలేదు. బృహత్ప్రయత్నం మీద కోపాన్ని కాస్త నియంత్రించుకొని, గొంతు పెగుల్చుకొని, తన కొడుక్కీవిధంగా ఉపదేశం గావించేరు.

"చూడు నాన్నా, ఇంగ్లీషును తరిమికొట్టి, తెలుగును రక్షించడానికి నేను సాగిస్తున్న పోరాటం...ఇది నీకోసమో నీ కూతురుకోసమో కాదు. ఇట్స్ స్ట్రిక్ట్లీ ఫర్ అదర్స్. నా స్పీచెస్సూ, ఇంటర్వ్యూసూ విని, ఎక్సైటైపోయి, నా మనవరాల్ని ఇక్కడికి పంపించెయ్యడం, చేస్తున్న జాబ్ నీ, ఎర్న్ చేస్తున్న లేక్స్ ఆఫ్ డాలర్స్నీ వదులుకొని నువ్విక్కడికి అఘోరించంలాంటి ఇడియాటిక్ పనులు చెయ్యాల్సిన అవసరం నీకు ఎంతమాత్రమూ లేదు. ఐ వాంట్ యూ పీపుల్ టు లివ్ హేపీలీ ఇన్ యూఎస్సేస్లీ. లేదూ మూవ్ ఓవర్ టు ఇంగ్లండ్ ఆర్ కెనడా ఆర్ ఆస్ట్రేలియా. ఐ డోంట్ మైండ్. అంతేగాని నెవర్, ఎవర్ థింక్ ఆఫ్ కమింగ్ బేక్ టు దిస్ కంట్రీ ఈవెన్ ఇన్ యువర్ డ్రీమ్స్. అయినా నువ్వొచ్చి ఉద్దరించడానికేముందిరా ఇక్కడ...మన్నూ మశానం తప్ప. ఆల్వేజ్ రిమెంబర్

ఒన్ థింగ్. యూ ఆర్ అండర్ నో ఆబ్లిగేషన్ ఆర్ డ్యూటీ బౌండ్ టు పుట్ మై ప్రీచింగ్స్ ఇన్ టు ప్రాక్టీస్. అండర్స్టాండ్" అని కొడుక్కి కడుపునిండా గడ్డిపెట్టేరు. తరవాత...కోపంగా ఫోన్ కట్ చేసేరు.

## పాపం..అమ్మా, నాన్న

ఏ.బి.ఎస్.రామారావు

కడుపులో ఉండగా నే తన్నితే ఆనందించింది అమ్మ

నాన్నను పిలిచి చెయ్యి తాకించి నవ్వింది నాన్నకేసి చూసి అమ్మ..ఎంతసంతోషమో..

పురిటిలో బాధ పెడితే సంతోషించింది అమ్మ

నీ కెల్లాతెలుసు? అని అనకండి......

..... అందరమ్మలూ అంతేట...

చదువులో వెనక పడితే కలవరపడింది.

ఉద్యోగం వస్తే ఊరంతా చెప్పిసంబరపడింది .

ఆకలి అంటే ఆనందపడి ఎన్నో పెట్టింది.

ఆకలి లేదంట ఆవేదన చెందింది.

నాకు పెళ్లి అనగానే పరవశించింది.

పోగా, పోగా, జారిపోతానేమోనని డీలాపడింది.

అమెరికా వెళ్ళి పోతున్నానంటే దిగులు పెట్టుకుంది

స్కైపుందంటే, సాటిరాదు సరసన ఉన్నదాంతో అంది.

అమెరికా వెళ్ళే రోజు వచ్చిందంటే, నోట్లో కొంగు కుక్కుకుంది అమ్మ.....

అమెరికా వచ్చెయ్యమంటే ససేమిరా రాలేనంది.

పదేళ్లకి వచ్చి చూస్తే పట్టెమంచం మీద పడుకునుంది అమ్మ....

మెదటి మాట...'అన్నంతిన్నావా?'...అంది అమ్మ...

తరవాతి మాట " కోడలు, మనవలు కులాసానా, చూడనేలేదు వాళ్ళని నేరుగా!" అంది కళ్లు తుడుచుకుంటూ..

దగ్గుతోంది, ఆయాసపడుతోంది...

ఎప్పట్నించి? చెప్పలేదేమంటే, "అబ్బే మొన్నటినుంచే" అంది.

"స్కైపులో రమ్మంటే రాలేదు, ఫోనులోనైనా చెప్పలేదేం?" అంటే,

"పోనీలేరా, బానేఉన్నాగా"... అంది.

తెలుస్తోంది, అబద్ధం చెపుతోంది అని అమ్మ....నా కోసం

నీలుగు, మూలుగు లేక లేచి ముద్దు పెట్టుకుంది నాతలవంచి నుదిటిమీద....

..... ఎనభై పైమాటే....అమ్మకి.

నీకు పెట్టిన నర్సు, వంటావిడ ,పని అమ్మాయి, ఏరి అనడిగితే ఓ నిట్టూర్పు నవ్వు నవ్వింది.

"ఆదివారం కదా రారు"

తరవాత తెలిసింది. అమ్మ మంచితనం ఆసరాగా తీసుకుని అస్తమానూ మానేస్తుంటారని...

అటుతిరిగి తలగడ పక్కన ఉన్న దబ్బా తీసి, మూత తీసి ఓ పెద్ద మైసూరుపాకు ముక్క పెట్టింది నాకు, నోట్లో...

అదేరుచి, అప్పటిరుచి, చిన్నప్పటినుంచి నోట్లో నానుతున్న రుచి...అన్నేళ్ళ రుచి,...

అమ్మేచేసింది...నాకిష్టమని....తెలుస్తోంది..

"లేవలేక ఇబ్బంది పడుతూ ఎందుకూ, చెయ్యడం అంటే", సమాధానంగ నా తలనిమిరింది..

అప్పుడు చూశా, అమ్మచేతిమీద కాలిన వాత...

"ఏమిటిది ?!!అయ్యో"" అంటే,

"చూశావ్......? ఏమీలేదులే, అదేపోతుంది"" అంది పమిటి చెంగు కప్పుతూ....

వీధి తలుపు చప్పుడయింది...ఎపార్ట్ మెంట్ కదా.. వరండా తలుపనాలేమో..

" లోపలికి రా నాయనా" అమ్మ అంది.

" ఎవరో తెలియకుండానే ?" మనసులో మాటే బయటకి గొణిగా....

"తెలుస్తుందిరా... ఆప్యాయతకి అంతటా ఆనంద తరంగాలే..మనసుకి తెలిసిపోతుంది...ట్యూషనో ఏదో అంటారుగా"

" ఇన్ ట్యూషన్" కరక్ట్ చేసా...

నేరుగా, లోపలి గదిలోకి వచ్చాడు అతను...

అమ్మ పరిచయం చేసింది " ఇతనే, రామారావని....నాకు చేదోడూ, వాదోడూనూ.... వాళ్ళ అమ్మగారితో పాటే నన్నూ అమ్మలా చూసుకుంటాడు....రోజూ వచ్చి ఓ గంట నాదగ్గర కూర్చుని ఆప్యాయంగా అన్ని విషయాలూ మాట్లాడందే కదలడు...ఎంతసేవ చేస్తున్నాడో వాళ్ళమ్మకి... చెప్పలేననుకో......నా పనులూ అతనే చేసిపెడతాడు...నీతో ఓ సారి చెప్పా ఫోనులో..."

"మా అబ్బాయి..." అతనికి పరిచయంచేసింది అమ్మ...ముక్తసరిగా అనిపించింది నాకు...అవును నాగురించి చెప్పేదేముంది?

"నమస్కారమండి, చాలా కాలానికి వచ్చినట్టున్నారు"

"ఎల్లా ఉన్నారు బామ్మగారూ?" అంటూ అమ్మ పక్కనే కూర్చున్నాడు.....మంచంమీద.....ఆప్యాయంగా మీద చెయ్యివేస్తూ... అమ్మ చేతి కాలిన గాయం ఇంకో చేత్తో తడుముతూ....

" బాగా ఉన్నా నాయినా, నీ ధర్మమా అని...కుంకుమాది లేపం రాసావుగా, వెంటనే వచ్చి... తగ్గి పోతుందిలే...ఎంత మంది పనివాళ్లుంటే ఏమిటి?.. వాళ్లకేంపట్టింది? నెలలో నాలుగు రోజులు నాగా పెట్టేస్తారు..."

" అయ్యో, వంటావిడని పెట్టాగా, ఆవిణ్ని చెయ్యమంటే చెయ్యదూ మైసూరుపాకూ, ..... నువ్వు తిప్పలు పడడందేనికి స్టౌ దగ్గరకెళ్లి??" అడిగా...

రామారావు నా కేసి తిరిగి అన్నాడు...

" నేనూ అదే చెప్పా, మా వాడు వస్తున్నాడూ, వాడికి మైసూరుపాకంటే ప్రాణం చిన్నప్పటినుంచీనూ, నేనే చెయ్యాలి

అన్నారు. ఆదివారం కనక ఇంట్లోనే ఉన్నా.. పోనీ బామ్మగారూ, ఆనందభవన్ లో బాగుంటుంది ఓ కిలో తీసుకుని వస్తాలెండి అన్నా...."

"అవును నీ సంతృప్తికి రామారావుగారు అన్నట్టే చెయ్యాల్సిందమ్మా..." నసిగా..

" ఊరుకోండర్రా, మీకేంతెలుసు? నువ్వు కొనుక్కు తినలేవని చేస్తానా?? నా చేతుల్తో చేసి, నువ్వొచ్చేటప్పటికి డబ్బాలో పెట్టి, నువ్వొచ్చాక ఆనందంతో డబ్బా మూత తీసి ఓ ముక్క నీ నోట్లో పెడితే ఉన్న ఆనందం రబ్బరు బేండు తీసి అట్టడబ్బాలో వాడెవడో ఎప్పుడో చేసి పెట్టిన ముక్క పెడితే వస్తుందా?... సరిఘ్గా కొలతలు తీసి కోసినట్టుగా ఉంటాయి వెధవ ముక్కలు...ఇంట్లో కోసే వంకర టింకర ముక్కల్లో ఉండే అమ్మతనం ఉంటుందా..." డబ్బా మూత అపురూపంగా తీస్తూ ఓ ముక్క రామారావుగారికిచ్చి, ఆనంద పడిపోయింది అమ్మ.....

"అదండీ వరస... " రామారావుగారు ముక్క కొరికి ఆస్వాదిస్తూ అన్నారు.. ఏమాటకామాటే చెప్పకోవాలి....అమ్మ వంట అమ్మ వంటే...ఆప్యాయత కలుస్తుందిగా...

"చెయ్యికాలి మానేసారు కాని, మీకోసం జంతికలు, కజ్జికాయలు చేస్తానని కూర్చున్నారు..." రామారావుగారు లేస్తూ అన్నారు...

" అవును మరి, వాడికి కారం ఎక్కువేసి కొంచెం గట్టిగా ఉంటే చాలా ఇష్టంగా తింటాడు జంతికలు...కజ్జికాయలు సరే సరి...కొబ్బరినౌజుతో నే చెయ్యలి..."

....అమ్మ, అమ్మ, అమ్మ...మనసు ఆర్ధం అయింది నాకు...ఏదో వెలితి ఇన్నాళ్ళూ, తెలుస్తోంది ఇప్పుడిప్పుడే... అన్నీ దూరం చేసుకుని దూరదేశాల్లోఉండి ఏం బావుకున్నాము?? ఇక్కడిలా పని వాళ్ళ సుఖం ఏది? అమ్మ ఆప్యాయత ఏది? చుట్టాల రాకపోకలు, శుభకార్యాలకి కలవడాలూ, ఏవి??

నన్ను చూసిన ఆనందం, రామారావు వచ్చి పలకరించడంతో అమ్మ ఆనందం మహదానందంగా మారడం స్పష్టంగా కనిపించడం లేదూ!!.....నే పెట్టుకున్న దూరం న్యాయమా, ధర్మమా, ఉచితమా, డబ్బే లోకమా? చాలదా ఈ సంపాదన? మనసారా నవ్వుకుని ఎన్నాళ్ళయిందో. ..అక్కడన్నీ కృత్రిమ నవ్వులేగా, ఎయిర్ హోస్టెస్సులా... భుజంమీద పడ్డచెయ్యితో నాలో నే వేసుకుంటున్న ప్రశ్నలు ఆగాయి....

" రండి హాల్లో కూర్చుని మాట్లాడుకుందాం... బామ్మగారూ మీరు కాసేపు పడుకోండి చాలా పొద్దున్నే లేచారివాళ"

రామారావు..

చాలా సేపు మాట్లాడుకున్నాం...

రామారావు గారు అమెరికాలో చాలాకాలం ఉన్నారుట....

" ఏం? ఎందుకువచ్చేసారు?" అడిగా కుతూహలంగా..

" ...మా నాన్నగారి ఆఖరి చూపులు కూడా దక్కించుకో లేని అభాగ్యుణ్ని...మా అన్నదమ్ములు ముగ్గుర్ని అరచేతుల మీద పెట్టుకుని పెంచి పెద్దచేసారు మా అమ్మా, నాన్న...అన్నలున్నారు కదా అని అమెరికా కే మొగ్గుచూపా.....చెక్కపెట్టెలో చలనంలేని నాన్నను చూసాక, ఇదిగో మానాన్నగారు ఆఖరి క్షణం వ్రాసుకున్న స్వగతం చదివి....చలించి పోయా... ఇదిగో పర్సులోనే పెట్టుకున్నా...చదవండి." రామారావుగారిచ్చిన నలిగిన కాగితం తీసుకు చదివా............ఇలా...

*.........పేదవాడిని,పెద్దచదువులు లేనివాడిని.......కష్టపడి పైకొచ్చావన్నారు*

*కోట్లు గడించక పోయినా , రెట్టింపు ఉత్సాహంతో, రెండిళ్ళు ,రెండు స్థలాలు,*

*రెండు పదుల లకారాలు, రాముడిగా ఉంటూనే కూడబెట్టా. చక్కని కుటుంబం అన్నారంతా.*

*చింతలు లేక ,చికాకు ల్లేక ,చివరి దాకా గడవాలని,*

*గడవక పోతుందా అని, గడవకపోతేనో అని, గడిస్తే బాగుంటుందని,*

*ఆలోచనలన్న, ఆవేదనలన్నీ,ఆశలన్నీ అన్నంతో పాటే ఏ పూటకాపూట మింగేస్తూ*

*నా వాళ్ళందరికి ఏ కష్టం కలగుండ బతికా, కలికాలానికి భయపడుతూనే.*

*పదవీ విరమణ చెయ్యమన్నారు. "ఓపికఉంది ,కొన్నాళ్ళుంటా "నంటే ఒద్దు పొమ్మన్నారు.*

*పించనో అంటే, పళ్ళికిలించారు. ఇది గవర్నమెంటు కాదుగా అని.*

*ఫరవాలేదులే, ఇదో లెఖ్ఖా, పదిలంగా నా పరివారం ఉందిగా అనుకున్నా.*

మమత అనురాగాలు , ఆత్మీయతలు , అనుబంధాలు,మంచితనాలు నా ఖాతాలో జమ అనుకున్నా

అక్క........డే పప్పు లో కాలేసా.

మంచాన్నించి కంచానికి, కంచాన్నించి మంచానికి .

పైసా సంపాదన లేదు. కాళ్ళల్లో సత్తువ లేదు, కళ్ళల్లో నీళ్ళకి కొదవ లేదు

కొట్టుకి, పాలకి, బడికి తిరుగుడు తప్పలేదు.కష్టాలకి కొదవ లేదు. ఇష్టాలకి ఆయుష్షు మూడింది

ఉత్సాహంగ ఉండేవాణ్ణి. దానికి ఉచ్చు పడింది. ఇంట్లోవాళ్ళకి అడ్డు.

ముసలితనపు మతిమరుపు మిగతా వాళ్ళకి మంట, చిరాకు

మాట్లాడితే ముసలి నస అన్నారు. మాట్లాడకపోతే మరీమంచిదనుకున్నారు .

అహంకారాలు, గర్వాలు, స్వార్ధాలు, గౌరవాన్ని గంగపాలు చేసాయి.

నలభై ఏళ్ళ నా నలుగుడు నల్లపూస అయింది. కరివేపాకు గుర్తొచ్చింది.

చిన్న, పెద్ద ,చిన్న – పెద్ద మాటలతో చిన్నబుచ్చారు.

సలహా ఇవ్వకూడదుట . సందేహం అడగకూడదుట.

మనసు విప్పరు. మల్లె లా ఉండరు.మనిషికి తోడున్నారు కానీ మనసుకి తోడెవ్వరు లేరు.

ఛీత్కారాలు, అయినా అప్పుడప్పుడు సత్కారాలు. ఎందుకో!!!!ఓ...అన్నట్టు సమాజం ఉందిగా..

అందుకేమో!!!!!! అమ్మ అమ్మగా ఉంటే విసుగు . ఎక్కడికి పోతుంది పాశం? పొంగి పొరలనివ్వరు గాని.

ఆఖరి వాడికి అమెరికాలో ఉద్యోగం అంటే ఆహా ఓహో అన్నారంతా.

ఆరేళ్ళయినా ఇంటి మొహం చూడలేదు. దాచినదంతా దారి ఖర్చులకయి పోతుందిట వస్తే.

అమ్మకి బెంగరా అంటే ఉందిగా స్పైపంటాడు.

కాంతానికీ ఓపికతగ్గి చిర్రు బుర్రు మంటూంటే , కూతురు కస్సు మంటుంటే

కొడుకు బుస్సు మంటుంటే,కోడలు కోపగించుకుంటూంటే , అల్లుడు అలుగుతూంటే

మామిడి చెట్టుగా బతకాలని ఆశపడ్డవాడిని, పెరటిలో గెలవేసిన బొంత అరటి చెట్టుగా మిగిలా

పువ్వు, అత్తాలు, ఎప్పుడు కావలిస్తే అప్పుడు కోసుకోవచ్చు. అదే మాదిరి అయ్యింది నే కూడబెట్టిన ఆస్థి....

పువ్వు పుణికి పుచ్చుకున్నారు భేషజాల భోజనానికి

అంతస్తు పెంపుకి ఓ అత్తం, పటాటోపాలకి మరో దినం మరో అత్తం .మళ్ళీ మరోటి.......

ఆస్థంతా అత్తాలయినా బాధ లేదు. ఇదంతా వీళ్ళకోసమే కదా.

ఆశించింది, అడిగిందీ ఒక్కటే....అరగంటైనా దగ్గర కూర్చుని కబుర్లు చెప్పండని

అబ్బే...ప్చ్ ...నెరసినజుట్టు, మాసినగడ్డం, ముడతలుపడ్డ ముఖం....ముచ్చటగా ఎలాఉంటానూ ..

తిరస్కారాలతో ఆదరణ కరువై ,మంచాన పడి పచ్చి మంచినీళ్ళకి పడిగాపులు కాశా.,

సెల్లులు, నెట్లు, ముఖ పుస్తకం, చాట్లు, సీరియళ్ళు, సినిమాలు, నావాళ్ళను నాకు దూరంచేశాయి

నా పుట్టె ముంచాయి. నన్ను వెక్కిరించాయి. మరో ఈ ప్రపంచానికి మారలేను .

మన్నిన నాళ్ళు మరువలేను. మగతగ ఎంతసేపు పడుకోను ?

అందరూ ఉన్నా ,అందర్నీ అందలంఎక్కించినా ,

అదెందుకో మరి ఆఖరి కాలంలో ఆనందం కరువై

అందరికీ భారంగ ఆవేదనే ఆప్తమిత్రుడై

అన్నానికి లోటు లేకపోయినా ఉన్నాదనడానికి

ఉసురు తో ఉన్నా ….ఊసులు కరువైనా

మనసు భారంగా ఉంటే అడుగు ముందుకు పడదు. చతికిలపడతాం

అన్నం ముద్ద గొంతు దిగదు. ఆవేదనకు అంతరాయం ఉండదు.

ఆశ్చర్యం........ఈ స్థితిలో ఆనందకరమైన తీపి పాత జ్ఞాపకాలు కూడా ఏడుపు తెప్పిస్తాయి.

దంతాలు బిగబట్టి ఊపిరి స్థంబించి ఏడుపు దిగమింగినా

కన్నీళ్ళు ధారాపాతంలా వస్తున్నాయి.

దొర్లొచ్చిన బంతి తీసుకోడానికి దగ్గరగ వచ్చాడు నాలుగేళ్ళ నా మనవడు

'''ఎందుకు తాతా ఏడుస్తున్నావు''' కళ్ళు తుడుస్తూ అన్నాడు పక్కన కూర్చుంటూ

పౌత్రోత్సాహం పెల్లుబికింది నాలో. పుత్రపరిష్వంగం కరువైన నాకు

వాడిని అక్కున జేర్చుకోగానే వళ్ళు పులకించింది.

బుడ్డి బుడ్డి అరచేతులు నిమురుతూ అన్నా----

-----------నువ్వు పెద్దవాడివవ్వద్దురా,ఇలాగే ఉండిపో.----

''పెద్ద అంటే కళ్ళజోడు పెట్టుకుంటారూ......అలాగా'' అన్నాడు

వాడి మాటలకి పగలపడి నవ్వా.

*ఇలా నవ్వుకుని ఎన్నాళ్ళయిందో....ఇదే ఆఖరి నవ్వేమో.*

*అవును ఒంటరి తనంతో ఆత్మతో ఆత్మీయత పెంచుకున్నందుకేమో !!!అంశ వెళ్ళిపోతున్నట్లుగ తెలుస్తోంది.*

*ఏదో ప్రేరణ. ఆరేముందు దీపాన్నయ్యా . గబగబ కలం,కాగితం తీసుకున్నా.*

*కాలాకాశాతీత శక్తి ఏదో క్షణంలో ఈనాలుగు మాటలూ వ్రాయించింది.*

*భగవత్కృపకి ధన్యుణ్ణి .*

*అమ్మయ్య........ తృప్తిగ ఉంది .ఏ ఆలోచనలూ లేవు .*

*మనసు చాలా తేలికయ్యింది .తెల్లటి కాంతిలోకి తేలిపోతున్నా .*

*.............ఉంటా ...............*

చదివి వికలించిన మనసుతో రామారావుగారికి ఇస్తే మడిచి పర్సులో పెట్టుకుంటూ అన్నారు...'''' అమ్మా నాన్నలు చాలా మంది పైకి తేలరు సార్.....లోపల లోపలే బాధ పడతారు...మన మనసుకేమీ బాధకలగకూడదని, మనసంసారాల్లో మనం సేండ్విచ్ మధ్య ఉన్న ఛీజ్ కాకూడదనీని... సద్దుకుపోతూంటారు...అర్ధం అయిందనుకుంటా మీకు....

మనం అక్కడినుంచి డబ్బు పంపిస్తున్నాం, వంట మనిషి ఉంది, పని మనిషి ఉంది, నర్సు ఉంది, ఓల్డేజ్ హోమ్ లో పెట్టలేదుగా అని సరిపెట్టుకుంటాం... కానీ ఆ ఇల్లే ఓ గ్లోరిఫైడ్ ఓల్డేజ్ హోమ్ అనుకోము... కనీసం ఏడాదికోసారైనా రాము...డబ్బులయిపోతాయి....మనవలు మనవరాళ్లు దూరం అయిపోతున్నారని అనుకోం.... ఓ సారి మా అబ్బాయి పుట్టాక మూడేళ్ళకి ఫస్ట్ టైము ఇండియా వచ్చినపుడు మా అమ్మ మనవణ్ణి దగ్గరకి తీసుకుంటే " వై షి ఈజ్ టచింగ్ మి" అన్నాడు....అదీఅబ్బుతున్న సంస్కారం...అమ్మ పక్కకి తిరిగి కళ్ళు తుడుచుకుంది

ఇక్కడకి తిరిగి వచ్చాక తెలిసొచ్చింది సార్...మన సేవింగ్సుతో వచ్చే వడ్డీ డబ్బులతో ఇక్కడ జీవితం హాయిగా సుఖంగా పనివాళ్లని పెట్టుకుని ...అక్కడి కంటే ఆనందంగా...సుఖంగా మనవాళ్ల మధ్య...బతికెయ్యచ్చని.

మేము ఇక్కడికి అమ్మదగ్గిరకి వచ్చేసాక మా అమ్మ ఆరోగ్యం చాలా మెరుగయింది సార్....అవే మందులు...కొన్ని

మందులు తగ్గించేశాం కూడానూ...వయసుభారం వల్ల మంచంమీదే కాలక్షేపం చేస్తోంది.. అంతే....ఆవిడకిపుడు తొంభై ఏళ్ళు..దూరంగ ఉన్నా సుఖంగా ఉంటే చాలు అని సంతోషిస్తుంది అమ్మ... కాని దగ్గరుంటే ఆనందపడిపోతుంది సార్....

ఉంటారు సార్, కొంతమంది.... కొంతమందేమిటి, చాలామంది అత్తా కోడళ్ళు ఈగోలతో, పొసెసివ్ నెస్ తో..

మిస్ అండర్ స్టేండిగులు, మిస్ కమ్యూనికేషనులతో....

...కలిసి పోయే కోడళ్లూ ఉంటారు, నన్ను ముట్టుకోకు నామాలకాకి లాంటి వాళ్లూ ఉంటారు.. కాని మనం అమ్మకివ్వాల్సిన ఆదరణ ఆప్యాయత ప్రేమ ఇస్తే, అమ్మ సద్దుకుపోతుంది సార్....మనసులో ముళ్లుగుచ్చుకుంటున్నా....

....మనమందరం గులాబి పూసిన రెమ్మలం...ముళ్లూ ఉంటాయి..ఆహ్లాదం కలిగించే రోజా పువ్వు ఉంటుంది రెమ్మకి...అవతలి వాళ్లు బతికి ఉన్నన్నాళ్లు వాళ్ళలో ఉన్న ముళ్ళలాంటి నెగెటివిటీనే చూస్తాం....వాళ్ళు పోయాక గులాబి లాంటి మంచిని అప్పుడు తలుచుకుంటాం...ఏడుస్తాం అప్పుడు....ఏమిటి ఉపయోగం...మా నాన్న మనశ్శాంతి పోగొట్టుకుని వ్రాసుకున్న నాలుగుమాటలు, నాకు మనశ్శాంతిని ఇవ్వడానికి తోడ్పడ్డాయి. సరే వస్తా, మళ్లీ కలుద్దాం""

రామారావుగారు లేచి పర్సు పేంటు జేబులో పెట్టుకుంటూ అడిగారు....ఏమిటి ఎవరికో మెస్సేజ్ కొడుతున్నట్టున్నారు సెల్ లో..... ....ఆయన చెప్పినదంతా విని చెమరిన కళ్లు తుడుచుకుంటూ మెసేజ్ ఇస్తూంటే అడిగారు....

“ అవును సార్, మా ఆవిడకి..."

"తలుపేసుకోండి" వెళ్లిపోతూ అన్నారు రామారావుగారు....నా తలుపులు తీసి...

..... లక్ష్మీ, రీచ్డ్ సేఫ్లీ, మామ్ ఈజ్ ఫైన్..

వుయ్ ఆర్ గోయింగ్ టు మువ్ టు ఇండియా ఫర్ గుడ్...ప్లీజ్ బి రెడీ..అండ్ స్టార్ట్ ప్రిపరేషన్స్....ఐ షల్ కాల్ యు సూన్....బై...ఐ లవ్ యు

(లక్ష్మికి తెలుగు వచ్చు కాని మాట్లాడదు తెలుగులో....అందుకే ఇంగ్లీషులో సంభాషణ ఎప్పుడూ....

క్షేమంగా చేరా...అమ్మ కులాసా..మనం ఇండియాకి షిఫ్ట్ అయిపోతున్నాము.. .

....రెడీగా ఉండు...ఆ ఏర్పాట్లు మొదలు పెట్టు...తరవాత ఫోన్ చేస్తా....బై... ఐ లవ్ యు..)....

# మరదలి కష్టం – బావ సాయం ఆర్.సి.కృష్ణ స్వామి రాజు

వారంగా ఒకటే వాన.

ఊర్లు ఊర్లన్నీ తడిసి ముద్దయినాయి. కాలువల్లోని నీళ్లు దొర్లుకుంటూ చెరువులు చేరినాయి. చెరువులు నిండి కలుజులు పారినాయి.

"ఒరేయ్ కొడుకా, ప్రాయానికి వచ్చిన కొడుకు గెడ్డం మీసం గొరగకుండా తిరగతా ఉంటే, ఊర్లో ఆడోళ్ళంతా తలా ఒక మాట అనుకుంటారురా నాయనా! రెండు వారాలుగా వాన పడతానే ఉంది. ఆగేట్లుగా లేదు. వాన నిలిచినాక తిరుపతి కెళ్ళి కటింగ్ చేసుకుంటానని వాయిదాలు మీద వాయిదాలు వేస్తా ఉండావు. ప్రస్తుతానికి మన ఊరి గణేశం దగ్గర కటింగ్ చేయించుకోకూడదా" అని నిష్టూరమాడింది పుష్పరాజ్ అమ్మ.

మెకానికల్ ఇంజనీరింగ్ లో డిప్లొమా చదివి ఉద్యోగాల వేటలో ఉన్నాడు పుష్పరాజ్.

అమ్మ పోరు పడలేక లుంగీ ఎగ్గట్టుకుని చిన్నగా అడుగులో అడుగు వేసుకుంటూ బయలుదేరినాడు.

పోతూపోతూ చొక్కా జేబులోని దువ్వెనతో తలని, మీసాలను ఒకటికి రెండుసార్లు దువ్వుకున్నాడు.

తూర్పు వీధిలో ఉండే గణేశం ఇంటికి పోయినాడు.

పుష్పరాజ్ ని చూసిన గణేశం ముఖం తిరుపతి కొండ గుండులా మిలమిలా మెరిసిపోయింది.

" పుష్ప రాజ్ అన్నా!

తిరుమల కొండ పైన కల్యాణ కట్టలో ఉద్యోగం వస్తుందన్నా నేను వెళ్లలేదన్నా. నేను ఊరు వదిలి వెళ్లి పోతే ఊర్లో వాళ్ళకి ఎవరు కట్టింగ్ చేస్తారు? పెండ్లిళ్లకు మేళం ఎవరు కొడతారు? చావులప్పుడు, కర్మక్రియలకు రేవు కాడ మగ వారికి గెడ్డాలు, మీసాలు ఎవరు గొరుగుతారు? అని ఆలోచించి ఆలోచించి ఎక్కడికీ పోకుండా మన ఊర్లోనే పని చేసుకుంటా ఉండాను.

అయినా నీకు తెలుసో లేదో, నా శిష్యులే ఇప్పుడు తిరుపతిలో పెద్ద పెద్ద ఏర్ కండిషన్ సెలూన్లు పెట్టి లక్షలు సంపాదిస్తా వుండారు. ఈ నాటికీ, వారికి కట్టింగు విషయం ఏదైనా డౌటు వస్తే నాకు ఫోన్ చేస్తారు. అంతెందుకు,

తిరుపతి చుట్టుపక్కల సినిమా షూటింగ్ లు జరిగితే యాక్టర్లకు కటింగ్ షేవింగ్ లకు కారు పెట్టి నన్నే తీసుకుని వెళతారు. నా దగ్గర ఒక్కసారి కటింగ్ చేసుకో, జీవితంలో నన్ను మర్చిపోవు" అని ఎగిరెగిరి చెప్పినాడు.

'ఒక్కసారి ఛాన్సు ఇచ్చి చూద్దాం' అని గణేశం చేతికి తన తల ఇచ్చినాడు.

గణేశం ముసిముసి నవ్వులు నవ్వుతూ, కొత్త టవల్ కప్పి, కొత్త బ్లేడు వాడుతున్నట్లు చూపించి పని ప్రారంభించినాడు.

అదీ ఇదీ మాట్లాడుతూ ఉన్నాడు గణేశం. గణేశం దగ్గర కటింగ్ చేయించుకుంటున్న పుష్పరాజ్ వైపు ఓర ఓర చూపులు చూస్తూ వెళ్ళినారు పదవతరగతి వరకు తనతో చదివిన పొట్టేలు పద్మ, విక్స్ వసంత.

వాళ్ళకి ఆ పేర్లు ఎలా వచ్చాయంటే ..... పద్మ వాళ్ళ నాయన పొట్టేళ్ల వ్యాపారం చేస్తాడు కాబట్టి ఆ పద్మ పొట్టేళ్ల పద్మ అయ్యింది. చీమిడి ముక్కుల విమల ఎప్పుడూ స్కూలు బ్యాగులో విక్స్ పెట్టుకు రావడంతో విక్స్ విమల అని పిలవడం గుర్తుకొచ్చి ముసిముసి నవ్వులు నవ్వుకున్నాడు పుష్పరాజ్.

వీధిలో నిలబడి వున్న ఎద్దు మీది పుండును, కాకి ముక్కుతో పొడుస్తోంది. చిత్త కార్తి కాకపోయినా కుక్కలు గుంపుగా పరుగులు తీస్తున్నాయి.

ఎఫ్. ఎమ్ రేడియో లో "బుట్ట బొమ్మా ... బుట్ట బొమ్మా" సినిమా పాట జోరుజోరుగా వస్తోంది. కళ్ళు మూసుకుని పొట్టి పావడ వేసుకుని డ్యాన్సు చేస్తున్న హీరోయిన్ ని గుర్తు తెచుకుంటూ చిరునవ్వులు చిందిస్తూ ఉన్నాడు పుష్పరాజ్.

పాట అయితే పసందుగా వినిపిస్తోంది కానీ, కత్తెర శబ్దం ఆగిపోయింది. ఏమయ్యిందని కళ్ళు తెరిచి చూస్తే గజగజ వణుకుతూ వున్న గణేశం కనిపించాడు. ఏమయ్యిందని తల తిప్పుతూ ఉంటే అద్దంలో తెగి వున్న మీసం కనబడింది. 'క్యార్' అన్నాడు. అక్కడే వున్న కత్తి తీసుకుని గణేశం పొట్టలో ఆరేడు సార్లు పొడిచిన చోట పొడవకుండా పొడవాలనుకున్నాడు.

'హత్యా నేరం కింద పోలీసులు కేసు బుక్ చేస్తే గవర్నమెంట్ ఉద్యోగాలు రావు కదా' అని భయపడి గమ్మున వుండిపోయాడు.

అర మీసం బాగుండదని చెప్పి పూర్తి మీసం తీయించేసుకుని చకచకా ఇంటి వైపు నడిచాడు. ఊర్లో ఎవరైనా చూస్తే బాగుండదని కర్చీఫ్ అడ్డం పెట్టుకుని వేగంగా నడిచి పోతున్నాడు.

'అయినా.. ఈ నాలుగు ఊర్లల్లో నేను ఒక్కడినే కదా అందగాడిని.

మీసాలున్నా అందగాడినే...మీసాలు తీసేసినా అందగాడినే. ఎంతో మంది హిందీ హీరోలకు మీసాలు వుండవు కదా, వాళ్ళు అందంగానే కనబడతారు కదా' అని తనకు తాను సర్ది చెప్పుకున్నాడు.

పుష్పరాజ్ మరదలు వారి ఇంటి ముందర తిన్నె పైన కూర్చుని వుంది. తెల్ల పావడ, టమోటా ఎరుపు పైట, జాకెట్టు వేసి ముద్దబంతి పువ్వు తలలో పెట్టి టెక్స్ట్ పుస్తకం ఒకటి చేతిలో పెట్టుకుని వుంది. మరదలిని పుష్పరాజ్ ముద్దుగా 'అమ్మి' అని పిలుచుకుంటాడు.

మీసాలు లేని ముఖం ఆ అమ్మికి కనబడకుండా, మరింత గట్టిగా కర్చీఫ్ ని ముక్కుకు అడ్డంగా పెట్టుకున్నాడు.

ఎవరి ఇంటిలోనో కోడి కూర ఉడుకుతోంది. కూర ఉడికేటప్పుడు వచ్చే ఘుమఘుమలాడే మసాలా వాసనకు పెద్ద తుమ్ము ఒకటి వచ్చింది.

'హచ్' అంటూ గట్టిగా తుమ్మాడు. చేతిలోని కర్చీఫ్ జారి కింద పడింది. మీసాలు లేని పుష్పరాజ్ ని చూసిన ఆ అమ్మి కిసుక్కున నవ్వింది. కోపమొచ్చింది పుష్పరాజ్ కి .

చుట్టు పక్కల రాయి ఏమైనా దొరుకుతుందేమోనని వెదికినాడు. రాయి దొరకలేదు. పక్కనే జామ చెట్టు కనబడింది. ఒక జామకాయను పెరికి ఆ అమ్మి పైన విసిరినాడు. ఆ అమ్మి పకపక నవ్వుతూ ఇంటిలోకి పరిగెత్తింది.

జామకాయ నేరుగా వెళ్లి తిన్నె పక్కన వున్న తెల్ల కుక్క పైన పడింది. అది 'కుయ్ కుయ్' అని అరిచింది. అంతే....వెదురుకర్ర ఒకటి అందుకుని కుక్కని తరిమితరిమి కొట్టాడు.

ఆ అమ్మి ఇంటికెళ్లి గొడవ చేస్తే 'పోరా, పేడి ముఖం వాడా' అని తిడుతుందేమోనని భయపడినాడు. 'మనకి టైం బాగా లేదు. లేకుంటే తిరుపతి ఏర్ కండిషన్ సెలూను లో మంచి ఆడియో, వీడియోల మధ్య అందాల భామల చేత కటింగ్ చేయించుకోవాల్సిన వాడిని... ఇలా గణేశం చేతిలో ముచ్చటైన మీసాలకే మోసం తెచ్చుకోవల్సి వచ్చింది' అని తనలో తానే కుములుతూ ఇంటికి చేరినాడు.

మీసాలు లేని కొడుకును చూసి 'నా కొడుకు మీసాలు ఉంటే మండలానికి అందగాడు, మీసాలు లేకుంటే జిల్లాకి అందగాడు కదా' అని పుష్పరాజ్ అమ్మ మురిసిపోయింది.

స్నానం చేస్తూ తొట్టె నీళ్ళల్లో మీసాలు లేని ముఖాన్ని చూసుకుంటూ వెక్కివెక్కి ఏడ్చినాడు. పిచ్చుక స్నానం లాంటిది చేసేసి దిగులుగా కూర్చున్నాడు.

మనసు మనసులో లేదు. మీసాలు పోయినాయని బాధ... మరదలు నవ్విందని కోపం...
'మీసమే పసందు మగముఖానికి' అనుకుంటూ అయిదు నిమిషాలకొకసారి అద్దంలో చూసుకుంటూ 'రెండు మూడు వారాలు పడుతుందేమో మీసాలు నిండుగా రావాలంటే' అని బాధపడ్డాడు. 'మిలమిలలాడే మీసాలు మళ్ళీ రానీయ్, ఆ అమ్మిని ఒక ఆట పట్టిస్తా' అని తనకు తానే సర్ది చెప్పుకున్నాడు. గోడ మీది సినిమా హీరోయిన్ క్యాలెండర్ తీసి పేనా తో హీరోయిన్ ముఖానికి పొడుగాటి మీసాలు పెట్టినాడు.

"పిడికెడు అన్నం తినరా కొడుకా" అని అమ్మ అడిగితే ఆకలి కాలేదని చెప్పి, దుప్పటి కప్పుకుని నిద్రపోయాడు.

xxxxxx

పుష్పరాజ్ వాళ్ళ కోడి మాత్రమే కాదు, ఊర్లో కోళ్లు కూడా వరుస బెట్టి కూసాయి.

' తెల్లారింది, లెయ్ లెయ్' అని తట్టి లేపింది  అమ్మ.

రెండు అర చేతులూ బాగా రుద్దుకుని చేతుల్లో వేడి పుట్టాక కళ్ళ మీద పెట్టుకుని అర చేతులు చూస్తూ వున్నాడు.

" ఇప్పుడే మీ మేనత్త వచ్చి పోయిందిరా. వానలకి మన ఊరి ఏటి కాలువ కల్వర్టు కొట్టుకు పోయిందంట. కాలువ దాటి ఆ పక్కకి వెళితే కానీ షేర్ ఆటో లు దొరకవు. ఆ అమ్మికి తిరుపతిలో ఎంసెట్ పరీక్ష ఉందంట. ఎట్లైనా ఆ అమ్మిని పరీక్షకు పోయేట్లుగా చేయమని అడిగిపోయింది"

కోపంగా పుష్పరాజ్ లేచి “అమ్మా, ఆ అమ్మికి టెక్కు బాగా పెరిగిపోయింది. నిన్న.. నా మీసం లేని ముఖం చూసి కిసుక్కున నవ్వింది. ఆ అమ్మికి సాయం చేయనుగాక చేయను” అని చెప్పినాడు.

“పెండ్లికి పిలిస్తే పోవాలి

చావుకు చెప్పక పోయినా పోవాలి

ఊర్లో అందరితో కలిసిపోవాలి

ఆడబిడ్డకు కష్టం వచ్చిందంటే ముందు ఉండాలి” అని చెప్పి కొడుకును లేచి పని చూడమని చెప్పింది.

అమ్మ మాట కాదనలేక, ఎక్కడో మనసు లోలోతు పొరల్లో మరదలి మీద ప్రేమ తొంగి చూడడంతో ‘సాహసం చేయరా డింభకా’ అనుకుంటూ ఊరి పొలిమేర్ల వైపు నడిచినాడు.  గబగబా చెరుకు తోటల గుండా కాలువ కాడికి పోయి నిలబడినాడు. కాలువ పక్కనున్న తాటి చెట్లను చూసినాడు. ‘ఒక తాటి చెట్టును పెరికి కాలువలో వేస్తాను. ఈ  గట్టు నుంచి ఆ అమ్మి దాని పైన నడుచుకుంటూ ఆ గట్టు పైకి వెళ్ళిపోతుంది’ అనుకుని తాటి చెట్టును పట్టుకుని ఊగించినాడు. అది అణువు కూడా కదలలేదు. ‘ఇదేందబ్బా, మొన్న బాహుబలి సినిమాలో ప్రభాస్ తాటి చెట్లతో ఆడుకున్నాడు కదబ్బా! మనకెందుకు కదలడం లేదు’ అని తలెత్తి తాటి చెట్టు పైకి చూసినాడు.   తాటికాయల మధ్యలో నుంచి సన్నటి తాటిపాము ఒకటి తొంగి కసికసిగా చూసింది. ‘బ్యార్’ అంటూ ఎగిరి పడినాడు.

ఇంతలో తాటి ఆకులతో గూడ చేసుకుని వాన పడకుండా  తలపైన పెట్టుకుని కాలవలో నీళ్లు ఎట్ల పారతా వుండాయో చూద్దామని అక్కడికి  వచ్చినాడు  నల్లబ్బ.

నల్లబ్బ అసలు పేరు నాగేంద్రుడు అయితే, తారు కన్నా నల్లగా ఉంటాడని ఊర్లో వాళ్ళందరూ నల్లబ్బ  అని పిలుస్తారు. అతడిని  అలా పిలిచినా ఏమీ అనుకోడు. "నలుపు నారాయణుడు మెచ్చు, ఈ  ఊర్లో వాళ్ళు నల్లబ్బను మెచ్చు"

అని అందరికీ చెబుతుంటాడు. అట్టాంటి నల్లబ్బ అంత వానలో కూడా ముఖానికి పిడికెడంత తెల్ల పౌడర్ పూసుకుని, తెల్ల పంచె, తెల్ల చొక్కా వేసుకుని అక్కడికి వచ్చినాడు.

ఆముదం తాగిన వాడి మాదిరి ముఖం పెట్టిన పుష్పరాజ్ విషయమంతా చెప్పినాడు. మరదల్ని ఎట్లయినా ఎంసెట్ పరీక్షలకు పంపించాలన్నాడు.

తాటి చెట్టు కథ విన్న నల్లబ్బ పడీపడీ నవ్వినాడు. "మీ చదువుకునే పిలకాయలకు తాటి ముంజలు తిననే సరిగా రాదు, అట్టాంటిది తాటి చెట్టు పెరక గలరా ? మీసాలు వచ్చేటప్పుడు దేశాలు కాన రావని పెద్ద వాళ్ళు ఊరకే చెప్పలేదు. ఇవన్నీ నాకంటే చెప్పినావు, ఊర్లో ఇంకెవ్వరికీ చెప్పబాక. తిట్టిన తిట్టు తిట్టకుండా తిడతారు.

సరే కానీ పుష్పరాజా... నాకొక ఆలోచన వచ్చింది. మొన్న ఇంటి పని జరగతా వుండి పెద్ద పెద్ద ప్లాస్టిక్ తాడులు తెచ్చినాను. వాటిని కట్టి ఈ పక్క నేను, ఆ పక్క నువ్వు పట్టుకుని నిలబడినామంటే నీ మరదలు చిన్నగా తాడు పట్టుకుని, ఈ పక్కనుంచి ఆ పక్కకి దాటేస్తుందిలే. మోకాళ్ళ లోతు మాత్రమే నీళ్లు పారుతున్నాయి. గబుక్కున నీళ్ల ప్రవాహం ఎక్కువైతే మనం ఒకరికి ఇద్దరం వున్నాం కదా, నీళ్ళల్లో కొట్టుకుపోకుండా కాపాడుదాం" అని ధైర్యం చెప్పినాడు. సరసరా ఇంటికి వెళ్లి ప్లాస్టిక్ తాడులు తెచ్చి ముడివేసినాడు.

సన్నగా వానజల్లులు పడుతున్నాయి. కాలువ పక్కన వున్న చింత చెట్లు గాలికి దయ్యాలు లెక్కన ఊగుతున్నాయి. దూరంగా పొలాల్లోని కప్పలు బెకబెకమని అరుస్తున్నాయి.

తాడు పట్టుకుని కాలువకు ఆ పక్క ఒకరు, ఈ పక్క ఒకరు నిలబడి ఉన్నారు. చిన్నగా "ఘల్ ఘల్" మని గజ్జెల శబ్దం రావడంతో ఆ అమ్మి వచ్చిందని పుష్పరాజ్ తెలుసుకున్నాడు. మళ్ళీ నవ్వులపాలు కాకూడదని కుర్చీఫ్ ని మూతికి చుట్టుకున్నాడు. ఆ అమ్మి ముందర కొంచెం టెక్కు చూపాలనుకున్నాడు. తలెత్తి చూడలేదు కానీ, ఆ అమ్మి వచ్చేది ఓర కంటితో చూసినాడు. పుష్పరాజ్ చూడనప్పుడు ఆ అమ్మి అతడిని చూసేది. వారిద్దరి దొంగ చూపులు చూసిన నల్లబ్బ ముసిముసి నవ్వులు నవ్వినాడు.

చిన్నగా తాడు పట్టుకుని కాలువ దాటేసింది. 'కనీసం థ్యాంక్స్ కూడా చెప్పలేదు, ఈ అమ్మికి బాగా పొగరు పట్టిపోయింది' అని మనసులో తిట్టుకున్నాడు. ఆ అమ్మి అవేమీ పట్టించుకోకుండా సర్రుసర్రున నడుచుకుంటూ వెళ్ళింది.

నేల మీద వున్న ఒక చిన్న గులకరాయిని తీసి ఆ అమ్మి పైన గురి చూసి వేయాలనుకున్నాడు. 'పరీక్షలకు పోతా వుంది కదా, మనం ఏమైనా చేస్తే వ్రత భంగమవుతుందేమో' అని కన్నార్పకుండా ఆమెనే చూసినాడు.

పొలాల మధ్యన వున్న దారి చివరి వరకు ఆ అమ్మి వెనక్కి తిరిగి చూడలేదు.
దారి మలుపు తిరుగుతుండగా, సర్రున షేర్ ఆటో ఒకటి వచ్చి నిలిచింది. అప్పుడు... ఆ అమ్మి వెనక్కి తిరిగి చూసింది.

ఆ చూపులకు పుష్పరాజ్ మనసు ఆకాశమంత ఎత్తు ఎగిరింది. చిన్నగా కుడి చేతితో 'టాటా' చెప్పి, ఆటో లో తుర్రుమని వెళ్ళిపోయింది.

ఆనందంతో గిరగిర తిరుగుతూ నీళ్ళలోకి దూకినాడు. రెండుమూడు మునకలేసి, గబగబా పైకి లేచి వచ్చి ప్లాస్టిక్ తాడు కు ముద్దులు పెట్టి మళ్ళీ నీళ్ళలోకి దూకినాడు. కాలువ లోని నీళ్లు ఎగిరి నల్లబ్బ ముఖం పై పడినాయి. మెరిసిపోతున్న పుష్పరాజ్ ముఖాన్ని చూసిన నల్లబ్బ పకపక నవ్వుతూ తను కూడా నీళ్ళలోకి దూకినాడు.

ప్రాక్టీస్ లో భాగంగా గణేశం ఊరి గుడి కాడ సన్నాయి ఊదుతున్నాడు.

సన్నాయి రాగం తెరలుతెరలుగా వినిపిస్తోంది.

## బాల్చీ తన్నేసింది

విప్పగుంట రామ మనోహర

"ఏమీ చేయాలని లేని, ఏమీ తోచని ఎదో ఒక సాయంత్రం". నా కవితావాక్యమే... మెదిలింది. కానీ ఇది సాయంత్రమూ కాదు అలాగని మధ్యాహ్నమూ కాదు. కవితలోలాగా పాట ఏదీ కూడా ఇటొచ్చి అటు వెళ్లనూ లేదు. ఇంట్లో అందరూ నిద్ర... మధ్యాహ్నం నిద్రని నిద్ర అంటారా.. కునుకు అంటారా లేక న్యాప్ అంటారా. ఏమో ఎదో ఒకటి. ఎండ వేడికి సాయంత్రం నాలుగయినా మధ్యాహ్నమే. ఇల్లు వేడి గా ఉంది. ఉక్క. ఏసీ వెయ్యాలని లేదు. బిల్లుకంటే ఏసీ చేసే చెడే ఎక్కువ. నిజమా..

ఏమీ చెయ్యాలని లేదు. ఇలాంటి ఎండాకాల మధ్యాహ్న- సాయంత్రాలెన్నో ఒకేసారి గుర్తొచ్చాయి. Déjà vu. ఇది మునుపటి అనుభవం లాగే ఉంది. ఓ సందిగ్ధావస్థ. జీవితంలో ఎన్నో చెయ్యాలనీ, చేసెయ్యాలనీ, చేసేసి ఉండాలని .. అన్నీ ఒక్కసారే అనిపిస్తాయి. అసౌకర్యంగా ఉన్నప్పుడే నా ఉనికి నాకు గుర్తొస్తుందేమో. ఆపదొచ్చినప్పుడే తిరుపతి వెంకన్నకు మొక్కినట్లు. నేను చేయనివి , చేయలేనివి, చేయగలిగీ వాయిదా వేస్తున్నవీ అన్నీ ఒక్కసారే ఉక్క పోయిస్తాయి. కూచుంటే కష్టం. ఈ ఆలోచనల వడగాల్పుల్ని లేచి ఎదిరిస్తేనే, లేకపోతే నన్ను లోలోపలే కాల్చేస్తాయి. లేచి హాల్లోకి వచ్చా.

మూలన పాత పుస్తకాల షెల్ఫ్. నాన్నది. దానికో కథ ఉంది. మరచి పోతే కదా గుర్తుకి రావడానికి. ఎన్ని సార్లు...అందుకే ఆ తలపుని చటుక్కున మూసేశా. దాని తలుపు తెరవకా చాలా రోజులయ్యింది. భయం. భయమంటే భయమే. తెరవగానే భళుక్కున పాత పుస్తకాలు పాత వాసనతో, 'వాసనల'తో మీద పడతాయి. జీవితంలో చేయనివీ– చేయలేనివీ లాగే, చదవనివీ– చదవలేనివీ చాలానే ఉన్నాయి అందులో. పుస్తకాలైనా, జ్ఞాపకాలైనా. ఈ మధ్య కరోనా ఒకటి మన ప్రాణాలకి. దగ్గినా తుమ్మినా అదేనని. జలుబోస్తే చాలు ముక్కులో ఆర్ టీ పీ సీ ఆర్ పుల్ల పెట్టి తుమ్మి, రెండ్రోజులు దాని రిజల్ట్ కోసం బిక్కుబిక్కుమని ఎదురు చూడాలి. పాత పుస్తకాలు తాకితే, ఆగని జ్ఞాపకాల్లా, ముక్కులు రెండూ జారునా భోరునా కారుతాయి అలర్జీ వల్ల. ఈ అలర్జీల వల్ల నీకు వాక్సిన్ వేయంపో అంటారేమో. అటూ ఇటూ చూసి మాస్క్ వేసుకుని ఓ పుస్తకం తీశా. ఎప్పుడో రెండు పేజీలు చదివి, చదివేసినట్లు పది మందికి ప్రచారం చేసుకున్న పుస్తకం అది. కనెక్టింగ్ ది డాట్స్. పుస్తకం బాగా ఘాటు గా ఉంది. చదవనివన్నీ ఎంతో విలువైనవని అనిపిస్తాయి. నక్క కథకు వ్యతిరేకం గా. అవే ఘాటు గానూ గాఢమ్ గానూ ఉంటాయి. తీసుకుని మిద్దె పైకి వచ్చా.

మిద్దె. దీని గురించి ఎంత చెప్పినా తక్కువే. కాలిన మిద్దే, ఇప్పుడు నాకది ఒయాసిస్సు. గాలి వీస్తోంది. సాయంత్రం అయినట్లు అనిపించింది. అయిందా.. అయినట్లు అనిపించిందా. లోపలి ఉక్కపోత కొంచెం తగ్గింది. ఆలోచనల పోత కూడా. అంతే. క్షణ క్షణానికీ మనకో దారి దొరుకుతూనే ఉంటుంది. తప్పించుకు తిరగడానికీ, ధన్యులవడానికీ. దాన్ని స్ట్రాటజీ అనో, ఫైండింగ్ సొల్యూషన్ అనో, ఆల్టర్నేటివ్స్ ని వెదకడమనో.. ఏదో ఓ థీరీ లోకి ఇరికించి గిరీశం చెప్పినట్లు ఘంటసేపు లెక్చర్ దంచొచ్చు. ఏదైతేనేం ఇది చాలసార్లే అనుభవం. చుట్టూ ఉన్న పరిస్థితులు మనసుని ప్రభావితం చేస్తాయని అనుకున్నా. పెద్దన ఊయల మంచం, ప్రియదూతిక చేతి కప్పురవిడెము కవిత్వాన్నిస్తాయని అన్నాడంటే అనడూ. కడుపు మండితే కేకలూ కూతలూ, నిండితే కోకల రైకల కైతలు..

పక్కింటి మిద్దె నీడ ఓ మూలన పడుతోంది. పేరుకి నీడే, కాలి కాలి సెగ. అయినా ఇంటికంటె మిద్దె పదిలం అనుకున్నా. రెండు ప్లాస్టిక్ కుర్చీలు లాగి ఓ దాని మీద కాళ్ళూ ఓ దాని మీద కాయం వేసి కూర్చున్నా... డాట్స్ కనెక్ట్ చేద్దామని. మాస్క్ పెట్టుకుని ఉన్నాకూడా ఘాటు తెలుస్తోంది. ఇక తీస్తే చుక్కలు కనిపిస్తాయేమో. పేజీలు తిప్పా. ఒకటీ రెండు పేరాలు... చదివినట్లే ఉన్నాయి. ఏమి చదివానో చెప్పమంటే చెప్పలేను. అదేం ప్రశ్న. అవమానమా అనుమానమా. ఇలాగే ఉంటుంది. విషయ పరిజ్ఞాన యుగం ..లో ఏదీ తెలీదు కానీ తెలిసినట్లే ఉంటుందని చాల సార్లు అనుకున్నా. నిన్ను

నువ్వు తెలుసుకో అన్నాడట వెనకటికెవడో. అవసరం ఏముంది. గూగుల్ని తెలుసుకో. చాలు. నీ నోట్లో ముద్దలు పెట్టడమే కాదు తినిపిస్తాడు కూడా. అడ్డంగా నిలువుగా పైకీ కిందికీ చదివేసి నీకు కావాల్సినదే నీకు చూపిస్తూ ఓహ్.. నీ మెదడు లో దూరి నీకు తెలీకుండా నీ ఇష్టాఇష్టాలతో వాడు వ్యాపారం చేస్తున్నాడు. అయితే తప్పేంటి? నాకంతా ఫ్రీయే గా ... సరే... లెట్ మీ కనెక్ట్ ది డాట్స్.

పుస్తకం జాన్ ఛాంబర్స్ రాశాడు. సిస్కో కంపెనీకి అత్యంత శక్తిమంతుడైన సి.ఈ.ఓ. గతం లో ఏమి చదివానో గుర్తొచ్చీ రానట్లుంది. మొదటి పేజీ తీశా. ముందు మాట. నీ గురించి పుస్తకం రావడానికి సరైన సమయం నువ్వు చచ్చాకే అని నమ్మేవాడిని ఈ పుస్తకం ఎందుకు రాశాను అని మొదలెట్టాడు జాన్. ఎత్తుగడ బాగుంది. ఓహ్. ఒక్క లైన్ చాలు. ఎందుకు రాశాడబ్బా అని చదివే ఆదుర్దా కంటే సాహిత్యసభల్లో ఎవడి అచ్చు వాడే వేసుకుని పుస్తకాలు ఇచ్చేసుకుని పుచ్చేసుకునే నాబోటి వాళ్ళంతా కళ్ళల్లో మెదిలారు. నా పుస్తకాన్ని జాన్ కి కూడా ఇస్తే బాగుణ్ణు. ఏమిటో ప్రతి దానికీ మనసు ఇంకొ వైపే లాగేస్తోంది. సరే మళ్ళీ జాన్ వైపు మళ్ళించా. తనో శక్తివంతమైన సీ.ఈ.ఓ. అయితే అతనికి డిస్లెక్సియా ఉందట. అబ్బా..ఈ సారి ఏ కాలేజీకైనా వెళ్లి లెక్చర్ దంచుతూ ఈ విషయం చెప్పొచ్చు అనుకున్నా. ఎంత కష్టాలున్నా జీవితంలో సక్సెస్ ఎలా సాధించాలి అని అడిగి జాన్ ఉదాహరణ చెప్పొచ్చు అనుకున్నా. సక్సెస్ కి ఇదో ఎన్నో మెట్టబ్బా అని అందరూ అబ్బుర పడతారు. చప్పట్లు కొడతారు. వెంటనే డిస్లెక్సియా అంటే ఏంటి..అదో బుద్ధి వికాసానికి సంబంధించిన సమస్య అని చూచాయగా తెలుసు. సమస్య అదే. అన్నీ ఇంతే .. కొంచెం తెలుసు కొంచెం ముసుగు. తలుపు సందుల్లోంచి చూస్తె కొద్దిగా కనపడి మిగతాది ఊహ రగిలినట్లు. కొంచెం నిప్పు కొంచెం నీరు.. పాట హమ్ చేశా.. నువ్వేన్నన్నా చెప్పు ఆ సినిమాలే వేరు ఆ పాటలే వేరు బొంబాయి హీరోయిన్ల తీరే వేరబ్బా. కానీ ఇదే ప్రశ్న కాలేజీ కుర్రాళ్ళు వేస్తే? ఏం అమ్మాయిలూ అడగొచ్చు గదా. ఎహే, నన్ను అమ్మాయిలు ఎందుకు అడుగుతారు నేనేమైనా రాహుల్నా గాంధీనా. సరే ఎవడడిగినా స్టేజీ మీద తెల్లమొహం వెయ్యాలి. వెంటనే వేళ్ళల్లో ఏదో కదలిక గమనించా. గూగల్ మీదకు వేళ్ళు పోవాలనే గుల గుల .. కానీ సెల్ ఫోన్ రూంలోనే పెట్టి వచ్చానే. వేళ్ళు సన్నగా వణుకుతున్నాయి. విత్డ్రాయల్ సింప్టమ్స్... ఒక్కసారి గుండె ఝల్లుమంది. సెల్ ఫోన్ కీ , డేటాకీ దూరంగా నేను.. అదీ చేతిలో పుస్తకంతో...ఈ నగరానికేమైంది.. నాకేమైంది.. ఏమిటీ వింత, ఎదో వెలితి. తప్పు జరిగిపోయింది యువరానర్.. గిల్టీ ఫీలింగ్. సరేలే

ఒక్కోసారి ఇలాంటి అనుకోని సంఘటనలు జరగడమే జీవితం అంటే... కోటబుల్ వాట్సాప్ కోట్. కాగితాలు రెప రెపలాడాయి గాలికి... చేతివేళ్ళ వణుకు వల్ల కాదు.

ఈ సారి కొంచెం శ్రద్ధ పెట్టి ఓ పేజీ చదివా. తన గురించిన పుస్తకం బతికుండగానే ఎందుకు రాయాలనిపించిందో, మనసెందుకు మారిందో జాన్ చెప్పేశాడు. ఎందుకింత గింజుకుంటాడు. ఎన్ని చూడలేదూ చదవ లేదూ. గతం నేర్పిన పాఠాలు చెప్పడం కోసం కాదు రానున్న అవకాశాలు నన్ను ప్రేరేపించాయన్నాడు. డౌట్ లేదు వీడో తేడా మనిషి. ఓ పక్క నా అనుభవాలూ నా పాఠాలంటూ భోరున పుస్తకాలూ ప్రవచనాలూ యూ ట్యూబులూ కవితలూ కాకరకాయలూ. చెప్పే వాళ్ళే.. నోళ్ళే.. చెవులు పనిచేసి చాలకాలం అయింది సమాజానికి. కానీ జాన్ మైండ్ లో ఓ పిక్చర్ ఉంది. గతం కానిది. రానున్నది. రేపటి రోజుల్లో కార్లూ బస్సులూ, విమానాలూ, ఓడలూ, కదిలేవన్నీ ఒకదానితో ఒకటి మాట్లాడుకుంటాయి టెక్నాలజీ వల్ల. డ్రైవర్ లేని కార్లన్న మాట. ఓ పదేళ్ళు పోయాక ఇప్పుడున్న వ్యాపారాల్లో నలభై శాతం మూత బడిపోతాయి టెక్నాలజీ మార్పు వల్ల. ఇలాంటివేవో రాశాడు. అబ్బా ఉక్కపోస్తోంది. పుస్తకం ఒక్క పేజీ పూర్తిగా చదివేశాగదా ఇక నాకు పూర్తిగా అర్థమై పోయింది. చేసిన వంటకం స్పూన్ తో చప్పరించి మ్..మ్..మ్... ఆహా.. అని కళ్ళు తిప్పే యాంకర్ లా. మొన్న చూసిన షో లో ఎవరో కొత్త యాంకర్... పేరు ? . ఛ.. సమయానికి సెల్ ఫోన్ లేక పోయే. ఓ పేజీ ఉక్కపోత తర్వాత పుస్తకం మీద నిశ్చితాభిప్రాయానికి వచ్చేసే సమయం ఆసన్నమైందని నా మనసు చెబుతోంది. మనసు మాట విను గెలుపు నీదే. ఫాలో యువర్ హార్ట్... స్టేటస్ లో పెట్టుకోవచ్చు. ఇక ఎందుకు టైం వేస్ట్. ఇంకేదైనా చెయ్యొచ్చు కదా .జీవితం చాలా చిన్నది. చాలా చేసెయ్యాలి.

అదే సమయానికి నా చూపు మిద్దె మీద దూరంగా గోడకి ఉన్న కుళాయి మీద పడింది. యాంకర్ గురించి ఆలోచిస్తూ తలెత్తి గడ్డం కింద చెయ్యి పెట్టేసరికి స్టీల్ కుళాయి మీద పడి తిరిగి నా కళ్ళల్లో పడి సూర్యుడు గుచ్చుకున్నాడు. సూటి పోటి సూరీడు పోతూ పోతూ నేనున్నానని గుర్తు చేస్తున్నాడా. వద్దు కవిత్వం వద్దు. సరేలే ఏదైతేనేం కుళాయిని చూశా. దాని కింద ఓ స్టీలు బక్కెట్. ఆ బక్కెట్ అంచు మీద ఓ పావురం. పుస్తకం, కళ్ళద్దాలూ తీసి పక్కన పెట్టా. పావురం మీదికి మనసు మళ్ళింది. కబూతర్ జా జా..పహలి ప్యార్ కీ ... దానికి నా హృదయ గానం వినపళ్ళే. అది బక్కెట్లోకి తొంగి చూస్తోంది. అంచు చుట్టూ తిరుగుతోంది. అటూ ఇటూ మెడ తిప్పుతోంది. 'గుర్ర్ గుటక్' అంటోంది. దాని మీద ఆసక్తి పెరిగింది. కాసేపు బక్కెట్ లోకీ మళ్ళీ తలెత్తి కుళాయి వైపూ చూస్తోంది. అక్కడేదో జరుగుతోంది. సస్పెన్స్...ఇక ఆపు ..

ఇందులో ఏముంది బ్రహ్మ రహస్యం ... దానికి దాహం వేస్తోంది. కుళాయి నుండి నీటి చుక్కలేమైనా రాలుతాయేమోనని చూస్తోంది. కుళాయి టైట్ గా ఉంది. డీ మానేటైజేషన్ టైం లో ఏ టీ ఎం లాగా. చిన్నప్పటి కథ లాగా కాదు కాదు ఈ మధ్య వాట్సాప్ లో తెగ వైరల్ అయిన కాకి లాగా పావురం కూడా రాళ్ళు తెచ్చి వేస్తుందా..ఏమైనా వాట్సాప్ ఓ గొప్ప పరిశోధనా విశ్వ వీద్యాలయం. ఎన్ని పాత కాలపు థీరీలకు ప్రూఫులు ఇస్తుందో..

ఈ సారి కొంచెం ఎక్కువగా వంగి చూస్తోంది బక్కెట్ లోకి. పడి పోతుందేమో. పడి పోతే నా బోటి వాడు దాన్ని పట్టుకోవడం ఈజీ. దాని భయం దానిది. అలాగే దాని జాగ్రత్త దానిది. తలతిప్పి, నా తట్టు చూసినట్లు అనిపించింది. నా మనసులోని మాట దానికి తెలిసిందా. ఏమో. వీడు నన్ను పట్టుకోవడానికి బక్కెట్ టెక్నాలజీ వాడుతున్నాడు అనుకుని ఉంటుంది. జాగ్రత్త పడింది. అవునా. నిజంగానా. అలా అనుకుందా. అసలు నేను ఏమి అలోచిస్తానో నాకే తెలీదు. ఓ పిట్ట ఏమి ఆలోచిస్తోంది నాకెలా తెలుసు? తెలుసు. నాకన్నీ తెలుసు. నిజానికి మనిషిగా నేనేది ఆలోచిస్తే మిగతా జీవులూ అలానే ఆలోచించాలి వేరే మార్గంలేదు వాటికి. గోరేటి వెంకన్న పిట్టపాట బాలూ ప్రోగ్రాం లో ... రామ సిలుకా, గోరువంకా పాల పిట్టా... తీతువమ్మా, పావురాయీ .. నరుడు పెట్టిన పేర్లు తప్ప తమకు ఊరూ పేరే లేదు. నేను దాన్ని 'పావురాయి'గా చూస్తున్నాననీ దాని మీద వెంకన్న పాట రాశాడనీ దానికేం తెలుసు. దానికి దాహం వేస్తోంది. నీళ్ళు లేవు. బక్కెట్ లోకి అడుగున నీళ్ళ కోసం దూకే రిస్క్ చెయ్యడం లేదు.

ఉన్నట్లుండి జీవకారుణ్యం పెల్లుబికింది నాలో. ఆమెవరో కుక్కల కోసం పాకులాడినట్లు. బిగ్ బాస్ లోకి నామినేట్ అవ్వాలంటే ఈ మాత్రం సరిపోతుందా. బుద్ధుని బొమ్మలెక్కువ మా ఊళ్ళో. పాపం. దాహం. లేచి కుళాయి తిప్పితే బాగుండుననిపించింది. మరి నేను లేస్తే అదెగిరి పోదా. ఎందుకు పోదూ... మళ్ళీ రాదూ... రాకెక్కడికి పోతుంది. బక్కెట్లో నీళ్ళు నిండా తిప్పాలి అది తాగాలంటే. లేక పోతే మళ్ళీ దానికి రిస్కే. నక్కా కొంగా కథలో లాగా. ఇది వేరే నక్క. అన్ని నక్కలూ ఒకేలా ఉండవు. ఆలోచించి అలోచించి లేద్దామా వద్దా అనుకుంటూ తర్జనభర్జన పడుతున్నా. మైండ్ మ్యాప్ వేసుకుంటున్నా. ఎలా లేవాలి, కుళాయి ఎంత దూరం, ఎంత సమయంలో నీళ్ళు తిప్పాలి .. ఓ ప్లాన్. బతుకంతా ప్లాన్డ్ గా బతకడం అన్నమాట. నిజానికి ప్లాన్డ్ గా ప్లాన్ చేసి బతకక పోవడం అన్నమాట. ఓ టెడ్ టాక్ లో ఎవరో ఏదో చెప్పారు. పేర్లు ఎన్నని గుర్తు? ఎవరో ఎవడో కోన్ కిస్కా... ఆ(.. గుర్తుకొచ్చింది...పేరు కాదు ... ఏదైనా చేయాలని అనిపిస్తే వెంటనే ఒకటి నుండి ఆరుదాకా లెక్కబెట్టు ఆలోపే లేచి పని మొదలెట్టు అని. ఇదేదో కొటేషన్లా బాగుందే! ఆరు దాటితే నీ

ఆలోచనలు నిన్ను లేవనీయవు అని. ఆరు నూరైనా అని అందుకే అన్నారేమో..దానికీ దీనికీ ఏమిటి లింకు? సరే... 'ఆలోచనలు అంత బరువైనవి' అన్నమాట. అబ్బా.. ఆలోచన గురించి  ఎంత బరువైన ఆలోచన !!  లేచా.. అప్పటికే ఆరు నూర్లు లెక్క పెట్టి ఉన్నా.

పావురం , అదే... నేను పెట్టుకున్న పేరు .. ఎగిరి పోయింది. 'హంస ఎగిరి పోవడం' అంటే.. మనిషి శరీరంలోని ఆత్మ లేచి పోవడం అని చిన్నప్పుడు నాయనమ్మ చెప్పింది. ఇప్పుడు ఎగిరిపోయింది పావురమే ..హంసా కాదూ.. ఆత్మ కాదు. మరి పావురం ఎగిరి పోతే అర్ధం ఏమిటి అడిగే ధైర్యం లేదు చిన్నప్పుడు. ఇప్పుడు అడుగుదామంటే మా నాయనమ్మ లోని పావురం ఎగిరి పోయి అదే.. హంస ఎగిరిపోయి ఇరవై ఏళ్ళు దాటింది. సెలవలకి ఊరోస్తామని ఏడాదంతా రాలిన బాదంకాయలని పై చెక్కు తీసి ఎండపెట్టి రెండు గోతాలు చేసి ఉంచేది. చచ్చెక్కడ ఉన్నాదో నాయనమ్మ. ఆధ్యాత్మ రామాయణం అష్ట పదులూ రెండూ సమపాళ్ల లో ఇష్టపడి పాడేది.

హడావుడిగా వెళ్లి బక్కెట్ లోకి నీళ్ళు తిప్పా. ధార... వెంటనే బక్కెట్  నీళ్ళు ఓ పావురం కోసం వేస్ట్ చేయడం ఎందుకు అనిపించింది. I am environmental friendly... you know. వెంటనే కుళాయి ఆపేశా. తెరిచి, మూసే లోపు మహా అయితే ఓ వందో రెండొందలో మిల్లీ లీటర్ల నీళ్ళు బక్కెట్ లో పడ్డాయి. బీకర్లో లెక్క గా ఆసిడ్ పోసిన రోజుల నాటి అనుభవం  ఇప్పుడు ఉపయోగ పడింది. పావురం ఎక్కడా అని చూశా..ఎగిరి పక్కింటి మూడంతస్తుల మేడ మీద కూచుని గుర్ర్ గుటక్ అంటూ ఉంది. మూడంతస్తుల మేడ ... నా జీవితమంతా, జీతమంతా ధార పోసినా కట్టలేను. నీ కోసమేనే ఈ పనంతా ఉండు అన్నా పావురం తో.

మరి బక్కెట్ నీళ్ళు వేస్ట్ చేయకుండా ఆపడం ఎలా. స్ట్రాటెజీ ఏమిటి ? ఆల్టర్నేటివ్ సొల్యూషన్ ఏమిటి ? బుర్ర గిర్రున తిరుగుతోంది. కాళ్ళు కాలుతున్నాయి. ముందు బక్కెట్ పక్కకులాగి కాళ్ళు కుళాయి కిందపెట్టి ధారగా నీళ్ళు వదిలి కాళ్ళు తడుపుకున్నా. ఆ.. ఎంత కొన్ని లిటర్లే. బీకర్లోంచి ఆసిడ్ ఒలికి చుర్రుమనడం గుర్తొచ్చింది. కాదు రా ... నీళ్ళు చుర్రుమంటూ ఉన్నాయి ఎండ కి పైప్ కాలి కాలి.  మరి ఇంత వేడినీళ్ళు తాగితే పావురం చావదా. నా కాళ్ళు కడుక్కునే నెపం తో వేడి నీళ్ళు వదిలేసి దానికి చల్లటి నీళ్ళు ఇస్తున్నా అనే తృప్తి నా కళ్ళల్లో మెరిసింది. జాగ్రత్త గా ఆలోచించాలే కానీ ప్రతి దానికీ ఓ లాజిక్కు ఉంటుంది. కళ్ళల్లో మెరుపుతోపాటే ఓ అద్భుతమైన ఆలోచనా తళుక్కున మెరిసింది. ప్రవరాఖ్యుని ఎదుట విద్యుల్లతలాంటి యాంకర్ లా ... ఓహ్... వరూధినిలా. ఈ యాంకర్ సంగతేంటో చూడాలి. ఈ బక్కెట్ కి కింది

వైపు పెద్ద అంచు ఉంది. దీన్ని తిప్పి పెడితే కొద్దిగా నీళ్ళు నిలుస్తాయి. ఎక్కువ లోతు ఉండదు. పావురం హాయి గా రిస్క్ ఫ్రీ గా తాగేసి పోతుంది. వంగి లోపలికి పడదు. నా ఇన్నోవేషన్ కి నేనే మురిసి పోయా. స్టార్టప్ గనక పెట్టిఉంటే కోట్లు గడించి ఉండేవాడిని. సెరెండిపిటీ అంటారు. డాట్స్ కనెక్ట్ చేస్తూ పావురం దాహం ఎలా తీర్చాలి అదీ నీళ్ళు వేస్ట్ చెయ్యకుండా అని తెలుసుకున్నా. పేటెంట్ కి అప్లై ... ఊహూ .. అంత లేదు ... ఓ యూ ట్యూబ్ వీడియో చెయ్యొచ్చు.

వెంటనే, అంతే వేగం గా బక్కెట్ లో ఉన్న నీళ్ళు ఒంపేసి బక్కెట్ తిరగేసి పెట్టి కుళాయి తిప్పేశా. వేడి నీళ్ళు. కాలుతున్న నీళ్ళు. ధారగా... అప్పటి దాకా బక్కెట్ కిందవైపునున్న చల్లదనానికి తలదాచుకున్న చీమలగుంపు పై ధారగా పడ్డాయి. వేడినీళ్ళు... ధారా పాతం. అవి కళ్ళుమూసి తెరిచేలోపే కళ్ళుమూశాయి...వాటిలోని ఆత్మలు పావురాల్లా... అదే హంసల్లా... ఎగిరిపోయాయి. తేలిన చీమల శవాలు నీళ్ళలోపడి కొట్టుకు పోయాయి. చివుక్కుమంది మనసు చీమ కుట్టినట్లు. చీమలేకదా... అవును చీమలే. ఏనుగులు కొట్టుకుంటే చీమలు చచ్చాయి అంటారు. అల్ప ప్రాణులు. చీమల గురించి తెలీంది ఎవరికి. కష్టజీవులు. అవి అల్ప ప్రాణులు... ఎలా ? ప్రాణులు. ఏమి చేసేది. తిరగేసిన బక్కెటలో నీళ్ళు అంచులు దాకా నిండాక సరేలే పావురం నీళ్ళు తాగితే నాకు పుణ్యమొస్తుందిలే.. బరాబర్ అనుకుని తిరిగి వచ్చి కూచున్నా.

నా అలికిడి కీ, జరుగుతున్న తంతు కీ తడబడి అప్పటిదాకా దాహంగా చూస్తూ ఉన్న పావురం ఆ మిద్దె మీదినుండి గుర్ర్ గుటక్ అనకుండా గప్ చుప్ గా ఎగిరి పోయింది. పావురం బాల్చీ తన్నేసింది. నీళ్ళు నింపినా, వద్దని బాల్చీ తన్నేసింది. పావురం నన్ను నమ్మ లేదు. ఇప్పుడు నాలోని పావురానికి.. అదే ... హంస కి దాహమేసినట్లు అనిపిస్తోంది. కానీ కాదేమో. అంతా నా భ్రమ. అసలు నాలో ఉన్నది పావురమా హంసా ముందు తేలాలి. లోన ఉన్నది హంసా .. హింసా..తేలాలి. అబ్బా రైమింగ్ ఎంత బాగుంది!

చీమల్ని చంపిన వాడు నన్ను చంపడా అనుకుందా .. ఏమో.. గోరేటి వెంకన్నని అడగాలి. నిజానికి నేను ఏనుగుల్నీ అవలీలగా చంపగలను, నా దగ్గర టెక్నాలజీలు చాలానే ఉన్నాయ్. ఇక పావురాలెంత... ఈ విషయం మాత్రం తిరుపతి వెంకన్నకి తెలుసు. నా లోని హంసకి తెలుసు.

(జరిగింది జరిగినట్లు రాశా... యాంకర్ విషయం కూడా పూర్తిగా రాశా )

( ఈ వాక్యం కూడా కథ లో భాగమే. ఎందుకంటే, అబద్ధాలు లేని కథలుండవు.)

**అంతు లేని కథ**

# దేవకీ సుతుడు 'నిర్మలాదిత్య' (భాస్కర్ పులికల్)

"మా...మా...మా" క్రిస్ పిలుపు వినిపించింది జనని కి.

'అమ్మమ్మ' అన్న పిలుపుకు ముద్దు మలుపులిచ్చి క్రిస్ చేస్తున్న ప్రయత్నమది.ఇంకా రెండు ఏళ్ళు నిండని పసివాడి నోటిలో వస్తున్న మాటలు విన్న జనని ఒక్క ఉదుటున లేచి పక్కలో వటపత్ర సాయి లాగా పడుకొని కాళ్ళు చేతులు ఊపుతున్న క్రిస్ ను ఎత్తుకుంది. ఏమిటో పొద్దున్నుంచి కృష్ణుని సంఘటనలే గుర్తుకు వస్తున్నాయి. కృష్ణాష్టమి అని నిన్నటినుంచే వాట్సాప్ లో శుభాకాంక్షలు. ఒక కృష్ణుని బొమ్మ తీసుకొని అందరు కాంటాక్ట్స్ కు టక టక ఫార్వర్డ్ చేయటమే కదా. చాలానే వచ్చాయి కృష్టామి గ్రీటింగ్స్. జనని కూడ ఒక జవాబు పంపించి...అదే మెసేజి మిగిలిన వారందరికి పంపించింది.

'బాబును చూసుకోవడానికి రా అమ్మ', అని దేవకి అడిగితే జనని సరే నని సంతోషంగా ఒప్పుకుంది. దేవకి కాలేజి చేరినప్పటి నుండి, ఇంట్లో ఒంటరిగానే ఉన్నందు వల్ల జనని కి ఈ మార్పు సంతోషాదాయకంగానే ఉంది.

క్రిస్ ను ఎత్తుకొని, అప్పుడే లేచాడు కాబట్టి, డైపర్ మార్చి తడి టవల్ తో వొళ్ళంతా తుడుస్తుంటే, క్రిస్ కి కృష్ణుని వేషం వేసి దేవికి కి సర్ప్రైజ్ చేస్తే బాగుంటుందనిపించింది. కృష్ణుడు అమెరికాకి వలస వస్తే క్రిస్ అనే పిలిచే వారేమో అనుకొని, తన ఊహాగానానికి తానే నవ్వుకుంది జనని.

పట్టు పంచ, గజ్జెలు అనుకుంటూ జనని దేవకి క్లోసెట్ వైపు అడుగులు వేసింది. దేవకి చిన్నప్పటి దుస్తులు అన్నీ అప్పటికప్పుడు చిన్నవైపోయావని గుడ్ విల్ స్టోర్ లో వేసేస్తున్నా, కొన్ని దుస్తులు అలానే సెంటిమెంట్ కోసం ఉండిపోయాయి.

దేవకికి కూచిపూడి నాట్యం మొదట్లో తనే నేర్పించింది. అప్పుడు తను ఏరి కోరి కొన్న డ్రెస్సులు క్లోసెట్లో ఓ మూల వాక్యూమ్ సీల్ కవర్ లో వున్నాయి. అది తెరచి, పంచలాగా పిన్నులేసి మార్చు కోగల ఓ పసుపు పావడ, ఆ కవర్ లోనే ఉన్న కాలి గజ్జెలు తీసుకుంది.

దేవకి ఎంత చక్కటి నాట్యం చేసేది. హైస్కూల్ వరకు తన మాటే వినేది. ప్రదర్శనలు, పోటీలు అంటూ మొత్తం అమెరికానే చుట్టి చూసేశారు. హై స్కూల్ చేరిన తరువాతే, సమస్యలు మొదలయ్యాయి. కాయిర్ , డాన్స్ షోలు అంటూ తను వద్దంటున్నా దేవకి చేరింది. చీర్ గర్ల్ అంటూ స్కూల్ ఫూట్ బాల్ ఆటలకు పోవడం మొదలెట్టింది. జూనియర్ సంవత్సరం లో కారు కొని ఇవ్వడంతో ఎదో ఒక ప్రోగ్రాం అంటూ, ఇంటికి పొద్దు పోయిన తరువాతే వచ్చేది. ఈ హడావిడిలో కూచిపూడి నాట్యం, గుళ్లకు పోవడం, పండుగలకు ఏర్పాటు చేసిన తెలుగు సంస్థల సంబరాలు పూర్తిగా తెర మరుగైపోయాయి. స్కూల్ లో ఫూట్ బాల్ ఆటగాళ్లు, చీర్ గర్ల్స్, కాయిర్ గ్రూపులో ని కొందరి తో ఓ పాపులర్ గుంపు ఏర్పడ్డది. అందులో దేవకి కూడా ఉంది.

క్రిస్ ను ఎత్తుకొని హై చైర్ లో కూర్చోబెట్టగానే 'కూకీ' అంటూ నవ్వుతూ జనని కళ్ళతో కళ్లు కలిపాడు. ఈ మాట మాత్రం ఎంత స్పష్టంగా పలకడం నేర్చుకున్నాడో అంటూ మురిపంతో, షెల్ఫ్ తెరిచి కొన్ని క్రాకెర్స్, ఫ్రిజ్ తీసి కొంచెం పండ్ల రసం సిప్పర్ లో పోసి ఇచ్చింది, జనని.

తనూ క్రిస్ పక్కనే కూర్చుని డైనింగ్ టేబిల్ మీద దేవకి పావడను అక్కడక్కడ పిన్నులు వేసి ఓ దోవతి లాగా మార్చ సాగ మొదలెట్టింది.

కాయల్ నర్సరీ నుంచి దేవకి క్లాస్మేటే. కాయల్ కుటుంబం ఓ రెండు ఇళ్ల అవతల ఉండేవారు. గుంపుగా స్నేహితులతో తిరిగే దేవకి, హై స్కూల్ రాగానే కాయల్ తో చనువుగా ఇద్దరే కలిసి తిరగడం జనని కంట పడక పోలేదు. ప్రామ్ కూడా ఆ నాలుగేళ్లు కాయల్ తోనే పోయింది. జనని దేవకికి ఆ వయస్సులో తీసుకోవలసిన జాగ్రతలన్నీ చెప్పింది. 'అవన్నీ తెలుసు లేమ్మా', అని దేవకి ఆ విషయం పై చర్చ అనవసరం అని ప్రతీ టీనేజర్ లాగే, ముఖంలో విసుగు, అయిష్టతో పాటు తెలిపి, విసవిస లేచిపోయింది. ఎదో విషయం పై తరచు దేవకికి జననికి గోడవలొచ్చేవి. జనని దేవకిని ప్రశ్నించడం ఆపే దాకా ఆ గొడవలు తగ్గలేదు. జనని స్నేహితులు కూడా, జనని ని ఎక్కువ పట్టించుకోవద్దని, పిల్లలే ఫిగర్ ఔట్ చేసుకుంటారు అనడంతో, మనస్సులో ఎంత ఆదుర్ద ఉన్నా, అణచు కుంది. కొన్ని సమస్యలు కాలమే తీరుస్తుంది. జననికి మంచి మార్కులు వచ్చి తనకు నచ్చిన యూనివర్సిటీ లోనే సీటు దొరికింది. దానికి ఊరు వదలి ఫ్లైట్ లో పోవలసిందే. కాయల్ మార్కులు అత్తెసరుగ రావడంతో అక్కడే కమ్యూనిటీ కాలేజీలో సీటు దొరికింది. దానితో కాయల్, దేవకి విడిపోవడానికి అట్టే సమయం పట్టలేదు.

జనని క్రిస్ మొఖం పైన ఉన్న క్రాకర్ ముక్కలు టిష్యూ తో తుడిచేసి, టేబిల్ ను కూడా పేపర్ టవెల్ తో తుడిచేసి తను పావడ పైన చేసిన మార్పులు సరిగా వచ్చాయా అని క్రిస్ పైనే పెట్టి చూసి, సరిపోయింది అని ముచ్చట పడింది. ఇక క్రిస్ తలపై ఓ కిరీటం కావలేమో కదా అనుకుని, చిన్ని కృష్ణుడే కదా అని తిరిగి క్లోసెట్ కి వెళ్లి, స్కార్ఫ్ ఒకటి తెచ్చి క్రిస్

తలపై కట్టి సరిపోయింది అని అనుకుంది. ఇక నెమలి ఈకలు. అవి ఎక్కడ పట్టడం? ఇంట్లో నెమలి ఈకలు ఉన్నట్లు లేవే అని అనుకుంటుండగా, దేవకి తరువాతి బాయ్ ఫ్రెండ్ మైక్ గుర్తుకు వచ్చాడు.

దేవకి మైక్ ను కాలేజీలో కలిసింది. మైక్ బయాలజీ లో మేజర్ చేసాడు. జనని పొలిటికల్ సైన్స్ తీసుకుంది. సెమిస్టర్ బ్రేక్లు ఉన్నప్పుడేల్లా, వాళ్ళు ఓ బ్యాక్ పాక్ ట్రిప్ కు వెళ్లే వారు. ఎక్కువగా అడవులు, ప్రకృతి అందాలకని ప్రసిద్ధి పొందిన ప్రదేశాలు తిరిగే వాళ్ళు. అప్పుడు దేవకి ఇంటికి తెచ్చిన సొవెనీర్ల లో రంగు రంగుల ఈకలు ఉన్నట్లు గుర్తు. కాని అవి ఎక్కడ ఉన్నాయని వేదకడం. ప్రింట్ చేసి కట్ ఔట్ పెడితే సరిపోతుంది అనుకుని, జనని ఫోన్లో నుంచే మంచి నెమాలి ఈక బొమ్మ వెదికి ప్రింటర్ కు ప్రింట్ చేయడానికి పంపించింది.

మైక్ ను కాలేజీలో ఉన్నప్పుడు ఓ సారి థాంక్స్ గివింగ్ కు మరో సారి క్రిస్మస్ సెలవలకు తీసుకొచ్చింది. మైక్ మృదుభాషి, మంచివాడే అనిపించాడు. మైక్ తో తి రగొద్దు అని దేవకితో చెప్పడానికి, జననికి కారణమేమి దొరకలేదు. చెప్పినా దేవకి వింటుందన్న నమ్మకం లేదు. అప్పటికి తనకు తెలిసిన స్నేహితులు వారి అబ్బాయిలకు, దేవకిని పెళ్లికని, పరిచయం కోసం అడుగుతుంటే వారి ఫోటోలు, కాంటాక్ట్ నంబర్లు ఇస్తూనే ఉండేది. దేవకి అందంగా ఉండడం వల్ల, తను చదివే ఐవీ లీగ్ వర్శిటీ వల్ల చాలా సంబంధాలే వచ్చేవి. కొన్ని సార్లు ఏమి మాట్లాడ కుండా వినేది, చాలా సార్లు 'వద్దన్నాను కదా. వదిలేయి. నేనే వెదుక్కుంటాను. నీవు చెప్పిన సంబంధం చేసుకొని అది భవిష్యత్తు లో తెగిపోతే, దాని వల్ల నువ్వు బాధ పడడం నాకు ఇష్టం లేదు", అంటూ సవాలక్ష కారణాలు చెప్పి గొడవ పడేది. మంచి సంబంధం వదులుకుంటున్నావు అని జనని అస్సహాయత తో ఏడవటం గుర్తొచ్చి నవ్వుకుంది.

క్రిస్ ను ఎత్తుకొని, వాడి రూంలో ప్లే ఏరియా లో పెట్టి, దేవకి ఆఫీస్ రూమ్ లో ప్రింటర్ నుంచి నెమలి ఈక ప్రింట్, పేపర్ సిసర్స్ తీసుకుని మళ్ళీ క్రిస్ దగ్గరికి వెళ్లి, కార్పెట్ పైనే కూర్చుని నెమలి ఈకను పేపర్ నుంచి కత్తిరించడం మొదలెట్టింది. క్రిస్ కీ బోర్డ్ బొమ్మను తీసుకొని మీటలు నొక్కసాగాడు. ఏవో నోట్స్ అపశ్రావ్యంగా మ్రోగుతున్నాయి. క్రిస్ పట్టు వదలని విక్రమార్కుడు లాగా ఎదో కొత్త పాట కట్టడానికి కుస్తీలు పడుతున్నాడు. జననికి నవ్వు వచ్చింది, క్రిస్ ముఖంలోని పట్టుదల చూసి.

దేవకి పరిచయం చేసిన తరువాతి అబ్బాయి జాన్. దేవకి గ్రాడ్యుయేషన్ తరువాత లా కాలేజి చేరడం, మైక్ రీసెర్చ్ అంటూ ఆఫ్రికా లోని దేశాలలో తిరగడానికి పోవడంతో, వారు విడిపోవాల్సి వచ్చింది. జాన్ దేవకి లా క్లాస్మేట్. దేవకి పొడగరి. 5 అడుగుల 10 ఇంచీలు తన హైట్. జాన్ ఆరడుగులు ఉంటాడు. అందగాడు కూడా. 'అమ్మయ్య, ఇన్ని రోజులకు మా దేవకికి తగిన జోడి దొరికింది' అని మురిసి పోయింది, జనని. అందుకే దేవకి, జాన్ లు ఒకే అపార్ట్మెంట్ లో కలిసి ఉన్నా, పెద్ద అభ్యంతరం అనిపించ లేదు. ఎలా పెళ్లి చేసుకుంటారు కదా అనుకుంది. అలాంటిది, లా ఫైనల్ ఇయర్ లో అర్ధ రాత్రి ఫోన్ చేసి బోరున ఏడ్చేసింది దేవకి.

'జాన్ తో బ్రేక్ అప్ నేనే చేసుకున్నాను. బాధ భరించలేక పోతున్న', అని జననితో చెప్పింది దేవకి. అల్లుడు కావడానికి అన్నీ అర్హత లకి, లక్షణాలకి టిక్ మార్కులున్న జాన్ కు డ్రగ్ ప్రాబ్లెమ్ ఉందంటే జననికి నమ్మ బుద్ధి కాలేదు. మొదట్లో జాన్ ఆ అలవాటు దేవకి నుండి దాచగలిగినా, ఒకే అపార్ట్మెంట్ లో ఉండడం మొదలెట్టాక దేవకికి అనుమానం రావడానికి అట్టే సమయం పట్టలేదు. దేవకి ఆ సారి నిజంగానే జాన్ ప్రేమలో పూర్తిగా పడిపోయింది. ఆ అలవాటు, తనతో ఉండడంతో మానేస్తాడు అని నమ్మింది. దేవకి ఇంతకు ముందు లాగ తరచు జాన్ గురించి చెప్పడం, మురిసిపోవడము లేదని తెలిసి జననికి అనుమానం వచ్చిన విషయం వాస్తవమే. కానీ వయస్సులో ఉన్న ప్రేమికుల జిల్లి కజ్జాలే అని సరిపుచ్చు కొని, ఈ సంబంధమైన కుదిరే లా చూడు స్వామి అని తెగ మొక్కింది, అన్ని దేవుళ్ళకు. దేవకి అంత రాత్రి ఫోన్ చేసి ఏడుస్తుంటే జననికి కూడా ఏడుపు వచ్చేసింది. దేవకి తేరుకొని, తానే ఎలా నిర్ణయం తీసుకొని అపార్టుమెంట్ బయటకు జాన్ ను తరిమిందో చెప్పి జనని తో తాను ధైర్యవంతురాలని, ఈ సెట్ బ్యాక్ నుండి కూడ తేరుకోగలనని చెప్పింది.

మాట అయితే అంది కాని, జాన్ జ్ఞాపకాల నుండి తెరుకోవడానికి బాగానే సమయం పట్టింది. దేవకి మళ్లీ డేటింగ్, ఉద్యోగం చేరిన సంవత్సరం తరువాత కానీ మొదలెట్టలేదు. ఆ మధ్య రెండు ఏళ్ళు జనని, దేవకికి చాలా సంబంధాలు పంపించి పెళ్లి వైపు దేవకి మొగ్గే టట్టు చాలా ప్రయత్నాలు చేసి విఫలమైనది.

అప్పటికే దేవకి వయస్సు 30ఏళ్లు దాటుతుండడంతో, పిల్లలు పుట్టడం, కష్టమని మరో అస్త్రం ఉపయోగించింది జనని. దేవకి తనకున్న

తెలివికి ఇదో పెద్ద సమస్య కాదు అన్నట్లు ముఖం పెట్టి 'నా ఎగ్స్ క్రయో లాబ్ లో ఫ్రీజ్ చేసి అట్టే పెట్టడానికి ఏర్పాట్లు అప్పటికే చేసేసాను', అని, జనని మరో మాట మాట్లాడనీయకుండా చేసింది. అప్పుడే జనని దేవకితో పెద్ద గోడవపడడటం. అటు తరువాత పెళ్లి విషయం జనని దేవకితో ఎత్త లేదు. ఓ నాలుగేళ్లు వారి జీవితాలు చెరో మార్గం వెదుకున్నాయి.

దేవకి వచ్చే సమయం దగ్గరౌతుందని, క్రిస్ ను చంకలో ఎత్తుకొని తన బెడ్ రూమ్ కు తీసుకెళ్లి డ్రెస్సింగ్ అద్దం ముందు కూర్చో బెట్టి లిప్ స్టిక్, మస్కర కోసం వెదుక సాగింది, జనని.

దేవకికి తనే మేకప్ చేసేది. చిన్నప్పుడు కూచిపూడి డాన్స్ చేసేటప్పుడు ఎంత సతాయించేది. డాన్సు అయ్యేంతవరకు మేకప్ అలాగే ఉండడానికి గగన మైపోయేది. చెపొద్దు గాని దేవకి మేకప్ లేకుండా నే అందగత్తె. ఇక మేకప్ తో జనని కళ్ళకి అప్సరస లాగానే కనిపించేది. ఇంత అందమైన పిల్లను, పెళ్లికూతురుగా చూడగలనా లేదా అనుకుంటున్న సమయంలో ఓ రోజు అకస్మాత్తుగా ఇంటికి వస్తున్నాని చెప్పి, ఓ కాప్ కారులో దిగింది దేవకి. తన వెంట పోలీస్

యూనిఫారంలో ఓ యువకుడు దిగాడు. పేరు ఆండ్రూ అని తన బాయ్ ఫ్రెండ్ అని పరిచయం చేసింది. జనని నవ్వుతూ ఇద్దరిని ఆహ్వానించి భోజనం పెట్టి, దేవకి ఇచ్చిన సర్ప్రైజ్ కు సంతోషించినా, పెళ్లి వరకు వచ్చిన తరువాత చూద్దాములే అన్న నిర్లిప్తను, ఓ మూల నుంచి, నిర్మూలించలేక పోయింది. ఆండ్రూ తల్లి తండ్రులు కూడా జనని లాగానే అమెరికాకు వలస వచ్చిన వారు. కాదంటే వాళ్ళు కొరియా నుండి ఈ దేశం వచ్చారు. ఆండ్రూ జనని లాగే ఇక్కడే పుట్టి పెరిగాడు.
దేవకి జనని కి మరో షాక్ ఇచ్చింది. తన అంచనాలకి పూర్తి విరుద్ధంగా, జననికి ఆండ్రూ వాళ్ల తల్లి తండ్రుల ను పరిచయం చేయడం, ఆండ్రూ దేవకికి ప్రపోజ్ చేయడం, మరో ఆర్నెళ్లకు డెస్టినేషన్ వెడ్డింగ్ అంటూ బాలిలో పెళ్లి చేసుకోవడం అయ్యిపోయాయి. పెళ్లి తరువాత దేవకి జననికి మరింత చేరువయ్యింది.

ఓ రెండు ఏళ్ల తరువాత పిల్లల గురించి ప్రస్తావిస్తే డాక్టర్ ను కలిసామని తాను ఇది వరకు ఫ్రీజ్ చేసిన ఎగ్స్ తో ప్రెగ్నెంట్ కావడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పింది. ప్రతీ సైకిల్ అలా ప్రయత్నించడం, ఫెయిల్ అవ్వడం జరగడంతో దేవకి బాగా స్ట్రెస్ అయ్యింది. ఆశ వదులుకొనే సమయంలో దేవకికి, డాక్టర్ ఆ సారి గర్భంలో ఎంబ్రియో నిలదిక్కుకున్నది, బెడ్ రెస్ట్ తీసుకోమంటే జనని నే, పని నుండి సెలవు తీసుకొని, దేవకి దగ్గరికెళ్లి ఆనందంగా అన్ని పనులు దేవకి కాలు కదప కుండా చేసింది. కానీ అంత చేసినా, మూడో నెలలో దేవకికి మిస్ కేరెజ్ అయ్యింది. దేవకి దుఃఖం ఆండ్రూ కూడా ఆపలేకపోయాడు. ఇద్దరిని, జననినే సముదాయించింది. ఇది పోతే మరో సారి ప్రయత్నించ వచ్చు అని ఆశాజనకం గా మాట్లాడింది జనని. దేవకి 'లాభం లేదమ్మ. పోయిందే చివరి ఫ్రోజెన్ ఎగ్. నీ మాట విని ముందే పెళ్లి చేసుకోక పోవడం వల్ల కర్మ, నన్నంటుకు పోయింది" అంటూ డిప్రెషన్ లోకి వెళ్ళిపోయింది.

దేవకి పరిస్థితి చూసి ఆండ్రూ అల్లాడి పోయాడు. చివరకు సమస్యకు పరిష్కారంగా ఆండ్రూ ప్రతీ ఆదివారం పోయే చర్చ్ ద్వారా, చైనా లో ఓ అడోప్షన్ ఏజెన్సీ సంప్రదించి, దేవకి తో పాటు ఓ చంటి పాపను దత్తతకు తీసుకివడానికి చైనాకు వెళ్లారు. అక్కడ వీళ్ళను చూస్తూనే బోసి నవ్వులతో నవ్విన చంటి అబ్బాయిని ఎన్నుకొని అన్నీ పేపర్లు సంతకాలు పెట్టి తమ కొడుకుగా ఆ అనాథను ఆదుకున్నారు. ఆ అబ్బాయే క్రిస్.

అడోప్షన్ దేవకిలో అనుకున్న మార్పులే తెచ్చాయి. దేవకిని అంత సంతోషంగా జనని ఎప్పుడూ చూడలేదు. దేవకిలోని మార్పులు చూసి జనని కూడా సంతోష పడడానికి అట్టే సమయం తీసుకోలేదు. దానికి తోడు క్రిస్ కూడా తన తప్పటడుగులు, వచ్చి రాని భాషతో ఇంటిల్లి పాదిని అవిరామంగా నవ్విస్తూ నే ఉండే వాడు.

జనని లిప్ స్టిక్ తెరిచి ఓ టిష్యూ తో తుడిచేసి, క్రిస్ నుదిటి మీద నామం పెట్టింది. అది వరకే పంచ, కాళ్ళకి గజ్జలు కట్టేసి ఉండడం వల్ల క్రిస్ ముఖంలో చిన్ని కృష్ణుడు కనిపించడం మొదలెట్టాడు. క్రిస్ కోసం తాను చేయించిన బంగారు మురుగులు, దండ కూడా వేసింది. క్రిస్ నుదిటి మీద ప్రింట్ చేసిన నెమలి ఈక పెట్టి స్కార్ఫ్ తలచుట్టూ కట్టింది జనని.

క్రిస్ ను చూస్తుంటే జననికే ముచ్చట వేసింది. వెంటనే మస్కారా తీసి బుగ్గ మీద దృష్టి తగల కుండా ఓ నల్లటి చుక్క పెట్టింది.

డోర్ బెల్ వినపడింది. వెంటనే తాళం చెవులతో తలుపుతీసుకొని క్రిస్ ను వెదుక్కుంటూ జనని క్రిస్ ఉంటున్న గదికి చేరుకుంది దేవకి. క్రిస్ లో చిన్ని కృష్ణుని చూసి ఆనందంతో దేవకి గుమ్మంలోనే ఆగిపోయింది. క్రిస్ సంతోషంగా దేవకి వచ్చిందంటూ, ఎత్తుకోమని చేతులు చాచి, 'మాం, మాం' అంటూ, నోరారా నవ్వుతూ జనని చూపులతో చూపులు కలిపాడు. 'దిద్దరాని మహిమల' న్నీ ఆ 'దేవకీ సుతుడు'లో, జననికి కనిపించాయి.

## బుడి బుడి అడుగులు ఎం .ఆర్.వి. సత్యనారాయణ మూర్తి

ఐదు నిముషాలనుంచి జగన్నాథం గారు ఎదురుగా ఉన్న మేడమీద కనిపిస్తున్న దృశ్యం కేసి ఏకాగ్రతగా చూస్తున్నారు. లోపల గదిలోంచి బాల్కనీ లోకి వచ్చిన వర్ధనమ్మ భర్త చేష్టలు చూసి విసుక్కుంది. “అలా అస్తమానం వాళ్ళ ఇంటికేసే చూస్తుంటే వాళ్ళు ఏమనుకుంటారు?తప్పుగా భావిస్తారు.లోపలకు వచ్చి టిఫిన్ తినండి.”అని హాలు లోకి వచ్చింది వర్ధనమ్మ.

దీర్ఘంగా నిట్టూర్చి బాల్కని లోంచి హాలు లోకి వచ్చారు జగన్నాథం గారు.టీపాయి మీద ప్లేట్ లో వేడి వేడి ఇడ్లిలు ఉన్నాయి.భార్యా భర్తలు ఇద్దరూ టిఫిన్లు తిని,వారి వారి రోగాలకు వేసుకోవాల్సిన టాబ్లెట్లు వేసుకున్నారు.ఆయన పేపర్ చేతిలోకి తీసుకున్నారు, ఆవిడ వంటింటి లోకి వెళ్ళారు.కొద్ది సేపటికి సాంబ్రాణి వాసన గాలిలో తేలుతూ వచ్చి ఆయన ముక్కుపుటాలను తాకింది. ఆ వెనకే ‘జో అచ్యుతానంద,జో జో ముకుందా’అన్న కీర్తన సన్నగా ఆయన చెవుల్ని పలకరించింది.వెంటనే పేపర్ పక్కన పడేసి, ఆ కీర్తన వినసాగారు. ఆ గానం ఆయనకి అలౌకిక ఆనందాన్ని కలిగించింది.

జగన్నాథం గారు రిటైర్డ్ సబ్ కలెక్టర్. కొడుకులు ఇద్దరూ అమెరికాలో ఉన్నారు. స్వంత ఊరు శివపురంలో మేడ కట్టుకుని స్థిరపడ్డారు.కింది పోర్షన్ అద్దెకిచ్చి మేడమీద ఉంటారు. వారి ఇంటి ఎదురుగా ఉన్న మేడమీద పోర్షన్ లో అద్దెకుంటున్నారు జానకమ్మ కుటుంబం. రిటైర్డ్ మాస్టారు ముకుంద రావు ,కింద విశాలమైన పెద్ద గదులు కట్టుకుని అందులో ఉంటూ, డాబా పైన మూడు గదులు ,ఒక రేకుల వసారా కూడా వేసాడు.అందులోకి అద్దెకి వచ్చారు జానకమ్మ,కొడుకు రాఘవ,కోడలు వైదేహి. ఈ మధ్యనే జానకమ్మ కూతురు వసంత పురిటికి వచ్చింది. పదిరోజుల క్రితమే వసంతకి మగపిల్లాడు కలిగాడు. అప్పటినుంచి ఎదురింటిలో సందడి మొదలయ్యింది.

చంటి పిల్లాడి ఏడుపులు,పెద్దవాళ్ళు "ఊరుకో నాన్నా..ఊరుకో"అంటూ సముదాయించడం..పొద్దున్నే చంటి పిల్లాడికి స్నానం చేయించడం ..వాడి రాగాలు ..కోడలు వైదేహి వాడిని వూరుకోబెడుతూ 'జోల పాటలు'పాడడం.ఇవన్నీ జగన్నాధం గారు ఆసక్తిగా చూస్తూ ఉంటారు.రెండు ఇళ్ళకి మధ్యదూరం ముప్పై అడుగుల రోడ్ మాత్రమే. అందుచేత ఎదురింటిలో జరిగే ప్రతీది జగన్నాధం గారి ఇంటి బాల్కనిలోంచి చూస్తె స్పష్టంగా కనిపిస్తుంది. జగన్నాధం గారికి చిన్నపిల్లలంటే చాలా ఇష్టం. అందుకే ఉదయమే బాల్కనిలో కూర్చుని ఎదురింటిలో చంటిపిల్లాడికి స్నానం చేయించడం,సాంబ్రాణి ధూపం వేయడం వంటి వాటిని ఆసక్తిగా చూస్తారు.ఆయన అలా చూడడంలో వేరే ఉద్దేశ్యం లేకపోయినా,చంటి పిల్లాడికి దిష్టి తగులుతుందని,వాళ్ళు తన భర్తని ఏమైనా అంటారేమోనని వర్ధనమ్మ భయం. అందుకే భర్తని లోపలకు రమ్మనమని పిలుస్తూ ఉంటూంది.

"ఏమిటో, చంటిపిల్లల అచ్చటా ముచ్చటా చూడాలని మనం ఎంతో ఆశ పడ్డాం. కానీ మన పిల్లలు మన ఆశ తీర్చనే లేదు."బాధగా అన్నారు జగన్నాధం.

"ఏం? మీకేనా, నాకు లేదా ఆ ఆశ. కోడలు పురుడు దగ్గర ఉండి పోయాలని, చంటి పిల్లాడికి లాల పోయాలని, వాడిని కాళ్ళమీద పడుకో బెట్టుకుని ఎన్నో ఊసులు చెప్పాలని అనుకున్నా. కానీ పెద్దాడికి, వాడి అత్తా, మామలే నెత్తిమీద దేవతలు. వాళ్ళు ఇద్దరినే అమెరికా రప్పించుకున్నారు కానీ, మనల్ని రమ్మనమని చెప్పలేదు.పైగా'అత్తయ్య గారూ, మీరూ మావయ్య గారు పెద్దవారు.మీకు ఇబ్బంది కలిగించడం ఇష్టం లేకే, మా వాళ్ళని రమ్మనమని చెప్పాం' అంటూ కోడలు సన్నాయి నొక్కులు. హూ .ఆ అమ్మాయిని అనుకోవడం ఎందుకులెండి.మనవాడు మేతక మనిషి. కోడలు గీచిన గీత దాటడు. రెండో మనవడు పుట్టినపుడు ఇదే భాగోతం.మనల్ని దగ్గరకు రానీలేదు. మనవలు పెద్దవాళ్ళు అయ్యాకే మనకి అమెరికా పిలుపు వచ్చింది.ఏం చేస్తాం?అప్పుడే వెళ్ళి పిల్లల్ని చూసి వచ్చాం.మన దురదృష్టం."దీర్ఘంగా నిట్టూర్చి అంది వర్ధనమ్మ.

"పెద్దవాడి విషయం లో అలా జరిగింది. రెండోవాడు కూడా వాళ్ళ ఆవిడ డెలివరికి, వాళ్ళ అత్తా మామల్నే పిలుచుకున్నాడు. వాడూ మన ఆశల్ని నీరుకార్చేడు."అన్నారు జగన్నాధం.

"మీరు ఎక్కడో అమాయకులులా ఉన్నారు.పెద్దవాడు ఒక బాట వేసి చూపించాడుగా. చిన్నాడు అదే బాటలో నడిచాడు."తేలిగ్గా చెప్పింది వర్ధనమ్మ.

"వాళ్ళ భవిష్యత్తు బాగుండాలని, వాళ్ళు ఏం కోరితే అది చదివించాం. ఎంతో ఖర్చు చేసాం.మనం చూపించిన ఆప్యాయత, అనురాగం లో సగం కూడా వాళ్ళు మనకు చూపడం లేదు.మన చిన్న చిన్న కోర్కెలు కూడా వాళ్ళు తీర్చడం లేదు. పిల్లలకు పెద్ద పెద్ద చదువులు చెప్పించడం కూడా తప్పేమోనని ఇప్పుడు అనిపిస్తోంది"జగన్నాధం గారి మాటల్లో పశ్చాతాపం ధ్వనించింది.

"మనది తప్పు కాదు.పిల్లల ఆలోచనా విధానం తప్పు.తల్లి తండ్రుల చిన్న చిన్న కోర్కెలు తీర్చాలని వాళ్ళు అనుకోకపోవడం తప్పు."అని వంటింట్లోకి వెళ్ళిపోయింది వర్ధనమ్మ.మళ్ళి పేపర్ చేతిలోకి తీసుకున్నారు జగన్నాధం.

★★★★

ఒకరోజు సాయంకాలం ఎదురింటి వైదేహి వచ్చింది."నమస్తే పెద్దమ్మ గారూ,రేపు మా మేనల్లుడిని ఉయ్యాలలో వేస్తున్నాం.మీరు వచ్చి ఆశిర్వదించాలి."అని వర్ధనమ్మ గారిని బొట్టుపెట్టి పిలిచింది.అలాగే వస్తానని చెప్పింది వర్ధనమ్మ. మర్నాడు ఉదయం నుంచి జగన్నాధం గారు బాల్కనీ లోనే కూర్చుని ఎదురింట్లో జరిగే హడావిడి చూస్తున్నారు. ఒక పేము ఉయ్యాల గది మధ్యలో వేలాడదీసి,నాలుగు తాళ్ళకు పువ్వుల దండలు,బుడగలు కట్టి అలంకరించారు వైదేహి ఆమె భర్త. కాసేపటికి పేరంటాళ్ళు అందరూ వచ్చారు. అందరిలోకి పెద్ద ముత్తైదువ వర్ధనమ్మ చేతిలో చంటి పిల్లాడిని ఉంచి ఉయ్యాలలో పడుకోబెట్టమని చెప్పింది వైదేహి. వర్ధనమ్మ కి ఒక్కసారి వళ్ళు పులకరించింది.ఎంతో ఆనందంతో పిల్లాడిని ఉయ్యాలలో పడుకోబెట్టి నెమ్మదిగా ఉయ్యాల ఊపింది.

ఆ తర్వాత పిల్లాడి అమ్మమ్మ జానకమ్మ, వసంత , వైదేహి ఉయ్యాల ఊపి జోలపాట పాడారు.మిగతా పేరంటాళ్ళు కూడా ఉయ్యాల ఊపి పాటలు పాడారు.వర్ధనమ్మ తను తెచ్చిన గిఫ్ట్ పాకెట్ వసంతకిచ్చి ఇంటికి వచ్చింది.

"ఏమండి, ఇవాళ ఏం జరిగిందో తెలుసా?" ఆనందంతో మొహం వెలిగిపోతుండగా భర్తని అడిగింది వర్ధనమ్మ. బాల్కని లోంచి అంతా చూసినా, భార్య ఆనందాన్ని కొనసాగించాలని, ఏమీ తెలియనట్టు ఆమె కేసి తిరిగి"ఏమిటి వర్ధనం,ఏమిటి విశేషం?"ఆసక్తిగా అడిగారు జగన్నాధం.

"వసంత కొడుకుని నా చేతికిచ్చి ఉయ్యాలలో వేయమన్నారండి" కళ్ళ నుండి ఆనంద భాష్పాలు రాలుతుండగా చెప్పింది వర్ధనమ్మ. భార్య భుజం మీద చేయి వేసి అనునయించారు జగన్నాధం. చీర చెంగుతో కళ్ళు తుడుచుకుంది వర్ధనమ్మ.

"స్వంత మనవడిని నా చేతులతో ఉయ్యాలలో వేయలేక పోయానని చాలా సార్లు బాధపడ్డాను.భగవంతుడు నా మొర ఆలకించినట్టుగా ఈ రోజు ఆ ముచ్చట వసంత వాళ్ళ బిడ్డ రూపంలో తీర్చాడు" అంది సంతోషంగా. ఈరోజు ఆమె మనసు గాలిలో తేలిపోతోంది. ఒక అపురూపమైన కల సాకారమైతే ఎంత ఆనందంగా ఉంటుందో అంత ఆనందంగా ఉంది ఆమెకి.

రోజులు గడుస్తున్నాయి. వైదేహి మేనల్లుడిని నిద్రపుచ్చడానికి పాడే పాటలు,అన్నమయ్య కీర్తనలు వింటూ జగన్నాధం గారు పులకించి పోతున్నారు. ఐదవ నెలలో వసంత పిల్లాడిని తీసుకుని అత్తారింటికి వెళ్ళిపోయింది.

ఆడపిల్ల పెళ్లి అయ్యాకా బంధువులు అందరూ వెళ్ళాకా ఆ ఇల్లు ఎలా నిశ్శబ్దంగా ఉంటుందో అలా ఉంది

జానకమ్మ ఇల్లు చంటిపిల్లాడు లేక. జగన్నాథం గారి మనసు మూగబోయి నట్టయింది.ఎదురింట్లో చంటిపిల్లాడి కేరింతలు లేవు,ఏడుపులు లేవు, జోలపాటలూ లేవు. నిశ్శబ్దంగా జైల్లో ఖైదీలలా వాళ్ళ పనులు వాళ్ళు చేసుకుంటున్నారా? అని విస్తుపోతున్నారు జగన్నాథం గారు.

ఒక నెల గడిచాకా వసంత మరల పుట్టింటికి వచ్చింది. శిశిరం తర్వాత వసంత ఋతువు వచ్చి కొత్త చిగుళ్ళతో వనం కొత్త రూపు దాల్చినట్టు జానకమ్మ ఇంట్లో మళ్ళీ ఉత్సాహం ఉరకలు వేసింది.జగన్నాథం, వర్ధనమ్మల హృదయాలు కూడా సంతోషంతో ఎగిసి పడ్డాయి. రెండు రోజులు గడిచాకా వర్ధనమ్మ ఎదురింటికి వెళ్లి వసంతని పలకరించి చంటి పిల్లాడిని తీసుకువచ్చి జగన్నాథం గారికి చూపించింది. వానకోసం బెంగపెట్టుకున్న

రైతుని వరుణుడు కుంభ వృష్టి తో కరునించినట్టు ఉంది జగన్నాథం గారి మనసు.వసంత కొడుకుని ఎత్తుకుని ముద్దాడారు. చిన్నపిల్లాడి మెత్తటి వళ్ళు తాకగానే ఆయన అలౌకిక అనుభూతికి లోనయ్యారు.అకస్మాత్తుగా ఆయన కళ్ళల్లో సన్నటి కన్నీటి పొర కదలాడింది.నాలుగు రోజులు ఉండి వసంత వెళ్ళిపోయింది.జగన్నాథం గారు చిన్న పిల్లలు ఆడుకొనే బొమ్మలు కొని వర్ధనమ్మ ద్వారా వసంతకు పంపారు.

ఈసారి వసంత నాలుగు నెలలు గడిచాకా పుట్టింటికి వచ్చింది.వంశి కృష్ణ అడుగులు వేస్తున్నాడు వేడుక చేయాలని.మర్నాడు జానకమ్మ,వైదేహి అరిసెలు చేసి పేరంటాల్లను పిలిచి, వంశి చేత అరిసెల మీద అడుగులు వేయించారు. ఆ హడావిడి అంతా జగన్నాథం గారు బాల్కని లోంచి చూసారు. పేరంటానికి వెళ్లి ఇంటికి వచ్చిన భార్యని పిలిచి ,"ఆ వేడుక మన ఇంట్లో కూడా చేస్తే నాకు చూడాలని ఉంది"అని అన్నారు.

భర్త మాటలకు ఒక్క క్షణం ఆలోచనలో పడింది వర్ధనమ్మ."మన నట్టింట్లో కూడా చిన్న పిల్లలు బుడి బుడి అడుగులు వేస్తే చూసి ఆనందించాలని నాకూ ఉంది.వాళ్ళు ఏమనుకుంటారో అని జంకుగా ఉంది.రేపే అడిగి చూస్తాను.మన అదృష్టం బాగుంటే వొప్పుకుంటారు.లేకపోతే ..."అని నిట్టూర్చి లోపలకు వెళ్ళింది వర్ధనమ్మ.మర్నాడు జానకమ్మ ఇంటికి వెళ్ళింది.

"వదిన గారూ, మిమ్మల్ని ఒక కోరిక కోరాలని వచ్చాను.కాదనరనే అనుకుంటున్నాను."అంది వర్ధనమ్మ.

"అయ్యో,అంత మాట ఎందుకు?ఏం కావాలో చెప్పండి"సౌమ్యంగా అడిగింది జానకమ్మ.పెద్ద ఉద్యోగస్తుడి భార్యనన్న భేషజం లేకుండా అందరితో కలిసిపోయే వర్ధనమ్మ అంటే జానకమ్మకి చాలా గౌరవం.

"మా వారికి చిన్నపిల్లలు అంటే చాలా సరదా.మీ వంశి చేత మా ఇంట్లో కూడా అడుగులు వేయించాలని ఆయన ముచ్చట పడుతున్నారు.మీరు,వసంత ఏమి అనుకోకుండా వంశిని రేపు మా ఇంటికి తీసుకురాగలరా?"

"భలేవారే,తప్పకుండా వంశిని తీసుకు వస్తాము.దానికేం భాగ్యం."అంది నవ్వుతూ జానకమ్మ.ఆమెకి కృతజ్ఞతలు చెప్పి ఆనందంగా ఇంటికి వచ్చింది వర్ధనమ్మ."ఏమండోయ్, వాళ్ళు వప్పుకున్నారు"అని సంతోషంగా భర్తకి

చెప్పింది.జగన్నాధం గారి మొహం ఆనందంతో వెలిగిపోయింది.వెంటనే స్కూటర్ మీద బజార్ కి వెళ్లి రెండు చీరలు,పిల్లాడికి డ్రెస్ కొన్నారు.స్వగృహ ఫుడ్స్ లో ఏభై అరిసెలు పాక్ చేయించి తీసుకువచ్చారు.

మర్నాడు సాయత్రం వర్ధనమ్మ హాలు లో తన పట్టుచీర పరచి దాని మీద అరిసెలు పెట్టింది.వంశి రాగానే వర్ధనమ్మ,వైదేహి వసంత ల సహకారంతో వాడికి పట్టుబట్ట కట్టి,మెడలో హారాలు వేసి,నెమలి పింఛం పెట్టి కృష్ణుడిలా అలంకరించింది. వంశీ  చేయి పట్టుకుని అరిసెల మీద అడుగులు వేయించింది.జగన్నాధం గారు సెల్ ఫోన్లో ఆ దృశ్యం వీడియో తీసారు.తర్వాత జగన్నాధం గారు వంశీ  చేయి పట్టుకుని అరిసెల మీద నడిపించారు.ఈ దృశ్యాన్ని వర్ధనమ్మ వీడియో తీసింది.వైదేహి,వసంత ఆ వృద్ధదంపతుల ఆనందం చూసి చాలా ముచ్చట పడ్డారు.ఈ ఘట్టం పూర్తికాగానే వర్ధనమ్మ, వాళ్ళు ముగ్గురికి బట్టలు పెట్టింది.

“ఇప్పుడు ఇవన్ని ఎందుకండీ?”మొహమాటంగా అంది వసంత.

“నన్ను నీ  మావయ్యగా అనుకో. కాదనకు”అన్నారు జగన్నాధం గారు.ఆయన అలా అనగానే ఏం మాట్లాడలేక పోయింది వసంత. ఆమె వున్న వారం రోజులూ వర్ధనమ్మ వంశి ని తీసుకురావడం,జగన్నాధం గారు వాడి చేయి పట్టుకుని బుడి బుడి అడుగులు వేయించడం,తర్వాత తను కొన్న బొమ్మలతో వాడితో కలిసి ఆడుకోవడం చేసేవారు. కింద అద్దెకున్న కంప్యూటర్ నేర్చుకుంటున్న అబ్బాయిని పిలిచి వంశీ తో ఉన్న వీడియోలకు కృష్ణుడు మీద ఉన్న పాటలను మిక్స్ చేయించారు. రోజూ ఆ వీడియోలు చూస్తూ ఆనందపడే వారు.

ఒక రోజు బాల్కనిలో కూర్చుని భార్యతో”ఎన్నాళ్ళ నుంచో కంటున్న కల వంశీ  వలన  నెరవేరింది వర్ధనం.నాకు చాలా తృప్తిగా ఉంది.”అని అన్నారు జగన్నాధం. ఆవిడకూ చిన్న పిల్లాడు తమ నట్టింట్లో తిరగడం ఎంతో సంతోషం కలిగించింది. ‘వంశీ  కృష్ణా,యదు వంశీ  కృష్ణా’అంటూ వచ్చే ఆ విడియోలు చూస్తూ ఆమె కూడా ఎంతో ఆనంద పడుతోంది.

ఒక రోజు ఉదయం నిద్రలేచి తన పనులు చూసుకుని వచ్చిన వర్ధనమ్మ కి భర్త ఇంకా నిద్ర లేవకపోవడంతో గదిలోకి  వచ్చి చూసింది.జగన్నాధం గారు నిద్రపోతూనే ఉన్నారు.అనుమానం వచ్చి ‘ఏమండి’ అంటూ గట్టిగా పిలిచి ఆయన్ని కదిపింది. ఆయన కదలలేదు.అది నిద్ర కాదు దీర్ఘనిద్ర అని ఆమెకి తెలిసింది.

ఒక్కసారి ‘ఏమండి”అంటూ బిగ్గరగా అరిచి దుఃఖపడసాగింది.వర్ధనమ్మ ఏడుపుకి జానకమ్మ,వైదేహి గబ గబా పరుగెత్తుకు వచ్చారు. మంచం మీద ప్రశాంతంగా ఉన్న జగన్నాధం గారు,పక్కనే రోదిస్తున్న వర్ధనమ్మ గారిని చూసి ఖిన్నులైపోయారు ఇద్దరూ.వర్ధనమ్మ దగ్గరకు వెళ్లి ఓదార్చారు.”ఆయన కోరిక తీరింది,నన్ను వంటరిదాన్ని చేసి వెళ్లి పోయారు”అంటూ కన్నీళ్ళు పెట్టుకున్నారు వర్ధనమ్మ.

సరిగ్గా అదే సమయానికి 'వంశి కృష్ణా,యదు వంశి కృష్ణా' అంటూ సెల్ ఫోన్ లో వీడియో ఆన్ అయ్యింది. ముగ్గురూ నోటమాట లేక ఆ వీడియో కేసె చూడసాగారు.వంశి బుడి బుడి అడుగులు వేస్తూ కనిపించాడు వీడియోలో. రోజూ ఆ సమయానికి ఆ వీడియో చూడడం ఆయన అలవాటు. అప్పుడు వర్ధనమ్మకి కనిపించింది తలదిండు పక్కన కవర్. ఆమె ఆతృతగా కవర్ తీసి చూసింది. చదివి తర్వాత వైదేహి కి ఇచ్చింది. చదివిన వైదేహి ఆశ్చర్యపోయింది.

ఐదు లక్షల రూపాయలకు ఒక చెక్కు, దానితో చిన్న స్లిప్ "వంశీ కృష్ణ ని బాగా చదివించండి...తాతయ్య "

# మనిషి

దమ్మవళం శ్రీనివాస్

.

అలజడిగా ఉంది రాధకు. ఏం చేయాలో అర్ధంకావటం లేదు. పడగ్గది తలుపు గొళ్ళెం బిగించి మంచం మీద కూర్చొని ఆలోచిస్తుంది. ఫేన్ వేసుకోవాలన్న స్పృహ కూడా లేకపోవటంతో ఒళ్ళంతా చమటలు పట్టేసినయ్. ఈలోగా ఎవరో తలుపు దబదబా బాదడం వినిపించి ఉలిక్కిపడింది. "ఎంతసేపే లోపల? వాళ్ళొచ్చే టైమ్ అయింది. తొందరగా తయారవు. అవతల నాకు బోల్డంత పనుంది.." గట్టిగా అరిచి చెప్పి జవాబు కోసం చూడకుండా హడావిడిగా వెళ్ళిపోయింది తల్లి శారద.

ఇంక తప్పదనుకుంటూ లేచింది రాధ. తండ్రి మీద కోపం ముంచుకొచ్చింది. చెప్పాపెట్టకుండా ఏదో పెళ్ళి సంబంధం పట్టుకొచ్చాడు. తన స్నేహితుడెవరో చెప్పాడట చాలా మంచి కుటుంబం అని. ఆ పూటే వాళ్ళు తనను చూసుకోటానికి రాబోతున్నారు. అన్నీ సరిపోతే సంబంధం కూడా కుదుర్చుకొనే ఉద్దేశంతో ఉన్నారు. ఇంతకు మించి వివరాలు తెలీవు. హడావిడిగా ఫోన్లో విషయం చెప్పి తానూ కాసేపట్లో ఆఫీసు నుంచి వచ్చేస్తానని తయారుగా ఉండమని చెప్పాడు తండ్రి. తల్లికి క్లుప్తంగా విషయం చెప్పి తన కంగారు బయటపెట్టకుండా గదిలోకి దూరి తలుపేసుకుంది రాధ.

ఏడాదిగా ప్రేమిస్తున్న చందూ మనసులో అదేపనిగా మెదులుతున్నాడు. తనను చూసుకోడానికి ఎవరో వస్తున్నారని తెలిసిన వెంటనే అతనికి ఫోన్ చేసి చెప్పాలనిపించినా ధైర్యం చాలక ఆ పని చేయలేకపోయింది. చెబితే ఉన్నపళంగా ఆక్కడకు వచ్చి నానా గొడవ చేస్తాడు. ఇలాంటి విషయాల్లో అతను జగమొండి. పైగా ఏదో పనిమీద అతను సొంతూరు వెళ్ళటం వల్ల రెండ్రోజులుగా సరిగ్గా మాట్లాడటం కుదర్లేదు. ఇప్పుడీ శుభవార్త తెలిసిందంటే మండిపడి ఊళ్ళో

పన్లు మానుకొని మరీ ఇంటికి వచ్చి తండ్రి పరువు తీసేస్తాడు. ఇందులో అతన్ని తప్పుబట్టడానికి కూడా ఏమీ లేదు. తనంటే అతనికి విపరీతమైన ఇష్టం, ప్రేమ..

ఇంట్లో ముందే చెప్పాల్సింది. ఛ. తండ్రి అంత తేలిగ్గా ఒప్పుకునే రకం కాదు. కనీసం తల్లితో అయినా ఈపాటికే చెప్పుంటే ఇక్కడిదాకా వచ్చేది కాదేమో. అయినా ఇంత హఠాత్తుగా ఇలా జరుగుతుందని ఎవరికి తెలుసు. ముందు పెళ్ళిచూపుల తంతు ముగించేస్తే మిగితా విషయాలు తరువాత చూసుకోవచ్చు.

చిన్నగా నిట్టూర్చి ఆటాచ్డ్ బాత్రూమ్ లోకి వెళ్ళి మొహం కడుక్కొని వచ్చి మంచం మీదుంచిన కొత్త చీర యాంత్రికంగా కట్టుకుంటూ మళ్ళీ ఆలోచనలో పడింది. ఆ వస్తున్న వాళ్ళకు తను నచ్చేసి వెంటనే సంబంధం కుదుర్చుకుంటే ఏం చేయాలి? అసలు వాళ్ళెవరో ఏంటో కూడా తెలీదు. తన ఫొటో ఏమైనా తండ్రి వాళ్ళకు పంపి ఉంటాడా? ఫొటో నచ్చే ఇక్కడకు వస్తున్నారా? ముస్తాబవుతూ అద్దంలో తనని పైనుంచి కిందిదాకా చూసుకుందోసారి. కొత్త నీలం రంగు చీరలో తెల్లగా మెరిసిపోతూ నాజూగ్గా, పొడుగ్గా చాలా అందంగా కనిపించింది. తను నచ్చకపోయే ఛాన్స్ చాలా తక్కువ. ఒక్కతే కూతురు కావటంతో కట్నం విషయంలో కూడా ఏమాత్రం రాజీ పడదు తండ్రి.. ఏదోకటి చేసి ఈ సంబంధం తప్పించాల్సిందే. అయినా అబ్బాయికి తను నచ్చితే సరిపోదు కదా. తనకూ అబ్బాయి నచ్చాలి. తనెలాగూ ఈ పెళ్ళికి ఒప్పుకోదు కాబట్టి ఎక్కువగా ఆలోచించటం అనవసరం. ఏదైతే అదయింది. వాళ్ళు వచ్చి వెళ్ళిపోయాక వాళ్ళ రియాక్షన్ చూసి, కుదిరితే ఈ రాత్రికే చందూ గురించి ఇంట్లో చెప్పెయ్యాలి. ఇలా ఆలోచించి మనసు కుదుటపరుచుకొని తలుపు తీసి బయటకు వెళ్ళింది.

★★★

సాయంత్రం ఐదున్నర. తల్లికి వంటగదిలో సాయం చేస్తూండగా వాళ్ళొచ్చారని హడావిడిగా చెప్పి వాళ్ళకు స్వాగతం పలకడానికి వెళ్ళిపోయాడు రాధ తండ్రి. అబ్బాయితోపాటు అమ్మా, నాన్నా వచ్చారు. వాళ్ళని ముందుగదిలో సోఫాలో కూర్చోబెట్టి మాట్లాడుతున్నాడు తండ్రి. వచ్చిన వాళ్ళను లోపల్నుంచి చాటుగా చూసింది రాధ ఆసక్తిగా. అబ్బాయి ఓ పక్కగా కూర్చొని రాధ తండ్రి చెప్పే విషయాలు శ్రద్ధగా వింటున్నాడు. అతడి అమ్మా, నాన్నా మరో పక్క కూర్చొని ఉన్నారు. అబ్బాయిని మరోసారి పరికించి చూసింది. వయసు ముప్పై లోపే ఉంటుందనిపించింది. నల్లటి రింగుల జుట్టు, ఎర్రటి మొహం, స్టైలిష్ గా సన్నగా కట్ చేసిన మీసాలు, గడ్డం.. బ్లూ జీన్స్ మీద వైట్ షర్ట్ టక్ చేసుకొని చాలా అందంగా సినిమా హీరోల కన్నా బావున్నాడు. ముందుగది కిటికీలోంచి ఇంటి ముందు ఠీవీగా పార్క్ చేసిన వాళ్ళ పొడుగాటి కారు కూడా కనిపించింది. 'అబ్బాయి బావున్నాడు' అప్రయత్నంగా అనుకుంది మనసులో. ఈలోగా శారద ట్రేలో మంచినీళ్ళు పట్టుకెళ్ళబోతూ రాధను తయారుగా ఉండమని చెప్పింది. గదిలోకి అన్యమనస్కంగా వచ్చింది రాధ. అద్దంలో తనని తాను చూసుకుంది. 'అబ్బాయేంటి అంత బావున్నాడు, తన అందానికి సరైన జోడీలా..' మనసులో మళ్ళీ అలజడి. అయితే

ఇప్పుడు కారణం వేరు. హేండ్ బేగ్ లోంచి లిప్స్టిక్ తీసి పెదాల రంగులో కలిసిపోయేలా చక్కగా రాసుకొని చూసుకుంది. అందం రెట్టింపైనట్టుగా అనిపించింది.

"అమ్మాయ్, ఇలా రా" తండ్రి గొంతు వినిపించింది. మరోసారి అద్దంలో చూసుకుంటూ జుట్టు, చీర సరిచేసుకొని ముందుగదిలోకి వెళ్ళింది. తండ్రి పక్కనే కూర్చుంది వచ్చిన వాళ్ళకి నమస్కారం చేసి. ఎదురుగా కూర్చున్న అబ్బాయి రాధని పరీక్షగా చూస్తూ చిరునవ్వు నవ్వాడు పలకరింపుగా. తనూ నవ్వింది సిగ్గుపడుతూ. దగ్గరనుంచి అతడు మరింత అందంగా కనిపించాడు. రాధ తండ్రి అబ్బాయిని పరిచయం చేసాడు. పేరు రాకేశ్. ఒక్కడే సంతానం. సి.ఏ పూర్తి చేసి చాలా పెద్ద కంపెనీలో మంచి స్థాయిలో ఉన్నాడు. అదే ఊళ్ళో ఆఫీసుకు దగ్గరగా సొంత విల్లాలో ఉంటున్నారు. ఆ తరువాత కొద్దిసేపు పెద్దవాళ్ళు మాట్లాడుకుంటూ, స్నాక్స్ తింటూ గడిపారు. రాకేశ్ కళ్ళు మాటిమాటికీ తన వైపే తిరగడం గమనించి చిన్నగా నవ్వుకుంది రాధ.

"మీరిద్దరూ ఏదైనా మాట్లాడుకోవాలంటే డాబా మీదకు వెళ్ళండి" అన్నాడు రాధ తండ్రి రాకేశ్ వైపు తిరిగి. జవాబు కోసం చూడకుండా "అబ్బాయిని తీసుకెళ్ళమ్మా.." అన్నాడు రాధతో. లేచి నిలబడింది రాధ. రాకేశ్ కూడా లేచాక ఇద్దరూ ముందుగది బయటకు వచ్చి విశాలంగా ఉన్న మెట్లెక్కి డాబా మీదకు చేరుకున్నారు. జరిగేది కలా నిజమా అర్థంకానట్టుగా అయోమయంగా అనిపించింది రాధకు. అంతటి అందగాడి పక్కన జంటగా నడుస్తూంటే ఏదో తెలియని పరవశం తనని కమ్మేసినట్టుగా, మనసు తన మాట వినాలన్న ధ్యాస కూడా లేకుండా తన పని తాను చేసుకుపోతునట్టుగా అనిపించింది.

చల్లటి గాలి వీస్తూంది. హాయిగా అనిపించింది ఇద్దరికీ. మనసులో రేగుతున్న అలజడిని తొక్కిపెట్టి పైకి సరదాగా ఉండటానికి ప్రయత్నించింది రాధ. ఇద్దరూ కాసేపు ఒకరి గురించి ఒకరు తెలుసుకున్నాక అడిగాడు రాకేశ్ కొద్దిగా మొహమాటపడుతూ "మీరెవరినైనా ఇష్టపడ్డారా ఇదివరకు?"

ఉలిక్కిపడాలన్న ఆలోచన కూడా రానట్టుగా, మెదడు మొద్దుబారినట్టుగా అనిపించింది క్షణకాలం. వెంటనే తేరుకొని "లేదు.." అని చిన్నగా నవ్వుతూ జవాబిచ్చింది, ఏ అనుమానానికీ తావులేకుండా. జవాబు విన్నాక అతడి మొహం మరింత ప్రసన్నంగా మారటం గమనించింది. మరి కాసేపు ఇద్దరూ సరదాగా మాట్లాడుకున్నాక ఇంట్లోకి తిరిగివచ్చారు. ఉత్సాహం రేకెత్తించేలా ఉండే అతడి మాటలు, ప్రవర్తనా బాగా నచ్చినయ్ రాధకు. మాటల మధ్యలో అనుకోకుండా తన చేతివేళ్ళు అతడి చేతిని తాకినప్పుడు కలిగిన అనుభూతి ఆమె మనసుని గిలిగింతలు పెట్టింది.

సంబంధం రెండు కుటుంబాలకూ నచ్చింది. త్వరలో కబురు చేస్తామని అమ్మాయి జాతకం కూడా అడిగి తీసుకెళ్ళారు రాకేశ్ కుటుంబం. అంతా సద్దుమణిగాక, రాధ కుటుంబం వచ్చిన సంబంధం గురించి చాలాసేపు

చర్చించుకున్నారు. అన్ని విధాలా సరైన సంబంధం అని తల్లీ తండ్రీ తేల్చేసారు సంతోషంగా. కాసేపటి తరువాత సంబంధం కుదిర్చిన స్నేహితుడు కూడా రాధ తండ్రికి ఫోన్ చేసి అమ్మాయి వాళ్ళకు బాగా నచ్చేసిందన్న వార్త చెప్పాడు.

ఆ రాత్రంతా రాధకు నిద్రలేదు. రాకేశ్ ను మొదటిసారి చూసిన దగ్గరనుంచీ చందూ గురించిన ఆలోచనలు చాలా ఇబ్బందిగా మారాయి. తను చేసేది తప్పా కాదా అని నిజాయితీగా ఆలోచిస్తూ తేల్చుకోవటం చాలా కష్టంగా తోచింది. చందూని ఇష్టపడిన మాట నిజమే. కానీ రాకేశ్ చందూ కన్నా ఎక్కువగా నచ్చేసాడు. ఇందులో ఏంటి తప్పు? చందూని తనింకా పెళ్ళి చేసుకోలేదు కదా. పెళ్ళి చేసుకొని ఉంటే ఇదంతా ఖచ్చితంగా తప్పే. ఇప్పుడు మాత్రం కాదు. అందం, ఆస్తి, సంపాదన, హోదా, చలాకీతనం అన్నింటిలోనూ చందూ మీద రాకేశ్ దే పైచేయి. అతడిలాంటి భర్త దొరకటం అంత తేలిక కాదు. మరింకేంటి సమస్య? చందూతో నడిపిన ప్రేమ వ్యవహారమా? రాకేశ్ వాళ్ళు రాకముందు తను నిజాయితీగా చందూనే పెళ్ళి చేసుకుందామని గట్టిగా నిర్ణయించుకుంది. అయితే ఇప్పుడదంతా మారింది. ఇలా మారటం తప్పా? ఇంతమాత్రానికే తనేమైనా స్వార్ధపరురాల జాబితాలో చేరిపోతుందా? తన స్థానంలో చందూ ఉండి తనకన్నా అందమైన, డబ్బున్న అమ్మాయి తగిలితే ఏం చేసేవాడు? రెండో ఆలోచన లేకుండా తనని వదిలేసేవాడా? అలా అయితే తమ మధ్య ఉన్న ప్రేమకి ఏంటర్ధం? ప్రేమంటే ఇంతేనా? లేక తామిద్దరి మధ్య ఉన్నది కేవలం ఆకర్షణ మాత్రమేనా? అయినా సినిమాల్లో చూపించినట్టు ప్రేమ వ్యవహారాలన్నీ పెళ్ళికే దారితీస్తున్నాయా ఏమైనా. ఒకర్ని ప్రేమించి మరొకర్ని పెళ్ళాడటం ఈరోజుల్లో చాలా మామూలుగా జరిగే విషయం. తనకి చందూతో ప్రేమే ముఖ్యమని అనుకుంటే రాకేశ్ లాంటి వాడ్ని పొదులుకోవాల్సి వస్తుంది. ఇంత గొప్ప సంబంధం పొదులుకోవటం ఏవిధంగా న్యాయం? ఇది స్వార్ధమే అనుకున్నా ఏంటి తప్పు? సరైన జీవిత భాగస్వామిని ఎంచుకొని ఆనందంగా జీవించాలనుకోవటం అసలు తప్పెలా అవుతుంది? చందూకి కూడా తనకన్నా మంచి పిల్లే దొరకొచ్చు. అతడ్ని నిజాయితీగా ప్రేమించిన వ్యక్తిగా తను కోరుకునేది కూడా అదే! నిజమైన ప్రేమకు అర్ధం అవతలి వ్యక్తి సంతోషంగా ఉండాలని కోరుకోవటమే. ఇందులో ఏ స్వార్ధమూ లేదు.

రాత్రంతా చాలాసేపు మేల్కొని రకరకాలుగా ఆలోచించి రాకేశ్ తో తన జీవితం ముడిపడటం అన్ని విధాలా సరైన నిర్ణయమని నిశ్చయించుకుంది. పడుకునే ముందు ఫోన్ చూసుకుంటే చందూ నుంచి పదిహేను మిస్డ్ కాల్స్ కనిపించినయ్. “అంతా ఓకేనా? అర్జెంట్ గా కాల్ చెయ్యి” అన్న మెసేజ్ కూడా వచ్చింది. అప్పుడు గుర్తొచ్చింది పెళ్ళి చూపుల హడావిడిలో తను ఫోన్ చూడటమే మర్చిపోయిందని. ఫోన్ ఆఫ్ చేసి నిద్రలోకి జారుకుంది.

★★★

ఉదయం నిద్రలేస్తూనే రాధ మొహం మీద సిగ్గుతో కూడిన చిరునవ్వు. రాకేశ్ తో పెళ్ళి జరిగినట్టూ, తామిద్దరూ ఏకాంతంగా గడిపినట్టూ వచ్చిన కలలు ఆమెను తన్మయత్వంలో ముంచెత్తాయి. త్వరగా స్నానం మొదలైనవి

పూర్తిచేసుకొని ప్రశాంతంగా కూర్చొని తనకున్న అతి పెద్ద సమస్య గురించి ఆలోచించింది. అది చందూకి బ్రేకప్ ఎలా చెప్పడమా అని.

ముందుగా ఫోన్ ఆన్ చేసి చందూకి మెసేజ్ పెట్టింది కాసేపట్లో ఫోన్ చేస్తానని. మెసేజ్ డెలివర్ అవలేదు. ఇదీ ఒకందుకు మంచిదే. తనకూ సమయం దొరుకుతుంది. అయినా ఇలాంటి విషయాలు ఫోన్లో చెప్పటం కన్నా నేరుగా మాట్లాడటమే మంచిది. అతను ఊళ్ళోకి తిరిగి రాగానే కలిసి మాట్లాడాలి. చాలాసేపు ఆలోచించాక ఈ విధంగా చెప్పాలనుకుంది. 'తనకు తండ్రి ఓ పెళ్ళి సంబంధం చూస్తే, తన ప్రేమ విషయం ఇంట్లో గట్టిగా చెప్పేసింది. పెద్ద గొడవ జరిగింది. తను చందూని తప్ప ఎవర్నీ చేసుకోనని మొండిగా చెప్పటంతో, తల్లీ తండ్రీ ఇద్దరూ ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించి బలవంతగా పెళ్ళి కుదిర్చారు. తల్లిదండ్రుల మన:శాంతి కోసం ఇప్పుడు ప్రేమని త్యాగం చేయాల్సి వస్తుంది. అందుకే నిన్నంతా ఫోన్ తీయడం కుదర్లేదు..'

ఇవన్నీ చెబుతున్నప్పుడు చందూ ఎలా స్పందిస్తాడో ముందుగానే ఊహించుకొని దానికి ఎలా ప్రతిస్పందించాలో కూడా బాగా అనుకున్నాక తృప్తిగా అనిపించింది. అతను ఎంత మొండివాడైనా, తనే వేరే పెళ్ళికి ఒప్పేసుకుంటే ఏం చేయగలడు. కొన్నాళ్ళు ఇద్దరికీ బాధగానే ఉంటుంది ఆ తరువాత అంతా సర్దుకుపోతుంది. జీవితమంటే సర్దుకుపోవటమేగా.

సాయంత్రానికి చందూనుంచి రిప్లై వచ్చింది, ఎల్లుండి సాయంత్రం ఊళ్ళోకి వస్తున్నానని, రాగానే కలుస్తాడని. మెసేజ్ చదువుకొని చిన్నగా నిట్టూర్చింది రాధ. చందూని ఎప్పుడూ కలిసే పార్క్ లో కలవటం అంత మంచిది కాదు. ఎవరైనా చూస్తే బాగోదు. సంబంధం కూడా చెడిపోవచ్చు. ఏ గుడిలాంటి ప్రదేశమైతే మంచింది. ఎవరైనా చూసినా తప్పుగా అనుకోరు. మరికాసేపు అతడ్ని ఎలా ఒప్పించాలా అని ఆలోచించింది.

★★★

"ఏంటమ్మా నువ్వనేది??" బాధగా అడిగింది రాధ మర్నాటి ఉదయం.

"అవునే. అబ్బాయి తల్లిదండ్రులకి జాతకాల పిచ్చిట. నీ జాతకం ఏమాత్రం సరిపోలేదట. సంబంధం కుదర్లేదు అని బాధపడిపోతూ చెప్పారట. పోన్లే ఎలా రాసిపెట్టుంటే అలా జరుగుతుంది.." కొద్దిగా విచారంగా చెప్పింది శారద. కుటుంబమంతా సంబంధం కుదిరిపోయినట్టే అని సంబరపడ్డారు అప్పటిదాకా.

హతాశురాలైంది రాధ. ఏంటిది ఇలా జరిగింది. రాకేశ్ తో జీవితం గురించి ఎన్నెన్నో ఊహించుకుంది. ఊహలన్నీ పేకమేడలకన్నా దారుణంగా కూలిపోయినయ్. ఆ రోజంతా భోజనానికి తప్ప గదిలోంచి బయటకు రాలేదు. దేనిమీదా మనసు రావట్లేదు. తనకేదో అన్యాయం జరిగినట్టుగా అనిపిస్తుంది. మధ్యలో చందూ చాలాసార్లు ఫోన్ చేసాడు.

డిస్కనెక్ట్ చేసి ఇంట్లో ఏదో పనిలో ఉన్నానని మెసేజ్ చేసింది. ఆ తరువాత కూడా వరుసగా కాల్స్ రావటంతో ఫోన్ ఆఫ్ చేసేసింది విసుగ్గా.

సాయంత్రానికి బాధ నుంచి తేరుకొని జరిగిందంతా ఓ పీడకలలా మర్చిపోవాలనుకుంది. పీడకల కాక మరేంటి. చందూని గాఢంగా ప్రేమించి, ఇంకొకర్ని ఎలా పెళ్ళి చేసుకోగలదు? తన జీవితం చందూతో ముడిపడుంది. ఇక రెండో ఆలోచన లేదు. ఇప్పుడే ఇంట్లో చెబితే బాగోదు. కొన్నాళ్ళు పోయాక చెబుదాం. ఇలా కాసేపు ఆలోచించాక మనసు తేలికపడ్డది. చందూతో మాట్లాడదామని ఫోన్ చేస్తే ఎంతసేపటికీ కలవలేదు. తమ ఊళ్ళో సిగ్నల్ సరిగ్గా ఉండదని అతడు చెప్పటం గుర్తుకొచ్చింది. మెసేజ్ పెట్టింది ఫోన్ చేయమని. మళ్ళీ చందూ గురించిన ఆలోచనలు మొదలైనయ్ ఎప్పటిలాగే.

★★★

ఉదయం నిద్రలేస్తూనే చందూ నుంచి ఫోన్. ఉత్సాహంగా మాట్లాడింది రాధ. ఎప్పుడెప్పుడు అతడ్ని కలిసి అతడి కౌగిట్లో కరిగిపోదామా అని మనసు ఉరకలేస్తుంది. కాసేపు మాట్లాడాక సాయంత్రం ఎక్కడ కలవాలో చెప్పాడు. ఫోన్ పెట్టేసాక ఆలోచనలో పడింది. గత కొన్నిరోజులుగా జరిగినవి ఇంకా మనసుని పట్టి పీడిస్తున్నట్టున్నాయి. చందూతో సంభాషణ ఇంతకుముందులా అనిపించలేదు. త్వరగా జరిగింది మర్చిపోయి జరగాల్సింది చూడాలి అనుకుంది చిన్నగా నిట్టూర్చి.

సాయంత్రం ఆరింటికల్లా చందూ చెప్పిన చోటుకు చేరుకుంది. వచ్చిన చోటు సరైందేనా అని అనుమానించి అతను పంపిన లొకేషన్ మేప్ మరోసారి చూసుకుంది. అంతా కరెక్టే. అదే చోటు. సంగీత కచేరీలు, భక్తి కార్యక్రమాలు మొదలైనవి జరిగే సెంటర్ అది. గేట్ తీసుకొని లోపలకు వెళ్ళింది. అక్కడో పెద్ద హాల్లో ఏదో ప్రవచన కార్యక్రమం జరుగుతోంది. మైక్ లో చెప్పటంవల్ల బయటకు కూడా బాగానే వినిపిస్తోంది. లోపలకు తొంగి చూసింది. అంతా సందడిగా ఉంది. టీవీలో భక్తి కార్యక్రమాల్లో తరచూ కనిపించే ఓ పెద్దాయన స్టేజ్ మీద మైక్ ముందు కూర్చొని ప్రసంగిస్తూంటే జనాలు ఆసక్తిగా వింటున్నారు. చెప్పులు బయట విడిచి తను కూడా లోపలకు వెళ్ళి వెనక వరసలో ఓ మూలనున్న కుర్చీలో కూర్చుంది. ఇక్కడకు రమ్మన్నాడేంటి? ఇంకెవరినైనా తనతో తీసుకు వస్తున్నాడా? అని అనుకుంది.

“.. మనుషులు స్వార్థపూరితమైన మనస్తత్వం కలవారు. వారికి కలిగే ప్రతీ అనర్థం, బాధ, దు:ఖం వెనుక ఏదో ఒక స్వార్థపూరిమైన ఉద్దేశం, కోరిక తప్పకుండా ఉంటాయి. అయితే, విచిత్రమేంటంటే తాము పడే బాధలకీ, దు:ఖానికీ తమ స్వార్థమే కారణమన్న చిన్న విషయం అర్థం చేసుకోటానికి కూడా చాలా మంది ప్రయత్నించరు..” చక్కటి ఉచ్చారణతో ఆకట్టుకొనేలా ప్రసంగిస్తున్న పెద్దాయన వైపు విసుగ్గా చూస్తూ, ఆయన చెప్పేది చిరాగ్గా వింటూ కూర్చుంది రాధ ఇంకేం చేయాలో తెలీక.

కాసేపటికి వచ్చాడు చందూ. హాలు తలుపు దగ్గర అతడ్ని చూసి, కుర్చీలోంచి చప్పున లేచి పరుగులాంటి నడకతో దగ్గరకు వచ్చింది సంతోషంగా. అయితే అతడి మొహం పీక్కుపోయి దిగులుగా కనబడింది. ఒంటి మీద ధ్యాస లేనట్టుగా ఉన్నాడు.

"ఏమైంది చందూ? ఏంటలా ఉన్నావ్?" కంగారుగా అడిగింది. ఇద్దరూ హాలు బయటకు వచ్చి ఓ పక్కగా నుంచొని మాట్లాడుతున్నారు.

"నువ్వు నన్ను మర్చిపోవాలి రాధా.." బాధగా చెప్పాడు.

"అదేంటి?? ఎందుకు??"

"మా ఇంట్లో నాకో పెద్దింటి సంబంధం చూసారు. ఊళ్ళో నిశ్చితార్థం కూడా జరిగిపోయింది. నీకు జరిగేది చెబుదామని ఎంతో ప్రయత్నించాను. నువ్వు ఫోన్ ఎత్తలేదు. చాలాసార్లు ఆఫ్ చేసి ఉంది. మా అమ్మా, నాన్నా బలవంతంగా నాకీ సంబంధం కట్టబెట్టారు. నీ గురించి చెప్పి, చేసుకోనని మొండికేస్తే ఇంట్లో పెద్ద గొడవ జరిగింది. చివరకు మా అమ్మ విషం తాగి చస్తానని బెదిరించి నిజంగానే తాగబోయింది. ఏం చేయాలో తెలీక పిచ్చెక్కిపోయి చివరకు వేరే దారేదీ కనబడక వాళ్ళు చెప్పినదానికి ఒప్పుకున్నాను. బంగారంలాంటి నిన్ను దూరం చేసుకున్నాను. ఇదంతా ఫోన్లో కాకుండా నేరుగా కలిసే చెబుదామని ఆగాను.. నిన్ను నాతో ఎవరైనా పబ్లిగ్గా చూస్తే బాగుండదని ఇక్కడకు రమ్మన్నాను.." ఎంతో బాధగా చెప్పాడు. చెబుతున్నంతసేపూ కంటినిండా నీళ్ళు. ఎంతో కాలంగా గుండెల్లో అదిమిపెట్టిన బాధ అంతా ఒక్కసారిగా బయటకు వచ్చినట్టైంది.

నిర్ఘాంతపోయింది రాధ. నోటమాట రాలేదు. ఇలా జరుగుతుందని ఏమాత్రం ఊహించలేదు. కాసేపటికి తేరుకుంది. సర్వం కోల్పోయినవాడిలా ఉన్న చందూని చూసి అప్పటిదాకా ఉన్న కంగారంతా ఇప్పుడు భరించలేని కోపంగా మారింది.

"ఛీ. దుర్మార్గుడా!! నీ అంత నీచుడు, స్వార్థపరుడు ఇంకొకడు ఉండడు. డబ్బుకు ఆశపడి నిజాయితీగా ప్రేమించిన నాలాంటి అమ్మాయిని కాదనుకుంటున్నావ్. నువ్వే ఆ పిల్లను ఇష్టపడి, నోటికొచ్చిన కథ చెప్పి నన్నొదిలించుకుంటున్నావ్. నీలాంటివాడ్ని ప్రేమించినందుకు నాకీ శాస్తి తప్పదు. నీ మొహం నాకెప్పుడూ చూపించకు.. మనుషులు ఎంత స్వార్థపరులో లోపల పెద్దాయన చక్కగా చెబుతున్నాడు. బాగా విని ఇంటికి వెళ్ళు. నీలాంటి నీచులకు చాలా అవసరం.." కోపంగా చెప్పి అతడు చెప్పేది వినిపించుకోకుండా, తనను ఆపబోయిన అతడి చేతిని విసిరికొట్టి, చెప్పులు తొడుక్కొని ఏడుస్తూ అక్కడనుంచి వెళ్ళిపోయింది రాధ.

“..మనిషికున్న అతిపెద్ద దుర్గుణం తాను చేసేది ముమ్మాటికీ సరైందే అని మనస్ఫూర్తిగా నమ్ముతూ, అదే పని  అవతలి మనిషి చేస్తే సహించలేకపోవటం..” లోపల జరిగే ప్రసంగం బయటకు వినబడుతోంది స్పష్టంగా, తేలిగ్గా అర్థమయ్యేలా..

★★★

రెండు రోజుల తరువాత చందూకి ఫోన్ చేసింది రాధ. “నన్ను క్షమించు చందూ. నీ పరిస్థితి తెలుసుకోకుండా ఇష్టం వచ్చినట్టు మాట్లాడేసాను. ఇంట్లో వాళ్ళు విషం తాగి చస్తానంటే నువ్వు మటుకు ఏం చేయగలవు? నువ్వు సంతోషంగా ఉండటమే నాకు కావాల్సింది. నిజమైన ప్రేమకు అర్థం ఇదే.. చక్కగా పెళ్ళి చేసుకొని సుఖంగా జీవించు. ఉంటాను..”

క్రితం రోజే, జాతకాలు సరిగ్గా సరిపోకపోయినా అబ్బాయి పట్టుబట్టడంతో తన పెళ్లి రాకేశ్ తో నిశ్చయమైపోయిన విషయం మటుకు చందూకి చెప్పలేదు రాధ. అతడ్ని అనవసరంగా బాధ పెట్టడం ఇష్టం లేక. ని..జ..మై..న ప్రేమకు ఇదే కదా అర్థం!

## మల్లన్న పాగా

రాచపూటి రమేష్

ఆ ఇంట్లో నుండి టకటకమని మగ్గం వేసే శబ్దం వినిపిస్తోంది. నడుములోతు మగ్గం గుంటలో దిగి మగ్గం పోగులపై కదుపుతూ, ఒడుపుగా మగ్గంపై జరీ చీర నేస్తున్నాడు శేఖర.

తలుపు కిర్రుమని శబ్దం చేస్తూ తెరచుకొంది. ఆయాసపడ్తూ లోనికి వస్తున్న తండ్రి భూషణాన్ని పట్టుకొని నడిపిస్తూ లోనికి తీసుకొచ్చాడతని చిన్న కొడుకు కేశవ, వుసూరుమంటూ మంచంపై కూలబడ్డాడు నాగభూషణం.

“వూపిరితిత్తుల డాక్టరేవున్నారు నాయన గురించి? "తమ్ముణ్ణి ప్రశ్నించాడు శేఖర చేస్తున్న పనినాపి.

“ఆస్తమా బాగా ముదిరిపోయిందంట. ఇన్‌హేలరూ, మాత్తర్లూ వాడుతుంటామని చెప్పినా అప్పటికీ, ఇంకా ఏవో మాత్తర్లు రాసిచ్చినాడు, ‘నువ్విటరా’ అని అన్నను పిలిచాడు కేశవ, మగ్గం గుంటలోంచి బయటకు వచ్చి కేశవతో బాటూ ఇంటి బయటకు నడిచాడు శేఖర.

"నాయనకేమీ బాగా లేదు. నెలా, రెండు నెల్ల కన్నా ఎక్కువ బతికేది కష్టమంటాడు డాక్టరు. ఆయన్ను బాగా చూసుకోమని చెప్పనాడు" చిన్నగా చెప్పాడు కేశవ. శేఖర దిగులుగా ఆలోచిస్తూ వుండిపోయాడు.

"నేను ఆసామి. ఇంట్లో మగ్గం నేయను పోతావున్నా, నువ్వొ వదినే నాయన కాడ వుండండి" అని వెళ్ళిపోయాడు కేశవ. శేఖర దిగులుగా ఇంట్లోకి నడిచాడు. అప్పటికే అతడి తండ్రి భూషణం మంచంపై ఆయాసంతో మూలుగుతూ పడుకొని వున్నాడు.

శ్రీకాళహస్తిలోని సాలిపేట, భాస్కర పేటలలో ఐదువందలకు మించి చేనేత మగ్గాలున్నాయి. స్వగ్రామమైన ఏర్పేడు నుండి ముప్పై సంవత్సరాల క్రితం బతుకు తెరువు కోసం అక్కడికి చేరుకున్నాడు. భూషణం, అనువంశిక వృత్తి ఐన మగ్గంనేత అతనికి బాగా తెలిసి వుండడంతో, మగ్గాల పై జరీచీరలు, పట్టుచీరలు నేయించి వ్యాపారం చేసే నీలకంఠయ్య అనే ఆసామి భూషణాన్ని పనిలో పెట్టుకున్నాడు.

ఆసామి దగ్గర నూలు, జరీలు తీసుకొని చెప్పిన గడువులోగా చీరలు నేసి ఆసామికిచ్చి కూలీ తీసుకొనేవాడు భూషణం. కష్టపడే తత్వం బాగా వుండడంతో బాటు ముట్కా తాగుడు వంటి అలవాట్లేమీ లేకపోవడంతో ఆసామి. నీలకంఠకు ప్రీతిపాత్రుడుగా మారాడు భూషణం.

కొన్నాళ్ళకు నీలకంఠయ్యే భూషణానికి సంబంధం వెతికి పూర్ణ అనే అమ్మాయితో వివాహం జరిపించాడు. కూడబెట్టిన డబ్బుతో బాటూ, తాను పనిచేసే ఆసామి దగ్గర కొంత అప్పు చేసి, సాలిపేట శివార్లలో ఒక చిన్న పెంకుటిల్లు సమకూర్చుకోగలిగాడు భూషణం.

కాలక్రమంలో భూషణానికి శేఖర, కేశవ అనే ఇద్దరు పిల్లలు పుట్టుకొచ్చారు. స్తోమత లేకపోవడంతో భూషణం కొడుకులిద్దరూ పదవ తరగతితో చదువుకు స్వస్తి చెప్పి మగ్గం పనిలోకి దిగారు. కొడుకు లిద్దరూ పుట్టాక అలస్యంగా పుట్టిన కూతురు రేవతి మాత్రం కొంత మేర చదువుకొని, తిరుపతిలో నర్సు ట్రైనింగు చేస్తూవుంది. ఆమె పెళ్ళి కోసం కష్టించి కూడబెట్టిన సొమ్ము బ్యాంకులో భద్రంగా డిపాజిట్ చేశాడు భూషణం.

మగ్గం గుంతలో చీరలు వేస్తూ వున్నప్పుడు నిరంతరం తోడుగా వుండే దుమ్ము, ధూళి సోకి, కొన్నాళ్లకు భూషణానికి ఆస్తమా దాపురించింది. మందులు వాడుతూనే మగ్గం పనికొనసాగించాడు. పులిమీద పుట్రలా నిరంతరం అతడి వెన్నంటే నిలిచిన అతని భార్య పూర్ణ హఠాత్తుగా గుండెపోటుతో మరణించింది. దానితో మరింత కుంగిపోయాడు భూషణం. కొడుకులూ, కూతురు ఎంత సర్ది చెప్పినా, మామూలు మనిషి కాలేకపోయాడు.

దిగులుతో అతని జబ్బు మరింత ముదిరింది. వంట చేసుకుంటూనో, రాట్నంపై కండెలు చుట్టుకుంటూనో వినయ విధేయులతో వుండే భార్య జ్ఞాపకాలు నిరంతరం భూషణాన్ని బాధించసాగాయి.

మూడు నెలల నుండీ అనారోగ్యంతో మగ్గం పనికి వెళ్ళలేక ఇంటి వద్దే వున్నాడు భూషణం. ఇంట్లో వున్న మగ్గంలో అతడి పెద్ద కొడుకు శేఖర జరీచీరలు నేసి నీలకంతయ్యకు ఇస్తూ వుంటే, మరోకొడుకు కేశవ మాత్రం ధర్మరాజనే మరో పట్టుచీరల వ్యాపారి ఇంటివద్ద వున్న మగ్గాల షెడ్లో మగ్గం నేస్తూ వున్నాడు. శేఖరకు రెండేళ్ల క్రితమే పెళ్లయింది. అతడి భార్య అరుణ ఇంట్లో వంటా, వార్పూ చూసుకొంటోంది.

దగ్గు తెర ముంచుకు రావడంతో ఆయాసంతో పుక్కిరి బిక్కిరయ్యాడు భూషణం. మగ్గం గుంటలోంచి లేచి తండ్రి వద్దకు వచ్చి మంచినీళ్లు తాగించాడు శేఖర. మంచం పై తండ్రి పక్కన కూర్చున్నాడు.

"బాబూ, శేఖరా, నీతో ఒక ముఖ్య విషయం చెప్పాలి" ఆయాసపడ్తూ అన్నాడు భూషణం. శేఖర ఆశ్చర్యంగా తండ్రి వంక చూశాడు.

"మీ చెల్లెలు రేవతి పుట్టినప్పుడు మీ అమ్మకు మూడో కాన్పు చాలా కష్టమై పోయింది. కడుపులో బిడ్డ అడ్డం తిరిగుండాదని, తల్లి ప్రాణాలకు కష్టమని చెప్పినారు డాక్టర్లు. దాంతో నేను భయపడి, కాన్పు సక్రమంగా ఐతే శ్రీశైలంలో మల్లన్నకు పట్టుపాగా సమర్పిస్తానని మొక్కుకుంది. దేవుడి దయ వలన మీ అమ్మకు కాన్పు సరిగ్గానే జరిగి, ఆడపిల్ల పుట్టింది. ఆ పాగా స్వంతంగా మగ్గం పైన నేసి తీసుకొని పోవడానికి ఎనిమిదివేల దాక కర్చొస్తుంది. నూలు, జరీ, సప్పురీ ఇదీ కొనాలి గదా! ఎన్నిసార్లు డబ్బు చేర్చి పెట్టుకున్నా ఏదో ఒక ఖర్చు వచ్చి డబ్బు కర్చయిపొయ్యేది.

డబ్బు చేతిలో వుంటే ఆసామికి భారీగా చీరల ఆర్డర్లు వచ్చేసుండి, పని ఒత్తిడి ఎక్కువగా వుండేది. దానితో ఈ వేళిర్ కూడా ఆ పాగా నేసి మల్లయ్య స్వామికి సమర్పించుకోలేక పోతిని నేను.

శివరాత్తిరి టయానికి కొందరు మగ్గాలోళ్లు ఆ పాగాను తీసుకొని పొయ్యి, ముందుగా దేవస్థానం ఆఫీసులో అధికార్లను కలిసి, ఆ పాగా ఇస్తారు. పూజార్లు రానికి కుంకుమ, పసుపురాసి, దేవుడికి నివేదన చేసి, దేవుడి ముందుండే దీపాల చుట్టూ చుట్టారు. కొన్ని తూర్లు పాగా బాగా వుంటే దేవుడికి అలంకరిస్తారు.

ఎన్ని పన్లున్నా, నువ్వీ శివరాత్రికి ఆ పాగా తయారు చేసుకొని పోయి శ్రీశైలంలో మల్లయ్య స్వామికి సమర్పించాల! ఇది నా కడ కోరిక" అన్నాడు ఆయాసపత్తూ భూషణం,

శేఖర నివ్వెరపోయాడు. కాసేపు ఆలోచించి "అట్టాగే నాయనా, ఎన్ని వస్తున్నా, ఆ పాగా తయారు చేసుకొని శ్రీశైలానికి పొయ్యొస్తానులే" అని తండ్రికి మాటిచ్చాడు. దానితో భూషణం నిశ్చింతగా ఊపిరి పీల్చుకున్నాడు.

శివరాత్రికంతా అరవై రోజులే గడువుంది. శేఖర ఆ పాగా తయారు చేయడం గురించి ఆలోచించసాగాడు.

శేఖర పోస్టాఫీసు ఖాతాలో ఏడువేల దాకా వుంటుంది. మరొక వెయ్యి రూపాయలు ఎవరో ఒకరి దగ్గర

చేబదులు తీసుకోవాలని అనుకున్నాడు.

శేఖర అడిగిన వెంటనే అతని మిత్రుడు నాగరాజు ఇంట్లోకి వెళ్ళి వెయ్యి రూపాయలు తెచ్చి శేఖర్ కిచ్చాడు. కానీ మరొక నెల రోజులలోగా ఆ డబ్బు తనకు తిరిగి ఇచ్చేయాలని, మరుసటి నెల తమ తిరుమల యాత్రకు ఆ డబ్బు అవసరం అని అన్నాడు. శేఖర అందుకు ఒప్పుకున్నాడు,

శేఖర పక్క ఇంట్లో వుండే వెంకటేశ్వర్లు ఇంట్లో మరో మగ్గం వుంది. జకార్డు బిగించిన ఆ మగ్గాన్ని చాలా రోజులుగా వెంకటేశ్వర్లు వాడడం లేదు. మగ్గాల పని గిట్టుబాటు కావడం లేదని కొంత కాలంగా వెంకటేశ్వర్లు చీరలు కొని, ఊర్లు తిరిగి ఇంటింటికీ వాటిని అమ్ముతూ వ్యాపారం చేసుకొంటున్నాడు.

వెంకటేశ్వర్లుకు చెప్పి, శేఖర ఆ మగ్గంలో పట్టు పాగా వేయడానికి పూనుకొన్నాడు. డిజైన్ల కోసం కావాల్సిన అట్టలను డిజైను అట్టలు తయారు చేసే మునస్వామి వద్ద కొని తెచ్చి ఆకారుకు బిగించాడు. పట్టునూలు, వార్పు, జరీ వగైరా కొనుక్కొని వచ్చి, పట్టుపాగా వేసే కార్యక్రమానికి పూనుకొన్నాడు.

భూషణం ఆరోగ్య పరిస్థితి నానాటికీ దిగజారుతూ వుంది. ఒక పక్క ఆయనను గమనించుకుంటూ మరొక పక్క మగ్గం నేస్తూనే వున్నాడు. శేఖర ఉదయం ఏడింటి నుండీ పదింటి వరకూ వెంకటేశ్వర్లు ఇంట్లో పట్టుపాగా నేసి, ఇంటి కొచ్చి భోజనం చేసి పదకొండింటి నుండి తనకు ఆసామి అప్పగించిన చీరల తయారీని కొనసాగించసాగాడు. రోజు చేసే పనికి అదనంగా మూడుగంటల పాటు వేయడంతో అతనికి సాయంత్రమయ్యేసరికి ఒళ్ళు నొప్పులతో బాటూ జ్వరం కూడా వచ్చేలా వుండేది.

పట్టు పాగా నేసేది దేవుడికి సమర్పించడానికి కాబట్టి వుదయాన్నే లేచి స్నానం చేసి, విబూది పెట్టుకొని శివుడికి పూజ చేసి, నైవేద్యం పెట్టే, హారతి కళ్లకద్దుకొని పనిలోకి దిగేవాడు. శేఖర భార్య అరుణ కూడా పూజ చేసి, శుచిగా వంట చేసి భర్తకు కావలసిన వస్తువులు అమిత శ్రద్ధతో తయారుగా వుంచేది. పాగా వేసినన్నీ రోజులు ఆ ఇంటిలోనివారు మాంసాన్ని దగ్గరకు రానీయక శాఖాహారమే తీసుకోసాగారు.

ఇంకొక రోజులో పాగా వేయడం పూర్తవుతుంది అనుకొనేంతలో భారీ వర్షం కురవ సాగింది. రెండురోజులైనా, వర్షం ఏకధాటిగా పడ్తూనే వుంది. కాళహస్తిలోని ముగ్గం గుంటలన్నింటిలో నీళ్ళు చేరడంతో చేనేత కార్మికులు వేస్తున్న చీరలు, పంచెలు అన్నీ బిగుతుగా తయారై పనికి రాకుండా పోయాయి. అధికారులు పాడైన మగ్గాలను అంచనా వేయడానికి సర్వే ప్రారంభించారు. ఆ సర్వే పూర్తయి, ప్రభుత్వం ఇచ్చే కొద్ది పాటి నష్టపరిహారం అలరేందుకు నెల రోజుల పైనే వస్తుంది. ఆ ప్రాంతం పక్కనే చెరువు వుండడంతో వర్షపు నీరు మగ్గం గుంటలో ఇంకి పడుగూ, పేకా పూర్తిగా పాడైపోయాయి. ఆ నేత కోసి వేసి, వృథాగా పారేయాల్సిన పరిస్థితి ఏర్పడింది,

శేఖర కేం చేయాలో దిక్కుతోచకుండా వుంది. "ఇంత కష్టపడి నేస్తూ వున్న పట్టు పాగా పాడై పోయిందే" అని అతనికి ఒకటే దిగులుగా వుంది. శేఖర్, బాటు అతని కుటుంబంలో మిగతా వాళ్లందరూ దిగులుతో కృంగిపోయారు.

శేఖర మేనమామ నారాయణవరంలో రుద్రయ్య అనే ఆయన వున్నాడు. ఆయన కూడా నాలుగు మగ్గాల్లో పంచెలు, టవళ్లు వేయిస్తూ వుంటాడు. కాళహస్తిలో భారీ వర్షం కురిసిన విషయం తెలుసుకొని మేనల్లుడు శేఖరకు ఫోన్ చేసి అక్కడి మూల పరిస్థితి అడిగాడు రుద్రయ్య. జరిగిన విషయం మానుకు వివరించాడు శేఖర,

"నువ్వేం కంగారు పడద్దు శేఖరా, నా మగ్గాల్లో ఒకటి ఖాళీగానే వుంది. నువ్విక్కడి కొచ్చి ఆ మగ్గంలో పాగా తయారు చేసుకో. ఇక్కడి మగ్గాల్లో నీళ్లేమీ చేరలేదులే. డబ్బు, పాగా తయారు చేసుకో. సుప్పు రాలేనంటే నేనే దాన్ని నేయిస్తాను దాని గురించి నువ్వు బాధపడొద్దు, రేపు నాకొక పార్టీ పదివేలివ్వాలి. నీకు డబ్బేమైనా అవసరమైతే ఇవ్వగలను,

నువ్విక్కడికి వస్తే ఆ నూలు అదీ కొని పాగా నేసుకోవచ్చు అన్నాడు రుద్రయ్య,

దేవుడికి తాను స్వంతంగా పట్టు పాగా తయారు చేసి సమర్పిస్తేనే ఫలితం దక్కుతుందని శేఖర్ అభిప్రాయం. అదే విషయం చెప్పాడు రుద్రయ్యకు.

" సరే, నువ్విక్కడికే వచ్చి మగ్గం నేసుకో, రేపు నాకొక పార్టీ డబ్బు ఇవ్వాలి. పట్టు, జరీ అవీ కొనాలంటే

నేను డబ్బు సర్దుతాలే. "అన్నాడాయన. శేఖర్ మనసు కుదుట పడింది.

శేఖర్ మరుసటి రోజు పొద్దున్నే నారాయణవరం ప్రయాణమయ్యాడు. శ్రీ కాళహస్తిలో మగ్గాల నేతకు

మరో వారం రోజులు వాతావరణం సహకరించదు. ది వరలో తిరుపతిలోని ఆర్, కె సిలు, అనే ఐటల షాపు యజమాని రాజా ఒకసారి కాళహస్తిలో తమ

బంధువులింటికి వచ్చి పక్కనే వున్న లాన్ని మగ్గాలను చూస్తూ శేఖర్ ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో శేఖర్ ఒక ప్రత్యేకమైన పట్టుచీర నేస్తున్నాడు. నాగుల చవితి సమయంలో స్త్రీలు పాములపుట్టలో పాలు పోసి పూజ చేసేటప్పుడు కట్టుకొనే పట్టుచీరలది, అది రాజాకు బాగా నచ్చడంతో అలాంటిదే కొన్ని తయారు చేసుకొని, ఎప్పుడు తన షాపు కొచ్చినా మంచి ధర చెల్లించి వాటిని కొనుక్కోగలనన్నాడు. శేఖర్ వాటికి కావలసిన పట్టు, జరీకాని సమయం దొరికినప్పుడల్లా నేస్తూ వచ్చాడు. వారం క్రితమే ఐదువేలు ధర పలికే రెండు చీరలు తయారు చేసి బీరువాలో వుంచాడు. దారిలో వాటిని రాజా షాపులో ఇచ్చి డబ్బు తీసుకుంటామని ఆ చీరలను బేగ్ లో వుంచుకొని బయల్దేరాడు. కానీ రాజా ఇచ్చిన విజిటింగ్ కార్డు ఎక్కడో పారేసుకోవడంతో ఫోను చేయడం కుదరలేదు. తిరుపతిలోని షాపు అడ్రస్ మాత్రం గుర్తుంది లీలగా, బస్సు తిరుపతి చేరుతూ వుండగా, శేఖర్ కు మేనమామ నుండి ఫోన్ వచ్చింది.

"నాడు డప్పిస్తానన్న పార్టీ ఆరోగ్యం బాగా లేక నిన్న చెన్నై ఆసుపత్రిలో చేరాడట. నా డబ్బు వారం తరువాత ఇస్తానన్నాడు. కాబట్టి నువ్వు డబ్బు అడ్జెస్టు చేసుకొనిరా" అన్నాడాయన తాపీగా.

శేఖర్ ఆందోళన పడ్డాడు. కానీ 'ఎలాగూ బట్టలషాపు ఓనరు రాజా తాను నేసి తెచ్చిన పట్టుచీరలు తీసుకొని డబ్బిస్తాడు కదా! చీర తయారీకి ఆ డబ్బు వాడుకోవచ్చు" అనుకున్నాడు మనసులో,

షాపు చిరునామా గుర్తుకు తెచ్చుకొని అక్కడకు వెళ్లాడు శేఖర్. ఆ బట్టల కొట్టు కస్టమర్లతో కిటకిటలాడుతూవుంది. కానీ రాజా లేడక్కడ. అక్కడ పనిచేసే గుమాస్తాను రాజు విషయం అడిగాడు శేఖర,

"రాజన్న ఫామిలీతో నిన్న పుదయమే కాశీ, హరిద్వార యాత్రకు వెళ్లాడు. ఆయన తిరిగొచ్చే దానికింకో పది రోజుల పైనే పడుంది" తాపీగా చెప్పాడతను.

గుమాస్తాకు తాను పట్టుచీరలు వేసుకొని వచ్చిన విషయం చెప్పి, అవి తీసుకొని డబ్బిమ్మన్నాడు తనకు.

"అన్న సామాన్యంగా చీరలు ఆయనే సెలక్ట్ చేసి, బేరం చేసి తీసుకొంటాడు. వాటి విషయం మాకు తెలీదు" విసుగ్గా చెప్పాడు గుమాస్తా.

శేఖర్ అతణ్ణి కాసేపు బతిమాలాడు.

"సరే, నీ మాటెందుకు కాదనాలి?" అని రాజాకు ఫోన్ చేసేడు గుమాస్తా.

"తాను యాత్రల నుండి తిరిగొచ్చాక, ఆ చీరలను చూసి బాగుంటే తీసుకుంటానని", చెప్పాడు రాజా,

శేఖర్ నిస్సహాయంగా వెనుతిరిగాడు.

ఇంటికి తిరిగి వెళ్లిపోదామా? "అనుకొనేంతలో అతనికి తన చిన్ననాటి క్లాస్ మేట్ నారాయణ తిరుపతిలో కెనరా బ్యాంకు మేనేజరుగా పని చేస్తూ వున్నట్లు గుర్తొచ్చింది. ఒకసారి కాళహస్తిలో శేఖరకు కనపడి తిరుపతి వస్తే తనను కలవమన్నాడు.

కెనరా బ్యాంకు వెతుక్కొని వెళ్లి నారాయణను కలుసుకోమన్నాడు శేఖర్. పని ఒత్తిడి లో వున్న నారాయణ

శేఖర్ ను పావుగంట వేచి వుండమని తరువాత , తాపీగా అతడెందుకొచ్చాడో అడిగాడు. శేఖర్ తాను వచ్చిన పని చెప్పి, పట్టుపాగా నేసేందుకొక ఎనిమిది వేలు సమకూర్చమనీ, నెల రోజుల్లో తాను అ డబ్బు తిరిగిచ్చేస్తానని అన్నాడు.

నారాయణ బుర్ర గీక్కొని," ఈ నెల నాకు జీతంలో పెద్ద మొత్తం ఇన్కంటాక్సు రూపంలో కట్టవుతూ వుంది, నీకు డబ్బు సర్దలేను సారీ "అన్నాడు.

శేఖర్ నిరాశగా నిట్టూర్చి బయల్దేరబోయాడు. అతని చేతిలోని లెదర్ బేగ్ ను గమనించి," ఏమిటా సంచీ? " అన్నాడు నారాయణ.

శేఖర్ లెదర్ బేగి ఇప్ తీసి, తాను నేసి తెచ్చిన పట్టుచీరలను చూపించాడు నారాయణకు,

" నాగుల చవితి చీరలా? మా ఆవిడకూ, మా అత్తగారికీ ఇటువంటి స్పెషల్ అకేషన్ చీరలంటే ఇంట్రెస్టు,

నువ్వు మా ఇంటికి వెళ్లి ఆ చీరలను మా ఆవిడకు చూపించి, ఒక వేళ కొంటుందేమో చూడు, నేను ఫోన్ చేసి

చెబుతాను "అన్నారు. నారాయణ.

శేఖర్ 'అట్లే' అని నారాయణ ఇంటి వెళ్ళాడు.

నారాయణ భార్య లక్ష్మిఆమె తల్లి అనసూయమ్మ శేఖర్ తెచ్చిన చీరలను చూశారు. "నాగులచవితి చీరలా, బాగున్నాయి నాయనా, ఎలాగూ వచ్చేది శివరాత్రి కదా, శివరాత్రి రోజు కూడా పుట్టలో పాలు పోసే ఆచారం మాకుంది. ఇంతకూ, ఎంతకిస్తున్నావు ఆ చీరలను?" అని అడిగింది అనసూయమ్మ దర్పంగా తమలపాకులు నములుతూ.

శేఖర వాటి వెల చెప్పాడు.

"ఓయమ్మ, ఐదువేలంటే చాలా ఎక్కువ కదా నాయనా, ఏదో మా వాడి ఫ్రెండువని నీ దగ్గర కొనేదందుకే, నాలుగు వేలు మించి ఇవ్వలేము, నీకిష్టమైతే ఇప్పు లేకపోతే వెళ్లిపో" అన్నరామె లేచి నిలబడి. నారాయణ భార్య లక్ష్మి కూడా తల్లికి వంత పాడింది.

"నాలుగు వేలంటే అసలు రేటు కూడా రాదమ్మగారూ, నష్టానికి అమ్ముకోవాల్సి వస్తుంది" దిగులుగా అన్నాడు శేఖర్. కానీ ఆమె ససేమిరా తాను చెప్పున రేటుకి దిగిరాలేదు.

"పోనీలే, ఏదో ఒక రేటుకు ఈ చీరలు అమ్ముకుంటే పట్టుపాగా తయారీకి, శ్రీశైలం ప్రయాణానికి సొమ్ము గిట్టుబాటౌతుంది" అనుకొని శేఖర్ ఆ పట్టుచీరలు వారికిచ్చి ఎనిమిదివేలు రొక్కం తీసుకున్నాడు. ఎరుపు, నలుపు రంగులలో మేలిమి పట్టుతో కళాత్మకమైన అంచులతో తయారైన పట్టు చీరలను చవగ్గా కొనుగోలు చేసినందుకెంతో మురిసిపోయారు ఆ తల్లీకూతుళ్లు.

శేఖర్ నారాయణవరం చేరేసరికి మధ్యాహ్నం మూడు దాటింది. అతని కోసం కాచుకొని వున్న రుద్రయ్య శేఖరకు టీ తెప్పించి, మగ్గాన్ని చూపించాడు. మేనమామతో వెళ్లి శేఖర్ పట్టుపాగాకు కావలసిన రేషం, జరీ, వార్పు వగైరాలు తెచ్చుకున్నాడు.

శివరాత్రికింకా రెండు రోజులే గడువుంది, శేఖర్ రాత్రి పదకొండింటి వరకూ మగ్గం చేసి, మళ్లీ పొద్దున్న నాలుగింటికే నిద్ర లేచి, స్నానం చేసి పూజ చేసుకొని మగ్గం పనిలో దిగాడు. కాళ్లతో అని బలంగా తొక్కుతూ చేతులతో మగ్గం వాటు చేస్తూ, పోగులపై నాడే అటూ, ఇటూ కదుపుతూ వేగంగా మగ్గం నేయసాగాడు అతడి నుదుటి నుండి చెమట ధారాపాతంగా కారుతోంది, నిర్విరామంగా మగ్గం నేస్తూ అలసిపోయినా, విశ్రాంతి తీసుకోకుండా నేయసాగాడు.

పన్నెండడుగుల పాగా తయారవడానికి మధ్యాహ్నం పదలొండు వరకూ పట్టింది. హడావిడిగా లేచి, పట్టు సాగాను మగ్గం నుండి వేరు చేసి, ఒక పేపర్ లో చుట్టి తన బేగ్ లో పెట్టుకున్నాడు,

భోంచేసి వెళ్లమని మేనమామ బలవంత పెడ్తున్నా వినక హడావిడిగా బయల్దేరాడు. శేఖర్ కాళహస్తి చేరేసరికి అతడి భార్య ప్రయాణానికి బట్టలు సర్దుకొని సిద్ధంగా వుంది. తండ్రి బాధ్యతను తమ్ముడికి అప్పగించి, భార్యతోబాటు బస్సులో శ్రీశైలం బయల్దేరాడు శేఖర్. వారు శ్రీశైలం చేరేసరికి రాత్రి బాగా పొద్దుపోయింది. ఒక సత్రంలో ఆ రాత్రి తలదాచుకొని, మర్నాడు వుదయం దేవస్థానం వారి ఆఫీసుకు వెళ్లాడు.

శేఖర్ పాగాతో బాటు "సూపరెండెంటు పనుల మీద తిరుగుతున్నాడు. ఆయనో మాట్లాడు" ఆఫీసులో అటెండరు చెప్పాడు శేఖర్ తో. శివరాత్రి ఏర్పాట్లలో సిబ్బంది తల మునకలుగా వున్నారు. శ్రీశైలమంతా భక్తులతో కిటకిటలాడుతూ వుంది. 'హరోం హర' అని శివనామం మారుమ్రోగుతోంది. పదకొండంటికి వచ్చాడు సూపరెండెంటు.

"పాగానా? వీల్లేదయ్యా, ఇప్పటికే ఇద్దరు, ముగ్గురు ఈ పాగాలు నేసుకొని దేవుడి కియ్యాలని వచ్చారు. అంత లేటుగానా వచ్చేది?" అని శేఖర్ పై చిందులు తొక్కాడు సూపరిండెంటు. శేఖర్ ఎంత బతిమలాడినా వినలేదు, నిరాశగా వెనుదిరిగాడు శేఖర్.

"ఎట్లా ఇంత దూరం వచ్చాం, దర్శనం చేసుకొని పోతాం" అందతడి భార్య అరుణ, గుడ్ లోకి భక్తుల క్యూలైను చాంతాడంత వుంది. దాని చివర నిలబడ్డారు. శేఖర్, అరుణ దిగాలుగా, శేఖర్ కేం చేయాలో పాలుపోలేదు. 'ఇంట్లోకెళ్ళి తండ్రికేమి సమాధానం చెప్పాలి?' అనుకున్నాడు బాధగా.

"ఏమయ్యో, నిన్నే" ఎవరో పిలవడంతో వులిక్కిపడ్డాడు శేఖర్. విఐపీల క్యూ నుండి గుడి బయటకు వస్తున్నారు. లక్ష్మి, అనసూయమ్మ, సఫారీ సూట్ లో మరో ముసలి వ్యక్తి. ఆడవాళ్లద్దరూ శేఖర్ అమ్మిన పట్టుచీరలే కట్టుకొని వున్నారు.

"నువ్వు తెచ్చిన చీరలే మా చెల్లెలు కూడా కావాలంది. ఈసారి ఇంకో రెండు తెచ్చియ్యి. పోయినసారి ఎక్కువిచ్చాను. ఈసారి మూడున్నర వేలకన్నా ఎక్కువియ్యను" అంది అనసూయమ్మ.

శేఖర్ వచ్చిన పని కనుకొన్నాడు సఫారీ సూట్ వాలా. ఆయన లక్ష్మి తండ్రి పరమేశ్వరరావట. ఆయన ఎండోమెంట్ శాఖలో పెద్ద ఆఫీసరు. పట్టుపాగా చూసి శేఖర్ పనితనానికి మెచ్చుకొని వెంటనే ఈవోకు ఫోన్ చేసి శేఖర్ గురించి చెప్పాడు.

కాసేపటికి క్యూలైన్ చివర్లో వున్న వాచ్ మేన్ శేఖరను, అరుణనూ గుడిలోకి తీసుకెళ్లాడు.

పట్టు పాగాకు కుంకుమ, పసుపు పూసి, దేవుడి పై కప్పి, శేఖర్ ను, అరుణను దీవించారు. పూజారులు, అదుర్తున్న గుండెలతో దేవుడికి నమస్కరించి, ప్రసాదం తీసుకొని, ఆఫీసులో దేవస్థానం వారిచ్చిన పారితోషికంతో వెనుతిరిగారా దంపతులు.

శేఖర్ కాళహస్తికి చేరేసరికి అతడి తండ్రి భూషణం పరిస్థితి సీరియస్ గా వుంది, ఎగశ్వాస, దిగశ్వాసతో కొట్టుకుంటున్నాడాయన. తండ్రి నుదుట శ్రీ శైలం గుడి నుండి తెచ్చిన కుంకుమ పెట్టి పాగా దేవుడికలంకరించిన

విషయం చెప్పాడు శేఖర్. ఆయన మొఖం ఆనందంతో విప్పారింది. భూషణం గుండెలు ఎగసిపడ్డాయి. కొద్ది క్షణాల్లోనే ఆ నేతగాడి శ్వాస ఆగిపోయింది.

కౌముది